ప్రజా

RNI No.APTEL/15835/2019

మణిపూస

మాసపత్రిక

తెలుగు మాసపత్రిక

సంపుటి - 1 సంచిక - 2 | మార్చి - 2020 | పేజీలు : 80 | వెల : 25/-



చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

కనపర్తి రాజారావు

94924 23833

అసోసియేట్ ఎడిటర్

శ్రీ కె.వెంకట అప్పారావు (Ph.D)

సీనియర్ సబ్ ఎడిటర్ & టెక్నికల్ అడ్వయిజర్

శ్రీ డా॥ ఎం.జయకుమార్, MBA.,Ph.D

ఎడిటర్

శ్రీ బి.రాజేష్

కరస్పాండెంట్

కె.దినేష్, B.Tech.,(M.J.M.C)

ఫొటోగ్రాఫర్

బి.వీరయ్య

డిజైన్ & డి.టి.పి

జె.సతీష్

సేల్స్ మేనేజర్

జి.విజయ్‌కుమార్ B.A., B.Ed

D.No.10-12-6/44, Plot No.302,
Sai Towers 1, Rednam Gardens,
Visakhapatnam.530002

విషయ సూచిక

ప్రజా మీడియా నెట్‌వర్క్
PRAJA MEDIA NETWORK

కనపర్తి రాజారావు
చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

Registration No.1140/2019

సాయి టవర్స్-1, ఫ్లాట్ నెం.302, రెడ్నం గార్డెన్స్, విశాఖపట్నం. ఫోన్ : 94924 23833

స్త్రీ మూర్తికే అగ్రపీఠం..

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ అని "స్త్రీ"ని ఉపనిషత్తులో అంద రికంటే అగ్రపూజ అందవలసిన మాతృమూర్తిగా అభివర్ణించారు. స్త్రీ అను పదములో 'స'కార, 'త'కార, 'ర'కారములున్నాయి.
'స' కారము సత్వగుణానికి,
'త' కారము తమోగుణాని,
'ర' కారము రజోగుణానికి ప్రతీకలు.
అంటే త్రిగుణాత్మకమైన ప్రకృతికి ప్రతీకగా స్త్రీని పేర్కోనవచ్చు. సమాజంలో స్త్రీకి ఉన్న స్థానాన్ని నిర్ణయించడానికి మానవ జాతికే తొలి విజ్ఞాన మైన ఋగ్వేదం తొలి ఆధారం ఐతరేయ బ్రాహ్మ ణంలో "పురుషుడు స్వయంగా స్త్రీ గర్భం నుండి పుత్ర రూపంలో జన్మిస్తాడని.ఈ స్త్రీ వలన పురు షునికి విశ్రామస్థానం,సుఖస్థానం అని చెప్పి స్వయంగా స్త్రీ గృహరూపం అంటూ సంభాషిం చింది.అస్మదాచార్యుల కాలం నుండి సమాజం లో పురుషులకు స్త్రీ పట్ల పూజ్యభావం అమితంగా వేదకాలంలో ఉన్నది. నాటి కాలంలో కూడ స్త్రీలు పురుషులతో సమా నంగా విజ్ఞాన మార్గంలో, బ్రహ్మజ్ఞానంతో ప్రకా శించే వారు కాబట్టే నాటి కాలమే స్త్రీని పురు షుడు అమితంగా గౌరవించేవారు. వైదిక విద్య అందరికీ విస్తరించింది.విద్య అనేది పరమాత్మ దత్తం.ఉపనిషత్కాలలో స్త్రీ, పురుష లిరువురు బహ్మజ్ఞాన తత్వం కలిగి ఉండే వారు. ఆకాలంలో బాలురతో సమానంగా బాలికలకు ఉపనయ నాలు చేసేవారు. కొంతమంది బ్రహ్మచర్యం పాటిస్తూ వారి జీవితాలను తపోజీవనంతో దైవానికి అంకితం చేసేవారు, గృహస్త జీవనం కావాలనుకునేవారు తమ గుణ కర్మ స్వభావా లకు అనుగుణంగా యువకులను స్వయం వరంగా పొందేవారు. ఋగ్వేదంలో సూక్తులు ప్రత్యేకంగా స్త్రీల కోసమే ఉపదేశించాయి.వేదార్థం ఏమిటంటే స్త్రీ అనేది పురుషునికి మరియి ఈ సభ్యసమాజానికి ఉషస్సువంటిది అని స్త్రీలు తమ విద్యాశోభతో గృహాన్ని అనుకూలంగా తీర్చి దిద్దే శక్తి కేవలం స్త్రీకే సాధ్యపడుతుందని,స్త్రీలవలన భావితరాలకు శిక్షణ,రక్షణగా నిలుస్తుం దని తెలియజేసింది.వేదాల తర్వాత అంతటి మహోన్నతమైనది "మనుస్మృతి"దీనితోనే ఆర్ష వాఙ్మయం మొదలైంది. మనుమహర్షికి స్త్రీల పట్ల ఉన్నంత భక్తి శ్రద్ధలు ప్రపంచంలో మరేవ్వ రికి లేవు.మనుస్మృతిలో న్యాయస్వరూపమే స్త్రీ అని పేర్కోన్నారు.ఎక్కడైతే స్త్రీలు పూజింప బడతారో అక్కడ ఉత్తమ సంతానం కలుగుతుంది.స్రీకి కలిగే ఉత్తమ సంతానం వలననే ఉత్తమ సమాజం ఏర్పడుతుంది. పుత్రునికి,పుత్రికకు ఆస్తిలో సమాన హక్కులున్నాయన్నాడు మనువు. వైదిక సంస్కారాలన్ని విశేషంగా స్త్రీ గౌరవాన్ని చాటుతాయి.కొంత మంది స్త్రీలంటే గౌరవం లేని స్త్రీ జాతిని వ్యతిరేకించే వారు స్త్రీలు వేదమంత్ర పఠనానికి అర్హులు కాదని స్త్రీ అంటే వంటింటి కుందేలని లేని పోని ఆంక్షలు విధించే ప్రక్రియ పురుషాదిక్య పాలనలో పెట్రేగి పోయాయి,క్రమేపి అది స్త్రీ జాతికి అనేక రకములైన ఆంక్షలతో కూడిన బంది జీవితానికి స్త్రీ బలిఅవుతూ వస్తున్నది. వేదం ప్రమాణంగా స్వీకరించిన మనువే "స్త్రీ బ్రహ్మ జ్ఞాని కావలని,స్త్రీ విద్యావతి అయితేనే లోక శ్రేయస్సు కలుగుతుందని చాటి చెప్పారు. "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అన్నది కేవలం స్త్రీ రక్షణను దృష్టిలో పెట్టుకుని అన్నదే కాని ఇందులో స్త్రీని కించ పరచటం కాదు. ఏ దేశంలో అయితే మహిళలు సర్వాంగ సుందరంగా ఆభరణాలతో అలంకరించుకుని పురుషుని సహాయం,తోడు లేకుండా రహ దారులలో, వీధులలో దైర్యంగా ఏ భయ బ్రాంతులు లేకుండా తిరగగలదో ఆదేశం సుపరిపాలన కలది అని పంచమ వేదమైన మహాభారతం చెప్పింది.చతుర్వేద సారాంశం మహాభారతం అందుకే మానవాళికి పంచమ వేదం అయ్యింది. వేదకాలం నుండి స్త్రీని అత్యధికంగా గౌరవిస్తూనే స్త్రీ రక్షణ కొరకు అనుక్షణం ఆరాటపడుతూనే ఉంది.యవత్ సమాజంలో నేటికి కొనసాగుతూనే ఉంది.గాంధి మహాత్ముడు కూడా ఈ మాటే అన్నాడు స్త్రీకి రక్షణ ఉంటే లోకానికే రక్షణ కలుగుతుందని చెప్పాడు.స్త్రీ తాను మరణయాతనను పొంది మరోజన్మనెత్తి జాతి మొత్తాన్ని కని పాలిచ్చి పెంచి,సకల సేవలనందిస్తూ,సృష్టిని సుస్థిరం చేస్తున్న మహోన్నత మూర్తి స్త్రీ.

మీ


రాజారావ్

చీఫ్ ఎడిటర్

తొలి మహిళా ఉపాధ్యాయిని
'జ్ఞాన జ్యోతి' సావిత్రిబాయి పూలే

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,
ప్రొఫెసర్, తెలుగుశాఖడిప్యూటి డీన్, స్టూడెంట్స్ వెల్ఫేర్,
సెంట్రల్ యూనివర్సిటి (యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్),
హైదరాబాద్-500046, మొబైల్: 9182685231

"ఎల్ల కాలం చీకటిగానే ఉండాలని
రాత్రి కోరుకుంటుంది
సూర్యుడి మీద శాపాల వర్షం కురవాలని
మూర్ఖులు కోరుకుంటారు
విషపూరిత కాళరాత్రి గడచిపోయింది.
సూర్య తేజస్సుతో సృష్టి సమస్తం
ప్రకాశవంతమైంది"--



సావిత్రిబాయి పూలే రాసిన 'కావ్యపూలే' కవితాసంపుటిలోనిదీ కవిత. సమాజంలో కనిపించే ఆధిపత్యాన్ని, ఆ ఆధిపత్యాన్ని ప్రశ్నించే తత్వాన్నీ, సమాజమెప్పుడూ అజ్ఞానంలో కూరుకుపోవాలనుకొనే సనాతన సంప్రదాయవాదుల్నీ, ఆ సంప్రదాయపు గోడల్ని బద్దలు కొట్టి ఆధునిక సమాజాన్ని నిర్మించాలని కోరుకునే సంస్కరణ వాదుల్నీ వస్తువుగా చేసుకొని సావిత్రిబాయి పూలే రాసిన బలమైన కవిత్వమిది.

నేడు సావిత్రిబాయి పూలే పేరు చెప్పగానే ఆమె మనకు భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలనీ, సామాజిక సంస్కరణశీలిగా స్ఫురిస్తారు. నిజానికి, భారతదేశంలో దళిత, బహుజనుల చరిత్ర, వారి శక్తి సామర్థ్యాలను గుర్తించ డానికి చాలా కాలం పట్టింది. డా.బాబా సాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా అన్ని అల్పసంఖ్యాక, దళిత వర్గాలకూ కొన్ని ప్రత్యేక హక్కుల్ని ఏర్పరచడం ద్వారా ఈ వర్గాలు చైతన్యవంతమయ్యాయి. దానితో తమ చరిత్ర మూలాల్ని గుర్తించడం మొదలు పెట్టారు. చరిత్రను, సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడం ప్రారంభించారు. ఈ విషయాన్నే ప్రముఖ సాహిత్య విమర్శకురాలు ఆచార్య కాత్యాయనీ విద్మహే ప్రస్తావిస్తూ "స్త్రీల దళిత బహుజనుల అస్తిత్వ ఉద్యమాలు ఊపందుకొన్న 1980ల నుండి సమాజపు చివరి అంచులకు నెట్టివేయబడిన వర్గాల ఆలోచనా విధానాలతో, ఆచరణ కార్యకలా పాలతో దేశీయ సామాజిక రాజకీయార్థిక చరిత్రను, సంస్కృతిని సమగ్రం చేయటం, సరిచేయటం అన్న లక్ష్యాలతో సాగుతున్న కృషిలో భాగంగానే గానే జ్యోతిరావ్ పూలే గురించి, ఆయన భార్య సావిత్రిబాయి పూలే గురించి మనకు తెలిసి వచ్చింది. సావిత్రి బాయి పూలే ది జ్యోతి రావ్ పూలే భార్యగా అతని సంస్కరణోద్యమ కార్యకలాపాలకు సహాయ కారి పాత్ర మాత్రమే కాదు. అన్నింటిలో ఆమె సహ భాగస్వామి. భారత దేశంలో మహిళాఉద్యమ చరిత్రకు తాత్విక భూమికను ఏర్పరచిన క్రియాశీల శక్తి" అని వ్యాఖ్యానించారు. దీనిలో భాగంగానే సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని భారతదేశంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. 1949 నుండి 2014 వరకూ యూనివర్సిటీ ఆఫ్ పూనే గా పిలిచారు. అయితే, దళిత, బహుజన, స్త్రీలలో వచ్చిన చైతన్యం ఫలితంగా చేసిన ఉద్యమాల వల్ల '19వ శతాబ్దికి చెందిన సావిత్రిబాయి పూలే చేసిన సామాజిక సంస్కరణలు, బ్రిటీష్ పాలనా కాలం నాడే దళిత, స్త్రీ, అల్పసంఖ్యాక వర్గాలను చైతన్యవంతం చేసినందుకు గాను యూనివర్సిటీ ఆఫ్ పూనేను 9 ఆగస్టు 2014 వ తేదీ నుండి **"సావిత్రిబాయి పూలే పూణే విశ్వవిద్యాలయం"**గా పేరు మార్పుచేశారు. భారతప్రభుత్వం 10 మార్చి 1998లో ఆమె పేరు, ఫోటోతో 200 రూపాయల విలువ గల పోస్టల్ స్టాంపుని విడుదల చేసింది.

తన పదవ యేటనే పదమూడేండ్ల వయసున్న జోతీరావు పూలే (తెలుగు వ్యవహారంలో 'జ్యోతీరావు పూలే')ని వివాహం చేసుకున్న ఆమె

సాధించిన గొప్పతనాన్ని, ఆమె చేసిన సంఘ సంస్కరణను, ఆమె రాసిన కవిత్వాన్ని ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

మహారాష్ట్రలోని సతారా జిల్లా, నయాగావ్ అనే గ్రామంలో లక్ష్మీ బాయి, ఖండోజీలకు 3 జనవరి 1831 వ సంవత్సరంలో జన్మించింది. తన పదవయేటనే జ్యోతీరావు పూలేని వివాహమైంది. అప్పటికి ఆ దంపతులకు వివాహమంటే ఏమిటో కూడా తెలియదని మహాత్మా జ్యోతీరావు పూలే జీవిత చరిత్ర రాసిని ధనంజయ్ కీర్ వ్యాఖ్యానించారు. (Mahatma Jotirao phooley, Dhananjay Keer, page;12) భారతీయ సామాజిక చరిత్రలో జ్యోతీరావు పూలే గొప్ప సంఘసంస్కర్తగా ప్రసిద్ధి చెందిన వ్యక్తి. ఆయన తన భార్య అయిన సావిత్రిబాయి పూలేకి, తానే తొలిగురువై చదివించాడు. తర్వాత మిత్రులు సఖరం యాశ్వంత్ పరాంజపే ,కేశవ్ శివరాం భావేల్కర్‌ల సహాయ సహకారాలతో 1847-48 లో అహ్మదాబాద్ లో ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేయించాడు. వెంటనే నిమ్నకులాలుగా పిలుస్తూ, చదువుకి దూరం పెట్టిన బాలికలకు పాఠాలు చెప్పడం ప్రారంభించినప్పుడు అగ్రవర్ణాలనబడే వాళ్ళనుండి అనేక అవమానాల్ని ఎదుర్కోవలసి వచ్చేదట. ఆమె పాఠశాలకు వెళుతుంటే, ఆమె చీరపై బురదచల్లేవారట. అందుకని అదనంగా మరొక చీరను బ్యాగ్ లో పెట్టుకొని వెళ్ళేవారట. అటువంటి ఎన్నో అవమానాల్ని భరిస్తూ తన భర్త జ్యోతీరావు పూలే సహకారంతో సుమారు 52 పాఠశాలల్ని ఏర్పాటు చేసి శూద్రులు, అతి శూద్రులని సమాజానికి దూరం చేసిన వారినెందరినో విద్యకు దగ్గర చేసింది. 1852లో 'మహిళా సేవా మండల్' పేరుతో ఒక సంస్థను స్థాపించి స్త్రీలను చైతన్య పరిచే వివిధ కార్యక్రమాల్ని రూపొందించి, అమలు చేసేవారామె. దానితో మహిళల్లో మాట్లాడే ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందడానికి ఆమె ఎంతగానో ప్రయత్నించేవారు.

సావిత్రిబాయి పూలే బాల్యవివాహాల్ని, శిరోముండనాల్ని నిరసించారు. కేవలం శిరోముండనాల్ని వ్యతిరేకించడమే కాకుండా, ఆ శిరోముండనం చేసే క్షురకుల్ని చైతన్యపరిచి **"వితంతు స్త్రీల తలలు గొరకం'** అనే నినాదంతో వాళ్ళచేత సమ్మెకూడా చేయించగలిగారు. ఆవిధంగా మూఢవిశ్వాసాల్ని పోగొట్టేందుకు ప్రయత్నించారు. వితంతు పునర్వివాహాల్ని ప్రోత్సహించారు. చిన్నవయసులోనే వివాహం కావడం, భర్త వదిలేయడం లేదా చనిపోవడం జరిగిన తర్వాత దిక్కుతోచని పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియని వారికి ఆశ్రయమివ్వడం ఆమెలో గల దయార్ద్రహృదయానికి, సామాజిక అవగాహనకు నిదర్శనం. వివాహం చేసుకోవడానికి యువతీ యువకులు, వారి కుటుంబాల అనుమతులే తప్ప, పురోహితుల ఆశీర్వాదాలు ప్రధానం కాదని **'సత్యశోధక్ సమాజ్'** ద్వారా ప్రజల్ని చైతన్య పరిచి అనేక సామాజిక వివాహాల్ని జరిపించేవారు. తమకు పిల్లలు లేకపోతే ఒక వితంతువుకి పుట్టిన పిల్లాడిని దత్తత తీసుకున్నారు. ఆ అబ్బాయికి యశ్వంత్ అని పేరుపెట్టుకున్నారు. ఒక బ్రాహ్మణ వితంతువు బిడ్డను కన్నది. అయితే, లోకానికి భయపడి ఆ బిడ్డని బావిలో పడేసింది. అది తెలుసుకున్న ప్రజలు ఆమెకు శిక్షపడేలా చేశారు. అప్పుడే జ్యోతీరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు ఒక ఆలోచన వచ్చింది. **'బాలహత్యా ప్రబంధక్ గృహ్'** పేరుతో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా తమ సంఘసంస్కరణను కొనసాగించిన సావిత్రిబాయి, జ్యోతీరావు పూలేలు ఒక బ్రాహ్మణ వితంతువుకి పుట్టిన బిడ్డనే పెంచుకోవడం ద్వారా గానీ, బ్రాహ్మణ వితంతువుకి పడ్డ శిక్షను గమనించి ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి, ఆ ఆశ్రమంలో కుల, మతాతీతంగా ఆశ్రయం కల్పించడాన్ని గమనిస్తే వాళ్ళలో 'బ్రాహ్మణుల' పట్ల వ్యతిరేకత లేదని, బ్రాహ్మణిజం పట్ల మాత్రమే వ్యతిరేకత ఉందని స్పష్టమవుతుంది. అందుకనే, దళిత ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్ళిన కత్తి పద్మారావుగారు వంటి వారు కూడా భూమిక పత్రికలో **'ఆమె మార్గంలో నడుద్దాం-సావిత్రిబాయి పూలే'** అనే వ్యాసంలో వ్యాసంలో "సావిత్రిబాయి పూలే తన భర్త అనే జ్యోతికి ఒక నూనెలా వ్యవహరించింది. అంటే ఆమె లేకపోతే ఆ జ్యోతికి వెలుగు లేదు అన్నంతగా మమేకం అయింది. ఆమె సహచర్యం వల్ల మహా త్మాపూలే ఆలోచనలు స్త్రీలపైపు మళ్ళాయి. మహాత్మాపూలే అందరి స్త్రీలను శూద్రులుగానే భావించాడు. ఆయన బ్రాహ్మణ స్త్రీలను వేరుచేయలేదు. బ్రాహ్మణ స్త్రీలు, బ్రాహ్మణ పురుషులచేత ఎలా అణగద్రొక్కబడుతున్నారో చాలా శాస్త్రీయమైన విశ్లేషణ చేశార"ని వ్యాఖ్యానించారు.

1896-97లో సంభవించిన ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని భయకంపితుల్ని చేసింది. అప్పుడు సావిత్రిబాయి పూలే స్వయంగా ప్లేగువ్యాధి వచ్చిన వాళ్ళకు సేవలు చేసింది. అనేక మందికి ఆహార శిబిరాల్ని ఏర్పాటుచేయించింది. చివరికి ఆ ప్లేగు వ్యాధికి గురై 10 మార్చి 1897 లో మరణించారామె.

ఒక ఉపాధ్యాయినిగా, ఒక సంఘసంస్కర్తగా ఎంతో కృషిచేసి సామాజిక పరివర్తనకు ప్రయత్నించిన సావిత్రిబాయి పూలే సాహిత్యం ద్వారా కూడా సామాజిక మార్పుని ఆకాంక్షించారు. ఆమె అప్పుడప్పుడూ మరాఠీ భాషలో రాసిన కవితలను **'కావ్యపూలే'** (1854) పేరుతో ప్రచురించారు. దీనితో పాటు మరో కవితా సంపుటి **'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'** (1891) కూడా ప్రచురితమైంది. ఆమె వివిధ సందర్భాల్లో చేసిన ఉపన్యాసాల్లో కొన్నింటిని 1892లో పుస్తకరూపంలోకి తెచ్చారు. వీటిలో కొన్ని కవితలను తెలుగులో ఆచార్య వి.కృష్ణ అనువాదం చేశారు. Braj Ranjan BaMani, Pamela Sardar సంపాదకత్వం వహించిన ఆంగ్ల పుస్తకం A Forgotten Liberator: The Life and Struggle of Savitribai Phule. ఈ పుస్తకం సావిత్రిబాయి జీవితాన్ని సాధ్యమైనంత సమగ్రంగా అందిస్తుంది. ఈ పుస్తకాన్ని 'చూపు' కాత్యాయని **'సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి-సావిత్రీబాయి పూలే జీవితం-ఉద్యమం'** పేరుతో తెలుగులో అనువదించగా, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వాళ్ళు ప్రచురించారు. అందుబాటులో ఉన్న ఈ పుస్తకమే తెలుగులో సావిత్రిబాయి పూలే జీవితాన్ని తెలుసుకోవడానికి ప్రధాన ఆకరంగా మారింది. ఆమె రాసిన కవిత్వం తన జీవితానుభవాల నుండి వచ్చింది. ఆత్మగతంగా కనిపించే ఆ కవిత్వంలో సమకాలీన సమాజ వాస్తవికత ప్రతిబింబిస్తుంది. ఆమె రాసిన కొన్ని కవితల్ని ప్రస్తావిస్తాను.

కలం పట్టిన ప్రతి కవీ ఇంచుమించు ఏదొక సందర్భంలో తన అమ్మ గురించీ, తన మాతృభూమి గురించీ కవిత్వీకరించుకుంటారు. తన జన్మకు కారణమైన అమ్మ, తన అస్తిత్వాన్ని రూపుదిద్దుకోవడానికి కారణమైన తన ఊరు లేదా తన మాతృభూమి గురించి సావిత్రిబాయి పూలే కూడా ఒక కవితలో వర్ణిస్తూ...

"ఆమె ముందు సముద్రం కూడా
చిన్నబోతుంది
ఆమె ముందు ఆకాశం కూడా
తలదించుకుంటుంది" అని ఎంతో **ఆత్మీయంగా, సగర్వంగా, ఉన్నతంగా చెప్తుంది.**

స్త్రీలను బానిసలుగా చూసే సమయంలో తనని ఒక స్నేహితుడిలా ఆదరించి, తనని చదివించి, ఉన్నతమైన వ్యక్తిత్వం గల మనిషిగా తీర్చిదిద్దిన తన భర్త మహాత్మా జ్యోతీరావు పూలే గురించి రాస్తూ... **"శూద్రజనుల ఆకాశంలో జ్యోతిబా ఓ సూర్యుడు"** అని అభివర్ణిస్తుంది. ఈ వ్యాసాన్ని ప్రారంభిస్తూ రాసిన కవితా పాదాలు కూడా సంఘసంస్కరణ కోసం పాటు పడిన జ్యోతీరావు పూలే గొప్పతనాన్ని వర్ణించే కవిత్వ పాదాలే.

తరతరాలుగా పాఠ్యాంశాల్లోను, నిత్య జీవితంలోను చదివించే, వినిపించే వాటి హేతుబద్ధతను ప్రశ్నించేవాళ్లు కొంతమందైనా ఉంటారు. తమ జీవితంలో కనిపించని వాటిని తామె విశ్వసించడం అంతసులభం కాదు. కనుక, వాటి గురించి ఆలోచిస్తారు. తమకు సరైన సమాధానం వచ్చేవరకూ వాటిని అవసరమైతే ప్రశ్నిస్తారు. జ్యోతిరావు పూలే లాగే, సావిత్రిబాయి పూలే కూడా అలాగే హిందూ పురాణాల్ని, శాస్త్రాల్ని ప్రశ్నించారు. ఆ ప్రశ్నల పరంపరలోనే కవిత్వాన్ని కూడా రాస్తూ...

"బైరాగీ భట బ్రాహ్మణులు
శ్రమను త్యజించి బిచ్చమెత్తుకుంటూ తిరుగుతారు
ఫలాన్ని ఆశించకుండ చాకిరీ చేస్తే
స్వర్గంలో పుణ్యం లభిస్తుందని చెప్పే తత్వ శాస్త్రం

పెద్ద **బూటకం"** 'శూద్రుల పరావలంబనం' పేరుతో రాసిన ఈ కవితాఖండికలో మనుస్మృతి, మరికొన్ని హిందూ మత గ్రంథాల్ని అనుసరించి చెప్పే 'శాస్త్రాల్ని' తీవ్రంగా నిరసించడం కనిపిస్తుంది. భిక్షాటన అనేదొక శైవతత్వంగా ప్రచారంలో ఉంది. సాక్షాత్తూ శివుడే బిక్షాటన చేసినట్లు పురాణాలు చెప్తున్నాయి. వ్యాసుడు బిక్షాటన చేయడానికి వెళ్ళినప్పుడు, సాక్షాత్తూ శివుని భార్య పార్వతీదేవి కావాలనే ఆలస్యంగా బిక్షపెడుతుంది-అంటే వాళ్ళకు కావలసిన ఆహారాన్ని పెడుతుంది. వ్యాసుడు ఆ ఆలస్యానికి సహించక కాశీనే శపించబోతాడు. శంకరాచార్యులు కూడా బిక్షాటన చేసినట్లు, ఆ సందర్భంలోనే ఒక వృద్ధురాలి దగ్గరేమీ లేక తన దగ్గరున్న ఉసిరి కాయనే బిక్షగా వేసిందట. అప్పుడు శంకరాచార్యులు 'కనకధారాస్తోత్రా'న్ని చెప్పినట్లు, దాన్ని పఠిస్తే ఆ పేదరాలి గుడిసెలో బంగారం వర్షించినట్లు కొన్ని ఐతిహ్యాలున్నాయి. బిక్షమెత్తుకోవడంలో ఆత్మగౌరవం ఉండదనీ, శ్రమ చేయకుండా ఇతరులపై ఆధారపడ్డం సోమరిపోతులను తయారు చేయడమేనని సావిత్రిబాయి పూలే అభిప్రాయం. శ్రమను గౌరవించాలనీ, కానీ **మనుస్మృతి** సోమరులను తయారు చేసిందని ఆమె అభిప్రాయపడుతూ...

'నాగలిపట్టేవారు, వ్యవసాయం చేసేవారు
మూర్ఖులని కుటిల మనువు చెప్పెను
వ్యవసాయం చేయవద్దని బ్రాహ్మణులను
ఆజ్ఞాపిస్తుంది మను ధర్మశాస్త్రం అంటారామె. అంతే కాదు,

'శూద్రుల పుట్టుక
పూర్వజన్మ పాపాల ఫలం
అనుభవిస్తారు ఈ జన్మలో శూద్రులు సమస్తం
సమాజంలో వైషమ్యాల
కుటిల ఆచారవ్యవహారాలు రచిస్తారు
ధూర్తులకే చెల్లు ఈ అమానవీయ సిద్ధాంతం" అంటారామె.

నిరంతరం చదవడం, ఆ చదివడం కూడా హేతుబద్ధంగా చదివినప్పుడు లోకం బాగా అర్ధమవుతుంది. సావిత్రిబాయి పూలే తన భర్త అడుగుజాడల్లో పయనిస్తూ, ఆయన ఆలోచనలతో ముందుకెళుతూ సామాజిక వాస్తవికతను అవగాహన చేసుకునేది. ప్రతి పనిలోనూ కార్యకారణ సంబంధాల్ని విశ్లేషించుకునేది. అందుకనే ప్రముఖ సాహిత్య విమర్శకురాలు ఆచార్య కాత్యాయనీ విద్మహే **"ఉత్పత్తి వర్గాలను, శ్రమజీవులు శూద్రులుగాను, శ్రమకు దూరమైన బ్రాహ్మణ వర్గాన్నిఅధికులుగానూ చెప్పిన మనువుకు కుటిలత్వాన్ని ఇంటిపేరుగా చేసింది సావిత్రిబాయి."** అని (తొలి ఆధునిక కవయిత్రి సావిత్రి బాయి పూలే, సారంగ అంతర్జాల పత్రిక, 1 నవంబర్ 2018) వ్యాఖ్యానించారు. పురాణాలు, కావ్యేతిహాసాల్లో మానవుల జన్మలకు సంబంధించిన కథల్ని, చదివినప్పుడూ, విన్నప్పుడల్లా మనిషి జన్మ గురించి ఆలోచించేది. స్త్రీ-పురుషుల కలయిక వల్ల జన్మించాల్సిన మానవజన్మ గురించి రకరకాలుగా కథలు ప్రచారం కావడం వెనుక ప్రజల్ని అమాయకుల్ని చేయడం, ఆ అమాయకత్వాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడం కొన్ని వర్గాలు, వర్ణాల కుట్రగా గుర్తించింది. ఒక శాస్త్రీయమైన దృష్టితో ఆలోచించమంటూ ....

'రాయికి కుంకుమపెట్టి
నూనెలో ముంచి
దేనినైతే దేవత అంటున్నారో
నిజానికది రాయేకదా" అని ప్రశ్నిస్తూనే, దానికి సమాధానాన్ని కూడా అందిందిస్తుంది. ఒక వేళ నిజంగా గుడులు, గోపురాలు తిరగడం వల్లనో, లేక స్త్రీ-పురుషులు కలవకుండానో 'దేవతల వరం' వల్లనే పిల్లలు పుడితే పెళ్ళి అవసరమేముందని ఒక అమాయకురాలడిగినట్లు.

'రాళ్ళకు మొక్కితే పిల్లలు పుడితే
మరి అకారణంగా

స్త్రీ - **పురుషులు పెళ్ళెందుకు చేసుకుంటారు?'** అని ప్రశ్నిస్తుంది. ఇక్కడ మనం జాగ్రత్తగా ఆలోచించాలి. పెళ్ళి అవసరాన్ని ఆమె తీవ్రంగానే ఆలోచించింది, ఆమె రాసిన ఉత్తరాల్లో, ఆమె చేసిన ప్రసంగాల్లో పురుషులు స్త్రీలను భోగవస్తువులుగా, బానిసలుగా చేసుకుంటున్నారని, అది సరికాదనే ఆలోచనల్ని వ్యక్తం చేశారామె. ఈ కవితా ఖండికలో ఆమె వైజ్ఞానిక దృక్పథమే కాకుండా, స్త్రీ-పురుషుల మధ్య ఉండాల్సిన సంబంధాల్ని కూడా గుర్తుచేసినట్లైంది. ఒక కవితలో కూడా స్త్రీని భర్తలెలా బానిసలుగా చేస్తున్నారో వర్ణిస్తూ..

"పాపం భార్య పనిచేస్తూనే ఉంటుంది
ఏ కష్టం లేకుండా భర్త నిస్సిగ్గుతో ఆరగిస్తూనే ఉంటాడు
పశువులలో కూడా లేదు ఇలాంటి వింత
వారిని మనుషులని ఎలా అనను ?" అని ప్రశ్నించడం ఆమె సామాజిక అవగాహనను తెలియజేస్తుంది. అణచివేతకు, దోపిడీకి గురవుతున్న

స్త్రీల స్థితిగతుల్ని ఈ కవిత ద్వారా మనందరి కళ్ళముందుంచుతుంది.

సావిత్రి బాయి పూలే తన భావజాలాన్ని వివరించడానికి వాహికగా కవిత్వాన్ని ఎన్నుకున్నప్పుడు వర్ణనకంటే, వస్తువుకే అధికమైన ప్రాధాన్యాన్నిచ్చారు. భావుకతను వ్యక్తీకరించడానికి వర్ణనలను ఎన్నుకున్నారు. **'సీతాకోక చిలుకలు'** కవిత దీనికి మంచి ఉదాహరణ.

'రంగురంగుల అందమైన సీతాకోక చిలుకలు
మెరిసే కళ్ళు, ఇంద్రధనుస్సు నవ్వు
దేహంపై పట్టుల్లాంటి రెక్కలు
చిన్న పెద్ద, ముడుచుకుని ఉండె
పసుపు రంగు రెక్కలు
అయినా, ఆకాశంలోకి ఎగురుతాయి
వాటి రూపం రంగు మనోహరం
సీతాకోక చిలుకలను చూస్తూ చూస్తూ
నన్ను నేను మరచిపోయాను". ఇక్కడ సీతాకోకచిలుకల్లో తనను తాను చూసుకోవడమే కవిత్వం. ఈ కవితను చదువుతున్న పాఠకునికి ఒక చక్కని భావచిత్రం మదిలో మెదులుతుంది. తోటలో కనిపించిన రంగు రంగుల సీతాకోకచిలుకలు సీతాకోకచిలుకల కళ్ళు మెరుస్తుండడం, ఇంద్రధనస్సు లాంటి నవ్వుల్ని విరజిమ్మడం, చివరికి ఆకాశంలోకి ఎగురుతాయనడం కూడా ఆమె భావుకతకు నిదర్శనం. మనిషికి ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛ, సామర్థ్యం, వాటిని ప్రదర్శించుకునే అవకాశాలున్నప్పుడు నిజంగా మనిషికి ఆనందం కలుగుతుంది. అప్పుడే కళ్ళు ఆనందంగా మెరుస్తాయి. ఈ కవితలో ధ్వని గర్భితంగా చేసిన వర్ణన సావిత్రిబాయి పూలే స్త్రీ స్వేచ్ఛ కోసం పడే తపనను వ్యక్తీకరిస్తుంది.

ఒకప్పుడు భారతదేశంలో సంస్కృతాన్ని కొన్ని కులాలు, వర్గాల వారు చదువుకోకూడదని నిషేధాజ్ఞలు అమలయ్యాయి. దానికి రకరకాల కారణాలు చెప్తారు. సంస్కృతాన్ని నేర్చుకోవడాన్ని నిరాకరించడం వల్ల ఆ కులాలు, వర్గాలు ఆంగ్ల భాషా సాహిత్యాల్ని చదువుకున్నాయి. అది ఒకరకంగా మేలే జరిగిందని ఆ వర్గాలు త్వరలోనే గ్రహించగలిగాయి. మూఢత్వం నుండి బయట పడ్డానికీ, ప్రపంచవిజ్ఞానాన్ని తెలుసుకోవడానికీ ఆంగ్లం ఎంతగానో మేలుచే సింది. సావిత్రి బాయి పూలే ఆంగ్లభాషను నేర్చుకోవడాన్ని ఇలాగే అవగాహన చేసుకున్నట్లు ఆమె కవిత్వాన్ని బట్టి చెప్పొచ్చు. మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ తర్వాత వచ్చిన పీష్వాలు సనాతన సంప్రదాయాలతో కొన్ని వర్గాలు, కులాల వారిని అణచివేశారు. ముఖ్యంగా శూద్ర, అతిశూద్రులను అణచివేసిన చరిత్ర పీష్వాలది. దీన్ని సాహిత్యీకరిస్తూ సావిత్రి బాయి పూలే...

"ఉమ్మి కోసం మెడలో ముంత
దారులలో నడవడం నిషిద్ధం
దుమ్ముతో నిండిన కాలిబాటలలో నడక
అడుగులను తుడిచి వేయటానికి
నడుముకు చీపురు కట్ట" లను కట్టిన పీష్వాల పాలనా కాలం శూద్రులకు ఒక భయంకరమైన, దారుణమైన నరకాన్ని చూపించిన యుగంగా వర్ణించారామె. స్త్రీలను, శూద్రులను విముక్తి చేయడానికే పీష్వాల సామ్రాజ్యమంతమై, ఆంగ్లేయ పాలన వచ్చిందనీ, దాన్ని ఆహ్వానించాలని ఆమె కోరుకున్నారు. ఆ సందర్భంలోనే ఆంగ్ల భాషను నేర్చుకోవాలని ఆమె పిలుపునిస్తూ కవిత్వం రాశారు.

"చీకటిలో వేదనతో నిరాశలో మునిగిపోయాం
స్వర్గమూ, నరకమూ అన్నా మాకు భయాలే
శూన్యమైన మా బతుకుల్లోకి
కదలిరావమ్మా మా తల్లీ ఆంగ్లమా
అంధ విశ్వాసాలను అవతలికి నెట్టి
కొత్త లోకానికి తలుపులు తెరువు
మాకింత ఊరటనివ్వు" అని నిమ్న కులాలుగా, శూద్రకులాలుగా పిలువబడుతున్న వారంతా శాస్త్రీయమైన దృష్టిని అలవర్చుకోవడానికి ఆంగ్లాన్ని నేర్చుకోవాలని ప్రబోధిస్తారామె. అంతేకాదు,ఈ వర్గాల వారు ఆంగ్లాన్ని నేర్చుకొని, శాస్త్రాల పేరుతో జరుగుతున్న మోసాల్ని అరికట్టవచ్చుని చెప్తూ...

"ఇంగ్లీషు చదివి కుల భేదాల
గోడలను కూల గొట్టు
భట్ బ్రాహ్మణులు రచించిన కుతంత్రాల
శాస్త్ర పురాణాలను పడ గొట్టు" అని అంటారామె.

సావిత్రిబాయి పూలే కవిత్వాన్ని తెలుగులోకి అనువదించిన ప్రముఖ కవి, పరిశోధకుడు ఆచార్య వి.కృష్ణ "పద్దెనిమిదో శతాబ్దంలో కరుడుగట్టిన భూస్వామ్య మత వ్యవస్థకు వ్యతిరేకంగా, పేష్వాల క్రూర రాజ్య హింసను ఎదిరిస్తూ తన జీవిత భాగస్వామి జ్యోతిరావు పూలే అడుగుల్లో అడుగులేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థకోసం పాటుపడిన తొలి మహిళ సావిత్రిబాయి పూలే....దళితులు, స్త్రీల అభివృద్ధికోసం సావిత్రిబాయి సమస్త జీవితాన్ని వెచ్చించారు. మూఢాచారాలకు, మూఢనమ్మకాలకు, అనైతికపోకడలకు వ్యతిరేకంగా ఉద్యమస్ఫూర్తితో ఆమె పనిచేశారు. ఈ ఉద్యమంలో ఎవరో రాసిన సాహిత్యాన్ని ఆమె ఆసరాగ తీసుకోలేదు. తానే స్వయం గా రచిస్తూ ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థకే కాదు, ప్రత్యామ్నాయ సాహిత్యానికి కూడా మార్గాలు తెరిచారు. తమ సాహిత్యం ద్వారా విజ్ఞాన కాంతులు ప్రసరింపచేశారా"ని (ఆంధ్రజ్యోతి, 25 డిసెంబరు 2015) వ్యాఖ్యానించారు.

ఈ విధంగా సావిత్రిబాయి పూలే 19వ శతాబ్దిలో ఒక సామాజిక విప్లవకారిణిగా, తొలి మహిళా ఉపాధ్యాయినిగా ఆమె చేసిన సేవ అనిర్వచనీయమైంది. కేవలం ఆమె పుట్టిన రోజునో, ఆమె మరణించిన రోజునో మనం స్మరించుకోవడం కాకుండా, నిత్యం ఆమెను మన తల్లిలో, మన చెల్లెలూ, మన అక్కలో, మన భార్యలో చూడగలిగినప్పుడే ఆమెకు మనం నిజమైన నివాళిని అర్పించినవాళ్ళమవుతాం. కొంతమంది జయంతులు, వర్ధంతులను జాతీయ దినోత్సవాలుగా జరుపుకునే సంప్రదాయం మన భారతీయకులకు ఉంది. ప్రజలు అడగకపోయినా అధికారంలో ఉన్నవాళ్లు 'కొంతమంది' జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తుంటారు. వాటిని నిర్వహించి, నివేదికలు పంపించమని మంత్రిత్వశాఖల నుండి ఉత్తర్వులు వస్తుంటాయి.అది సావిత్రి బాయి పూలే విషయంలో కూడా జరిగితే బాగుంటుంది. సావిత్రిబాయిని ఒక కులానికి కట్టేయకుండా, సామాజిక పరివర్తనకు కృషి చేసిన మహనీయురాలిగా భారతీయులంతా గుర్తించగలగాలి.

సామెతలతో సరదాగా...



“కొత్తొక వింత పాతొక రోత” ఇలా మారిపోతున్నాయి రోజులు. ఒకప్పుడు.. మన ముందు తరం వారు.. అంతకు ముందు వారు.. మాట్లాడుకునే భాష కానీ.. ఆ వ్యవహారిక సంభాషణలు కానీ.. ప్రస్తుతం కనుమరుగైపోయాయనే చెప్పవచ్చు.. “కొత్త నీరు వచ్చి పాత నీరు కొట్టుకుపోయింది” అన్న చందాన.. ఇదివరలో.. మన వారి మాటలలో.. నిత్య జీవితంలో తరచూ సామెతలు.. ఆయా సందర్భానుసారంగా కనపడుతూవుండేవి. ఎంతో తేలికగా చెప్పేస్తూ వుండేవారు వాటిని. ఆ సందర్భానికి అది సరైనదే కదా! అనిపించేది. ఇప్పుడు ఏభై, అరవై ఏళ్ల వయసున్నవారికి ఇవి సుపరిచితాలే... కానీ ఆ తర్వాత తరం.. ముఖ్యంగా ఇప్పటి యువతకి ఇవి తెలీడం లేదు. వారికి ఈ సామెతలు, నానుడులు, ఇటువంటి వాటి మీద ఇంట్రస్ట్ లేకుండా వుంది. భాషని ఖూని చేసేస్తున్నారు. అందుకే.. మనం మన తర్వాత తరాల వారికి మన తేట తేనెల తెలుగుని వారికి అందించడంలో తగినంత కృషి చేయాలి. మన తెలుగు ని వెలుగు లోకి తేవాలి... ఆ ప్రయత్నంలో.. చేపట్టిన ప్రక్రియ... మనకి పెద్దలు చెప్పిన సామెతలలో కొన్నిటిని సేకరించి... ఈ కథలో పొందుపరి చారు.. ఈ కథ మొత్తం సామెతల చుట్టూనే తిరగడం విశేషం.

“కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది..” అంటూ గొణుగుతూ.. అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన భర్త కాంతారావు గారికి కాఫీ తెచ్చి ఇచ్చింది సుమతి..

“ఏంటోయ్ నీలో నువ్వే గొణుక్కుంటున్నావు.. ఏంటో.. అర్థమయేటట్లు చెప్పొచ్చు కదా! “అన్నారు ఆయన..

“ఏం చెప్పమంటారు.. “చిలక్కి చెప్పినట్లు చెప్పాను” మీకు.. విన్నారా.. మీ అక్కగారి” నోట్లో నువ్వు గింజ దాగదు “అని.. నామాట వినకుండా.. ఆవిడ చెవిలో ఊదారు.. ఆవిడ సంగతి తెలిసిందేగా

“తిరిగే కాలూ.. తిట్టే నోరూ ఊరుకోదని” మనమ్మాయికి కుజ దోషం వుందని ఆవిడ ఊరంతా టాంటాం చేస్తోంది. ఒకరిని అనుకుని ఏం లాభం..” మన బంగారం మంచిదవాలి కానీ”.. ఇక దీనికి పెళ్లి అయినట్టే..” అంది సుమతి.

“ఔనా.. మా అక్క అలా చెప్పదే ఎవరికీ..

“అనుమానం.. పెను భూతం..” అనవసరంగా అపార్థం చేసుకోకు.. మీ పుట్టింటి వాళ్ళేమయినా చెపుతున్నారేమో కనుక్కో.. జాతకం రాయించింది మీ తమ్ముడేగా.. “అన్నాడు కాంతారావు.

“ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు “ప్రతీదానికీ మా అన్నదమ్ముల్ని ఆడిపోసుకోవడమే మీరు.”ఆడలేనమ్మ మద్దెల గోల” లాగా... అయినా మా తమ్ముడేం మీ అక్కయ్య లాగా ఎవరికీ చాటింపులు వేసే రకం కాదు..” అంది సుమతి.

“ముంజేతి కంకణానికి అద్దమేల”.. అయినా.. ఇప్పుడు ఆ గోల ఆపి అసలు సంగతికి రా... ఇంతకీ నీ బాధ... మా అక్క అందరికీ చెపుతోందనా... మనమ్మాయి పెళ్ళి కావడం లేదనా.. “చెవిలో జోరీగ లాగా “నస పెట్టకుండా ఏదో చెప్పు ముందు..” అన్నాడు కాంతారావు.

“ఇంకేం వుందీ చెప్పడానికీ.. మీకు ఎప్పుడూ” కడుపే కైలాసం.. ఇల్లే వైకుంఠం” నా మాట ఎప్పుడైనా పట్టించుకున్నారు గనకనా.. అమ్మాయికో మంచి సంబంధం వాకబు చేద్దాం అని గానీ.. అల్లుడి కాళ్లు కడిగి కన్యాదానం చేద్దామనిగానీ.. ఆలోచనే లేదు.. “అంది సుమతి నిష్టూరంగా..

“ఓసి, పిచ్చిదానా.. “కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదే “.. ఆ ఘడియ రాలేదింకా మన పిల్లకి.. “అన్నాడు తాపీగా..

“అబ్బబ్బా మీకు చెప్పీ చెప్పీ నా “తల ప్రాణం తోకకివస్తోంది”. “చెవినిల్లు కట్టుకుని పోరినా” వినిపించుకోరు. మీ పెదనాన్న

కొడుకు.. చూడండి.. ఎంచక్కా రెండేళ్ళలో ఇద్దరి ఆడపిల్లలు పెళ్ళి చేసి

"గుండెల మీద కుంపటి "దించేసుకున్నారు.. కాస్త ఆయన ఎరికలో ఏవైనా మంచి సంబంధాలున్నాయేమో అడగండి. "అంది సుమతి.

"వాడినా.. వాడు "ఉపకారం అంటే ఊళ్ళోంచి పారిపోయేరకం." వాడినుంచి నేను సహాయం ఆశించడం "ఇసుకలో నూనె పిండినంత".. అయినా వాడు

"అయినవాళ్ళకి ఆకులు.. కాని వాళ్ళకి కంచాలు "పెట్టే తరహా.. వాడిని చచ్చినా అడగను. "అన్నాడు కాంతారావు.

"అయ్యో.. అలా అనుకుంటే ఎలా అండీ..

"వసుదేవుడంతటి వాడే గాడిద కాళ్లు పట్టుకున్నాడు" ఆయన ముందు మనమెంతటివారం.. అయినా మన

"నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది." మీరోసారి ఫోను చెయ్యండి.. ఆ తర్వాత" అందితే జుట్టు అందకపోతే కాళ్లు" పట్టుకుందాం." అంది సుమతి.

"వాడి గురించి "అరటిపండు వలచి చేతిలో పెట్టినట్లు "చెప్పినా నీకు అర్థం కావడం లేదు. సరేలే..

"తుమ్మితే ఊడిపోయే ముక్కు ఉన్నా ఒకటే పోయినా ఒకటే "నీ తృప్తి కోసం వాడిని అడుగుతాను. ఆ ఫోన్ ఇటు తీసుకురా..

"హలో.. అన్నయ్యా.. నేనురా.. కాంతారావుని.. ఎలా వున్నావు? అమ్మాయిల దగ్గర నుంచి ఫోన్లు వస్తున్నాయా? కులాసాగా వున్నారా ?.. ఆ.. ఏం లేదు.. ఈ ఏడు మేము మా శ్రీవల్లికి సంబంధాలు చూడడం మొదలెట్టాము.. నీ ఎరికలో ఏవైనా మంచి సంబం ధాలుంటే చెప్పమని మీ మరదలు అడగమంటే.. అందుకని ఫోను చేస్తున్నాను.. నీకు.."

"మేనరికమా... లేదన్నయ్యా.. నీకు తెలీనిదేముందీ..

"పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదు" అయినా.. వాడిని గారాబంతో చెడగొట్టింది అక్క... "మొక్కై వంగనిది మానై వంగునా" వాడికి ఇంకా ఉద్యోగం.. సద్యోగం లేదు.. స్థిరపడలేదు... ఓ పక్క.. అక్కయ్య అంటూనేవుందిలే.. సంబంధం కలుపుకోరా.. అంటూ... మా ఇద్దరికీ సుతారామూ ఇష్టం లేదు.. "అంత్య నిష్టూరం కన్నా ఆది నిష్టూరం మేలు "వద్దు అని చెప్పేసాలే అక్కకి.. ఏదైనా సాం ప్రదాయ కుటుంబం, మంచి ఉద్యోగం చేసుకుంటున్న పిల్లాడె వరైనా వుంటే చెప్పు.. నా స్థితిగతులు నీకెరికేగా..... ఔను.. జాతకం లో కొంచెం కుజ దోషం వుందట.. ఏవో పరిహార పూజలు చేయించింది మీ మరదలు.. అక్క చెప్పిందా..." అన్నాడు కాంతారావు..

ఆ ఫోనులో ఆ అన్నగారి మాటలు అన్నీ విని విసురుగా ఫోను పెట్టేసారు కాంతారావు గారు..

"ఏంటండీ.. ఏమన్నారు మీ అన్నయ్య? "అంది సుమతి.

"నీ మాట విని వాడికి ఫోన్ చేసాను... నా చెప్పుతో నన్ను కొట్టుకోవాలి. "మంచోడు మంచోడు అంటే చంకనెక్కి కూర్చున్నాడట "ఇలాంటి వాడే..." కళ్ళు నెత్తికెక్కాయి "వాడికి." కడుపు నిండిన బేరాలూ.. కడుపు నిండిన మాటలూ "వాడివి. ఏంటో ఆడపిల్ల పెళ్ళి చేయడమంటే ఆషామాషి అనుకుం టున్నావా.. నాకంటే ఏదో అదృష్టం పుచ్చి మంచి సంబంధాలు వచ్చాయి... అందరికీ అలా రావు... ఎవరైనా పెళ్ళిళ్ళ పేరయ్యాని పట్టుకుని "గంతకి తగిన బొంతని "వెతుక్కోమని ఉచిత సలహా పడేసాడు." ఊరుకున్నంత ఉత్తమం లేదు.. బోడిగుండంత సుఖం లేదు" అనవసరంగా వీడికి ఫోన్ చేసి మాటలనిపించుకున్నాను "అన్నాడు కాంతారావు కోపంగా..

"అయ్యో.. అంతమాటన్నారా.. అయినా..

"జిహ్వాకో రుచి.. పుర్రెకో బుద్ధి" పొన్లెండి ఆయన బుద్ధి బయట పడింది... "తలని తన్నేవాడొకడుంటే.. తాడిని తన్నేవాడొకడుం టాడు. "ఏదో ఒకరోజు ఆయనకే తెలుస్తుంది.. "ఉంగరాల చేత్తో మొట్టేవాడు చెపితేనే మాట వింటారు కొందరు "..మీరేం బాధ పడకండి.. "మనసుంటే మార్గముంటుంది "..ఆ దేముడే మనకే దారి చూపిస్తాడు. చెప్పడం మర్చిపోయా... నా చిన్నప్పటి స్నేహితురాలు పార్వతి నిన్న గుళ్ళో కనపడింది... తనకి తెలిసిన మంచి సంబంధాలు వున్నాయట.. ఈ రోజు మనింటికి వచ్చి.. చెపుతానంది.. చూద్దాం తనేం చెపుతుందో... "విత్తం కొద్దీ వైభోగం "పైగా మన దురదృష్టం "గోరు చుట్టు మీద రోకలి పోటు "లాగా పిల్లకి కుజ దోషం ఒకటీ... అది కప్పెట్టి పెళ్ళి చేయలేం కదా.. "అంది సుమతి.

మర్నాడు.. కాంతారావు ఆఫీసు నుంచి.. రాగానే.. ఆనందంతో ఎదుసుమతి.

"ఏంటోయ్.. "గాజుల కళకళ గుమ్మంలోనే ఎదురయింది".. కొంపతీసి ఉదయం నేను" నక్కని తొక్కివెళ్ళినట్టున్నాను".. అన్నారు.. చమత్కారంగా..

"పోండి.. మీకెప్పుడూ వేళాకోళమే... ముందిలా కూర్చుని కాఫీ తాగుతూ... నేను చెప్పే విషయం సావధానంగా వినండి. "ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయకండి" అంది. "ముద్దొచ్చినపుడే చంకకెక్కాలి "అనుకుంది సుమతి.

బుద్ధిగా చేతులుకట్టుకుని.." ఆ.. ఇప్పుడు చెప్పు "అన్నాడు కాంతారావు.

"నిన్న.. నా స్నేహితురాలు పార్వతి గురించి చెప్పాను కదా.. మధ్యాహ్నం తను వాళ్ళాయనని తీసుకుని మన ఇంటికి వచ్చింది. ఆయన బేంక్ మేనేజర్‌గా పని చేసి రిటైర్ అయ్యారట. పెద్దది ఆడపిల్లకి పెళ్ళి చేసి.. కాపురానికి పంపారట. తర్వాత అబ్బాయి.. వేణుగోపాల్.. ఎమ్ బి ఏ.. చేసి.. ఏదో పెద్ద కంపెనీలో చేస్తున్నడట. నెలకి లక్ష పైగా జీతం వస్తోందట. గుళ్ళో నాతో పాటు మన వల్లిని చూసారు కదా.. పిల్ల చక్కగా

"చిదిమి దీపం పెట్టుకునేలా వుంది" అనిపించిందట. వాళ్ళ వేణుకి చేసుకుంటామని అడిగారు. అప్పటికీ చెప్పాను.. "అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని వుంది" అన్న చందాన పిల్ల జాతకంలో కుజ దోషం గురించి కూడా చెప్పాను. వాళ్ళ కి అలాంటి పట్టింపులు ఏవీ లేవనీ... అసలు జాతకాల గురించి

ఆలోచించమనీ.. పైగా పెట్టుపోతలు కూడా ఏవీ ఆశించమనీ.. చెప్పారు. నాకైతే... "వెతకపోయిన తీగ కాలికి చుట్టుకున్నట్టు

"అనిపించింది. "ఉయ్యాల్లో బిడ్డని పెట్టుకుని ఊరంతా తిరిగామేమో" మనం. ఇదిగో అబ్బాయి ఫోటో ఇచ్చి వెళ్ళారు.. చూడండి.. దొరబాబు లా వున్నాడు.. మన శ్రీవల్లి పక్కన చూడ ముచ్చటగా వుంటాడనిపించింది. ఇంతకంటే గొప్ప సంబంధం మనం తేలేము.. ఆలోచించండి.." అంది సుమతి.. సంబరంగా.

"నువ్వు చెప్పిందీ నిజమే సుమతీ... పిల్లాడు బావున్నాడు.. కుటుంబమా.. మంచి సాంప్రదాయ కుటుంబమని చెపుతున్నావు.. పైగా వాళ్ళకి ఈ జాతకాల పట్టింపు లేకపోవడం... నిజంగా మన అదృష్టం. సరే మరి.. రేపు వెళ్ళి మంచీ చెడూ మాట్లాడి వద్దాం." అన్నాడు కాంతారావు.

రేపటిదాకా ఎందుకూ..

"శుభస్య శీఘ్రం...". "తలుచుకున్నపుడే తాత ప్రయాణం" అన్నట్లుగా ఇప్పుడే బయలుదేరదాం. మనం వస్తున్నట్టు పార్వతి కి ఫోన్ చేస్తాను." మీన మేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా అయిపోతుంది "..లేవండి.. లేవండి.." అంది సుమతి.


"లేడికి లేచిందే పరుగు ".. మా లేడీ గారు యమ హుషారుగా వున్నారు.. ఉండు పనిలో పని... మా పెదనాన్న కొడుక్కి ఫోన్ చేసి.. ఈ విషయం చెప్పాలి.

"గంతకి తగిన బొంత "అన్నాడుగా... ఇప్పుడు నేను చెప్పే ఈ సంబంధం వాడికి "కుక్క కాటుకి చెప్పు దెబ్బ "అనిపించాలి. "ఇనుము విరిగినా అతకవచ్చుకానీ.. మనసు విరిగితే అతకలేము..".. అంతలా నా మనసుని బాధ పెట్టాడు వాడు." అన్నాడు కాంతారావు.

"పోన్లెండి.. "ఊరందరిదీ ఓ దారి ఉలిపిరి కట్టెదో దారి" వదిలేయండి.. ఆయనని.. "గురివింద గింజ తనకింద నలుపెరగ దట "మనకెందుకింక ఆయన సంగతి.. ముందు బయలుదేరదాం పదండి" అంటూ భర్త ని తొందరపెట్టింది సుమతి.

వెళ్ళే దారిలో..." ఏవండీ.. చెప్పడం మర్చిపోయా.. ఇందాక పార్వతీ.. వాళ్ళాయన వచ్చినపుడు మీ అక్కయ్య గారు వచ్చారు.. విషయం అంతా తెలుసుకున్నారు.. వాళ్ళు వెళ్ళాక.. తన కొడుక్కి.. శ్రీవల్లి ని ఇవ్వడంలేదని ఉక్రోషం తో.. నానా మాటలు అన్నారు.." ఏ రాయైతేనేం పళ్ళూడకొట్టుకోవడానికి ".. ఆ జాతకాల పట్టింపులు నాకు లేవన్నాను.. అయినా నా మాటకి విలువీయ కుండా పరాయిసం బంధాలకి పోతున్నారూ.. "కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక పోతుంది" అంటూ.. శాపనా ర్థాలు పెట్టిందావిడ..

"శుభం పలకరా పెళ్ళి కొడకా అంటే పెళ్ళి కూతు రు... ఏది ? "అన్న ట్టుగా.. ఈవిడ అపశకు నపుమా టలేంటీ.. అని బాధే సింది నాకు "అంది సుమతి.



"పోనీలే.. మా అక్క సంగతి తెలుసుకదా... నువ్వు ఎందుకు.." గుమ్మడి కాయల దొంగంటే భుజాలు తడుముకుంటావు" పట్టించుకోకు..." గుడ్డి గుర్రానికి పళ్ళు తోమడం "తప్ప దానికి వేరే పనీపాటా లేదు.

"పనిలేని మంగలి పిల్లి తల గొరిగినట్టు" అది అలా వాగుతూనే వుంటుంది. వదిలేయి తన మాటలు.. ఎప్పుడూ వుండేవేగా.. "అంటూ భార్యని ఓదార్చాడు.

పెళ్ళి చూపులు అయిపోవడం.. పెళ్ళి మాటలు మాట్లాడుకో వడం.. ఆకాశమోత పెళ్ళి పందిరిలో భూదేవంత అరుగు మీద.. కాంతారావు, సుమతి దంపతులు.. పెళ్ళి కొడుకు కి కాళ్లు కడిగి కన్యాదానం చేయడం అయిపోయి.. . అమ్మాయిని అత్తగారింటికి సాగనంపారు.

పై పంచతో చెమర్చిన కళ్ళని తుడుచుకుంటూ..

"అందరికాళ్ళు మొక్కినా అత్తవారింటికి పోక తప్పదు కదా" అంటూ అనుకున్నాడు ఆ ఆడపిల్ల తండ్రి.

ఈ జాతకాలు కుదరడం లేదనే వంకో.. ఈ కుజ దోషం కారణంగానో.. చాలా మంది ఆడపిల్లలకి.. సరైన సమయంలో వివాహం కాకపోవడమో.. అసలు వివాహాలే కాకపోవడమో జరుగుతోంది. వినం ఇంతలా వెల్లివిరిసి.. ప్రపంచం ఆధునికంగా ముందుకు కు సాగిపోతోంటే... ఇంకా ఈ మూఢ నమ్మకాలేంటి ? ఆడపిల్లల జీవితాలకి ఈ జాతకాలు ఓ అడ్డుగోడ.. చదువుకున్న వారిలోనే ఈ జాడ్యం ఎక్కువగా వుంది.. అందరికీ.. మా శ్రీవల్లి చేయందుకున్న వేణుమాధవ్.. ఓ ఆదర్శం కావాలి... అనుకున్నాడు కాంతారావు.

ఇంతలో ఫోన్ మోగింది.... ఈ పెళ్ళి కి పిలవలేదుగా.. అందుకే ఈ సంగతి తెలీక ... కాంతారావు పెదనాన్న కొడుకు.... "ఒరేయ్ కాంతారావూ... మీ అమ్మాయికి ఏద్కెనా నా సంబం ధం వుంటే చెప్పమన్నావుగా... ఇక్కడ.. ఈ. సేవలో పనిచేస్తూం టాడు.. నెలకి పదివేలు జీతం .. అతనికీ కుజ దోషం వుందట.. సరిపోతుంది ఇద్దరికీ.. వాళ్ళ నెంబర్ ఇస్తాను.. ఓ సారి మాట్లాడి.. సంబంధం కుదుర్చుకో... నాపేరు చెపితే.. కట్నంలో.. కాస్త తగ్గిస్తా రు.. "అన్నాడు..

"ఆ.. అన్నయ్యా... "దొంగలు పడ్డ ఆరునెలలకి కుక్కలు మొరి గాయట".. అర్థమయిందను కుంటాను.. "అంటూ ఫోన్ పెట్టేసాడు.

☺ ☺ ☺

ఆకాశంలో సగం-అవకాశాల్లో సగం

జీతాలూ సగం సగమే

యత్ర నారీ పూజ్యంతే... ఇలా మన ఆదర్శాలు ఆకాశంలోనే ఉంటాయి. ఆచరణ మాత్రం పాతాళంలోనే ఉంటుంది. స్త్రీ పురుషుల మధ్య అంతరాలు అన్ని చోట్ల అలాగే ఉన్నాయి. భారతదేశంలో వందల, వేల కోట్ల వ్యాపారం చేసే కొన్ని కంపెనీల సీఈఓల వార్షిక వేతనాలు, అందులో స్త్రీ పురుషులకు తేడాలను ఈమధ్య ఎకనామిక్ టైమ్స్ బ్యానర్ ఐటెంగా ప్రచురించింది. 2019 సంవత్సరంలో కొన్ని పెద్ద కంపెనీలను పరిశీలిస్తే పురుష పుంగవుడయిన సీఈఓకు సగటున ఏటా రెండున్నర కోట్ల జీతం ఇస్తే, మహిళా మణి అయిన సీఈఓకు ఒకటిన్నర కోటి ఇచ్చారు. "పే గ్యాప్ బిట్వీన్ వుమెన్ అండ్ మెన్ సీ ఈ ఓ స్ డబుల్స్" అన్న శీర్షికతో చాలా లోతయిన వ్యాసమిది. బయోకాన్ ఫార్మా అధినేత్రి విశ్లేషణను కూడా జతచేశారు. నిజానికి ఒకప్పటితో పోలిస్తే ఈ అసమానతలు కొంత తగ్గాయి కానీ, ఇంకా చేరుకోవాల్సిన దూరం చాలా ఉంది. సమం కావాల్సిన అంతరం కూడా అంతులేనంతగా ఉంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహిళలు సమానం కావాలని కోరుకుంటున్నాం. ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ఉత్తేజపరుస్తున్నాం. చట్టాలు తెస్తున్నాం. కానీ, మహిళా సమానత్వం విషయంలో సమాజం ఇంకా మహిళలముందు తలదించుకోవాల్సిన పరిస్థితిలోనే ఉంది. అక్షరాస్యత లేని, అవగాహన లేని సమాజాల్లో సమానత్వం గురించి కాదు ఈ చర్చ. దేశంలోనే పేరున్న పెద్ద కంపెనీల నిర్వహణా బాధ్యతలు చూసే సీఈఓ పోస్టులంటే చదువు, అనుభవం, నాయకత్వ లక్షణాలు, చొరవ, శక్తి సామర్థ్యాలు ఉంటేనే కదా ఎంపిక చేస్తారు? అలాంటి చోట్లే స్త్రీ పురుషుల వేతనాల్లో ఇంత వివక్ష ఉండడం అవమానకరం, ఆక్షేపణీయం. దేశంగా మనం కోరుకుంటున్న మహిళా వికాసానికి ఇది మంచిది కాదు. ఉద్యోగం చేసే సగటు భారతీయ స్త్రీ ఇంటిపనిని కూడా ఇష్టంగానో, కష్టంగానో చేస్తూనే ఉంది. సాధారణ గృహిణి అయినా ఇంటి పనిని ఒక పనిగా అనుకోకుండా చేస్తూనే ఉంది. మోస్తూనే ఉంది. ఈ లెక్కన నిజానికి పురుషుల కంటే మహిళలకే వేతనాలు ఎక్కువుండాలి. అలాంటిది అంతంత పెద్ద కంపెనీల్లోనే మహిళలను జీతాల విషయంలో అంత చిన్నచూపు చూడడం భావ్యం కాదు. అది ఇది ఏమని అన్ని రంగముల మగధీరులనెదిరించి నిలిచిన మహిళలకు ఒక్క రూపాయి ఎక్కువయినా ఇవ్వచ్చు కానీ, పురుషులకంటే పావలా కూడా తక్కువ ఇవ్వడానికి మాత్రం వీల్లేదు.



మహిళా ఆవిష్కర వేత్తలు



ప్రముఖ ఆవిష్కర్తల పేర్లు చెప్పమని అడిగితే.. చాలామంది థామస్ ఎడిసన్.. మార్కోనీ.. గ్రాహం బెల్‌ల పేర్లతో ప్రారంభిస్తారు. మరి మేరీ ఆండర్సన్.. అన్ త్సుకమోటోల సంగతేంటి? మీకు వాళ్ల పేర్లు పెద్దగా తెలియకపోవచ్చు. కానీ, ఆ ఇద్దరు మహిళా ఆవిష్కర్తలే.. మనం రోజూ వాడే ప్రతి వస్తువు, సాంకేతికత వెనక ఉన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు ప్రపంచానికి అందించిన 8 అద్భుత ఆవిష్కరణల గురించి తెలుసుకుందాం.

1. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ - గ్రేస్ హాపర్ : రెండో రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అమెరికా నేవీలో చేరిన గ్రేస్ హాపర్.. అక్కడే కొత్త కంప్యూర్ మార్క్‌ను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. అప్పుడే ప్రోగ్రామింగ్ కోడ్‌ను కంప్యూటర్ భాషలోకి అనువాదం చేసే కంపైలర్ సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను అభివృద్ధి చేశారు. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లలో డి-బగ్గింగ్ అనే పదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది కూడా గ్రేస్ హాపరే. 79 ఏళ్ల వయసు వచ్చే వరకూ ఆమె కంప్యూటర్ అభివృద్ధి కోసం పనిచేశారు. అందుకే అంతా ఆమెను 'అమేజింగ్ గ్రేస్' అని పిలుస్తుంటారు.



2. కాలర్ ఐడీ, కాల్ వెయిటింగ్- డా.షెర్లీ ఆన్ జాక్సన్

ఫోన్ కాల్ ఎవరి నుంచి వస్తుందో తెలిపే కాలర్ ఐడి, మనం ఒకరితో మాట్లాడుతున్నప్పుడు మరో కాల్ వస్తే తెలిపే కాల్ వెయిటింగ్ ఫీచర్లను ఈమె అభివృద్ధి చేశారు. భౌతిక శాస్త్రంలో శాస్త్రవేత్త అయిన డా.షెర్లీ.. టెలికాం రంగంలో అనేక పరిశోధనలు చేశారు. ఫైబర్ ఆప్టిక్ కేబుల్, ఫ్యాక్స్ మెషీన్లు, సోలార్ బ్యాటరీల తయారీ వెనక ఈమె పరిశోధనలే కీలకం. అమెరికాలోని ప్రఖ్యాత మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి డాక్టరేట్ అందుకున్న తొలి ఆఫ్రికన్-అమెరికన్.



3. వాహనాల గ్లాస్ వైపర్- మేరీ ఆండర్సన్

1903లో మేరీ ఆండర్సన్ న్యూయార్క్‌లో పర్యటిస్తున్నారు. చలికాలం కావడంలో తన కారు అద్దాలపై మంచు పడుతోంది. ఆ మంచును తొలగించేందుకు డ్రైవర్ మాటిమాటికీ కారును ఆపి, బయటకు వెళ్తున్నాడు. దాంతో కారులో ఉన్న వారూ చలికి వణికిపోతున్నారు. ఆ సమస్యకు పరిష్కారం గురించి ఆలోచించిన మేరీ ఆండర్సన్.. రబ్బరుతో గ్లాస్ వైపర్‌ను తయారు చేశారు. దానిపై 1903లోనే ఆమె పేటెంట్ హక్కులూ పొందారు.



4. అంతరిక్ష కేంద్రం బ్యాటరీలు- ఓల్గా డి గాన్జలెజ్ సనాబ్రియా

అత్యధిక బ్యాకప్ ఇచ్చే నికెల్-హైడ్రోజన్ బ్యాటరీల సాంకేతికతను 1980లోనే ఓల్గా అభివృద్ధి చేశారు. ఈ బ్యాటరీలను అంతరిక్ష కేంద్రాల్లో వినియోగిస్తారు. ప్రస్తుతం నాసా పరిశోధనా కేంద్రంలో ఇంజినీరింగ్ విభాగం డైరెక్టర్‌గా ఓల్గా పనిచేస్తున్నారు.

5. డిష్ వాషర్- జోసెఫీన్ కోక్రేన్

తన ఇంట్లో పని మనిషి కంటే వేగంగా.. భద్రంగా.. శుభ్రంగా వంట పాత్రలను కడిగేసే డిష్ వాషింగ్ మెషీన్‌ను తయారు చేశారు. ప్రపంచంలో తొలి ఆటోమేటిక్ డిష్ వాషర్ అదే. ఈ ఆవిష్కరణకు గాను 1886లోనే ఆమె పేటెంట్ హక్కులు పొందారు. డిష్ వాషర్ తయారీ పరిశ్రమను ప్రారంభించారు.

6. హోం సెక్యూరిటీ సిస్టం- మేరీ వ్యాన్ బ్రిట్టన్ బ్రౌన్

నర్సుగా పనిచేసే మేరీ.. ఎక్కువగా ఇంట్లో ఒంటరిగా ఉండాల్సి వచ్చేది. రోజురోజుకీ నేరాలు పెరిగిపోతుండటంతో ఇంటి గుమ్మాన్ని పర్యవేక్షించేందుకు 1960లో ప్రత్యేక కెమెరాను ఏర్పాటు చేశారు. ఇంటి లోపలే ఉండే ఆ కెమెరా ఇంటి ముందు పరిసరాలను తలుపు రంధ్రంలోంచి చిత్రీకరిస్తూ ఉండేది. ఆ వీడియోను బెడ్ రూంలోని తెరపై చూసే వీలుండేది. ఆ ఆలోచనే ప్రస్తుత సీసీ కెమెరా సెక్యూరిటీ వ్యవస్థలకు పునాదిగా చెప్పొచ్చు.

7. మూల కణాలను వేరు చేయడం- ఆన్ త్సుకమోటో రక్తకణాలు ఉత్పత్తిలో కీలకమైన స్టెమ్ సెల్స్‌ను వేరు చేసే విధానాన్ని కనుగొన్నారు. అందుకు 1991లో పేటెంట్ పొందారు. ఈ విధానంతో బ్లడ్ క్యాన్సర్ వైద్యం సులభతరమైంది. ప్రస్తుతం స్టెమ్ సెల్ ఎదుగుదలపై ఆమె పరిశోధనలు చేస్తున్నారు.

8. కెవ్లార్(బుల్లెట్ ప్రూఫ్ ఫైబర్)- స్టెఫనీ కోలెక్

బుల్లెట్ ప్రూఫ్ దుస్తులు తయారీలో వినియోగించే ఫైబర్‌ను 1965లో సృష్టించారు. స్టీల్ కంటే ఐదు రెట్లు గట్టిగా ఉండే ఆ పదార్థంతో రూపొందించిన జాకెట్లను లక్షల మంది సైనికులు.. పోలీసులు వినియోగిస్తున్నారు. చేతి గ్లౌజులు.. మొబైల్ ఫోన్లు.. విమానాలు.. వేలాడే వంతెనల తయారీలోనూ ఆ ఫైబర్‌ను వాడుతున్నారు.



తెలంగాణ ధీర వనిత

"మల్లు స్వరాజ్యం"

తెలంగాణ ధీర వనిత "మల్లు స్వరాజ్యం" సార్థక నామధేయురాలు ఆమే. పసితనం నుండే పోరాటం కోసం ఆరాటం.ఆమే సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామంలో 1931లో జన్మించిన మల్లు స్వరాజ్యం. నిజాం సర్కారుకు ముచ్చెమటలు పట్టించి, రజాకార్ల పాలిటి సింహ స్వప్నమై నిలిచింది. 1945-48 సంవత్సరాల్లో సాయుధ పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించి నైజాం సర్కారును గడగడలాడించింది. ఈమె పోరాటాల ధాటికి తట్టుకో లేక 1947-48లో ఈమె ఇంటిని పూర్తిగా దగ్ధం చేశారు. మల్లు స్వరాజ్యం వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులను మేల్కొల్పింది.

ఈమె జానపద బాణీల్లో పాటలు కట్టి స్వయంగా పాడి గ్రామాలలోని ప్రజలను ఆకట్టుకునేది. ఈమె ఆంధ్రప్రదేశ్ శాసనసభకు నల్గొండ జిల్లా తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి 1978-1983,1983-1984 సంవత్సరాలలో రెండు పర్యాయాలు సి.పి.ఐ.(ఎం)పార్టీ తరపున ఎన్నికైంది. నల్లగొండకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణా యోధుడు, పార్లమెంటేరియన్ భీమిరెడ్డి నరసింహారెడ్డి ఈమెకు సోదరుడు.వామపక్ష భావాలతో, స్త్రీల ఆధ్వర్యంలో మొదలైన పత్రిక 'చైతన్య మానవి' సంపాదకవర్గంలో ఈమె ఒకరు.

"కొండపల్లి సీతారామయ్యను బాదితే బాగుండును" ప్రముఖ నక్సలైట్ నాయకుడు కొండపల్లి సీతారామయ్యపై తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, కమ్యూనిస్టు నాయకురాలు మల్లు స్వరాజ్యం తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. కొండపల్లి సీతారామయ్యను తుపాకీ మడమ తిప్పి బాదితే బావుండేదని తనకు అనిపించిందని ఆమె అన్నారు. కొండపల్లి కోటేశ్వరమ్మ (92) ఆత్మకథ నిర్జనవారధిని ఆమె ఆవిష్కరించి ప్రసంగించారు. నిర్జనవారధి చదువుతుంటే తనకు దుఖం తన్నుకొచ్చిందని ఆమె చెప్పారు. తన భర్తను కొండపల్లి కోటేశ్వరమ్మ ఎక్కడా తిట్టలేదు గానీ తనకైతే తుపాకీ మడమ తిప్పి సీతారామయ్యను బాదితే బాగుండనిపించిందని ఆమె అన్నారు. ప్రజల కన్నా పార్టీ ఎక్కువ, మానవ సంబంధాల కన్నా పార్టీ కట్టుబాట్లే మిన్న అనే మగవాళ్ల సంకుచిత దోరణిని కోటేశ్వరమ్మ సునిశితంగా గమనించారని ఆమె అన్నారు. ప్రజల చేతిలో కర్రలా, వడిసెలా ఉండాల్సిన వామపక్షాలు కాస్తా ఇప్పుడు అతి జాగ్రత్తగా సంరక్షించుకోవాల్సిన గాజు పాత్రల్లా మిగిలిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. సమసమాజ స్వప్నం సాధ్యమని భావించే తన వంటి మహిళలమంతా ఒక వామపక్ష పార్టీ పెట్టాలని భావిస్తున్నట్లు కూడా ఆమె అన్నారు. కొటేశ్వరమ్మ నాయకత్వంలో పార్టీ పెట్టాలనే ఆలోచన ఉందని, ఆమెతోనే పార్టీ నిర్మాణ ప్రతిపాదన చేద్దామని అనుకున్నానని మల్లు స్వరాజ్యం అన్నారు.



మహిళా దినోత్సవం...

నాణేనికి అటువైపు

- వేలూరి లక్ష్మి దేవి



'కొంత మంది ఆడవాళ్ళకి, మొగవాళ్ళకీ ఈ పోస్ట్ నచ్చక పోవచ్చు. కానీ నేను నా మనసులో వున్నది ఎవరేమను కున్నా వ్రాసేస్తాను' అందుకేనేమో - యదార్థ వాది - లోక విరోధి' అంటారు. అలా నా మనస్సులో వున్నది, (సత్యం) చెప్పి నేను కొన్ని చోట్ల, వారి కోపాలకు, వారినుంచి దూరం కూడా అయిపోయాను. అలా అని, అన్నిటినీ, అన్ని వేళలా భరించలేము కదా. ప్రత్యేకంగా కొన్ని ఇబ్బందికర, పది మందిలో మనల్ని వేలెత్తి చూపే విషయాలు సరే అది వొదిలి అసలు విషయానికి వస్తాను. "HAPPY WOMEN DAY.... HAPPY INTERNATIONAL WOMEN DAY" అని అందరూ తెగ (మనల్ని - అంటే ఆడవారిని) ఈ రోజు మాత్రం, ఎక్కడ లేని వారు మనపై ప్రశంసా జల్లులు కురి పించి," అహో ఓహో "అంటూ, తెగ వుబ్బించేసి, ఏ ఒక సంస్థ వారో, 'WOMAN OF THE YEAR MAHILAA AWARD' అనో చెప్పేసి, మనకు మెడలో ఒక దండ వేయించేసి, ఒక 'మొమెంటో' చేతి కిచ్చి, ఒక శాలువా కప్పేసి, చేతులు దులిపేసు కుంటారు. నా దృష్టిలో ప్రత్యేకంగా ఉమన్స్ డే ఎందుకు? మాకు, అంటే మా ఆడవారికి ప్రతి రోజూ ఉమన్స్ డే నే ! ప్రతి రోజూ 'దిన - ఉత్సవమే' వివరి స్తాను. స్త్రీ జన్మయే గొప్ప జన్మ ! చిన్నప్పుడు అమ్మా నాన్నల, అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ళ మధ్య, ఒక యుక్త వయసు వచ్చాక సమాజంలో .... ప్రతి రోజూ ఒక 'దినమే'... మేము అక్క అవుతే, తమ్ముడు చెల్లెళ్ళ కోసం, చెల్లెలవుతే అన్న అక్కల కోసం సర్దుకు పోతూ వున్నా ....ఏదో ఒక దానికి 'దినం' పెట్టించు కుంటూవుంటాం.... యుక్త వయసులో, ఎక్కువ మాటాడితే ఒక తప్పు.... మాటాడకపోతే ఒక తప్పు.... ఇలా రోజూ దినం పెట్టించుకుంటుంటాం..... నేను, ఈ కాల మాన పరిస్థితు లనూ, మా వయసు వారి అనుభవాలతో వ్రాస్తున్నాను. కొంతమంది నేను వ్రాస్తే , 'అలా లేదు లక్ష్మి గారూ కాలం మారింది.' అని వాదిస్తారు... కాలం మారలేదు, అలానే వుంది... మనుష్యుల స్వభావాలూ మారలేదు ...అవే ఇరుకు ఆలోచనలు, అదే పురుషా ధికార మనస్తత్వం ....ఎవరో కొంచం, తిరుగుబాటు చూపిస్తే, వారికి ఒక -"పొగరు, విరుగుబాటు, అతి ...." ఇలా ఇలా ఎన్నెన్నో బిరుదులు.... చిన్నప్పుడు, ఆటపాటలతో, అపుడో ఇపుడో, అమ్మ నాన్నల, అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ళ తిట్లతో, కొద్దో, గొప్పో దెబ్బలతో, అవన్నీమరచిపోయి నిర్మలంగా ప్రతి రోజునీ "ఉత్సవం" లా గడిపేస్తాము ..... వయసుకొచ్చాక, కాలేజ్‌లలో, (కొంచెం ఫ్రీగా వుంటే) 'ఏవేవో బిరుదులిచ్చి "దినాలు" పెట్టేస్తారు. బాగా చదువు కుని వుద్యోగాల్లో చేరి సంపాదిస్తున్నా, అమ్మానాన్నల అదుపులో వున్నా, ఏదో ఒక చిన్న విషయానికైనా, పని చేసే చోటనో.. ఏదో ఒక ఇబ్బందిని ఎదుర్కుంటూ ..' దినం 'పెట్టించేసు కుంటున్నాము. ఇక పెళ్ళయ్యాకా .... అక్కడ ప్రతిరోజూ 'దినమే' ఎదుర్కోవాలి మంచిగా వుంటే "మంచి తనాన్ని - చేతగాని తనం"గా తీసుకుని, దినం పెట్టేస్తుంటారు ...ఇక కొంచెం 'గడుసు'గా వుంటే, "పొగరు మోతనీ, సంపాదిస్తున్నానని అహంకారమనీ, పెంపకం సరిగా లేదనీ, మొగుణ్ణి చెప్పుచేతల్లో వుంచుకుందనీ ..... గడుసు అని బిరుదులు ఇచ్చి, ప్రతిరోజూ 'దినం' పెట్టేస్తుంటారు.... పిల్లలు పుట్టాక, వాళ్ళ ఆలనా, పాలనా చూస్తూ, వాళ్ళని సక్రమంగా పెంచినా, ఏ చిన్న

తప్పు వారిద్వారా అయితే నేమి, మనద్వారా అయితే నేమి, దానికి 'మమ్మల్నే' బాధ్యుల్ని చేస్తూ, దినాలు పెట్టేస్తుంటారు .... వాళ్ళని జీవితంలో స్థిరపరిచి, పెళ్ళి పేరం టాలు చేసి 'అబ్బ' అనుకునే లోపుగా, వారి పిల్లల బాధ్యతలు ....అంటే ...కూతురు, కోడలయినా ఉద్యోగాలు చేసే వారయితే ....వారికి చాకిరీ! అలా వారికీ, వారి పిల్లలకు చేస్తూ , చిన్న మాటకూడా అనకూడదు. అంటే వాళ్ళతో దినం. ఒక వేళ కూతురో కొడుకో, ఏ కొడుకో విదేశాల్లో వుంటే, 60, 65 వయసుల్లో వాళ్ళకు 'అమ్మ' (అంటే, వాళ్ళకు 60,65 కాదు ...మాకు ....) గుర్తొస్తుంది . ఇద్దరూ వుద్యోగాలకెళ్తారు ... వారి పిల్లల్ని చూసుకోవడానికి, ఇంటికి ఒక కాపలా దారు కావాలి .... ఎవరినైనా పెట్టుకుంటే, వారికి దాదాపు, నెలకు ఏ డెబ్బయ్యో, ఎనభయ్యో వేలు మన డబ్బులో ఇవ్వాలి .... మన మొహాలకు ఒక్క మారు - పోనూ రానూ డెబ్భై ఎనభై వేలు పెట్టి టికెట్ కొని పిలిపించు కుంటే , ఏ ఆరునెలలో చచ్చినట్టు పడివుంటారు అని ....మేము, ఆ 'మమకారం'- అనే కారాన్ని అడ్డుపెట్టుకుని.. ఎగేసుకుపోతాం... ఆరునెలల వగానే 'ఇక ఈ జన్మలో' రాకూడదు అని నిశ్చయించుకుని ....వస్తాం ..కానీ , మళ్ళీ అదే 'కారం 'అడ్డువచ్చి వెళ్ళాల్సి వస్తుంది ....పైగా అక్కడ జీవితం ' బంగారు పంజరం '...మన భాష వారికి అర్థం కాదు, వారి భాషను మనం అనుసరించలేము, బయటికి ఒంటరిగా వెళ్ళ లేము ....ఇంట్లో ఒంటరిగా వుండలేము .....ఇలా తిరిగి స్వదేశం చేరే వరకు, 'దినమే' ! ఒక వేళ త్వరగా వెళ్తామంటే - కూతురయితే ,'' ఏంటమ్మా ! నీకంత కష్టంగా వుందా ?
వెళ్తానంటున్నావు ? ఇక్కడ నాకష్టం నీకు అర్థం కాదా.. అవునులే ! అక్కడ బాగా ఇరుగు పొరుగులతో కబుర్లు, ఇక్కడయితే .. నీకు స్వతంత్రం వుండదుగా ...? ''...అంటూ దినం పెట్టేస్తారు ... కోడలయితే ... తను మంచి అవ్వాలనీ, ఎక్కడ కీ ఇవ్వాలో, అక్కడ ఇచ్చేసి, ఏమీ ఎరగనట్టు ...కొడుకుతో ...దినం పెట్టించేస్తారు ....'' సరే, ఏదోలా ఆ ఆరు నెలలు కష్టంగా - ఇష్టంగా కాదు గడిపి .... రాగనే .. మళ్ళీ ఇక్కడి బాధ్యతలు .... దినాలు .... చూసే వారికేమో, 'మీకేమండీ... హాయిగా, (కూతురయితే కూతురని, కొడుకయితే కొడుకని) రెఫర్ చేస్తూ ..., విదేశాలు చుట్టివచ్చారు ... అక్కడకు వెళ్ళలేని వారు.... అంటూ, అక్కడ మనం, ఐ మీన్ మేము పడ్డ ' దినాన్ని ' పదే, పదే జ్ఞాపకం చేస్తూ ....దినం పెట్టేస్తుంటారు...... ఇక మాకెక్కడండీ ప్రత్యేక దినం.... ఎందుకు ప్రత్యేక దినం... పైగా, కొన్ని, కొంత మంది (మా ఆడవారి) జీవితాలు ఎలా బుక్ అయిపోయివుంటాయో ఎలా మాటాడకుండా, దినాలు బ్రతికుండగానే పెట్టించుకుంటారో చెబుతాను.... నాకొక స్నేహితురాలు వుంది... నాకున్న కొంతమంది ముఖ్యులలో ఒకామె ... తనకు భర్త లేరు.. కావలసినంత డబ్బు ! కానీ ఆరోగ్యం బావుండదు... కొడుకు దగ్గర వుంటారు. ఒక్కడే కొడుకు. ఆ కొడుకుకూ తెలుసు. అమ్మకు ఆరోగ్యం సరిగ్గా వుండదని ... ఒక్కసారి గుండె జబ్బుతో మంచాన పడ్డారు. అయినా తమ కొడుకు చదువుకోసం, ఆవిడని అక్కడికి పంపించారు. 'బయటి భోజనం పడదు వాడికి 'అని ....అంటే, వయసులో వున్నవాడికి పడదు ... ఏ అర్ధ రాత్రి ఆవిడకేమయినా అయితే, ఆ చిన్న కుర్రాడు, వూరు కాని వూరులో ఆమెను, డెబ్బ ఏళ్ళ వయసులో ఆమెను చూసుకోగలడా ఆ చిన్న కుర్రాడు ? .... అక్కడా వాడి చదువు అయ్యేవరకు, తనకు రోజూ 'దిన దిన గండమే'... ఇక మరో స్నేహితురాలు. తనకు ఒకమ్మాయి, అబ్బాయి.. ఇద్దరూ విదేశాల్లో వుద్యోగాలు చేసుకుంటూ... స్థిర పడి పోయారు... తను ఆయన వున్నంతవరకు, ఆయన అనారోగ్యంతో జీవితంతో పోరాడి, పోరాడి, ఆయన ఈ మధ్యనే పోయారు... ఇప్పుడు తన అనారోగ్యంతో పోరాడుతూ, ఒంటరిగా , 'దినాలు 'లెక్కపెడుతోంది.... అక్కడికి వెళ్ళి ఆరునెలలకోసం (భర్త పోయాక) మధ్యలోనే తిరిగి వచ్చేసింది.....' నీకేం కావాలో చెప్పమ్మా ! డబ్బు పంపిస్తాం...' అంటారు. డబ్బుతో వస్తుందా, మనశ్శాంతి? డబ్బుతో వస్తుందా ఆప్యాయత ? అది అర్థం చేసుకోరెందుకు? ..... ఇలా వ్రాస్తూ పోతే .... మా బాధలు, వేనకు వేలు, లక్షలకు లక్షలు .....ఈ మధ్య, ఈ ''వృద్ధాశ్రమాల ''ఫీడ ఒకటి మనకంటుకుంది ....ఫ్రీ వృద్ధాశ్రమాలు, పెయిడ్ వృద్ధాశ్రమాలు, ఎన్నారై వృద్ధాశ్రమాలు .....ఓహ్ !.. ఇవన్నీ స్త్రీకి సుఖాన్నిస్తాయా ....కన్న బిడ్డల మనస్సులో కాస్తంత ప్రేమ , ఆప్యాయత ....ఇవేవి ? అవే మాకు కరువు ....నేను నా గురించి వ్రాయటం లేదు ....ఎంతో మంది తల్లుల వ్యథని, బాధని చూసి, విని చెబుతున్నాను.... వ్రాస్తున్నాను .... కాబట్టి, నా ప్రియతమ సోదరులారా, కొడుకులారా, కోడళ్ళారా, కూతుర్లారా.... మాకు కాస్తా ప్రశాంత జీవితాన్ని ఇవ్వండి.... మనశ్శాంతిని ఇవ్వండి.... కొంచెం ఆప్యాయతని పంచండి.... ఇప్పుడు బ్రతికినన్ని ఏళ్ళు మేము బ్రతకముగా... వునన్ని నాళ్ళు మాకు, మీ ప్రేమను పంచండి.... ఎక్కడ సుఖంగా, ఎక్కడ సౌకర్యంగా వుండాలని అనుకుంటామో, అక్కడ ఉండనివ్వండి... బ్రతికుండగానే మాకు ''దినాలు ''పెట్టకండి .. ప్లీస్ .....మాకు ఏ ప్రత్యేక మహిళా దినోత్సవాలూ వద్దు.. మమ్మల్ని పిచ్చివాళ్ళని చేసి, ఓహో, ఆహా అంటూ ఆకాశానికి ఈ ఒక్కరోజూ ఎత్తేసి, మళ్ళీ రేపటినుంచి, పాతాళానికి త్రొక్కకండి ....నేను వెళ్ళి చూసి , మాటాడిన వృద్ధాశ్రమాలలో, ఆ తల్లి దండ్రుల బాధ, ఆప్యాయ తలకు, వారి పిల్లలకోసం, వారు చూసే ఆ ఆర్ద్రత చూపులు, ఆ ఎదురుతెన్నులు నన్ను కలచి వేసి .... ఇవ్వాళ ఈ పోస్ట్ పెడుతున్నాను.... మాకు వృద్ధాశ్రమాలూ వద్దు, మీ మహిళా దినోత్సవాలూ వద్దు .... విదేశ యానాలూ వద్దు ...మా తో వుండండి.. మాకు మీ హృదయాల్లో కాస్త చోటు ఇవ్వండి పురుషపుంగవుల్లారా.... మా త్యాగాలు, మీ హృదయాల్లో భద్ర పరచుకోండి...సభలూ, సన్మానాలూ మాకొద్దు .... మమ్మ మమ్మగా చూడండి... చాలు..... ఈ వ్యాసం చాలా మందికి నచ్చక పోవచ్చు .... చాలామందికి నచ్చినా, నచ్చనట్టు నటించవచ్చు... నో వరీ.. నో ప్రాబ్లెం....ఓ ! ఓపికతో జీవిస్తున్న, జీవచ్ఛవ మహిళా, మీకూ - నాకూ నా ఇదే జోహార్ !...

మహిళా సాధికారత - భారతీయ సమాజంలో వైరుధ్యాలు

- ఆచార్య కె.యస్.చలం, మాజీ వి.సి. ద్రావిడ యూనివర్శిటీ, యు.పి.ఎస్.సి., పూర్వ సభ్యులు, న్యూఢిల్లీ

జంతు దశనుండి నిట్టనిలువుగా నడకనారంభించిన దగ్గరనుండి మనిషి వివిధ ప్రాంతాలకు పయనం సాగించారని అది ఆఫ్రికా నుండి సుమారు 60,000 నాడు జరిగిందని కొందరంటారు. అది ఎక్కడనుండి ప్రారంభమయినా మానవ నాగరికతకు మూలమైన నిట్టనిలువుమనిషి సుమారు రెండు లక్షల సంవత్సరాలక్రితం ప్రకృతిలో వున్నాడు. ఇక్కడ మనిషి అంటే స్త్రీ పురుషులు అని అర్థం. మొదటనుండి మహిళే అన్ని ప్రాంతాల్లో నాగరికతల్లో సమూహాలను కూర్చటానికి కుటుంబాన్ని నెలకొల్పడానికి, వ్యవసాయం, మానవ అభివృద్ధికి మూలం అని శాస్త్రవేత్తలు చెబుతారు. కుటుంబం ఏర్పాటు మహిళల తన ప్రాథమిక స్తానాన్ని కోల్పోవడం వ్యక్తిగత ఆస్తి ప్రారంభంతో మొదలయిందని ఫ్రడరిక్ ఏంగిల్స్ విశదీకరించాడు



ఆయన గ్రంధానికి మూలమైన మోరన్ పరిశోధనలు యిప్పుడు కొంత వివాదస్పదమయినప్పటికి ఏంగిల్స్ చేసిన సూత్రీకరణ అందరూ అంగీకరిస్తున్న వాస్తవమే. మానవ నగరికత వివిధ దశల్లో వేరు వేరు ప్రాంతాల్లో అభివృద్ధి జరిగినప్పటికీ మహిళ తన స్థానాన్ని కోల్పోలేదు. అసలు మానవ నాగరికతలో మొట్టమొదటి దేవత తియామత్ మేసపు మోమియో చరిత్రలో కన్పిస్తుంది. మన దేశంలో హరప్పా నాగరికతలో కన్పించిన దేవతామూర్తులు ఈ దేశంలో మొదటినుండి మహిళలకువున్న గౌరవాన్ని వారి పవిత్రతను తెలియజేస్తుంది. అది యీనాటికి దళిత, ఆదివాసి, బహుజన కులాల్లో నమ్మకాల్లో కనిపిస్తునే వుంది. ఇదే యీ దేశ వారసుల అసలైన వారసత్వం అని చెప్పడానికి అవసరమైన చారిత్రిక, పురావస్తు ఆధారాలు చాలా వున్నాయి. పురుషదురహంకారం పితృస్వామికవ్యవస్థ యీ దేశంలో ఋగ్వేద ఆర్యులతో ప్రవేశించి దాన్ని యిప్పటికి ఆరాధించి, అన్వయించి మిగతా వారిపై రుద్దడానికి ప్రయత్నించే సామాజిక వర్గం అతిశక్తివంతంగా తయారయింది. ఈ రోజు మహిళ శక్తి గూర్చి ముఖ్యంగా వారి ప్రాకృతికసిద్ధాంగా రావలసిన సమాన హక్కుల గూర్చి మాట్లాడుతున్నది. మరల దిగువ కులాలనుండి గాక కులీనుల, భద్రలోక్ వామపక్ష ప్రజాతంత్ర శక్తుల నుండి రావటం గమనించ దగ్గ అంశం. నిజానికి ఈ ఉద్యమాలను అవహేలన చేస్తూ, మహిళస్తానం ద్వితీయం కాని, ప్రాథమకం కాదంటూ మగాడికి అణగిమణిగి వుండాలని ప్రవచనాలు మగవాళ్లు చెబుతున్నా దానికి వంత ఎపాడి బహుజన కులాల్లో అభావజాలాన్ని యిప్పుడు మీడియా ద్వారా ప్రచారం చేస్తున్న కొంతమంది మహిళామణులను, వారి అద్వితీయ తాత్విక జ్ఞాన సంపదకు పదవిన్యాసాలకు ఆశ్చర్య పోవలసిందే.

ఇప్పుడు యీ విషయం ఉటంకించడానికి కారణం భాతదేశంలో పురుషుడు అహంకారాన్ని పితృస్వామిక వ్యవస్తను పెంచిపోషించిందెవరో తెలుసుకోవాలి. దిగువ కులాల సామాజిక, కుటుంబ, వ్యక్తిగత ఆస్తి తదితర అంశాలను పరిశీలించినపుడు, ద్విజకులాల కంటే దిగువ కులాల స్త్రీలు కొంతవరకు మెరుగు. అయితే ఆధునిక యుగంలో యీ సామాజిక వర్గాల నుండి పురుషులు ఉద్యోగాలు, పట్టణ పెట్టుబడి దారి సాంస్కృతిక జీవితంలోకి అడుగు పెట్టిన తరువాత వారి కుటుంబాల్లో వస్తున్న మార్పులను కొంతమంది ప్రశ్నిస్తున్నారు. ఇక్కడే చిక్కంతా వారంతా. వారి శాతం ఎంత అని తెలుసుకోకుండా అందరినీ ఆడిపోసుకోవడం కొంత మందికి అలవాటయి పోయింది. ముఖ్యంగా పెట్టుబడిదారి, సామ్రాజ్యవాద సాంస్కృతిక జీవితంలో మార్కెట్ అధికారిక వ్యక్తిగత స్వేచ్ఛను చూసి భ్రమపడి, యీ మహిళను కూడా వస్తువుగా చూడాలనే అపస్మారకంగానో, చైతన్యవంతంగానో ఆలోచించే కొద్దిమంది పురుషులు, మహిళమణులు వున్నారు. అసలు మహిళ కూడా హిందూ సమాజంలో సూద్రునితో సమాజం అని మనుధర్మ శాస్త్రం చెప్పిన సంగతి కొంతమందికి తెలిసినా దాన్ని ప్రక్కన పెట్టి అదో స్వల్పవిషయంగా హింధూమత ఔన్నత్యంగూర్చి మాట్లాడేవారున్నారు. అందుకే డా॥ అంబేద్కర్ మనందరిని కాదని సూద్రులకు (దళితులతో సహా) మహిళలకు

సమాన మక్కులు రాజ్యాంగంలో వుండాని పేర్కొనటంతో బాటు మహిళలకు ప్రత్యేక కోడ్‌ను రూపొందించాడు. బహుశా అదీ ఒక కారణమే ఏమో ద్విజకులాల పురుషులు వారి భ్రమలో వున్నారు మహిలామణులు అంబేద్కర్‌ను ఎప్పుడూ తలవనైనా తలవరు. ఇది ఒక విధంగా నేటిదికాదు. కొన్నాళ్ల క్రితం నాటి సామాజిక లక్షణం. దాన్ని కొందరు మార్చాలనుకున్నారు. గత ధశాబ్దంగా భారతదేశంలో వచ్చిన మార్పులతో ద్విజకులాల మహిళా నాయకురాండ్రే భారతీయత గూర్చి ఎక్కువుగా మాట్లాడుతున్నారు. అందులో ఒకరిద్దరు ముఖ్యంగా దళిత నాయకురాలైన సావిత్రిబాయి పూలే ఎమ్.పి ఆవ్యవస్తను కాదని బయటకు రావడం జరిగింది. ఈ విషయాలు యిక్కడ చెప్పుకోవడానికి కారణం భారతీయ సమాజంలో వున్న వైరాధ్యాలు అర్థం చేసుకోకుండా మహిళా సమాధికారత గూర్చి మాట్లాడలేము.

ఇప్పుడు దేశవ్యాప్తంగా పితృస్వామిక ఆధిపత్య భావజాలాన్ని మను దర్మ పాలనను కొనసాగించాడానికి తీసుకువస్తున్న రాజ్యాంగ పరమైన మార్పులపై తిరుగుబాటు చేస్తున్నదికూడా దిగువకులాల నుండి మతంపుచ్చుకున్న ముస్లిం మహిళలే. వారిని అడ్డుకోవాలని వాగున్న దికూడా ద్విజకులాల బామలేనన్నది మరువకూడదు. అక్కడక్కడా ప్రజా స్వామ్య వామపక్ష భావజాలంతో ప్రభావితులైన యువతుల యిందులో ముందువుండటం భవష్యత్‌పై ఆశలు రేకిస్తోంది. అయితే యిప్పుడు దేశంలో ప్రపంచంలో వున్న పరిస్తుతులను బట్టి అది సుదూరతీరమనే భావన వస్తోంది. మనదేశంలో గత శతాబ్దంగా వచ్చిన మార్పులను చూద్దాం. మహిళలను, సూద్రులకు విద్యకు దూరంగా వుంచిన బ్రాహ్మణీ హిందూమత ప్రభావంత ఏరాజ్యమైనా చివరకు ముస్లిం పాలకులైనా మహిళలకు చదువు యివ్వలేదు. కొంత మంది పురానాలు తిరగేసి గార్గి, గాయిత్రి జపం చేస్తారు. అదెప్పటిమాట. అప్పుడు ప్రపంచంలో అన్ని చోట్ల సమానత్వం వుంది. అది ఊహాజనిత కాల్పనిక సాహిత్యం ద్వారా ప్రచారం పొందినదైనా అది ఎందుకు కొనసాగ లేదు అని ప్రశ్నిస్తే సమాధానం వుండదు. మరి కొంతమంది అద్విజ కులాల్లోని జమీందారి, ఇనాందారి భూస్వామి సంస్కృతిలో ఒకటి రెండు కుంటుంబాల్లో యింటి వద్దనే చదువు కున్న విదుషీమణులున్నారు. వారి పేర్లు మాటి మాటికీ చెబుతూ, పుంఖానుపుంకాలుగా సాహిత్య సృజన చేసిన సాహితీవేత్తలు కూడా. నాటి అక్షరాస్యతతో మహిళల శాతం గూర్చి మాట్టాడారు. వందల సంవత్సరాల క్రితం నాటి భారతదేశ జనాభ 1901 లెక్క ప్రకారం మహిళల అక్షరాస్యత 0.65 శాతం ముప్పయి ఏళ్ల తరువాత గాని 2.93 శాతానికి 1931 నాటికి చేరుకోలేద. స్వాతంత్ర్యం వచ్చి ప్రజాస్వామ్య పాలన వచ్చిన తరువాత 18.6 శాతం 1971లో వుంది. రెండు దశాబ్దాల్లో రెండింతలయి 1991 నాటికి 40 శాతానికి చేరి 2011 నాటికి 65.5 శాతంగా వుంది. ఇందులో దగువకులాల, ఆదివాసీల శాతాన్ని తీసేస్తే పట్టణ ప్రాంతాలకు ద్విజ కుల మహిళల అక్ష్ర్యాసత చూస్తే దాదాపు వంద శాతానికి దగ్గరగాను, ఆదివాసీ ప్రాంతాలైన విశాఖ మన్యంలో 2 శాతానికి మాత్రమే అక్కడ మహిళలు పరిమితమైన విషయం అర్ధమవుతుంది. వింత గా మన దేశంలో సివిల్ సొసైటీ పౌరసమాజ ఉద్యమాల్లో దిగువ కులాల విషయాలు, అస్పృశ్యత, వివక్షత, మహిళల పట్ల జరిగే దాడులు, వారి అక్షరాస్యతకై ఉద్యమాలు చాలా తక్కువుగా వుంటాయి. గతంలో ఎవరో అన్నట్లు సారాతాగే భర్తల తలలు గీయించి ఊరేగించిన సంఘటనలున్నాయి గాని బ్రాంది తాగి క్లబ్బుల్లో తందనాలాడే మగాళ్లను తాకిన మహిళమణులు ఎక్కడ? అన్న ప్రశ్నలు ఎవరినీ నిందించటానికి కాదు. ఉద్యమాల్లో వున్న బలహీనతలు లోపాల గూర్తి తెలుసుకోవటానికనే గ్రహించాలి. రేపుల విషయమే తీసుకుందాం. సుమారు 25,000 కేసులతో దలితులపై నే 9200 మానభంగాలు జరిగినట్లు 2013 సిఆర్‌బిఐ రిపోర్టు తెలియజేస్తుంది. 2016లో మరింత పెరిగాయి. మహిళా ఉద్యమాల్లో కనీపడే ఇంకో అంశం, బాల్య వివాహాలపై పోరాటం 1901లో సగటున పెళ్లి ఆడపిల్లలయితే 13 ఏళ్లకు జరిగేది. అది 90 ఏల్ల తరువాత గాని19 ఏళ్లకు చేరుకోలేదు. అందుకే కేథరిన్‌మెమో ఇన్ మదర్ ఇండియా పుస్తకంలో జాత్యాహంకారంతో చిలవలు పలవలు వండి వార్చినా దాన్ని గాంధి ఖండించినా, అందులో లేవనెత్తిన విషయం బాల్య వివాహాలు, దళితుల వివక్షత ముఖ్యంగా నాటి బాల్య వివాహాలలో తొమ్మిదేళ్ల వయసులో పెళ్లిల్లు జరిగి మగాడి దౌర్భాగ్యానికి నలిగిపోయిన లైంగిక భాగాల ఎముకల గూర్చి చదివిన ఆరికి ఈ దేశంలో మతనమ్మకాలు మనుషులను జంతువుకంటే హీనంగా దిగజార్చిన సంఘటనలు గుర్తుచేస్తాయి. నేడు మీడియాలో అశ్లీల దృశ్యాల ద్వారా రెచ్చగొట్టబట్టే మృగాల దౌర్జన్యాలకు నలగిపోతున్న 5-10 ఏల్ల బాలికల శరీరాలు, అదీ కొన్ని సమాజిక వర్గాల ఆడపిల్లలే గురికావడం వింతేమీకాదు. మరి అంతర్జాతీయ శక్తిగా విశ్వగురువుగా ఎదగాలంటే పాశ్చాత్య మార్కెట్‌ను దాని సంస్కృతిని పెంచి పోషించాలిగదా! మార్కెట్‌కు కావలసిన స్వేచ్ఛను యివ్వాలిగదా! ఇటు వంటి చిన్న చిన్న ఉల్లంఘనలు లెక్కలోకి రావు. అందుకే బారతీయ సంస్కృతి గూర్చి ప్రవచనాలు చేస్తాంగాని ఆ సంస్కృతి సృష్టించిన వస్తువులను, మీడియాను ఎలా అదుపు చేస్తాం. అది చిన్న విషయంకాదు. లక్షల కోట్ల వ్యాపారం.

దిగువ కులాల యువకులు, యువతులు పరాయికరణకు గురిచేయాలంటే తమ ప్రత్యక్ష అనుభవాల నుండి చైతన్యం పొంది ఎదురుతిరగకుండా వుండాలంటే బ్రాహ్మణబనియా ఆధీనంలోనే మీడియా వుండాలి. జరుగుతున్న అనర్ధాలకు వారి కుటుంబాలే ప్రభావితమైనవారందరు గదా. దానికి ముందు మాట్లాడుకోవచ్చు. అయితే వెనుక బడిన కులాలు, కళాకారుల కుటుంబాల నుండి వచ్చిన మహిళలు కొన్ని రాష్ట్రాల్లో వెనుకబడిన, కొన్ని రాష్ట్రాల్లో దళితలుగా నమోదౌతు కొంత ఆర్థిక రంగంలో ప్రవేశించారు. ముఖ్యంగా కుటీర, చిన్నతరహా పరిశ్రమల ద్వారా నేత, కళంకారి, పనిముట్ల తయారీ రంగాల్లో మహిళలపై పేరుమీద నమోదైన విషయం తెలిసిందే. అయితే కేరళ, కర్నాటక, తమిళనాడులలో సమారు 50 శాతం యీ పరిశ్రమల్లో మహిళల పేరున నమోదైతే ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో తక్కువగా వున్నారు. అంటే దేశంలో మహిళాసాదికారితకై ఉద్యమించే ఉద్యమ కారులు, మహిళలైనా పురుషులైనా యీ దేశం యింకా బ్రాహ్మణీయ హింధూ భావజాలం నుండి బైటపడలేదని, గత దశాబ్దంగా జరుతున్న ప్రచారం, అచరణ ద్వారా వైరుధ్యాలుపెరుగుతున్నాయని గ్రహించాలి.

ఆధార్ లేకుంటే చావనుకూడా చావలేరు!



సృష్టి కొన్ని నియమాలకు లోబడి ఉంటుంది. ఆ నియమాలను తనకు తానే పెట్టుకుంది. గురుత్వాకర్షణ, భూభ్రమణం, పగలు- రాత్రి, మారే రుతువులు ఇలా కోట్ల కోట్ల సంవత్సరాలుగా ఒకే రూల్స్ క్రమం తప్పకుండా సృష్టి ఫాలో అవుతూ ఉంటుంది. ఇదంతా దేవుడు చేసే పని. సృష్టి స్థితి లయ అతనికి/ఆమెకు ఆట. ఆ ఆటలో మనమంతా బొమ్మలం అనుకోవడం ఒక ఫిలాసఫీ. దేవుడు చేసిన మనుషులు కాదు. మనుషులే దేవుడిని పుట్టించారు అనేది ఇంకో ఫిలాసఫీ. అయినా ఆ గొడవ మనకెందుకు? సంఘం నడకకు మనం కూడా కొన్ని రూల్స్ ఏర్పాటు చేసుకుంటాం. మెజారిటీ ఆ రూల్స్ ను ఫాలో అవుతారు. ఒక్కోసారి రూల్స్ కోసమే బతకాల్సి వస్తుంది. రూల్స్ కోసమే చావాల్సి వస్తుంది. లేదా రూల్ ప్రకారమే పుట్టాలి. రూల్ ప్రకారమే చావాలి. చచ్చినా రూల్ ను జవదాటడానికి వీల్లేదు. చిన్నప్పుడు మా ఎలిమెంటరీ స్కూల్లో ఒకటో క్లాసులో చేర్చేప్పుడు అయ్యవారు ఏది రాస్తే అదే మా పుట్టినరోజు. నేను ఫలానా రోజు పుట్టాను. మీరు ఆరు నెలలు ముందో, వెనకో తేదీ వేశారు అని అడిగే అవసరం అప్పుడు కనిపించలేదు. పైగా సర్టిఫికెట్ల ప్రకారం ఒక పుట్టినరోజు, అసలు పుట్టినరోజు కలిపి ఒక జన్మకే రెండు జన్మల ఫలం దక్కింది కదా అని పొంగిపోయేవాళ్ళం. అయినా అమ్మ తరువాత లౌకిక ప్రపంచంలో మరో జన్మ ప్రసాదించాల్సింది గురువే కాబట్టి- గురువుకు ఆ అధికారాన్ని మనం కాదనడానికి వీల్లేనిది. కాబట్టి గురువు ప్రకటించిన తేదీకే మనం పుట్టామనుకోవడం మర్యాదే కానీ, ఏమాత్రం తప్పు కాదు.

ఇప్పటి తరానికి ఈ సౌలభ్యం లేదు. పుట్టీ పుట్టగానే కేర్ కేర్ మని ఏడ్చినా ఏడవకపోయినా పరవాలేదు. ముందు ఆధార్ సెంటర్ కు వెళ్లి పుట్టినట్లు, అంతకంటే ముందు జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. లేకపోతే లోకంలో మన పుట్టుకను ఎవరూ గుర్తించరు. ఆ ఆధార్ బిళ్లను కర్ణుడి కవచకుండలంలా ఎప్పుడూ మెడలో తగిలించుకుని ఉండాలి. పేరుకు తగినట్లు ఈ భూమి మీద మనం నిలబడడానికి ఈ ఆధార్ కార్డే మనకు ఆధారం. ఆధార్ కార్డులో మన ఫోటోనే ఉంటుంది. కానీ ఇంతవరకు ఎవ్వరూ ఎప్పుడూ తీయనంత వికారంగా, పేలవంగా, మసకమసకగా, మచ్చలు మచ్చలుగా, అలవాటుగా ఘోరాలు చేసేవారు పలకలో తమపేరు తామేరాసుకుని తగిలించుకున్న పోలీసు స్టేషన్ ఫొటోలకన్నా ఘోరంగా ఫోటోలు తీసి కార్డులో పేస్ట్ చేయాలని ఆధార్ నిర్వాహకులకు స్పష్టమయిన ఆదేశాలున్నట్లున్నాయి. లేకపోతే చాలామంది ఆధార్ ఫొటోలనే డిపి లుగా పెట్టుకుని తమను తామే చూసుకుంటూ మురిసిపోయి లోకాన్ని మరచిపోతారని ప్రభుత్వానికి భయం. ఇక ఆధార్ కార్డుల్లో అక్షర దోషాల గురించి రాసే ఓపిక నాకు లేదు. అయినా ఆధార్ విలువ తగ్గదు. మనిషిగా మనకో పేరుఘ తల్లిదండ్రులు పెట్టి ఉంటారు. ఆ పేరును ఆధార్ తోసిరాజని మనల్ను ఒక సంఖ్యగా ఆధార్ రూపాంతరం చేస్తుంది. భవిష్యత్తులో మన పేరు ఎవరయినా అడిగితే పన్నెండంకెల మన ఆధార్ సంఖ్య టక్కున చెప్పకపోతే స్వచ్ఛందంగా మనకు మనమే జైల్లోకి వెళ్లాలి. నిజంగా కూడా దేనికయినా ఒక లెక్క ఉండాలి. అసలు లెక్కల్లో ఉన్నవన్నీ అంకెలు, సంఖ్యలే. ఈ అంకెల సంకెలలో మనం బందీలు కావడం అంటే మనం లెక్కల్లో నిష్ణాతులమన్నమాట.

బెంగళూరులో శ్మశానానికి ఒక శవం వెళ్ళింది. శవానికి ఆధార్ కార్డు లేక శ్మశాన వైరాగ్యం అంటే ఏమిటో ఆ పోయిన ఆమె బంధువులకు తెలిసివచ్చింది. అంతటి విషాదంలోనూ చివరాఖరికి ఎలాగో శవానికి ఆధార్ కార్డును జత చేస్తే- అప్పుడు శవానికి శ్మశాన ప్రవేశం లభించింది. చావు వార్త కాబట్టి ఇంతకంటే ఎక్కువ రాయడం బాగోదు. ఆధార్ లేని చావును చివరికి వల్లకాడు కూడా ఒప్పుకోదు అని గ్రహింపు ఉంటే బతికి ఉన్నవారికి ఈ లోకంలో నూకలు చెల్లుబాటవుతాయి. లేకపోతే నూకలు చెల్లినా, శ్మశానం మాత్రం ఆ నూకలను గుర్తించదు.

అందుకే "ఆధార్"అంటూ ఉంటే భూమ్మీద బతికి బలుసాకు సాగుచేసుకుని, అమ్ముకుంటూ అయినా బతకవచ్చు. ఆధార్ లేని వేళ ఆ దేవదేవుడే మన పక్కన నిలుచున్నా ఏ ఆధారమూ లేనట్లే.



ఎక్కువ హత్యలు సన్నిహితులే చేస్తున్నారు

ప్రపంచంలో ప్రతి రోజూ సగటున 137 మంది మహిళలను వారి జీవిత భాగస్వాములో, కుటుంబ సభ్యులో హత్య చేస్తున్నారని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (యూఎన్‌ఓడీసీ) తాజాగా విడుదల చేసిన లెక్కలు చెప్తున్నాయి.

"ఒక మహిళ హత్యకు గురయ్యే అవకాశం అత్యధికంగా ఉన్న ప్రాంతం ఆమె ఇల్లే" అని ఆ సమాచారం స్పష్టం చేస్తోంది.

ఆ నివేదిక ప్రకారం.. 2017లో హత్యకు గురైన 87,000 మంది మహిళల్లో సగం కన్నా ఎక్కువ మంది.. వారికి అత్యంత సన్నిహితుల చేతుల్లోనే చనిపోయారు.

అందులో సుమారు 30,000 మంది సన్నిహిత భాగస్వాముల చేతుల్లో హత్యకు గురవగా.. మరో 20,000 మంది బంధువుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారు.

ఈ సంఖ్యల వెనుక ఉన్న మహిళల గురించి తెలుసుకోవాలని బీబీసీ 100 మంది మహిళలు భావించింది. అక్టోబర్ నెల మొదటి రోజున హత్యకు గురైన మహిళలు, పురుషుల గురించిన వార్తా కథనాలను మేం ఆ నెలంతా పరిశీలించాం. వారి కథలు కొన్నిటిని ఈ కింద పంచుకుంటున్నాం. ఈ హత్యలను ఎలా ప్రచురించారన్న దాని గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.

పురుషుల హత్యలే ఇంకా అధికం

యూఎన్‌ఓడీసీ సేకరించిన సమాచారం.. "ఉద్దేశపూర్వక హత్యల ఫలితంగా ప్రాణాలు కోల్పోయే అవకాశమున్న పురుషుల సంఖ్య మహిళల కన్నా దాదాపు నాలుగు రెట్లు అధికంగా ఉంది" అనే విషయాన్ని ప్రస్ఫుటం చేస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 హత్యల్లో ఎనిమిది మంది పురుషులే అని ఐరాస సూచిస్తోంది.

అయితే.. సన్నిహిత భాగస్వాముల వల్ల హత్యకు గురైన ప్రతి 10 మందిలో ఎనిమిది కన్నా ఎక్కువ మంది మహిళలేనని అదే నివేదిక చెప్తోంది.

"సన్నిహిత భాగస్వామి హింసే మహిళలను అధికంగా బలి తీసుకుంటోంది" అని ఆ నివేదిక ఉద్ఘాటించింది.

47 మంది మహిళలు.. 21 దేశాలు.. ఒక్క రోజు

2017లో హత్యలకు సంబంధించి ప్రభుత్వ వర్గాలు అందించిన గణాంకాలను క్రోడీకరిస్తూ ఐక్యరాజ్యసమితి గణాంకాలను రూపొందించింది.

"మహిళలు, బాలికల హత్యలు" లేదా "స్త్రీ హత్యల"కు సంబంధించిన అంకెలను.. సన్నిహిత భాగస్వామి/కుటుంబ సంబంధిత హత్య అనే ప్రాతిపదికన క్రోడీకరించారు.

ఈ అంకెల వెనుక ఉన్న మహిళల గురించి మరింత తెలుసుకోవటానికి బీబీసీ 100 మంది మహిళలు, బీబీసీ మానిటరింగ్ రంగంలోకి దిగింది.

2018 అక్టోబర్ 1వ తేదీన హత్యకు గురైన మహిళలకు సంబంధించి మీడియాలో ప్రచురితమైన కథనాలను మేం పరిశీలించాం. ఆ రోజున 21 వేర్వేరు దేశాల్లో 47 మంది చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. వీటిలో చాలా హత్యలపై ఇంకా దర్యాప్తు జరుగుతూనే ఉంది.

అక్టోబర్ 1న మీడియా రిపోర్ట్ చేసిన మహిళల హత్యలు

నేహా శరద్ చౌధరి వయసు 18, భారత్‌లోని మాలేగావ్‌లో హత్యకు గురైంది.

గుర్తు తెలియని మహిళ వయసు 31, ఇరాన్‌లోని మషాద్‌లో హత్యకు గురైంది.

లిండా మిల్లర్ వయసు 66, అమెరికాలోని ఇండియానాపోలిస్‌లో హత్యకు గురైంది.

గుర్తు తెలియని బాలిక వయసు 17, భారత్‌లోని అలీపూర్‌లో హత్యకు గురైంది.

జుడిత్ చెసంగ్ వయసు 22, కెన్యాలోని బరింగోలో హత్యకు గురైంది.

ఫర్జానా బీబీ వయసు 22, పాకిస్తాన్‌లోని పాక్‌పట్టన్‌లో హత్యకు గురైంది.

డినా మపెల్లి వయసు 77, ఇటలీలోని విమెర్కటెలో హత్యకు గురైంది.

శాండ్రా లూసియా హ్యామర్ మౌరా వయసు 39, బ్రెజిల్‌లోని పల్మాస్‌లో హత్యకు గురైంది.

జెన్నిఫర్ మజిన్ మలెస్ వయసు 24, కంబోడియాలోని లాస్ కామ్బులాస్‌లో హత్యకు గురైంది.

గుర్తు తెలియని మహిళ వయసు 82, రొమేనియాలోని డ్రక్సానీలో హత్యకు గురైంది.

యనెట్ నున్నెజ్ నిక్లాజ్ వయసు 46,

చిలీలోని రియో క్లారోలో హత్యకు గురైంది.

రితూ దేవి వయసు తెలియదు, భారత్‌లోని నీలిలో హత్యకు గురైంది.

గుర్తు తెలియని మహిళ వయసు 30, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో హత్యకు గురైంది.

గుర్తు తెలియని బాలిక వయసు 5, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో హత్యకు గురైంది.

గుర్తు తెలియని మహిళ వయసు 67, నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో హత్యకు గురైంది.

కాట్టీ మయొర్లే జాకమ్ హెర్నాండెజ్ వయసు 34, కొలంబియాలోని కుకుటలో హత్యకు గురైంది.

నియా వయసు తెలియదు, ఇండోనేసియాలోని డుమైలో హత్యకు గురైంది.

మేరీ అమెలీ వయల్లట్ వయసు 36, ఫ్రాన్స్‌లోని ఒయొన్నక్స్‌లో హత్యకు గురైంది.

గుర్తు తెలియని మహిళ వయసు 85, జపాన్‌లోని కవాసకిలో హత్యకు గురైంది.

వనెస్స విసెంటె ద సిల్వ వయసు 27, బ్రెజిల్‌లోని సెర్రా తల్హదలో హత్యకు గురైంది.

రెస్టి నోవా డిల వయసు 20, ఇండోనేసియాలోని దక్షిణ సొలొక్‌లో హత్యకు గురైంది.

టి. జ వయసు తెలియదు, ఉజ్బెకిస్తాన్‌లోని అసాకా జిల్లాలో హత్యకు గురైంది.

జస్టినా కొయిలో లోప్స్, వయసు 69, బ్రెజిల్‌లోని బౌరులో హత్యకు గురయ్యారు

గ్రిసెల్డా ఇరియా ఒసోరియో ఆల్వరెజ్, వయసు 21, మెక్సికోలోని టిజువానాలో హత్యకు గురయ్యారు

ఎడినెవుజా కోస్టా సిల్వా, బ్రెజిల్‌లోని క్విగ్జెరామొబిమ్‌లో హత్యకు గురయ్యారు

పాలా ఆండ్రియా ఆల్వరెజ్ మొరేల్స్, వయసు 35, కొలంబియాలోని సియుడడ్ బొలివర్‌లో హత్యకు గురయ్యారు

గుర్తు తెలియని యువతి , పాకిస్తాన్‌లోని తాండ్లియన్‌వాలాలో హత్యకు గురయ్యారు

మారియా గ్లాడిస్ హెరెరా డె డమైన్, వయసు 55, ఎల్ సాల్వడర్‌లో హత్యకు గురయ్యారు

టబాటా అమ్‌స్కోలి డె పజ్ లోపెజ్, వయసు 18, గ్వాటెమాలాలో హత్యకు గురయ్యారు

బార్బీ పిగ్గ్, వయసు 49, యూకేలోని మిడిల్స్‌బ్రోలో హత్యకు గురయ్యారు

లియొన్సియా టుపాస్, వయసు 67, ఫిలిప్పీన్స్‌లోని క్వెజన్ నగరంలో హత్యకు గురయ్యారు

విల్మా జోసెఫెనా కాంట్రియాస్, వయసు 55, ఎల్ సాల్వడర్‌లో హత్యకు గురయ్యారు

గుర్తు తెలియని మహిళ, బ్రెజిల్‌లోని బెలెమ్‌లో హత్యకు గురయ్యారు

గుర్తు తెలియని మహిళ, వయసు 39, మెక్సికోలోని క్యాంపెచేలో హత్యకు గురయ్యారు

ఎమిలీ పుంజలన్ బుకే, వయసు 27, ఫిలిప్పీన్స్‌లోని క్వెజన్ నగరంలో హత్యకు గురయ్యారు

గుర్తు తెలియని మహిళ, మెక్సికోలోని టపాచులాలో హత్యకు గురయ్యారు

గాబ్రియెలా డ రోసా సిల్వా, బ్రెజిల్‌లోని పోర్టో అలెగ్రెలో హత్యకు గురయ్యారు

గుర్తుతెలియని మహిళ, పాకిస్తాన్‌లోని లాహోర్‌లో హత్యకు గురయ్యారు

జీనబ్ సీకాన్వాండ్, వయసు 24, ఇరాన్‌లోని ఉరుమెలో హత్యకు గురయ్యారు

ఉన్మార్ సనమ్, వయసు 50, యూకేలోని బర్మింగ్‌హామ్‌లో హత్యకు గురయ్యారు

రుటె మారియా డ కాన్సెషియో, వయసు 36, బ్రెజిల్‌లోని ఒలిండాలో హత్యకు గురయ్యారు

అవన్ నజ్మదీన్, వయసు 32, యూకేలోని స్టోక్ ఆన్ ట్రెంట్‌లో హత్యకు గురయ్యారు

కరెన్ గ్రోవ్స్, వయసు 58, యూఎస్‌లోని ఇండియానాపోలిస్‌లో హత్యకు గురయ్యారు

డమారిస్ యోసెలిన్ 'ఎన్', వయసు 18, మెక్సికోలోని అకపుల్కోలో హత్యకు గురయ్యారు

మిలైన్ ఫెరీరా డె ఒలీవిరా, వయసు 19, బ్రెజిల్‌లోని మినాస్ గెరైస్‌లో హత్యకు గురయ్యారు

గుర్తుతెలియని మహిళ, వయసు 61, తజిక్‌స్తాన్‌లోని వంజ్ జిల్లాలో హత్యకు గురయ్యారు

సుపినా, వయసు 48, ఇండొనేసియాలోని సెకదౌ హిలిర్ ప్రాంతంలో హత్యకు గురయ్యారు

కాట్టీ మయొర్లే జాకమ్ హెర్నాండెజ్ వయసు 34,



కొలంబియాలోని కుకుటలో హత్యకు గురైంది.

స్థానిక మీడియాలో ప్రచురితమై, అనంతరం సంప్రదించగా స్థానిక అధికారులు నిర్ధారించిన ఉదంతాలు ఇవీ...

నేహా శరద్ చౌదరి (18 ఏళ్లు), ఇండియా

నేహా శరద్ చౌదరి.. తన 18వ పుట్టిన రోజు నాడు హత్యకు గురైంది. ఆమెది 'పరువు' హత్యగా అనుమానిస్తున్నారు.

నేహా తన బోయ్‌ఫ్రెండ్‌తో పుట్టినరోజు వేడుకలు జరపుకోవటానికి బయటకు వెళ్లింది. అతడితో ఆమె సంబంధాన్ని ఆమె తల్లిదండ్రులు ఆమోదించలేదని పోలీసులు బీబీసీకి నిర్ధారించారు.

ఆ రోజు సాయంత్రం ఆమె ఇంట్లోనే ఆమె తల్లిదండ్రులు, మరొక మగ బంధువు ఆమెను హత్య చేశారన్నది ఆరోపణ.

ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ముగ్గురు నిందితులూ జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

ప్రేమించినందుకు, కుటుంబ అభీష్టానికి వ్యతిరేకంగా పెళ్లి చేసుకున్నందుకు.. ప్రతి ఏటా వందలాది మంది హత్యకు గురవుతున్నారు. ఇటువంటి నేరాలు తరచుగా నమోదు కాకపోవటం, వెలుగు చూడకపోవటం వల్ల.. 'పరువు హత్యలు' అని పిలిచే ఈ దురాగతాల గురించి అధికారిక లెక్కలు లభించటం కష్టం

జుడిత్ చెసాంగ్ (22 ఏళ్లు), కెన్యా

అక్టోబర్ ఒకటో తేదీ, సోమవారం నాడు.. జుడిత్ చెసాంగ్, ఆమె సోదరి నాన్సీలు.. తమ పొలంలో జొన్న పంట కోస్తున్నారు.

జుడిత్.. ముగ్గురు పిల్లల తల్లి. ఆమె ఇటీవల తన భర్త లబాన్ కామురెన్ నుంచి విడిపోయి.. తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

వీరు పొలంలో పనులు ప్రారంభించిన కొద్ది సేపటికే.. భర్త పొలం దగ్గరికి వచ్చి జుడిత్ మీద దాడి చేసి ఆమెను చంపేశాడు.

అనంతరం అతడిని గ్రామస్తులు చంపేశారని స్థానిక పోలీసులు చెప్తున్నారు.

మహిళలు తమ సన్నిహిత భాగస్వామి లేదా కుటుంబ సభ్యుల చేతుల్లో హత్యకు గురయ్యే ప్రమాదం అత్యధికంగా ఉన్న ప్రాంతం ఆఫ్రికా అని ఐరాస నివేదిక చెప్తోంది. ఆఫ్రికాలో ఇలాంటి హత్యల రేటు ప్రతి 1,00,000 మందికి 3.1 గా ఉంది.

ఇక 2017లో సన్నిహిత భాగస్వాముల చేతిలో హత్యకు గురైన మహిళల సంఖ్య అత్యధికంగా ఆసియాలో నమోదైంది. ఆసియాలో మొత్తం 20,000 మంది ఈ రకంగా చనిపోయారు



ఆన్‌లైన్ నిశ్చితార్థం....

కొంచెం లోతుగా ఆలోచిస్తే ఇందులో ఎంతో సౌలభ్యం ఉంది. తాత్వికంగా కూడా భావనలోనే దేవుడున్నాడు. అందుకే అన్నమయ్య భావింప సకల సంపద రూపమదిగో... అన్నాడు. భావింపను న్నాడిందరి భాగ్యము వలెను... అని కూడా అన్నమయ్యే అన్నాడు. భౌతికంగా పీటల మీద కూర్చుని మానసికంగా ఏదేదో ఆలోచించేవారికన్నా-ఇలా ఆన్‌లైన్లో పరమ పవిత్ర భావనతో తంతు నిర్వహించడం శాస్త్ర సమ్మతమే కావాలి. ఎందుకంటే వేద మంత్రాలు ఋషులు రాసే నాటికి ఇంటర్నెట్ లేదు. ఉంటే- వారుకూడా మంత్రాలు చదివి యూ ట్యూబ్ లింకులు ఆన్ లైన్లోనే అప్ లోడ్ చేసేవారు. లేదా లైవ్ లో ఆన్ లైన్ పౌరోహిత్యం చేసేవారు. నిజానికి ఆశీర్వచనం అన్నమాట అర్థమే కోరిక, విష్, శుభ కామన, ఆల్ ది బెస్ట్. అది ఆన్ లైన్ అయినా, ఆఫ్ లైన్ అయినా ఆశీర్వచనం ఆశీర్వచనమే. భవిష్యత్తులో జరిగేవన్నీ ఆన్‌లైన్ పెళ్లిళ్లే. వాట్సాప్ ఆహ్వానాలే. వీడియో కాల్ హాజరులే. ఇమోజి అక్షింతలే. ఇమేజ్ పంచ భక్ష్యాలే. మరి కాపురాలు..? వాటికైనా భౌతిక స్పృహ, స్పర్శ తప్పవు కదా. ఆన్ లైన్ నిశ్చితార్థం.... అంతర్జాల మహేంద్రజాల గజిబిజి గిజిగూళ్ళ గురించి మనభాషలో అనాదిగా మాటలున్నాయి. ఇంటర్నెట్ ఆన్‌లైన్, ఆఫ్ లైన్ మాటలకు తగిన తెలుగు పదాలు లేవు. ఉండాలని మరీ పట్టుబట్టాల్సిన అవసరం కూడా లేదు. ఇప్పుడు ప్రపంచం బతికి బట్టకట్టో, కట్టకుండానో తిరుగుతున్నదే ఆన్ లైన్లోనే కాబట్టి ఆన్ లైన్ మాటను యథాతథంగానే వాడుకోవచ్చు. అలా వాడడం ఇష్టం లేని వారు ఈనాడును సంప్రదిస్తే సంస్కృత భారపదబంధ బాహ్యావలయరహదారి లాంటి సమాససందోహ సంరభంతో ఒక పారిభాషిక పదం ఇవ్వకపోరు. ఆన్‌లైన్లో గుండె ఆపరేషన్లే చేయగా లేనిది, ఆన్ లైన్లో కోట్లకు కోట్లు ట్రాన్స్ ఫర్ చేయగాలేనిది- ఆన్ లైన్లో ఒక నిశ్చితార్థం చేయడంలో ఎలాంటి దోషం లేదు. నేను పౌరోహిత్య కుటుంబం నుండి వచ్చినవాడిని. మమ అనుకోండి అని చెప్పిన తరువాత పూజారి ఏమి చెబుతున్నాడో ఎవరికీ పట్టదు. ఈ ఆన్ లైన్ నిశ్చితార్థంలో అబ్బాయికి అమ్మాయికి పీటలు వేశారు. ఒక స్మార్ట్ ఫోన్లో అమ్మాయి , మరో స్మార్ట్ ఫోన్లో అబ్బాయి వీడియో కాల్లో కనిపిస్తూ సిగ్గుల మొగ్గలవుతున్నారు. రెండు స్మార్ట్ ఫోన్లను పీటల మీద చక్కగా కూర్చోబెట్టారు. అమ్మాయికి అబ్బాయి తరపున పెట్టిన నిశ్చయ తాంబూలాల బట్టలను అమ్మాయి వీడియో ఉన్న ఫోన్ నెత్తిన పెట్టారు. అబ్బాయి నెత్తిన అలాగే బట్టలు పెట్టారు. చక్కగా పురోహితుడు నిశ్చితార్థాన్ని నిర్వహించాడు. అబ్బాయి అమ్మాయి నిజంగా అక్కడ ఉన్నట్లుగానే భావించి అందరూ సెల్ఫీలు, విల్ఫీలు తీసుకుని కుల్ఫీలు తిని ఫోన్ నెత్తిన అక్షతలు చల్లారు. ఒకవేళ పెళ్లి ముహూర్తానికి కూడా అమ్మాయి అబ్బాయిలు విదేశంలో బిజీగా ఉంటే ఇలాగే ఆన్ లైన్లో పెళ్లిచేసుకునే అవకాశం ఉంటుంది.

మహిళా దినోత్సవం....



మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక మహిళాదినోత్సవం గా పిలవబడిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8 న ఆచరిస్తారు.వివిధ ప్రాంతాలలో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపు మరియు ప్రేమల గురించిన సాధారణ ఉత్సవం నుండి మహిళల ఆర్థిక, రాజకీయ మరియు సామాజిక సాధనల ఉత్సవంగా వుంటుంది. సామ్యవాద రాజకీయ ఘటనగా ప్రారంభమై, ఈ ఆచరణ వివిధ దేశాలు ముఖ్యంగా తూర్పు ఐరోపా, రష్యా మరియు పూర్వ సొవియట్ సమూహపు దేశాల సంస్కృతిలో మిళితమైంది. కొన్ని ప్రాంతాలలో, ఈ దినానికి రాజకీయ రంగు పోయి, పురుషులు స్త్రీలకు గల ప్రేమను వ్యక్తపరిచే విధంగా అనగా మాతృమూర్తుల దినోత్సవం మరియు వాలెంటీన్స్ దినోత్సవం లాగా మారిపోయింది. ఇంకొన్ని ప్రాంతాలలో, ఐక్యరాజ్యసమితి ఉద్దేశించినవిధంగా రాజకీయ మరియు మానవీయ హక్కులు బలంగా వుండి ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ మరియు సామాజికహక్కుల పోరాటంపై జాగృతి పెంచేవిధంగా జరుపుతారు.

ఈ రోజున కొంతమంది వంకాయ రంగు రిబ్బనులు ధరించి ఆచరిస్తారు.

ప్రారంభంలో మహిళా దినోత్సవం వేరు వేరు తేదీలలో ఆచరించబడింది. చికాగోలో 1908 మే 3న న్యూయార్క్‌లో ఫిబ్రవరి 28, 1909 మరియు ఫిబ్రవరి 27, 1910. రెండవ అంతర్జాతీయ సామ్యవాద సమావేశానికి ముందుగా ఆగస్టు 1910 లో, అంతర్జాతీయ మహిళా సమావేశం కోపెనహాగెన్ లో జరిగింది. అమెరికా సామ్యవాదులచే ఉత్తేజితులై, జర్మన్ సామ్యవాది లూయిస్ జియట్జ్ వార్షిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని ప్రతిపాదించగా సహ జర్మన్ సామ్యవాది క్లారా జెట్కిన్ సమర్ధించారు. 17 దేశాలనుండి వచ్చిన వంద మంది మహిళలు తమకు ఓటుహక్కుతో పాటు సమానహక్కులు సాధించడానికి సరియైన వ్యూహమని అంగీకరించారు. తదుపరి సంవత్సరం 1911 మార్చి 19న పదిలక్షలమందిపైగా ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ మరియు స్విట్జర్లాండ్ దేశాలలో 1911 మార్చి 19 న మహిళా దినోత్సవం ఆచరించారు. ఆస్ట్రో-హంగేరియన్ రాజ్యంలో300 పైగా ప్రదర్శనలు జరిగినవి.వియన్నాలో రింగ్ స్ట్రాసెలో ప్రదర్శన చేశారు.మహిళలు ఓటుహక్కు మరియు ప్రభుత్వ పదవుల హక్కు అడిగారు. ఉపాధిలో లింగ విచక్షణ పద్ధతులను ప్రతిఘటించారు.. అమెరికాలో ఫిబ్రవరి చివరి ఆదివారం నాడు మహిళా దినోత్సవం జరుపుకుంటూనే ఉన్నారు.

1913 లో రష్యను మహిళలు వారి మొదటి మహిళా దినోత్సవాన్ని ఫిబ్రవరి చివరి ఆదివారం జరుపుకున్నారు. (అప్పటికి రష్యాలో జూలియన్ కాలెండర్ అమలులో ఉంది).

1914 వరకు మహిళా సమస్యల గురించి ఎన్నో ఆందోళనలు జరిగినా అవేవీ మార్చి 8న జరగలేదు. అయితే 1914 నుండి ఆ రోజుని మహిళా దినోత్సవంగా ప్రకటించుకున్నారు. ఆ రోజు ఆదివారం కావడం వలన అలా ప్రకటించివుండవచ్చు

కానీ, అప్పటినుండే అన్నీ దేశాల్లోనూ మార్చి 8 నే మహిళా దినోత్సవంగా తీర్మానించారు. 1914 లో జర్మనీ జరుపుకున్న మహిళా దినోత్సవాన్ని మహిళా ఓటు హక్కు కోసం అంకితమిచ్చారు. అయితే,1918 నుంచి వారికి ఓటు హక్కు రాలేదు.

1917 లో ఫిబ్రవరి విప్లవం ఆ నెల చివరి ఆదివారం సెయింట్ పీటర్స్ బర్గ్లో మహిళా దినోత్సవం జరుపుకోవడంతో మొదలయ్యింది. (గ్రెగేరియన్ కాలెండరు ప్రకారం ఆ తారీఖు మార్చి 8). ఆ రోజు సెయింట్ పీటర్ బర్గ్ మహిళలందరూ మొదటి ప్రపంచ యుద్ధం మరియు రష్యాలోని ఆహార కొరత ముగిసిపోవాలని నినదించారు. దీన్నే 'బ్రెడ్డు మరియు శాంతి' డిమాండుగా వ్యవహరించారు. లియోన్ ట్రోస్కీ ప్రకారం, 'ఆ రోజే ఒక విప్లవానికి పునాదులు పడతాయని ఎవరూ ఊహించలేదు. వస్త్ర పరిశ్రమల్లోని మహిళా శ్రామికులందరూ పై అధికారుల హెచ్చరికల్ని ఖాతరు చేయకుండా విధులు బహిష్కరించి వీధుల్లో పడ్డారు. అవే విప్లవానికి తొలి అడుగులు".

అక్టోబర్ విప్లవం తరువాత సోవియట్ యూనియన్లో ఆ రోజుని అధికారిక సెలవు దినంలా ప్రకటించడానికి బోల్షెవిక్ అలెగ్జాండర్ కొలెన్టైల్ లు, వ్లాదిమిర్ లెనిన్ని ఒప్పించడంలో కృతకృత్యులయ్యారు. కానీ, 1965 వరకూ అది అమల్లోకి రాలేదు. అదే సంవత్సరం సోవియట్ మహిళలు అప్పటి వరకు చూపిన సాధికారత స్మారకార్థం, మార్చి 8న యుయస్సార్ ప్రభుత్వం ఆ దినాన్ని అధికారక సెలవు దినంగా ప్రకటించింది.1917 సోవియట్ విప్లవం తరువాత రష్యా కూడా దీనిని ప్రకటిచింది. చాలా మటుకు కమ్యూనిస్టు, సోషలిస్టు దేశాల్లో దీన్ని పాటించేవారు. 1922 నుంచి చైనావారు, 1936 నుంచి స్పానిష్ వారు దీనిని అధికారికంగా ప్రకటించుకున్నారు.1949 అక్టోబర్ 1 లో చైనా పీపుల్స్ రిపబ్లిక్ ఏర్పడినది. వారి రాష్ట్రీయ మండలి డిసెంబరు 23న, మార్చి ఎనిమిదిని అధికారిక దినంగా ఉత్తర్వులిస్తూ, చైనా మహిళలకి ఆ రోజు సగం సెలవు ప్రకటించింది.

1977 తరువాత అంతర్జాతీయ మహిళా దినోత్సవం బహుళ ప్రాముఖ్యత సంతరించుకుంది. అప్పుడు మార్చి 8ని మహిళా హక్కులు మరియు ప్రపంచ శాంతి దినంగా ప్రకటించాలని యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ పిలుపునిచ్చింది.

1980 దశకంలో రినీ కోట్ అనే చరిత్రకారిణి అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఆవిర్భావం గురించి పరిశోధించింది.

భారతదేశంలో మహిళా హక్కుల పోరాటం


భారతదేశంలో తొలిగా అహ్మదాబాద్ లో అనసూయా సారాభాయ్ టెక్స్టైల్ లేబర్ అసోసియేషన్ అనే పేరుతో కార్మికసంఘం ప్రారంభించింది. భారత కార్మికోద్యమంలో కార్మిక స్త్రీలను సంఘటితం చేసిన మహిళా నేతలలో సుశీలా గోపాలన్, విమలారణదివే, కెప్టెన్ లక్ష్మిసెహగల్, అహల్యారంగ్నేకర్, పార్వతీకృష్ణన్ ప్రముఖులు. ఈ పోరాటాల ఫలితంగానే స్వాతంత్ర్యం తరువాత కార్మికుల బ్రతుకులు మెరుగయ్యాయి. కార్మికుల పని పరిస్థితులు, వేతనాలు మరియు మహిళా కార్మికుల గురించి చట్టాలను చేయబడినవి. 1991లో ప్రారంభమైన సరళీకరణ విధానాల ప్రభావంవలన ప్రైవేటు రంగం బలపడడంతో మహిళా కార్మికుల చట్టాల అమలు కుంటుబడుతున్నది. దీనికి వ్యతిరేకంగా పోరాటాలలో మహిళలు పాల్గొనడం మరియు నేతృత్వం వహించడం మెరుగుపడవలసివుంది.

యు.యెస్.ఎ లో అధికారిక గుర్తింపు

మహిళా దినోత్సవంగా అధికారిక గుర్తింపును, ప్రభుత్వ సెలవుదినాన్ని సాధించేందుకు లాస్ ఏంజిల్స్ నగరానికి మేయరు, కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్, యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్ సభ్యులతో కలిసి కృషిచేశారు. 1994లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా గుర్తించేలా బిల్లును రూపొందించడం ద్వారా సాకారం చేశారు.



రామ.. రామా...!!



నారాయణ నారాయణ పాపం... రాముళ్లు, దేవుళ్లు...! అనుకుంటాం గానీ.., వాళ్ల మహత్తు ఈ అర్చకులు, ధర్మకర్తల గారడీ ముందు దేనికీ పనికిరాదు... వాళ్లు దేవుళ్లను బజారుకీడ్వగలరు... గల్లీ కొట్లాటల స్థాయికి దింపగలరు... ఇప్పుడు మళ్లీ అదే పాత దిక్కుమాలిన వివాదాన్ని తెర మీదకు తీసుకొస్తున్నారు... ఎప్పుడూ ఏదో ఓ వివాదంలోకి లాగితే తప్ప తృప్తి ఉండదేమో... అంతటా ఇలాగే... అక్కడ తిరుమలలోనేమో నామం ఎలా ఉండాలని కొట్లాట... వీవీవీఐపీ భక్తుల కరుణాకటాక్షాల కోసం వెంపర్లాట... కొందరు శుష్క మఠాధిపతులైతే పాపం, కలిసి ఉన్న దేవుళ్ల జంటలనూ విడదీసి, పునఃప్రతిష్ఠించాలంటారు మరోచోట... అలాగే కొంతకాలం క్రితం భద్రాచల రాముడిని కూడా పనికిరాని ఓ వివాదంలోకి తీసుకొచ్చారు... కల్యాణం చేసే అర్చకులు మహాపాపానికి ఒడిగడుతున్నారంటూ గొడవ... ఏమిటయ్యా అదీ అంటే..? కొంతకాలంగా అక్కడ రాముడి గోత్రాన్ని, ప్రవరను మార్చేసి, రాముడి బదులు నారాయణ కల్యాణం చేస్తున్నారని ఆరోపణ... అయ్యో, అయ్యో, ఇంకేమైనా ఉందా..? ధర్మం భ్రష్టుపట్టిపోతుందంటూ గగ్గోలు... శోకాలు... అంతేనా..? మీడియాకు కూడా ఎక్కి రచ్చరచ్చ చేసేస్తున్నారు... ఎవరి వాదన వారిది... క్షమించాలి, ఎవరి వితండవాదం వాళ్లది... ఇప్పుడు మళ్లీ మొదలుపెట్టేశారు... కోర్టుకెక్కుతారట... ఏం..? కోర్టుకు తెలుసా..? భద్రాద్రి రాముడు అద్వైతుడో, ద్వైతుడో... ఇంకాస్త వివరాల్లోకి వెళ్దాం..

ఆమధ్య పాపం, తెలుగుదేశం ఎమ్మెల్యే వయోభారమో, ఓటమిభారమో, మరేమిటో గానీ చాలా ఫ్రస్ట్రేషన్‌లో ఉండి, ఏదేదో మాట్లాడేస్తున్నాడు... అసెంబ్లీలో అసందర్భంగా భద్రాచలం గుడి ప్రస్తావన తీసుకొచ్చాడు... మా పిఠాపురం డివిజన్ నుంచి వచ్చిన ఆదాయంతోనే గుడి కట్టారు, గుడి కూలిపోయే స్థితిలో రాజమండ్రి ఆదిశేషయ్య పునర్నిర్మించాడు, మా ఆంధ్రా ఆదాయం తీసుకెళ్లి తెలంగాణలో గుడి కట్టారు అని తలాతోకా లేని వ్యాఖ్యలకు దిగాడు... పోనీలే, మొత్తానికి ఆదాయం ఎవరిదైనా గుడి తెలంగాణలోనే ఉన్నది అని మాత్రం అంగీకరించాడు... భక్త రామదాసు పాల్వంచ ప్రాంతంలో తహసిల్దార్ అని చరిత్ర చదివాం, జనం చెల్లించిన శిస్తు నుంచే గుడి కట్టాడని విన్నాం, ఆ శిస్తు వాడకంపై కారాగారం కథలూ చదివాం గానీ ఈ పిఠాపురం ఎందుకొచ్చిందో మధ్యలో అర్థం కాదు... ఇప్పుడు జగన్‌ను స్వరూపానందుడికన్నా విపరీతంగా ప్రేమించేస్తున్న కేసీయార్ భద్రాచలాన్ని ఏపీకి రాసిచ్చేయబోతున్నాడనే వార్తలు కూడా వచ్చాయి ఆమధ్య... సరే, ఈ దిక్కుమాలిన రచ్చకేం గానీ... అసలు భద్రాద్రి గుడిలోనే పూజారులు తన్నుకుంటున్నారు... అనగా మాటలతోనే సుమా... పనికిమాలిన రామనారాయణ, రామచంద్ర వివాదాన్ని మళ్లీ తెర మీదకు తీసుకొస్తున్నారు...

2018లో కావచ్చు... ఈ పంచాయితీని మరీ గల్లీ స్థాయి తగాదాగా మార్చాడు ఓ స్వామి... నాలుగొందల మంది దాకా శిష్యపరమాణువులతో కూడి, ఏకంగా ఆ రాముడి అంతరాలయంలోనే బైఠాయించాడు... అనగా ధర్నా చేశాడు... ఎవడొస్తాడో వచ్చి జవాబు చెప్పాల్సిందే అని భీష్మించాడు... నినాదాలు చేశారు... దర్శనాలు ఆగిపోయాయి... భక్తుల అవస్థలు, అసహనం... ఇంతకీ ఆయన ఎవరయ్యా..? కోటిలింగాల పీఠాధిపతి శివస్వామి... అదో శైవమతం... మరి ఈ శైవుడికి భద్రాద్రి రాముడిపై ఎందుకు దయకలిగిందో గానీ, స్వామి వారి తరఫున వకాల్తా పుచ్చుకుని, చిల్లరగా ధర్నాలు, నినాదాల పంచాయితీకి దిగాడు... ఏమయ్యోయ్, సామీ... రాముడి అంతరాలయాన్ని ఏకంగా ఓ ధర్నా చౌక్ చేసేశావు గదయ్యా... నీ సంకుచిత మేధస్సుతో...!!

అసలేమిటయ్యా ఈ తగాదా అని యూట్యూబు శోధిస్తే మహత్తర టీవీలో అప్పట్లోనే గంటల కొద్దీ పండితులు తిట్లతో కొట్టుకుంటున్న మరో గల్లీ స్థాయి పంచాయితీ కనిపించింది... భద్రాద్రి గుడి అద్వైత ద్వేషుల అడ్డాగా మారినట్టు, మత రాజకీయాలు తిష్ట వేస్తున్నట్టు, అక్కడ సీతారాముల కల్యాణం గాకుండా లక్ష్మీనారాయణుల కల్యాణం చేస్తున్నట్టుగా తిక్క తిక్క హెడ్డింగులు కూడా పెట్టేశారు... పరమ నిష్ప్రయోజనకరమైన చర్చ.

రామ అనే శబ్దాన్ని అష్టాక్షరిలోని 'ర', పంచాక్షరిలో 'మ' తీసుకుని సృష్టించారనీ, అంటే అది హరిహర అద్వైత భావన అనీ ఒకరి వాదన... అందుకని నారాయణ పదాన్ని రామ పదానికి కలపొద్దట... అయ్యా, బాబులూ... రాముడు సాక్షాత్తూ ఆ నారాయణుడి అవతారమే అయినప్పుడు మరి రామనారాయణ అంటే తప్పేమిటయ్యా..? అదేమంటే..? ఒకాయన అంటాడు... అయోధ్య రాముడు వేరు అట, భద్రాద్రి రాముడు వేరు అట... భద్రాద్రిలోని రాముడు అద్వైత స్వరూపం అట... అందుకే గతంలో ఓ శివలింగం కూడా ఉంటే, అర్చకులు దాన్ని పీకేసి, బిందెలో గుట్టుగా పెట్టుకుని, గోదావరిలో పారేశారట... కానీ మళ్లీ మళ్లీ ఆ లింగం గుడిలో అలాగే ప్రత్యక్షమయ్యేసరికి, దాన్ని ఓ మూలకు జరిపి, అనామకంగా వదిలేశారట... దేవుడా... దేవుడా..? నువ్వు హరిహర రాముడివే తప్ప హరి రాముడివి కాదన్నమాట.

విద్యుత్ వాడని హేమసానే




పుణె నగరంలో ఓ అడవి. అది హేమ సానే సృష్టించిన చిన్న అడవి. అందులో ఓ పాత ఇల్లు. ఇంటి చుట్టూ చెట్లు. ఈ చెట్లు చీకట్ల మధ్యే ఉంటారామె. ఎందుకండి ఇలా అనడిగితే.. 'నేను పుట్టినప్పుడు కరెంటు ఉందా! మా అమ్మానాన్నలు, వారి పెద్దలు కరెంటు చూశారా? ఎందుకండి ఆ కరెంటు? అది లేకుండానే నేను అన్ని పనులూ చేసుకోగలను. విద్యుత్తు వాడితే భూతాపం పెరుగుతుంది. ప్రకృతికి నష్టం వాటిల్లుతుంది. అందుకే కరెంటు వాడను' అంటారు హేమ సానే. బోటనీ ప్రొఫెసర్‌గా, ప్రభుత్వ కళాశాలలో హెచ్‌వోడీగా బాధ్యతలు నిర్వర్తించిన రోజుల్లోనూ ఆమె కరెంటు వాడలేదు. పిల్లలు, సహచరులు లైటు, ఫ్యాను వేసుకుంటామంటే వద్దనేవారు కాదు. తను మాత్రం స్విచ్ బోర్డు మీద వేలు పెట్టింది లేదు. పదవీ విరమణ తర్వాత కూడా ఆమె పంథా మార్చుకోలేదు. వంటకోసం ఓ పొయ్యి. వెలుతురు కోసం కిరోసిన్ దీపాలు. ఇంటో ఏదైనా ఉపకరణం ఉన్నా.. అది విద్యుత్తుతో పని చేసేదై ఉండదు. ఎనిమిది పదుల వయసుకు చేరువ అవుతున్నా.. ఆమె మారలేదు. ఎందుకు ఇదంతా అని ఎవరైనా అడిగితే... 'మనం సుఖాలకు అలవాటు పడితే.. మన చుట్టూ ఉన్న జీవాలకు కష్టాలు తప్పవు. ఉపకరణాలు వాడితే ప్రకృతికి కలిగే నష్టాన్ని పూడ్చే శక్తి నాకు లేదు. నన్ను చూసి ఎవరైనా మారితే మరింత సంతోషం. భవిష్యత్తు తరాలకు వనరులను మిగిల్చాలనేది నా సందేశం' అని చెబుతుంది. పాతదైపోయిన ఆ ఇంట్లో ఆమె ఒక్కరే ఉంటున్నారు. అయినా ఆమె కొత్త ఇల్లు కట్టుకోవాలనుకోవడం లేదు. పెళ్లి కూడా చేసుకోని ఈ ఒంటరి మహిళతో ఎనిమిది పిల్లులు సావాసం చేస్తున్నాయి. ఆరు కుక్కలు అండగా ఉంటున్నాయి. ఇవే తన ఆస్తులు అంటారామె. పిచ్చుకలు, ఇతర పక్షులు, మానులు, మొక్కలు ఈ జన్మంతా తోడుగా ఉంటాయంటారామె. ప్రతి రోజూ ఎవరో ఒకరు ఈ ఇంటికి వస్తూనే ఉంటారు. ఆమె 'విశేష' జీవితం గురించి తెలుసుకుంటారు. ఆమె నుంచి స్ఫూర్తి పొంది విద్యుత్తు వినియోగాన్ని కొంతైనా తగ్గించాలనే సంకల్పంతో అక్కడి నుంచి బయల్దేరుతారు. ఆమె మాత్రం కరెంటుతో పనిచేయని రేడియోలో పాటలు వింటూ హాయిగా పడుకుంటారు. పక్షుల కిలకిలలు వింటూ.. కరెంటు లేని మరో ఉదయాన్ని స్వాగతిస్తూ మేలుకుంటారు. తనపై తీసిన డాక్యుమెంటరీకి జాతీయ అవార్డు రావడం విశేషం.

జాతీయ అవార్డుతో

ఈ ప్రకృతి ప్రేమికురాలికి రచన అంటే ఆసక్తి. ఉదయం నుంచి రాత్రి వరకూ పుస్తక రచనతోనే కుస్తీ పడుతూ ఉంటారు. పర్యావరణ పరిరక్షణపై 25 పుస్తకాలు రాశారామె. కొన్నేళ్లుగా మహారాష్ట్ర ప్రభుత్వ పాఠశాల పుస్తకాలకోసం వృక్షశాస్త్రం పాఠ్యాంశాలు రాస్తున్నారు. పూర్వ విద్యార్థులైతే తమ గురువు గారిని మినీ గూగుల్ అని సంబోధిస్తారు. ఏ సందేహం వచ్చినా ఆమె దగ్గరికి వచ్చి నివృత్తి చేసుకుంటారు. ఒంట్లో నలతగా ఉంటే ఓ వైద్యుడు ఆమె ఉండే ఇంటికే వస్తాడు. అతడూ ఆమె విద్యార్థే!! తన తదనంతరం ఆ ఇంటిని అనాథాశ్రమానికి ఇచ్చేస్తానంటారు హేమ సానే.

అద్భుతమైన లేఖ



తన కుమారుణ్ణి స్కూల్లో చేర్చుతూ ఒకనాటి అమెరికన్ ప్రెసిడెంట్ అబ్రహాం లింకన్ టీచర్ కి రాసిన లేఖ.

“మా అబ్బాయి ఇవాళే మొదటిసారి స్కూలుకి వస్తున్నాడు. కొంతకాలం అక్కడ అంతా వాడికి వింతగానూ కొత్తగానూ ఉండబోతోంది.

అందుకే వాడితో మీరు కొంచెం సున్నితంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాను.

ఈ సాహసకృత్యం వాణ్ణి సప్తసముద్రాలూ దాటి వెళ్ళేందుకు సాయపడవచ్చు.

ఆ సాహసాల్లో యుద్ధాలూ, విషాదాలూ, దుఃఖాలూ వాడికి అనుభవంలోకిరావచ్చు. అలాంటి జీవితంలో వాడికి నమ్మకం, ప్రేమ, ధైర్యం తోడుగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అందుచేత, దయచేసి మీరు దగ్గరుండి ప్రేమతో వాడు నేర్చుకోవలసినవన్నీ నేర్పిస్తారా? వీలైతే అవన్నీ సున్నితంగా నేర్పగలరా?

1.ఒక మిత్రుడుంటే ఒక శత్రువు కూడా ఉంటాడని నేర్పండి. అందరు మనుషులూ న్యాయంగా ఉండరనీ, అందరూ సత్యసంధులు కారనీ వాడికి తెలియాలి.

2.ఒక దుష్టుడున్న చోట ఒక వీరుడు కూడా ఉంటాడనీ జిత్తులమారి రాజకీయ నేత ఉండే చోటే అంకితభావంతో పనిచేసే నేత కూడా ఉంటాడనీ చెప్పండి.

3.అప్పనంగా దొరికిన 100 కన్నా సొంతంగా సంపాదించుకున్న 10 ఎక్కువ విలువైనవని నేర్పండి. స్కూల్లో మోసం చేసి గెలవటం కన్నా ఫెయిలవటం ఎక్కువ గౌరవంగా ఉంటుందని నేర్పండి.


4.ఓడిపోయినప్పుడు చక్కగా దాన్ని అంగీకరించటం, గెలిచినప్పుడు మనస్ఫూర్తిగా ఆనందించటం,.. నేర్పండి.

5.అందరితో మృదువుగా ప్రవర్తించమనీ, కఠినంగా ఉన్న వాళ్ళతో కఠినంగా ఉండమనీ నేర్పండి.

6.అసూయకు వాణ్ణి దూరంగా ఉంచగలిగితే బావుంటుంది. చప్పుడు చెయ్యకుండా నవ్వటం నేర్పండి.

7.వాడు విచారంగా ఉన్నప్పుడు నవ్వటం నేర్పగలిగితే నేర్పండి.కన్నీళ్ళు కార్చటం అవమానమేమీ కాదని నేర్పండి.

8.ఓటమిలో కూడా కీర్తి ప్రతిష్ఠలు ఉండవచ్చనీ, గెలుపులో నిరాశ ఉండవచ్చనీ నేర్పండి.



9.పుస్తకాలు ఎంత అద్భుతంగా ఉంటాయో నేర్పండి.

10.అందరూ వాడి ఆలోచనలు తప్పని అన్నప్పటికీ, వాటిని తను మట్టుకు గౌరవించటం నేర్పండి.

11.అందరూ దేన్నో అనుసరిస్తున్నా, తను అలా చెయ్యకుండా ఉండే మనోబలాన్ని మా అబ్బాయికి నేర్పండి.

12.అందరు చెప్పేదీ వినమనీ, సత్యమనే జల్లెడతో వడబోసి మంచిని మాత్రమే గ్రహించమనీ చెప్పండి.

13.తన ప్రతిభనీ, మేధస్సునీ ఎక్కువ ధర చెల్లించేవారికే అమ్మమని చెప్పండి కానీ తన హృదయానికీ, ఆత్మకీ వెల నిర్ణయించద్దని నేర్పించండి.

14.అసహనం ప్రదర్శించే ధైర్యాన్నీ, ధైర్యంగా ఉండేందుకు ఓర్పునీ కలిగి ఉండనివ్వండి.

15.ఉదాత్తమైన ఆత్మవిశ్వాసం ఉండాలనీ,అప్పుడే మానవాళి మీదా వాడికి ఉదాత్తమైన విశ్వాసం ఏర్పడగలదనీ నేర్పించండి.

మీకు వీలైనంత వరకూ ప్రయత్నించి వాడిని మంచి పిల్లవాడుగా మలచండి. మీరు మలచ గలరు. ఇది మా నమ్మకం.

ఈ విలువైన సమాచారం ఉన్న ఈ ఉత్తరం నేటి తరం తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు.

స్వాతంత్ర్యేచ్ఛ, వామపక్ష భావాలు నిండిన కుటుంబం



స్వాతంత్ర్యేచ్ఛ, వామపక్ష భావాలు నిండిన కుటుంబం. ప్రజాసమస్యలపై పోరాడే నైజం... పేరులోనే తిరుగుబాటు. ఇదీ పార్లమెంట్ సభ్యురాలు విప్లవ్ ఠాకూర్ నేపథ్యం. రాజ్యసభలో ఇటీవల ప్రభుత్వ ధోరణుల్ని నిలదీసి, సాక్షాత్తూ ప్రధానమంత్రిని కడిగేసి ఆమె వార్తల్లోకెక్కారు.

"మీరు చేస్తున్నదల్లా భారతదేశాన్ని విడగొట్టే ప్రయత్నం, అంతకు మించి మీరు చేసిందేమీ లేదు" అంటూ విప్లవ్ ఠాకూర్ ఇటీవల రాజ్యసభలో చేసిన గర్జన అధికార పక్షాన్ని ఉలిక్కిపడేలా చేసింది. "అవును! ఆ మాటలు నా మనసులో నుంచి వచ్చాయి. దేశంలో సామాజిక కల చెదిరి చెల్లాచెదురైపోతున్న తీరు చూసి నాలో కలిగిన బాధే ఆ మాటలు పలికించింది. నా పది నిముషాల ప్రసంగం తరువాత అధికార పార్టీ నాయకులు కొందరు నాతో మాట్లాడారు. 'మీరు మమ్మల్ని బాగా భయపెట్టారు' అని వాళ్లు చెప్పారు" అన్నారు విప్లవ్ ఠాకూర్.

అమ్మ బాటలో...

పార్లమెంట్‌లో పదునైన ప్రసంగాలకు విప్లవ్ ఠాకూర్ పెట్టింది పేరు. నమ్మినదాన్ని నిర్భయంగా చెప్పే ధైర్యం, పోరాడే తత్త్వం ఆమెకు పుట్టుకతోనే వచ్చాయి. విప్లవ్ తండ్రి కామ్రేడ్ పరస్ రామ్ అవిభక్త కమ్యూనిస్ట్ పార్టీలో పేరున్న నాయకుడు.

ఆమె తల్లి సరళా శర్మ స్వాతంత్ర్య సమరయోధురాలు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ నుంచి పంజాబ్ శాసనసభకు ఎన్నికయ్యారు. పార్టీలో, ప్రభుత్వంలో అనేక పదవులు చేపట్టారు. తండ్రి నుంచి పోరాట స్ఫూర్తినీ, తల్లి నుంచి ప్రజాస్వామిక విలువలనూ విప్లవ్ అందిపుచ్చుకున్నారు.

హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జన్మించిన ఆమె పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి రాజనీతి శాస్త్రంలో పీజీ పూర్తి చేశారు. పద్ధెనిమిదేళ్ళ వయసులోనే ఠాకూర్ హర్నామ్‌సింగ్‌తో ఆమెకు వివాహం అయింది. వారికి ఇద్దరు కుమార్తెలు. సామాజిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే విప్లవ్ తన తల్లి బాటలో ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించారు. 42 ఏళ్ళ వయసులో తొలిసారిగా హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా పని చేశారు. ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గానూ వ్యవహరించారు. 2006, 2014లో రాజ్యసభకు ఎంపికైన విప్లవ్ అనేక కమిటీల్లో సభ్యురాలిగా పని చేశారు. రెండేళ్ళపాటు హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా బాధ్యతలు నిర్వహించారు. డెబ్భై ఆరేళ్ల విప్లవ్‌కు పుస్తకాలు చదవడం, రచనలు చేయడం, ట్రెక్కింగ్, స్కయింగ్‌లాంటి అనేక అభిరుచులు ఉన్నాయి.

ఈ పాలకులు విడదీస్తున్నారు!

మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీకి విధేయురాలైన విప్లవ్ ప్రజా సమస్యలపై రాజ్యసభలో అనేకసార్లు గళమెత్తారు. అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వాన్ని ధైర్యంగా నిలదీసేవారు. నూలుపై సబ్సిడీ విషయంలో మోదీ ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తోందంటూ గతంలో ఆమె చేసిన ఆరోపణలు సంచలనం కలిగించాయి. "ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో సిల్కు నూలుపైనా, మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో కాటన్ నూలుపైనా సబ్సిడీలు ఇస్తున్నారు. కానీ హిమాచల్ ప్రదేశ్, జమ్ము-కశ్మీర్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రధానంగా వచ్చే ఉన్ని నూలుపై సబ్సిడీ నిలిపివేశారు. దీనివల్ల పేద మహిళలు, చేనేత కార్మికులు దెబ్బతింటున్నారు" అంటూ రాజ్యసభలో కొన్నాళ్ళ కిందట ధ్వజమెత్తారు. ప్రస్తుత పాలకులు ప్రజలను విడదీస్తున్నారన్నది ఆమె ఆరోపణ.

తెల్లగా ఉంటేనే అందమా?

అలాగే "ఫెయిర్‌నెస్ క్రీమ్‌ల ప్రకటనలు మహిళలను కించపరుస్తున్నాయి. వాటివల్ల మహిళల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతింటోంది. కాబట్టి వాటిని నిషేధించాలి" అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై ఆమె వివరణఇస్తూ "భారతదేశంలో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు చాలా వైవిధ్యంగా ఉంటాయి. ప్రజలు వేర్వేరు రంగుల చర్మం కలిగి ఉంటారు. 'తెల్లగా ఉండడమే అందం' అనే ఫెయిర్‌నెస్ క్రీమ్‌ల ప్రకటనలు మహిళల మనసుల్లో ఒక కాంప్లెక్స్‌ను పెంచుతాయి. చర్మం రంగు తక్కువగా ఉన్నవారు ఆత్మన్యూనతకు గురవుతారు" అని చెప్పారు. విశేషం ఏమిటంటే- పార్లమెంట్‌కు ఆమె ఠంచనుగా హాజరవుతారు. సభలో ఆమె హాజరు 92 శాతానికి పైనే! జాతీయ సగటు 79 శాతం కన్నా ఇది చాలా ఎక్కువ. అలాగే ఆమె సభలో వేసిన ప్రశ్నలు, పాల్గొన్న చర్చలు కూడా జాతీయ సగటు కన్నా ఎంతో హెచ్చు. "సభలో నేను ముందుగా రాసుకున్న దాన్ని ఎప్పుడూ చదవలేదు. అప్పటికప్పుడు మాట్లాడడాన్నే ఇష్టపడతాను. ఇక మాట్లాడే అంశాలంటారా, ఈ ప్రభుత్వ హయాంలో వాటికి కొరతే లేదు" అంటారు విప్లవ్.

చిన్నప్పుడు నెహ్రూతో విందు!

దేశ తొలి ప్రధాని నెహ్రూపై లేని అవకాశాలను కల్పించుకొని మరీ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతలు విమర్శలు చేస్తున్నారని విప్లవ్ ఆరోపణ. "నెహ్రూను కించపరచడానికి బీజేపీ నాయకత్వం ప్రయత్నించిన ప్రతిసారీ నాకు కోపం వస్తుంది" అని అంటారామె. విప్లవ్‌కు నెహ్రూ ఆదర్శ నాయకుడు. "నేను నెహ్రూను 1957లో తొలిసారి కలుసుకున్నాను. అప్పుడు నా వయసు 13 ఏళ్ళు. పంజాబ్ శాసనసభను ప్రారంభించడానికి ఆయన వచ్చారు. అప్పుడే కాంగ్రెస్ టిక్కెట్టు మీద మా అమ్మ ఎన్నికయ్యారు. నెహ్రూకూ, శాసనసభ్యులకూ గవర్నర్ విందు ఇచ్చారు. దానికి నన్నూ, నా సోదరినీ మా అమ్మ తీసుకువెళ్ళారు. అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి ప్రతాప్ సింగ్ కైరోన్ మమ్మల్ని నెహ్రూకు పరిచయం చేశారు. ఆ సాయంత్రం మిగిలిన వారందరికన్నా నాతో, నా సోదరితోనే నెహ్రూ ఎక్కువ సమయం గడిపారు. నెహ్రూతో ఫొటో దిగాలని మహిళా శాసన సభ్యులు పోటీపడ్డారు. వారిని వరుసలో నిలబడాలని నెహ్రూ చెప్పారు. అప్పటికీ వాళ్ళు ఒకరినొకరు తోసేసుకుంటూ ఉండడంతో "వరుసలో ఉండడం మీకు తెలీదు. మీరు శాసనసభ్యులు ఎలా అయ్యారు?" అని ఆయన ప్రశ్నించారు. మా వైపు తిరిగి 'రండి పిల్లలూ! నాతో రండి' అని పిలిచారు" అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని విప్లవ్ గుర్తు చేసుకున్నారు.

ఎవరు ద్రోహులు?

సిఏఏని వ్యతిరేకిస్తున్న వారు 'దేశద్రోహులు' అంటూ అధికార పార్టీ నాయకులు ప్రకటనలు, నెహ్రూ కోసమే దేశ విభజన జరిగిందని ప్రధాని మోదీ ఆరోపణల నేపథ్యంలో... రాజ్యసభలో తాజాగా చేసిన ప్రసంగంలో ప్రధానిపై నేరుగానే విమర్శలు సంధించారు విప్లవ్ ఠాకూర్. "ఈ ఆరేళ్ళలో మీరు చేసిందేమిటి? మీరు చేస్తున్నదల్లా దేశాన్ని విభజించే ప్రయత్నం... దేశాన్ని విడదీసే ప్రయత్నం మాత్రమే! ఇక 'ద్రోహి' అనే పదానికి నిర్వచనం ఏమిటో ఈ రోజు మాకు చెప్పాలి. 'ద్రోహి' అని ఎవరిని అంటారు? భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడాన్ని కమ్యూనిస్ట్ పార్టీ వ్యతిరేకించింది. నాలుగేళ్ళు నిషేధానికి గురైంది. కానీ నెహ్రూ, అప్పటి ప్రభుత్వం వాళ్ళను ద్రోహులు అనలేదు. నెహ్రూకు వ్యతిరేకంగా లోక్‌సభలో వాజ్‌పేయి మాట్లాడేవారు. ఆయనను ద్రోహి అని ఎవరూ అనలేదు. కానీ ఈ రోజు మీ ప్రధాన మంత్రికీ, మీ హోం మంత్రికీ, మీ విధానాలకూ వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వాళ్ళు ద్రోహులైపోతారు. వాళ్ళను పట్టుకుంటారు, జైల్లో పెడతారు. ఆరేళ్ళ పిల్లల్ని కూడా మీరు వదలడం లేదు. ఆరేళ్ళలో మీరు చేసినంతగా పాకిస్థాన్ నామ జపం డెబ్భై ఏళ్ళలో మేము ఎప్పుడూ చెయ్యలేదు. మీకు ఏ సందర్భం వచ్చినా పాకిస్థాన్ ప్రస్తావనే! మీరు (మోదీ) పాకిస్థాన్‌కు (నవాజ్ షరీఫ్ పుట్టినరోజు సందర్భంగా ఆకస్మికంగా) వెళ్ళి బిర్యానీ తిన్నారు. ఆహ్వానం లేకుండా వెళ్ళి వచ్చిన మీరు ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఇక, కశ్మీర్ విషయంలో మాట్లాడే, తీర్మానం చేసే హక్కు యూరోపియన్ యూనియన్‌కు లేదని ఒకవైపు అంటారు. మరి వాళ్ళ ఎంపీలను ఆహ్వానించి, కశ్మీర్‌కు ఎందుకు తీసుకువెళ్ళారు? వాళ్ళను పిలిచి, జోక్యం చేసుకొనేలా చేసింది మీరే కానీ ఇతరులు కాదు కదా! ఈ దేశాన్ని విభజించకండి. సమైక్యంగా ఉంచండి. మనది లౌకికవాదం. మనం ధర్మాన్ని నమ్ముతాం. కానీ మీరు ఏ ధర్మం గురించి మాట్లాడుతున్నారు? ఏ రాముడి గురించి మాట్లాడుతున్నారు? ప్రజలలో వినిపించిన మాటలతో ఆయన సీతను అడవికి పంపాడు. వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్న ప్రజలతో మీరు కనీసం మాట్లాడడం కూడా లేదు. అయోధ్యలో ఆలయం కట్టండి, తప్పనిసరిగా కట్టాల్సిందే! కానీ రాముడి ఆదర్శాలను కూడా అనుసరించండి. వట్టి మాటలూ, ప్రసంగాలూ కట్టిపెట్టండి" అంటూ విరుచుకుపడ్డారు.

- విప్లవ్ ఠాకూర్



సరి లేరు కారు కెవ్వరూ!!!



చాలాకాలం క్రితం తమిళనాడులో జరిగిందిది. పార్లమెంటు ఎన్నికలలో నిలబడిన డిఎంకె అభ్యర్థి తరపున ప్రచారం చేయడానికి ప్రముఖ హాస్యనటుడు ఎన్ ఎస్ కృష్ణన్ వచ్చారు. ప్రత్యర్థి ఒక పెద్ద డాక్టరు. పేదల పక్షపాతి అని, ఉచితంగా వైద్యం చేస్తారని పెద్ద పేరు. కృష్ణన్ తన ఉపన్యాసంలో డిఎంకె అభ్యర్థి గురించి చెప్పలేదు. అవతలి డాక్టరు గురించే చెప్పుకుపోయాడు. ఎంత మంచివాడు, ఆయన మన కాలంలో ఉండడం మనకు అదృష్టం... అంటూ. డిఎంకె కార్యకర్తలకు ఏమీ అంతుపట్ట లేదు. ఉపన్యాసం చివర్లో కృష్ణన్ ''అంత మంచాయన మనకు అందుబాటులో ఉండడం అత్యవసరం. ఆయన్ని ఢిల్లీ పంపించి వేస్తే మనం ఎంతో నష్టపోతాం. ఈ డిఎంకె అతనంటారా, ఎక్కడున్నా ఒకటే. అందువలన అతన్ని ఢిల్లీకి తోలేసి, డాక్టరు గారిని మన మధ్యే ఉంచేసుకుందాం.'' అన్నాడు. జనం చప్పట్లు కొట్టారు. ఎన్నికలలో డాక్టర్ని ఓడించి తమ మధ్యే ఉంచుకున్నారు!

తెలంగాణ ప్రజలు తెరాసను పార్లమెంటు ఎన్నికలలో ఓడించి, స్థానిక ఎన్నికలలో గెలిపించడానికి యిలాటి లాజిక్కే కారణమై ఉంటుందని తోస్తోంది. మోదీ ఆకర్షణ యింకా తగ్గలేదని, పార్లమెంటు ఎన్నికలు మోదీ కేంద్రంగా జరుగుతున్నాయని గ్రహించక కెసియార్ భంగపడ్డారు. ప్రజలు ముఖ్యమంత్రిగా ఎవరుండాలో, ప్రధానిగా ఎవరుండాలో నిర్ణయించే విచక్షణ తమకు ఉందని ఓటర్లు నిరూపించుకున్నారు. అలాగే మమతా బెనర్జీ బెంగాల్ విడిచి ప్రధాని అయిపోదామని కలలు కంటే అక్కరలేదు, యిక్కడే ఉండు అన్నారు. మాయావతికీ అదే సందేశం. రాబోయే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో యిప్పుడు గెలుచుకున్న ఎంపీల నిష్పత్తిలో ఎమ్మెల్యేలు ఉంటారని బిజెపి అనుకుంటే లాభం లేదు - మమతకు దీటైన స్థానిక నాయకుణ్ని చూపిస్తే తప్ప! ఇది గ్రహించని కెసియార్ కాంగ్రెసు, బిజెపి రెండూ చతికిల పడతాయని, ఫెడరల్ ఫ్రంట్ ప్రముఖ స్థానంలో ఉంటుందని, దానికి తను సారథ్యం వహించవచ్చని కేసీఆర్ కలలు కన్నారు.

తీరాచూస్తే పార్లమెంటు ఎన్నికలలో కెసియార్‌కు చావు దెబ్బ తగిలింది. సారు-కారు-పదహారు-సర్కారు నినాదం బేకారైంది, తెరాస నాయకత్వం బేజారైంది. కెసియార్ కూతురు ఓడిపోయింది. పార్టీకి కొత్తగా వర్కింగ్ ప్రెసిడెంటుగా నియమితుడైన కుమారుడు విఫలమయ్యాడు. కొడుకుని ముఖ్యమంత్రిగా పట్టాభిషుక్తుణ్ని చేసి తన స్వయంగా ఫెడరల్ ఫ్రంట్ ద్వారా కేంద్రంలో చక్రం తిప్పేద్దామనుకుంటే మీకా శ్రమ అక్కరలేదన్నారు. అందువలన మనకు ప్రస్తుతానికి కెసియారే ముఖ్యమంత్రి. 17 సీట్లలో ఒకటి మజ్లిస్‌కు ఎలాగూ పోతుంది, తక్కిన పదహారూ మావే అని అహంకరించిన తెరాస కాంగ్రెసు మళ్లీ జీవం పోసుకోవడంతో, బిజెపి తనకు ప్రత్యర్థిగా అవతరించడంతో బిత్తర పోతోంది. గోడ దూకిన కాంగ్రెసు నాయకులు మళ్లీ గోడెక్కి పిల్లుల్లా చూశారు, దూకాలా వద్దా అని. స్థానిక ఎన్నికల ఫలితాలు చూశాక ధైర్యం వచ్చి దూకేశారు. అసెంబ్లీ ఎన్నికలలో 119కి 88 సీట్లు , మున్సి!ల్స్ పల్స్ పట్టుకొని, సహకార సంఘాల ఎన్నికలలోనూ అఖండ విజయం సాధించడంతో కెసియార్ తనకు ఎదురు లేదనుకున్నారు. తన విజయంలో చంద్రబాబు పాత్రను విస్మరించారు. బెంగాల్ కానీయండి, యుపి కానీయండి, మహారాష్ట్ర కానీయండి - బాబు ఎక్కడికి వెళ్లి ప్రతిపక్ష నాయకులతో చేతులు కలిపారో అక్కడ వాళ్లంతా మటాష్ అయ్యారు. ఇక్కడ తెలంగాణలో కాంగ్రెసుతో చేతులు కలిపారు. దెబ్బకి కాంగ్రెసు కుదేలైంది. (పార్లమెంటు నాటికి బాబును వదుల్చుకుని ఒంటరిగా 3 సీట్లు గెలిచి మీసాలు మెలేస్తోంది). బాబును బూచిగా చూపించి కెసియార్ ఎన్నికలలో లబ్ధి పొందారు తప్ప లేకపోతే తెరాసకు 70కి మించి సీట్లు వచ్చేవి కావని నా అంచనా. కానీ యీ 88 తన ప్రజ్ఞే అనుకున్నారు కెసిఆర్. అంతటితో తృప్తి పడకుండా యితర పార్టీ ఎమ్మెల్యేలను ఆరగించడం మొదలెట్టారు.

11 మంది కాంగ్రెసు ఎమ్మెల్యేలు, ఒక టిడిపి ఎమ్మెల్యే తన వెనక్కాల క్యూ కట్టడంతో తనేం చేసినా ఫర్వాలేదనే ధీమా వచ్చింది కెసిఆర్‌కు. ప్రజలకు జవాబు చెప్పుకోవలసిన పని లేదనుకున్నారు. ఫలితాలు వచ్చిన రెండు నెలల దాకా కాబినెట్ కూర్పే లేదు. తనుండగా వేరే ప్రజాప్రతినిధి అక్కర లేదనుకుంటూ అధికారగణంతో పరిపాలన సాగించారు. ఇదేమిటని ప్రతిపక్షం అడగకుండా అసెంబ్లీ కూడా సమావేశ పరచలేదు. ఏ సంప్రదింపులూ లేకుండా కెటిఆర్‌ను వర్కింగ్ ప్రెసిడెంటు చేశారు. పార్టీ కార్యకర్తలకు సన్నిహితుడైన హరీశ్ రావుని పక్కన పడేశారు. తను కేంద్రమంత్రి అయిపోయి, కొడుకుని ముఖ్యమంత్రి చేస్తారనే మాట బయటకు వచ్చినా ఖండించలేదు. తప్పేముంది? అన్నట్లు వ్యవహరించారు. 4 నెలల తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికలలో 16 ఖాయం అని లెక్కలు వేసేసుకున్నారు. తీరా 9 దగ్గర ఆగవలసి వచ్చింది. బిజెపికి 4, కాంగ్రెసుకు 3 వచ్చాయి. తెరాసకు 2014 కంటె 2 తగ్గాయి. తెరాస అనేక రకాలుగా నష్టపోయింది. ఉత్తర తెలంగాణలో కంచుకోటలైన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లలో కూడా ఎదురు దెబ్బలు తగిలాయి. దక్షిణ తెలంగాణలోని నల్లగొండలోనూ తగిలాయి. నగరంలో మల్కాజ్‌గిరిలో కాంగ్రెసు పక్షాన రేవంత రెడ్డి నెగ్గగా, సికింద్రాబాద్ నుంచి అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయిన బిజెపి కిషన్ రెడ్డి పార్లమెంటుకి ఎన్నికై కేంద్రమంత్రి కూడా అయిపోయారు. బిజెపికి సొంతంగా పూర్తి మెజారిటీ ఉంది కాబట్టి తెరాస అవసరం లేదు. ప్రతిపక్షాలకు మనుగడే ప్రశ్నార్థకమై పోయింది కాబట్టి కెసిఆర్ సలహా సంప్రదింపులు అక్కరలేదు. తెలంగాణ వంటి చిన్న రాష్ట్రంలో కూడా సగం సీట్లే సంపాదించుకోగలిగిన కెసిఆర్‌ను చూసి నేర్చుకోవాల్సింది ఏమీ లేదని వాళ్లనుకుంటారు. ఇవన్నీ చాలనట్లు బిజెపి తెలంగాణపై గురి పెడుతుంది. ఈ ఫలితాలు యిచ్చిన ఉత్సాహంతో బిజెపి తన తెలంగాణ యూనిట్‌ను ఉత్తేజ పరిచి, కాంగ్రెసు స్థానంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగడానికి వనరులు సమకూరుస్తుంది.

రైళ్లలో రాయితీ ప్రయాణం

●వివిధ వర్గాలకు తక్కువ చార్జీలతో టికెట్లు ●అవగాహన ఉంటే ఎంతో మేలు



కూర్మన్నపాలెం(విశాఖపట్నం): రైళ్లలో ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. వివిధ వర్గాల ప్రజలకు రైల్వేశాఖ రాయితీలు కూడా కల్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం రైల్వే బుకింగ్ కౌంటర్లలో చూపించి రాయితీ టికెట్లను పొందవచ్చు. చాలా మందికి రాయితీ టికెట్ల విషయం తెలియక వినియోగించుకోలేకపోతున్నారు. దీనిపై అవగాహన పెంచుకుంటే అర్హులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

శారీరక, మానసిక వైకల్యం, అంధులు, వివిధ దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న దివ్యాంగులకు స్లీపర్ క్లాస్, థర్డ్ క్లాస్ ఏసీ, ఏసీ చైర్‌కార్లలో 75 శాతం రాయితీతో ప్రయాణించవచ్చు. ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్ ఏసీలలో మాత్రం 50 శాతం, రాజధాని, శతాబ్ది ప్రముఖ సూపర్ ఫాస్ట్ రైళ్లలో 25 శాతం మాత్రమే రాయితీ వర్తిస్తుంది. వీరికి సహాయకులుగా వెళ్లేవారికి కూడా అదే స్థాయిలో రాయితీ వర్తిస్తుంది. చెవిటి, మూగవారికి స్లీపర్, సెకండ్ క్లాసులో 50 శాతం రాయితీ వర్తిస్తుంది.

క్రీడాకారులకు రైల్వే ప్రోత్సాహం

జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లలో పాల్గొనే క్రీడాకారులకు 75 శాతం రాయితీతో కూడిన సాధారణ, రిజర్వేషన్, ఫస్టు క్లాస్ తరగతుల్లో టికెట్లను జారీ చేస్తారు. పర్వతారోహణ చేసే వారు కూడా రాయితీ టికెట్లు పొందవచ్చు. సామాజిక, సాంస్కృతిక విద్యారంగంలో, అఖిల భారత సదస్సులకు హాజరయ్యే వైద్యులకు 25 శాతం రాయితీ టికెట్లు జారీ చేస్తారు. ఇందుకు పూర్తి ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలి.

విద్యార్థులకు...

ఇంటర్మీడియట్‌లోపు చదివే విద్యార్థులకు తమ నివాస ప్రాంతం నుంచి, మరో ప్రాంతంలోని కళాశాలకు వెళ్లి వచ్చేందుకు ప్యాసింజర్ రైలుకు మాత్రమే ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. ఇందుకు రైల్వే బుకింగ్ కౌంటర్‌లో అందుబాటులోని దరఖాస్తు వివరాలతో కూడిన జిరాక్స్ ధ్రువీకరణ పత్రాలు జత చేసి ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించి రైల్వే అధికారులకు అందజేస్తే ఉచిత పాసులను జారీ చేస్తారు.

డిగ్రీ విద్యార్థులకు...

ప్రతి డిగ్రీ విద్యార్థి రాయితీతో కూడిన రైల్వే పాసు పొందేందుకు విద్యా సంస్థ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ప్యాసింజర్ రైళ్లలో 150 కిలో మీటర్ల పరిధిలోనే ప్రయాణించే అవకాశం ఉంటుంది. ఇందుకు రైల్వే బుకింగ్ కౌంటర్‌లో రాయితీ పాసులు జారీ చేస్తారు. మూడు నెలల వ్యవధితో కూడిన పాస్ పొందాలనుకుంటే మరింత తక్కువ టికెట్ ధరలతో జారీ చేస్తారు.

సీజనల్ టికెట్లు


ఎవరైనా ఒకే రూటులో ప్రతి రోజూ ప్రయాణించే వారికి 15 రోజులు చార్జీతోనే నెలరోజులు ప్రయాణాలు చేయవచ్చు. వీటినే సీజనల్ టికెట్ అంటారు. 160 కిలో మీటర్ల లోపు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని జనరల్ బోగీల్లో ప్రయాణించేందుకు సగం చార్జీలతో కూడిన పాస్‌లు నెల వ్యవధికి జారీ చేస్తారు. ఒకవేళ సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ప్రయాణించాల్సి వస్తే అదనంగా సర్ చార్జీ టికెట్ కొనుగోలు చేసి ప్రయాణించవచ్చు. ఈ టికెట్లను స్థానిక రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కార్యాలయాలలోనే క్షణంలో పొందే వీలుంటుంది.

ప్రభుత్వ ఉద్యోగాల ఇంటర్వ్యూలకు వెళ్లే వారికి...
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల ఇంటర్వ్యూలకు వెళ్లే నిరుద్యోగ, యువతీ యువకులకు జనరల్ బోగీల్లో ప్రయాణిం చేందుకు ఉచిత టికెట్లు జారీ చేస్తారు. రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించాలంటే 50 శాతం రాయితీతో టికెట్ జారీ చేస్తారు. ఇందుకు పూర్తి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

వ్యాధులతో బాధపడేవారికి...
కేన్సర్ రోగులు తరచూ చికిత్స కోసం ప్రయాణించాలంటే రైలు స్థాయిని బట్టి 50 నుంచి 100 శాతం వరకు టికెట్లపై రాయితీ కల్పిస్తారు. వారి సహాయకులకు ఇదే రాయితీ వర్తిస్తుంది. తలసేమియా, కిడ్నీ, గుండె, శస్త్ర చికిత్సలకు వెళ్లేవారికి 50 శాతం రాయితీ టికెట్లను పొందవచ్చు. కుష్ఠు, హెచ్ఐవీ, లుకేమియా, అనీమియా, టీబీ రోగులు 50 నుంచి 75 శాతం రాయితీపై టికెట్లను పొందవచ్చు.

కార్మికులకు, కళాకారులకు రాయితీ
కూరగాయలు అమ్మేవారు, పారిశుధ్య కార్మికులు, ఇళ్లల్లో పాచి పనులు చేసేవారు, భవన నిర్మాణ రంగం, వ్యవసాయ కార్మికులకు 100 కిలో మీటర్లలోపు ప్రయాణించాలంటే అతి తక్కువ ధరకే సీజనల్ టికెట్లు జారీ చేస్తారు. ఈ టికెట్లు పొందాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరి. కళాకారులకు, జనరల్ స్లీపర్ క్లాసులలో 75 శాతం, ఫస్ట్ క్లాస్, ఏసీ చైర్‌కార్ 50 శాతం, సినీ సాంకేతిక నిపుణులు విధుల నిమిత్తం ప్రయాణించేందుకు స్లీపర్ క్లాసులో 75 శాతం, ఫస్ట్ క్లాస్ ఏసీలో 50 శాతం రాయితీతో టికెట్లు జారీ చేస్తారు.

ప్రపంచంలోనే విలువైన 8 గొప్ప పాఠాలు



Vivekananda : నిశ్శబ్దముగా వుండు ఎందుకంటే నాణెము ధ్వని చేసినంతగా నోట్లు చేయవు, విలువ కలిగినవి అలానే వుంటాయి.

Shakespeare : ఇతరుల భావాలతో ఆటలాడకు.. అలా చేయటం వలన నువ్వు ఆడిన ఆ ఆటలో గెలవచ్చు గాక కాని ఒక మంచి వ్యక్తిని నువ్వు జీవితాంతం కోల్పోతావు.

Napoleon : ఈ ప్రపంచం చాలా ఇబ్బందులను ఎదుర్కుంటుంది దానికి గల కారణం అశాంతిని రగిలించే చెడ్డ వ్యక్తులు కాదు మంచి వ్యక్తుల మౌనం

Einstein : నేను వారిపట్ల చాలా కృతజ్ఞుడనై వున్నాను ఎవరయితే నన్ను నిరాకరించారో..వారి వలనే నేను నా అంతట నేనుగా ఎదిగాను

Abraham Lincoln : నీలో స్నేహ గుణం అన్నది నీ బలహీనత అయితే ప్రపంచంలో నువ్వు అందరికన్నా బలమైనవాడివని అర్థం

Chralie Chaplin : నవ్వుతూ తమ జీవితాన్ని కొనసాగిస్తున్నవారి జీవితాల్లో బాధలు వుండవు అని అనుకోవద్దు వారి వద్ద వాటిని ఎదుర్కొని నిలబడే తనం వలనే
ఆ విధంగా తారసపడతారు

William Arthur : అవకాశాలు సూర్యకిరణాలు వంటివి అందుకే వాటిని వీలయినంత త్వరగా దొరకబుచ్చుకోవాలి ఆలస్యం చేస్తే వాటిని కోల్పోక తప్పదు


Hitler : నువ్వు వెలుగులో వున్నంత కాలం నిన్ను అందరూ అనుసరిస్తారు అదే నువ్వు చీకట్లో వుంటే నీ నీడ కూడా నీతో రాదు.....

అమితాబ్ అంటే అర్థం

అమితాబ్ బచ్చన్ తండ్రి హరివంశరాయ్ బచ్చన్ కవి, సంస్కరణవాది. ఆయన తన కొడుక్కి బౌద్ధ దేవుళ్లలో ఒకరి పేరు పెట్టాడు. అదేమిటి గౌతమ బుద్ధుడు ఒకడే కదా అనుకోకండి. ఆగ్నేయాసియా దేశాల్లో, చైనాలో, జపాన్‌లో, టిబెట్‌లో, అజంతా, ఎల్లోరా గుహల్లో చాలా చోట్ల బౌద్ధాలయాల్లో విగ్రహాలు కనబడతాయి. అవి ఎవరివో తెలియవు. కింద ఏదో పేరుంటుంది, మైత్రేయ, పద్మపాణి.. అని. బౌద్ధంలో గౌతమబుద్ధుడు ఒకడే దేవుడు లేదా జ్ఞానోదయం పొందిన సిద్ధపురుషుడు కాబట్టి యివన్నీ రకరకాల పోజుల్లో బుద్ధుడు అనుకునేవాణ్ని. కానీ వీళ్లకు కిరీటాలు ఉన్నాయే అని ఆశ్చర్యపడేవాణ్ని.

బౌద్ధులు కాకపోయినా అభ్యుదయ వాదులు, హేతువాదులు తమ పిల్లలకు బౌద్ధానికి సంబంధించిన పేర్లు పెడుతూంటారు. తథాగతుడు, అమితాభుడు, మంజుశ్రీ యిలా..! అవన్నీ బుద్ధుడి పేర్లే అనుకునేవాణ్ని. ఏదో ఉత్పత్త్యర్థం ఉంటుంది అనుకుని వూరుకునేవాణ్ని. కానీ వాళ్లంతా వేర్వేరు దేవుళ్లని 1969లో ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్యగారి సంపాదకత్వంలో ప్రచురించిన ఆంధ్ర విజ్ఞాన కోశం ఆరవ సంపుటంలో ఆదిరాజు వీరభద్రరావు గారు రాసిన 'బౌద్ధ దేవతలు' వ్యాసం చదివినప్పుడు తెలిసింది. బౌద్ధంలో మైనర్ వర్గమైన హీనయాన శాఖ వాళ్లు బుద్ధుణ్ని దైవస్వరూపుడిగా కాక, జ్ఞానిగా చూస్తారని, మేజర్ వర్గమైన మహాయాన వాళ్లు హిందూమత ప్రభావం చేత అనాత్మవాది (ఆత్మ లేదనేవారు) ఐన బుద్ధుడికి పూర్వజన్మలు కల్పించి, అవతారాలు కల్పించారని, తాంత్రిక పద్ధతులను అవలంబించారని, ఆ శాఖే విదేశాలలో ప్రాచుర్యం పొందిందని ముందే తెలుసు. కానీ హిందూమతం ఫక్కీలో చాలా మంది దేవుళ్లను కల్పించి, ఒక్కొళ్లకు ఒక్కో శాఖను అప్పగించారని, వాళ్లను బోధిసత్త్వులంటారనీ ఆ వ్యాసం చదివాకనే తెలిసింది. బోధిసత్త్వులో ప్రధానమైనవారు అవలోకితేశ్వరుడు, మంజుశ్రీ. అవలోకితుడు అంటే కిందకు చూసేవాడు అని అర్థం. స్వర్గం నుంచి భూమిని చూస్తాడన్నమాట. మంజుశ్రీకి మంజునాథుడు, మంజుఘోషుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. అవలోకితేశ్వరుడి బొమ్మ మనం చాలా చోట్ల చూస్తాం. ఇతను విష్ణువు లాటి వాడు. విశ్వాన్ని నడుపుతూంటాడు. ఇతని గర్భంలో సమస్త లోకాలు పర్వతాలు, యోగులు, దేవతలు ఉంటారు. పలు రూపాల్లో వచ్చి తన భక్తులకు సాయపడుతూంటాడు. తనను ధ్యానించేవారిని ఆపదల నుంచి, దొంగల నుంచి, దుఃఖం నుంచి, అనేక బాధల నుంచి కాపాడతాడు. ఇతని ఎడమ చేతిలో ఎఱ్ఱ కలువ వుంటుంది. కుడి చేయి అభయముద్ర దాల్చి వుంటుంది. ఇతనికి పద్మపాణి, లోకనాథుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో యితనికి అనేక చేతులు, కళ్లు కూడా ఉంటాయి. ఇతని పక్కనే "తార" అనే స్త్రీ విగ్రహముంటుంది. 7వ శతాబ్దం తర్వాత యీమెను శక్తిస్వరూపిణిగా చూడసాగారు. ప్రాణులను సంసార సాగరం తరింపచేసేది (దాటించేది) కాబట్టి 'తార' అనే పేరు వచ్చింది. ఈమె పేర అష్టోత్తరం కూడా ఉంది. రెండో స్థానంలో ఉన్న మంజుశ్రీని టిబెట్టు, నేపాల్, చైనా, జపాన్, జావాలలో కూడా పూజిస్తారు. ఇతను విజ్ఞానానికి అధిష్ఠాన దేవత. ఒక చేతిలో విజ్ఞాన ఖడ్గం, మరో దానిలో పుస్తకం ఉంటాయి. సింహవాహనుడు. ఇతని శిష్యుడు మైత్రేయుడు ఉపదేవత మాత్రమే. మొదటి యిద్దరికీ మానవాతీత శక్తులున్నాయి. కానీ మైత్రేయుడు గౌతముడిలాగ అనేక జన్మలెత్తి చివరకు బుద్ధత్వం ప్రాప్తింప చేసుకున్నవాడు. గౌతమబుద్ధుడికి బోధివృక్షం కింద జ్ఞానోదయం అయినట్లు యితనికి చంపక వృక్షం కింద అయింది. ఇతను ధర్మచక్ర ప్రవర్తన కార్యకలాపాలను పరిరక్షిస్తూ ఉంటాడు. తన తర్వాతి అవతారం మైత్రేయుడే అని గౌతమబుద్ధుడు (శాక్యముని అంటారు) చెప్పాడట. బంగారుఛాయ శరీరుడైన ఇతను పద్మంలో కూర్చోడు. నిల్చోడమో, పడుకోవడమో చేస్తాడు. ఇంకో బోధిసత్త్వుడు సమంతభద్రుడు. టిబెట్టులో అత్యంత ప్రియమైన దేవత. ఆకుపచ్చ రంగులో ఏనుగుమీద సవారీ చేస్తూంటాడు. బౌద్ధధర్మాలను చక్కగా పాటించేవారిని రక్షించడం యితని పని. శాంతికి ప్రతిరూపం. మహాస్థాన ప్రాప్తుడు అనే బోధిసత్త్వుడికి యిలాటి క్షణాలే ఉన్నాయి. క్షితిగర్భుడు అనే అనే బోధిసత్త్వుడికి స్త్రీలక్షణాలున్నాయి. స్త్రీలకు ప్రసవ సమయంలో సాయపడతాడు. పాతాళ లోకాధిపతి. శిరోముండనం చేయించుకుని, దండం చేత పట్టుకుని బౌద్ధభిక్షువు రూపంలో కనబడతాడు. వీళ్ల కాక హిందువులు ఇంద్రుడికి బౌద్ధరూపం కల్పించి, వజ్రపాణి అనే అతన్ని బోధిసత్త్వులలో చేర్చారని అంటారు.

లోకానికి చెందని బుద్ధదేవుళ్లలో అయిదుగుర్ని ధ్యానబుద్ధులు అంటారు. వైరోచనుడు, అక్షోభ్యుడు, రత్నసంభవుడు, అమితాభుడు, అమోఘసిద్ధి అని వాళ్ల





పేర్లు. ఈ ఐదుగురు ఆదిబుద్ధదేవుని ధ్యానసాధనకు ఫలంగా ఉత్పన్నమైనవారు. వీళ్లు తమకు ప్రతిబింబాలుగా బోధిసత్త్వులను, యితర దేవతలను సృష్టిస్తారు. వీళ్లల్లో వైరోచనుడు, అమితాభుడు ప్రధానులు. వైరోచనుడివన్నీ సూర్యలక్షణాలే. కొందరి గురించి వింటే హిందూ దేవతలకు బౌద్ధ కలరింగ్ యిచ్చినట్లు తోస్తాయి.

అమితాభుడు అంటే అమితమైన కాంతి కలవాడు. ఇతనికి యింకో పేరు కూడా ఉంది. అమితాయువు అని. అంటే మితం లేని ఆయుర్దాయం కలవాడు, చిరంజీవి అని. పశ్చిమ దిక్కుకు అధిపతి. మరణించినవాళ్లు అక్కడికే చేరతారు. ఇతని అధీనంలో వున్న స్వర్గాన్ని 'సుఖవతి' అంటారు. పూజాతత్పరులైన వారికి అమితాభుడు యీ స్వర్గంలో చోటిస్తాడు. మన అమితాబ్ బచ్చన్‌కు వాళ్ల నాన్న యీ దేవుడి పేరే పెట్టారు. ధ్యానబుద్ధుల్లో మూడోవాడైన అక్షోభ్యుడు తూర్పుదిక్కుకు అధిపతి.

మహాయానం ప్రకారం గౌతమబుద్ధుడి తర్వాత చాలామంది బుద్ధదేవులు అవతరిస్తారు. వీళ్లను తథాగతులంటారు. మనిషిగా పుట్టి దేవుడి స్థాయికి ఎదిగినవాడు పద్మసంభవుడు. 8వ శతాబ్దానికి చెందినవాడు. ఇతను భారతదేశంలో పుట్టి మహాయాన శాఖను బాగా ప్రచారం చేశాడు. టిబెట్టులో కొంతకాలం ఉండి తర్వాత రాజుతో పేచీ వచ్చి వెళ్లిపోయాడు. అక్కడ యితన్ని బాగా ఆరాధిస్తారు. ఇతను అవలోకితేశ్వరుని అవతారమనే నమ్మకం ప్రబలాక పద్మంలో పుట్టాడనే కథ తర్వాత ప్రచారంలోకి వచ్చింది, విగ్రహాలు వెలిశాయి. ఇతని చేతిలో ఒక దండం ఉంటుంది. ఇది పైన మూడుగా చీలి వుంటుంది. వాటిలో ఒక కపాలం, ఒక శిరస్సు, ఒక వజ్రాయుధం ఉంటాయి. గుఱ్ఱమెక్కి వుంటాడు. ఈ గుఱ్ఱం పేరు బలాహ.

ఇలా అనేకమంది దేవతలున్నారు. బెంగుళూరు నుంచి మడికెరికి వెళ్లే దారిలో కూర్గులోనే బయిల్‌కుప్పె అనే చోట నామ్‌డ్రోలింగ్ టిబెటన్ బుద్ధిస్ట్ మొనాస్ట్రీ ఉంది. చైనా ఆక్రమణ తర్వాత టిబెట్టు నుంచి పారిపోయి వచ్చిన బౌద్ధులకు అక్కడ విశాలమైన స్థలం యిస్తే అక్కడ ఆలయం కట్టుకున్నారు. వాడుకలో గోల్డెన్ టెంపుల్ అంటారు. ఒక పెద్ద హాల్లో బంగారు పూత పూసిన మూడు రకాల దేవుళ్లు కనబడతారు. ఎడమవైపు పద్మసంభవుడు, మధ్యలో శాక్యముని (మనందరికీ తెలిసిన గౌతమబుద్ధుడు), కుడివైపు అమితాయువు అనే పేరుతో వీళ్లు కొలిచే అమితాభుడు. వీళ్లు పద్మసంభవుణ్ని గురు రిన్‌పోచే అంటారు. వీళ్లు అతను స్థాపించిన న్యెయింగ్‌మాపా అనే శాఖకు అనుయాయు.

టిబెట్టులో కూడా అనేక బౌద్ధశాఖలున్నాయి. వాళ్ల కథనం ప్రకారం గౌతమబుద్ధుడు మరణించిన 12 ఏళ్ల తర్వాత పద్మసంభవుడు ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్-పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉన్న ఒడ్డియానాలో సింధు సరస్సులో పద్మంలో పుట్టాడు. అతన్ని వాళ్లు రెండో బుద్ధుడుగా పరిగణిస్తారు. ఇక మధ్యలో ఉన్న శాక్యముని కథ మనందరికీ తెలిసినదే. శుద్ధోధనుడికి, మాయాదేవికి పుట్టి, యశోధరని పెళ్లాడి, రాహులుడనే కొడుకుని కని, ఒక్కసారిగా ప్రపంచమంటే విరక్తి కలిగి, సన్యాసి అయిపోయి, తపస్సు చేసి బోధివృక్షం కింద జ్ఞానోదయం కలిగి, తన బోధనలతో ప్రపంచాన్ని ప్రభావితం చేసినవాడు. మహాయానం ప్రకారం మొత్తం 1002 బుద్ధులలో యితను 4వ వాడు.

ఇక కుడివైపు ఉన్న అమితాయుస్ (అమితాభుడు)ని ప్రార్థిస్తే ఆయుర్దాయం పెరుగుతుందని వాళ్ల నమ్మకం. పాపాలు చేస్తే ఆయుష్షు తరిగిపోతుందని, పాపాలు మాని, అమితాయుస్‌ను కొలిస్తే పెరుగుతుందని వాళ్ల నమ్మకం. కొన్ని చోట్ల అతని చేతిలో మన ధన్వంతరి టైపులో ఒక పాత్ర కూడా ఉంటుంది. ధన్వంతరి ఆరోగ్యానికి, ఆయుర్దాయానికి ప్రతీక కదా. ఈ సారి కూర్గు వైపు వెళితే యీ బౌద్ధాలయం చూడండి. అలాగే గూగుల్‌లో పైన చెప్పిన ఒక్కొక్క దేవుడి పేరు కొట్టి ఇమేజిలు చూడండి. మీరు గతంలో చూసిన చిత్రాలు, విగ్రహాలు గుర్తుకు వస్తాయి.

ఇక భాష గురించి.. ఆ పుస్తకాల్లో భాష మీరు రాసినట్లు ఉంటుందా అని అడుగుతారు. ఎందుకుంటుంది? 50 ఏళ్ల క్రితం, 100 ఏళ్ల క్రితం పుస్తకాల్లో గ్రాంథికం ఎక్కువగా వుంటుంది. ముఖ్యంగా యిలాటి ఆధ్యాత్మిక పుస్తకాల్లో! ఇప్పుడు కూడా వ్యాసాల్లో భాష గంభీరంగానే ఉంటుంది. నేను "కబుర్లు"అని పేరు పెట్టి మాట్లాడే ధోరణిలో రాస్తున్నాను కాబట్టి చాలా కాజువల్‌గా, ఇంగ్లీషు పదాలను కూడా ఉపయోగిస్తూ రాస్తాను.

ఉపనిషత్తుల గురించి వున్న పుస్తకాల్లో ఎవరిది మంచిది అనే ప్రశ్న చాలామంది అడుగుతున్నారు. పుస్తకాల షాపుకి స్వయంగా వెళ్లి నాలుగూ చూసి, దేనిలో వ్యాఖ్యానం విపులంగా వుందో, భాష సరళంగా ఉందో, చదివించేట్లు ఉందో చూసి కొనుక్కోవడం మంచిది. శ్లోకాల అర్థం తెలుసుకుని ఊరుకుంటే సరిపోదు. వాటిని విశదీకరించి, లోతైన భావాలను తర్కించిన పుస్తకాలే చదవాలి. ఇంకో మాట కూడా యిక్కడ రాయాలి. ఏదైనా విషయం గురించి నేను రాసినంతే, నేను రాసిన వరుసలోనే ఆ పుస్తకాల్లో ఉంటుందని అనుకోకండి. చాలా పేజీలుంటుంది. నేను వాటి సారాంశం మాత్రమే రాస్తాను. పెద్దగా ఆసక్తి లేనివారిని కూడా చదివించే తపనతో ఆర్డర్ కూడా ముందూవెనకా చేస్తాను. నేను చూపించేది ఝలక్ మాత్రమే. పూర్తిగా ఆస్వాదించే కోరిక, తీరిక వున్నవాళ్లు వాటిని చదవండి. ఇంకో విషయం గమనించారా %--% జాతీయస్థాయి సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్, మన మెగాస్టార్ చిరంజీవి పేర్లకు అర్థం ఒకటే. - ఎం. ప్రసాద్ .

ఢిల్లీ తీర్పు వెనక చేదు నిజాలు



బీజేపీయేతర పార్టీలకు సంతోషం ఏమిటంటే..? కేజ్రీవాల్ గెలిచినందుకు కాదు... బీజేపీ ఓడిపోయినందుకు..! నిజానికి మిగతా పార్టీలు ఏవీ కేజ్రీవాల్‌ను పెద్దగా ఓన్ చేసుకోవు... తను ఏ కూటమిలోనూ ఇమడలేదు... సీఏఏ, ఎన్నార్సీ వంటి అంశాల్లో లెఫ్ట్, కాంగ్రెస్ అనుసరించిన పంథాలో కూడా కేజ్రీవాల్ వెళ్లలేదు, పైగా హనుమాన్ చాలీసా పఠనం వంటి ట్రైఫ్లీ చిట్కాలతో తను సాఫ్ట్ హిందూ అని చెప్పుకోవటానికే ప్రయత్నించాడు... ఐనా అందరికీ ఆనందం ఎందుకంటే..? బీజేపీని ఆయన ఓడించినందుకు మాత్రమే...! తమకు చేతకాని పనిని కేజ్రీవాల్ చేసి చూపించినందుకు... బీజేపీ డబ్బు, అధికారం, మందబలం ఎంత చూపించినా సరే కేజ్రీవాల్ బీజేపీని నిలువరించినందుకు..! మరి కేజ్రీవాల్‌కు చేతనైన పని మిగతావాళ్లకెందుకు చేతకాలేదు..? ఇది కదా అసలు ప్రశ్న...

ఎన్నికల సంఘం సైటు చెబుతున్న వివరాలే చూడండి ఓసారి... కాంగ్రెస్ 4.26 శాతం... వరుసగా పదిహేనేళ్లపాటు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్ పార్టీ... దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన పార్టీ... సరైన నాయకుడు గనుక దొరికితే ఇప్పటికీ దుమ్మురేపగల కేడరున్న పార్టీ... కేవలం ఆ అతితక్కువ వోట్ల శాతం సంపాదించి చతికిలపడింది... 63 స్థానాల్లో డిపాజిట్లు కూడా రాలేదు... ఢిల్లీలో ఇక కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లినట్టే... ఇక్కడ ఓ విషయం చెప్పుకోవాలి... బలమైన ప్రాంతీయ పార్టీలు మాత్రమే బీజేపీకి విరుగుడు అనే ఓ వాదన, కేసీఆర్ ప్రవచిస్తున్న ఫెడరల్ ఫ్రంటు వంటివే శరణ్యం అనే వాదన మళ్లీ ప్రబలంగా వినిపిస్తున్నది... ఆ శక్తులతో ఓ యాంటీ-బీజేపీ కూటమి జాతీయ స్థాయిలో నిర్మాణం జరగాలనేది దాని సారాంశం... కానీ దీనివల్ల అంతిమంగా జరిగేది ఏమిటో తెలుసా..? బీజేపీ దేశవ్యాప్తంగా మరింత బలపడుతుంది... మిగతా జాతీయ పార్టీలు నామమాత్రంగా మిగిలిపోతాయి.

ఎలాగంటే... తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బెంగాల్, యూపీ, బీహార్... ఇలా పెద్ద పెద్ద రాష్ట్రాల్లో ఈరోజు కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం లేదు, బలం లేదు... ఈశాన్య రాష్ట్రాల్లో కొట్టుకుపోయింది ఏనాడో... ఇక బీజేపీకి దీటుగా వేరే జాతీయ పార్టీ ఏమున్నది..? మన ద్రవిడ పార్టీలను వదిలేస్తే... ఉత్తరాది పార్టీలన్నీ ఢిల్లీలో ఈసారి బరిలో నిలిచాయి... కానీ దారుణంగా వోట్ల శాతం కనిపిస్తున్నది... అయితే ఆప్, లేదంటే బీజేపీ... అంతే... మిగతావాళ్లు ఏం చెప్పినా, మినీ ఇండియా మనోగతంలా భావించబడే ఢిల్లీ వోటర్లు వినలేదు... వాళ్లకు అక్కరలేదు... తెల్లారిలేస్తే పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియాలో, సైట్లలో లెఫ్ట్ నాయకుల వార్తలే అధికంగా కనిపిస్తుంటాయి... ఢిల్లీలో సీపీఎం సాధించిన వోట్లు శాతం జస్ట్... 0.01 శాతం... చెల్లని వోట్ల శాతం అక్కడక్కడా ఎక్కువ..! సీపీఐ... 0.02 శాతం..! అంటే చెల్లని వోట్లకు దీటైన చెల్లుబాటు కూడా లేనంతగా ఎందుకు దిగజారిపోయినట్టు...? పైకి ఏం చెప్పుకున్నా సరే, టీఎంసీ, ఎన్సీపీ, ఎస్పీ, బీఎస్పీ, ఆర్జేడీ, ఎల్జేపీ, ఎస్ఏడీ, జేడీయూ... అన్ని పార్టీలూ దేశంలోని ఏదో ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైపోయాయి.

బీజేపీకి వ్యతిరేకంగా అన్నీ ఏకం కావాలి... ఓ కూటమి నిర్మించాలి... సరే... అందరినీ ఏకోన్ముఖంగా కదిలించగల నాయకుడు ఏడీ..? ఆయా ప్రాంతాల్లో బలంగా కనిపించే నాయకులు ఇతర ప్రాంతాల్లో జీరోలు... పైగా ఒకరంటే మరొకరికి పడదు... ఈ

కూటములు ఎంత దరిద్రంగా పాలించాయో, ప్రాంతీయ పార్టీల నేతలు తమ కులాల కోసం, తమ ప్రాంతాల కోసం, తమ పార్టీల కోసం, తమ ఆస్తుల కోసం, తమ కుటుంబాల కోసం గతంలో ఎన్ని క్షుద్ర రాజకీయాలు చేశారో చూసిందే... సంకీర్ణం అనబడే అతుకుల బొంతలు, అస్థిర రాజకీయాలు ఇప్పుడు ఇండియాకు సరికావు... ప్రజలు వాటిని నమ్మే స్థితిలోనూ లేరు... పోనీ, వీటన్నింటినీ నడిపించే ఓ జనతా జయప్రకాష్ నారాయణో ఉన్నాడా అంటే ఎక్కడా కనిపించడం లేదు... ప్రతి రాజకీయ నాయకుడికీ ఏదో ఒక మజిలీ... అవినీతి, అవలక్షణాలు... ప్రత్యేకించి ప్రాంతీయ పార్టీలు...! సో, ఏతావాతా తేలేది ఏమిటంటే... బీజేపీని నిలువరించాలంటే ఓ బలమైన జాతీయ పార్టీ కావాలి... ఓ కొత్త నాయకుడు కావాలి... లేవు, లేరు... అదే బీజేపీ బలం... ప్రస్తుతానికి.. ఢిల్లీలో బీజేపీ ఓడిపోయింది... కేజ్రీవాల్ గెలిచాడు...! అంతిమ ఫలితాలు వచ్చేసరికి బీజేపీ సింగిల్ డిజిట్‌కు పరిమితమైపోయింది. ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు... ఢిల్లీ వోటరు బీజేపీ వద్దనుకున్నాడు... వీసమెత్తు సందిగ్ధం లేదు... సంశయం లేదు... గత అయిదేళ్లలో ఇతర రాష్ట్రాలకు విస్తరించలేక, ఢిల్లీలోనే బోలెడు పొలిటికల్ ఒడిదొడుకులను, బీజేపీ మార్క్ ఒత్తిళ్లను ఎదుర్కున్న ఆప్‌కు ఇది జీవన్మరణ సమస్యగా మారింది... ఆ పరీక్షలో నెగ్గింది... ఇక కారణాలపై బోలెడు విశ్లేషణలు వినిపిస్తుంటయ్... ఇలా...

పొలిటికల్ స్ట్రాటజిస్టు పీకే వ్యూహాలు గెలిపించాయి... గుడ్
బీజేపీ మత అతివాదాన్ని వోటర్లు తిరస్కరించారు... గుడ్
మోడీ, అమిత్‌షా నాయకత్వానికి ఇది ఎదురుదెబ్బ... గుడ్
సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లపై వోటర్ల విముఖత... గుడ్
అనుకున్నట్టుగా ఈవీఎంలు ట్యాంపర్ చేయలేదు... గుడ్
కాంగ్రెస్ తను త్యాగం చేసి ఆప్‌ను గెలిపించింది... గుడ్
మందబలాన్ని బీజేపీ మరీ అతిగా ప్రదర్శించింది... గుడ్

నిజమా..? ఇవే నిజమా..? కాస్త డిఫరెంటు కోణంలో చూద్దాం... ఒకే ఒక ప్రధాన కారణం కనిపిస్తుంది... అది కేజ్రీవాల్‌ను ఎందుకు వద్దనుకోవాలో ఢిల్లీ వోటరుకు ఒక్క కారణమూ కనిపించలేదు కాబట్టి..!

కేజ్రీవాల్ పాలనకన్నా మేం ఫలానా మంచి పనులు చేస్తాం అని బీజేపీ చెప్పుకోలేకపోయింది కాబట్టి... కేజ్రీవాల్ కొన్ని ప్రజోపయోగ పనుల్ని చేతల్లో చేసి చూపించాడు కాబట్టి... అసలు కాంగ్రెస్ పార్టీకి దశ, దిశ లేక, ఆ వోట్లన్నీ ఆప్ వైపు మళ్లాయి కాబట్టి... అసలు కాంగ్రెస్ బరిలోనే లేనట్టు కాబట్టి... కేజ్రీవాల్‌ను వదులుకుంటే కొన్ని ప్రయోజనాలు దూరం అవుతాయని భయపడ్డారు కాబట్టి... అయితే ఏమిటా మంచి పనులు..?!


కరెంటు చార్జీలను నేల మీదకు తీసుకురావడం... తక్కువ వినియోగం ఉన్న కష్టమర్లకు ఫ్రీ కరెంటు ఇచ్చాడు... అది ఢిల్లీ కాబట్టి, ఎక్కువగా గృహ, వాణిజ్య వినియోగం కాబట్టి... వ్యవసాయం వంటి సబ్సిడీ వర్గాలు లేవు కాబట్టి... క్రాస్ సబ్సిడీల వెసులుబాటు ఉంది కాబట్టి జాగ్రత్తగా ప్లాన్ చేసి, చార్జీలను స్ట్రీమ్ లైన్ చేయగలిగాడు... అది అంతకుముందు కాంగ్రెస్‌కు గానీ, బీజేపీకి గానీ చేతకాలేదు... అందుకని కేజ్రీవాల్‌ను వదులుకోవడం ఢిల్లీ వోటరుకు ఇష్టం లేకుండా పోయింది... పైగా ప్రభుత్వం పై పెద్దగా అవినీతి ఆరోపణలు లేవు, దుబారా ఖర్చులు, ఆడంబరాలు, అట్టహాసాలు, హైఫైలు లేవు, కుల రాజకీయాలు అస్సలు లేవు...

సర్కారు బడి..! ఢిల్లీలోని పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రైవేటు విద్య ఓ గగనకుసుమంగా మారిన స్థితిలో, ప్రైవేటు బడులకు మించి సర్కారు బడిని కేజ్రీవాల్ తీర్చిదిద్దగలిగాడు... ఒక్క ముక్కలో చెప్పాలంటే సర్కారు రంగంలోనే కార్పొరేటు విద్యను అందుబాటులోకి తెచ్చాడు కాబట్టి ఢిల్లీ వోటరుకు కేజ్రీవాల్ నచ్చాడు... నచ్చిన విషయాన్ని వోట్లుగా చూపించారు.

తగ్గిన తాగునీటి టారిఫ్, మహిళలకు ప్రజారవాణాలో ఉచితం వంటివి ఇంకాస్త అదనపు పాపులారిటీని, నమ్మకాన్ని తీసుకొచ్చాయి... చేస్తున్నవే గాకుండా, అదే దిశలో తన హామీలకు పదును పెట్టాడు... 20,000 లీటర్ల వరకు నీరు ఫ్రీ, 200 యూనిట్ల ఎలక్ట్రిసిటీ ఫ్రీ, డిగ్రీ వరకు చదువు ఫ్రీ, Govt. బస్సుల్లో మహిళకు ఫ్రీ, Govt. బస్సుల్లో స్టూడెంట్స్ కు ఫ్రీ, సర్కారు బడిలాగే నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం ఇలా కేజ్రీవాల్ పోచుకోలు కబుర్లు, మోడీ పట్ల గుడ్డి వ్యతిరేకత జోలికి పోకుండా... పూర్తిగా ఢిల్లీలో సంక్షేమ పథకాలపైనే కాన్సంట్రేట్ చేశాడు... పంజాబ్ తదితర ప్రాంతాల్లో తన పార్టీకి ఎదురైన చేదు అనుభవాలు తనను నేల మీదకు దింపాయి... సీనియర్ నాయకులు కొందరు పార్టీని వీడి వెళ్లిపోయారు... ఇక తన ఇంటిని సర్దుకోవడంపైనే దృష్టి పెట్టాడు... వరుసగా మూడోసారి కూడా ప్రభుత్వ వ్యతిరేకత గండాల్ని దాటేసి గెలవడం అనేది మామూలు విషయం కాదు, కేజ్రీవాల్ అది సాధించగలిగాడు... ఎలాగూ తను నాలుగు మంచి పనులు చేస్తూనే ఉన్నాడు కదా, బీజేపీని చూసి, కాంగ్రెస్‌ను చూసి, చేతిలో ముంతను ఎందుకు వొలకబోసుకోవాలి... అదే ఢిల్లీ వోటరు ప్రదర్శించిన తెలివిడి... కేజ్రీవాల్‌కు అదే శ్రీరామరక్ష..!!



[redacted]



మొన్న ఒక చర్చ జరిగింది. వశిష్ట నారాయణ సింగ్ అనే గొప్ప మ్యాథమేటీషియన్ కు భారత ప్రభుత్వం ఈ సంవత్సరానికి పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. ఐతే, ఆయన పోయిన ఏడాదే చనిపోయారు. విచిత్రమైన విషయం ఏమిటంటే, వశిష్ట నారాయణ సింగ్ గురించి తెలిసిన mathematics teachers or lectureres or students కూడా మన దేశంలో తక్కువ. ఆయన తన జీవితంలో స్కిజోఫ్రీనియాతో బాధపడటం, ప్రపంచం అంతా తనతో విబేధిస్తోందనే హాలూసినేషన్ తో బతకడం, స్కిజోఫ్రీనియా వలన సంసార జీవితం విడాకులు తో సందిగ్ధంలో పడటం, ఇల్లు విడిచి తప్పి పోవడం, చివరికి ఒక బిక్షగాడి రూపంలో ఆయన దొరకడం, లాలూ ప్రసాద్ యాదవ్, శత్రుఘ్న సింహా వంటి వారు పూనుకుని ఆయనకు ట్రీట్మెంట్ ఇప్పించి మళ్ళీ మనిషిని చేయడం, దీనికంతటికీ పూర్వం ఆయన తన అద్భుతమైన గణిత మేధాశక్తితో మన దేశంలోనూ అమెరికా లోనూ గల గణిత మేధావులను అబ్బురపరచడమూ, అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీ లో అధ్యాపకుడిగా ఉంటూ, నాసాలో పని చేయడం, ఇత్యాది ఆసక్తికరమలుపులు గల జీవితం కనుక ఒక బయోపిక్ వచ్చేందుకు మాత్రమే ఉపయోగపడే జీవితాన్ని పాపం ఆయన ఈ దురదృష్టకరమైన దేశంలో జీవించాడని చెప్పాలి. దాదాపు ఇదే రకమైన జీవితం గల జాన్ నాష్ అనే మాథమెటీషియన్ కు నోబెల్ బహూమతి లభించింది. బ్యూటీఫుల్ మైండ్ అనే సినిమా ఆయన జీవితం ఆధారంగా తెరకెక్కడమూ, కొన్ని అకాడెమీ అవార్డు లు అందుకోవడమూ జరిగింది. నాష్ ప్రతిపాదించిన గేమ్ థియరిని గురించిన చర్చలు ఇప్పటికీ అమెరికా వంటి దేశాల్లో జరుగుతాయేమో కానీ వశిష్ట నారాయణ సింగ్ ప్రతిపాదించిన సూత్రాల గురించిన చర్చ మనదేశంలో ఎక్కడా జరగదు. చివరికి పద్మశ్రీ అవార్డైనాగానీ ఆ థియరీలను బయటకు తీసుకురాలేదు. మన దేశంలో గణితం చాలా దారుణమైన పరిస్థితిలోకి దిగజారింది. మన తెలుగు రాష్ట్రాల లో మరీ దారుణం. చదువుకున్న మేధావులు కూడా నేటికీ రాముడి రావణుడి చర్చలు చేస్తారే తప్ప గణితము, సైన్సు గురించి ఎక్కడా ఎప్పుడూ మాట్లాడరు. ఒకప్పుడు గణితమంటే ఒక టఫ్ సబ్జెక్టు అనే భావన ఉండేది. ఇపుడది లేదు. ఇంజనీరింగ్ కాలేజీలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగినతరువాత, EAMCET లో రాసిన ప్రతివాడికీ సీటు వచ్చే కాలం దాపురించాక, మ్యాథ్స్ అసలు ఏ ప్రాధాన్యతా లేని సబ్జెక్టు అయిపోయింది. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లీషులో హూష్ హాష్ అని మాట్లాడుతున్నారా లేదా అనే చూస్తున్నారు తప్ప, అసలు లెక్కలు వచ్చా..నోటి లెక్కలు వచ్చా!? ఎక్కాలు, కూడికలు, హెచ్చివేతలు, భాగాహారాలు టక టకా చేయగలుగుతున్నారా లేదా అనే స్పృహ ను కోల్పోయారు. పాలకులు సైతం ఇంగ్లీషు లో బోధన మహా గొప్ప అనే భ్రమలో పడిపోయారుగానీ, గణితానికి, నంబర్లకు, pure science priciples కి ఇంగ్లీషా, తెలుగా అని భాషతో సంబంధం ఉండదనే సత్యాన్ని మరిచిపోయారు. మీ పిల్లలను గణితంలో సైన్సులో తీర్చి దిద్దుతామని ఏ స్కూలూ చెప్పుకోదు. ఇంగ్లీషు లో ఆలోచింపజేసే ఇంగ్లీషు మీడియం స్కూల్సు పుట్టుకొచ్చాయి కానీ, గణితం లో ఆలోచింపజేసే maths medium schools, సైన్సు లో ఆలోచింపజేసే science medium schools ఇంకా పుట్టుకు రాలేదు. అసలు గణితంలో ప్రవేశం, ప్రావీణ్యమూ, ఆసక్తి యువతలో చచ్చిపోయాయి, చంపబడ్డాయి కాబట్టే ఈ దేశ యువత రేషనల్ గా ఆలోచించడం మానేసింది. మతాలమీద, మూఢనమ్మకాల మీద, సినిమా యాక్టర్ల మీద, వ్యక్తి పూజల, వాట్సాప్ పుకార్ల మీద ఈ దేశ యువత దృష్టి మరలడానికి గల కారణాల్లో గణితం చచ్చిపోవడమే ప్రధాన కారణం అనుకుంటాను. నియో కార్టెక్స్ పనిచేయడానికి, మనిషి రేషనల్ బీయింగ్ గా మారడానికి, మెదడులో ఆ న్యూరాన్లు ఒకదానికొకటి అల్లుకుంటూ గొప్ప కాంప్లెక్సు నెట్వర్క్ లు ఏర్పడటానికి గణితాన్ని మించినది ఏదీ లేదు. అసలు మనిషి తత్వాన్వేషణనే గణితంతో మొదలైంది. గత కాలపు గొప్ప ఫిలాసఫర్లందరూ గొప్ప గణిత వేత్తలే. Let no one ignorant of geometry enter here. ప్లేటో తన అకాడెమీ సింహద్వారం వద్ద చెక్కించుకున్నాడు. రేఖా గణితం రాకపోతే అసలు లోపలికి అడుగుపెట్టడానికే అర్హత లేదు పొమ్మన్నాడు. ఒక్క ప్లేటోనే కాకుండా, రేఖా గణితాన్నీ ఆల్జీబ్రాను కలిపిన మోడెర్న్ ఫిలాసఫీ పితామహుడు డెకార్టే కానీ, డిఫెరెన్షియల్, ఇంటెగ్రల్ క్యాల్క్యులస్ కర్త లెబ్నిజ్ గానీ అటు, కాంట్ గానీ, స్పినోజా కానీ మ్యాథమేటిక్స్ లేకపోతే ఫిలాసఫీనే లేదన్నారు. అంతటి శక్తి గల గణితానికి ఈ రోజు ఏ దుర్దశ పట్టిందో చూడండి. చివరికి నెంబర్లుగల మార్కులను తీసేసి, ABCD గ్రేడ్లు మొదలు పెట్టారు. పిల్లలకు నెంబర్లతో ఆటలాడటం నేర్పని చదువుల్లోంచి మరో ఐన్స్టీన్ పుడతాడనుకోవడం, మరో ప్లేటో పుడతాడనుకోవడం అమాయకత్వం. ప్రజలను మూఢత్వం లో ఉంచేసే మరో దొంగ బాబానో, ప్రజలను మతాలకేసి తలలు బాదుకునేలా చేసే చెత్త రాజకీయ నాయకుడో తప్ప భవిష్యత్తు తరాలను నడిపించగల, ఆలోచింపజేయగల మహనీయులు ఉండబోరు. అందుకే మొదటి ఉద్యమం గణితంలో జరగాలి.

వెంకన్న నామాలపై మెట్రో రైలు!!



తిరుపతిలో అంతా వెంకన్నే. అన్ని చోట్లా నామాలే. ఈ నామాలకు జామెట్రీ లెక్కలేవో ఉన్నాయని వైష్ణవ సంప్రదాయంలో పెద్దలు చెబుతుంటారు. ముక్కు మీది వరకు నామం, నుదుటి మీద మాత్రమే నామం, గోపీ చందన నామం, లలాట ఫలకే కస్తూరీ తిలకం, భుజాల మీద నామాలు, భుజాల మీద శాశ్వత శంఖు చక్రాలు . . . ఇదంతా పెద్ద తిలక ధారణ శాస్త్రం. తమిళ వైష్ణవులకు- తెలుగు విష్ణవులకు ఈ నిలువునామం విషయంలో ఏవో కొన్ని అభిప్రాయభేదాలున్నాయి. అయినా తిరుమల తిరుపతి దేవస్థానాలకు తమిళ వైష్ణవమే నచ్చుతుంది కాబట్టి- ఈ విషయంలో ఇంతకంటే లోతుగా వెళ్లి ప్రయోజనం లేదు. నిలువునామం- అడ్డనామం గొడవలు శతాబ్దాలుగా ఉన్నవే. అసలు దైవనామం వదిలి నిలువునామం దగ్గరే ఆగిపోవడమేమిటి? అని ఆధునికులు విసుక్కుంటారు. కానీ నామమహిమ ఎంత గొప్పదో, నామం పెట్టుకోవడం అంతే గొప్పది. నిలువు నామం పెట్టుకునే పద్ధతినిబట్టి వారు ఏ సంప్రదాయం ఫాలో అవుతున్నారో తెలిసిపోతుంది. నామాలు రకరకాలుగా ఉన్నప్పుడు సహజంగా అందులో ఏది గొప్ప? ఏది కాదు ? అనే చర్చ ఉండితీరుతుంది. ఆ విషయం ఇక్కడ అప్రస్తుతం. పుణ్యక్షేత్రం తిరుపతిలో మెట్రో రైలుకు శంఖుస్థాపన జరిగింది. పిల్లర్లు మొలిచాయి. ఎవరికి ఐడియా వచ్చిందోగానీ, ప్రతి పిల్లర్ పైన నామాలను చెక్కారు. కొన్నిటికి రంగులు కూడా వేశారు. మంచిదే. రేప్పొద్దున నామాలమీద రైలు పెట్టెలు ప్రయాణం చేస్తాయి. అంటే భక్తుల కాళ్ల కింద నామాలు ఉంటాయి. అది మహాపచారం. వెంటనే నామాలను తొలగించి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి- అని ఒక వివాదాన్ని సృష్టించారు. అంతకు ముందు నామాలు మంచి ఆలోచన అన్నవారు కూడా ఇప్పుడు అనుమానంలో పడ్డారు. చివరికి నామాలు ఉంటాయో? ఉండవో తెలియని సందిగ్ధావస్థ. కర్ణాటక శివమొగ్గ, తుముకూరు ప్రాంతంలో ఒక కథ బహుళ ప్రచారంలో ఉంది. రవాణా సౌకర్యాలు లేనిరోజుల్లో శ్రీ శైలానికి భక్తులు గుంపులు గుంపులుగా కాలినడకన వెళ్లేవారు. ఒక గుంపులోనుండి ఒక భక్తుడు దారితప్పి చీకటివేళ ఒక గ్రామం చేరాడు. ఒక గుడిసె ముందు కాళ్లు బారజాపుకుని ఒక ముసలామె వక్కాకు దంచుకుంటూ ఉంది. ఈ భక్తుడు ఆయాసంగా ఆ ముసలామెను అడిగాడు. శ్రీశైలం వెళ్లాలి. దారి తప్పాను. రాత్రికి ఇక్కడే ఎక్కడయినా పడుకుని తెల్లవారుతుండగా వెళతాను. ఎలా వెళ్లాలి? ఎటు వెళ్లాలి? అని. ముసలామె ఆప్యాయంగా ఇదిగో అటు వైపు శివుడి గుడి మంటపం ఉంది. అక్కడికెళ్లి పడుకుని పొద్దున్నే అక్కడినుండి తూర్పు దారిలో వెళ్ళు అంది. భక్తుడు మంటపానికి వెళుతూ- అవ్వా నువ్వేమీ అనుకోనంటే ఒక విషయం చెబుతా. గుడి వైపు నువ్వు కాళ్ళుజాపి ఉన్నావు. కాళ్ళు ఇంకో వైపుకు తిప్పు అన్నాడు. అవ్వ నవ్వుతూ- శివుడు లేనివైపు చెప్పు అటే కాళ్ళు పెట్టుకుంటా అంది. ఏదో జ్ఞానోదయమయినవాడిలా భక్తుడు వెళ్ళిపోయాడు. పది రోజుల తరువాత శ్రీశైలంలో గుడి గోపురం ముందు భక్తుడికి అదే అవ్వ కనిపించి మాయమయ్యింది. శివుడు లేనిదెక్కడ? అన్న అవ్వ మాట భక్తుడిలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. కథను కొద్దిగా తిరుపతికి మార్చుకుంటే వెంకన్న లేనిదెక్కడ? అని ప్రతిధ్వనించాలి. అప్పుడు నామాలు లేనిదెక్కడ? అని కూడా ప్రతిధ్వనించాలి. భక్తి పైపైన కాకుండా అంతరాంతరాల్లో ప్రతిఫలించాలి. అందుకే- అంతయు నీవే హరి పుండరీకాక్షా! అని అన్నమయ్య అనగలిగాడు. మనం నామం దగ్గరే ఆగి ఉన్నాం.

ఆధునిక తెలుగుసాహిత్యంలో - స్త్రీ

ఆధునిక తెలుగు సాహిత్యంలో సంఘసంస్కరణ, ఆత్మాభిమానం, అస్తిత్వ ప్రకటన మొదయిలన అంశాలు ప్రధానంగా చోటు చేసుకున్నాయి. ప్రాచీన తెలుగుసాహిత్యంలో పురాణహితిహాసాలు, కావ్యప్రబంధాలు ప్రధాన ప్రక్రియలు. మానవ సంబంధాల వ్యాఖ్యాన చరిత్రగా తెలుగులో లిఖిత సాహిత్య చరిత్ర 10 వ శతాబ్ది నుంచి మహాభారత రచనతో ప్రారంభమయింది. కనుక స్త్రీ నిరసనల, ప్రతిఘటనల చరిత్రకు సంబంధించిన విషయాలు కూడా ఆ కాలం నుంచి మాత్రమే లభిస్తాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మహిళల అభివృద్ధి, సాధికారత నేపథ్య అంశాలు తెలుగు సాహిత్యం మీద ప్రభావాన్ని చూపింది. కార్యాచరణతో కూడిన చైతన్యం, లక్ష్య ప్రకటనలో నిర్దిష్టత, లక్ష్య సాధనకు అవసరమయిన సిద్ధాంత భూమికల మీద రచయిత్రులు సాహిత్యాన్ని తీసుకొచ్చారు. సాంకేతికంగా, వైజ్ఞానికంగా పురోభివృద్ధి చెందుతున్న కాలంలో సాహిత్యంలో అనుభూతులే కాకుండా అవసరాలను కూడా పెనవేసుకున్నాయి. చరిత్ర, సమకాలీనత, సామాజికత ఇతివృత్తాలయ్యాయి. సంస్కరణ ఉద్యమంతో పాటే ఆధునిక సాహిత్యం ఆవిర్భవించిది. సంస్కరణోద్యమ ఆశయాలు, లక్ష్యాల ప్రచారానికి సాధనంగా అభివృద్ధి చెందింది. మహిళ సంస్కరణోద్యమాన్ని జగద్వితం చేసిన కందుకూరి వీరేశలింగం 1911లో మరణించారు. ఆయన ప్రోత్సహించిన స్త్రీ విద్యయే స్త్రీలను సామాజిక రంగంలోకి తీసుకొచ్చింది. స్త్రీ విద్య ఉద్యమం, స్త్రీ పునర్వివాహ వుద్యమం కంటే విస్తృత ప్రజామోదం పొందింది. పురుషస్వామ్య సమాజంలో స్త్రీలు బాల్య వివాహాలకు, అవిద్యకు, సహగమనాలకు, నిర్బంధ వైధవ్యాలకు గురి అవుతూ దుర్భరమైన జీవితాలను గడుపుతుంటే ఆ పరిస్థితిని ప్రక్షాళన చేయడానికి పూనుకున్నారు.



కట్టమంచి రామలింగారెడ్డి ఆధునిక యుగప్రారంభంలో(1899) 'ముసలమ్మ మరణం' ఖండకావ్యం రాశారు. ఇది జాతి కోసం సమిష్టి బాధ్యతను వహించాల్సిన అవసరాన్ని, పరోక్షంగా స్వాతంత్రోద్యమంలో ప్రజల్ని భాగస్వాముల్ని చేసే ప్రయత్నంగా వచ్చిన ఆధునిక భావజాలం కలిగిన కావ్యం. అనంతపురం పట్టణం బుక్కరాయ సముద్ర గ్రామం దగ్గర గల చెరువు చరిత్ర ఆధారంగా కట్టమంచి తన కావ్యాన్ని రచించారు. సి.పి. బ్రౌన్ రాసిన అనంతపురం చరిత్రలోంచి కథను తీసుకొని కల్పన చేశారు. ఒకసారి వర్షాలు ఎక్కువగా కురిసి బుక్కరాయ సముద్రం చెరువు నిండిపోయింది. చెరువు కట్ట తెగిపోయే పరిస్థితిలో ఊరిపెద్దలంతా కలిసి పోలేరమ్మకు పొంగళ్ళు పెట్టాలని నిర్ణయించారు. ఊరి ప్రజలంతా చెరువు దగ్గరకు చేరుకొని ఉత్సవం ప్రారంభించారు. అప్పుడు ఆకాశవాణి రైతు బసిరెడ్డి చిన్నకోడలు ముసలమ్మ చెరువుకు బలైపోతే కట్ట తెగదని పలికింది. ముసలమ్మ ఆత్మత్యాగానికి సిద్ధపడింది. భర్తను, అత్తమామలను ఊరి ప్రజలను ఒప్పించింది. తన కొడుకును భర్తకు అప్పగించింది. ప్రజల ఆమోదం తీసుకొని దేవుని స్మరిస్తూ ముసలమ్మ చెరువులో మునిగిపోయింది. సర్ సిఆర్ రెడ్డి 'ముసలమ్మ మరణం' ఖండకావ్యంలోని సారాంశం. ఈ కథాంశం ద్వారా ఆనాటి భారతదేశ స్థితి, జాతీయోద్యమాన్ని దృష్టిలో వుంచుకొని ఆలోచిస్తే ఇది స్త్రీ పాత్ర ద్వారా చెప్పిన సమిష్టి బాధ్యతకు సంబంధించిన కథావస్తువు.



డాక్టర్ జి.కె.డి.ప్రసాద్
ఫ్యాకల్టీ, జర్నలిజంశాఖ
ఆంధ్రవిశ్వకళాపరిషత్,
విశాఖపట్నం.9393111740

ఆధునిక తెలుగు కవిత్వం తొలినాళ్ళ నుంచి ఊరి కోసం, జాతి జనుల కోసం, స్త్రీలే త్యాగం చేయగలరనే విషయాన్ని సి.ఆర్.రెడ్డి తన కావ్యం ద్వారా వ్యక్తం చేశారు.

1912లోనే గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' నాటకం ద్వారా ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాయాలని కాంక్షించారు.1913లో జరిగిన ఆంధ్రమహాసభకు అనుబంధంగా జరిగిన మహిళాసభ స్త్రీ విద్య, ఉద్యోగాల్లో రాజకీయాల్లో ప్రవేశం కోసం చర్చజరిగింది. ''కుటుంబాధికారంపై పితృస్వామిక నీతులపై, సామాజిక స్వభావంపై తిరుగుబాటు చేస్తూ ఆత్మగౌరవ చైతన్యం గల స్త్రీలు చరిత్రను తిరగరాయడం ప్రారంభించారని చలం, కొడవటిగంటి కుటుంబరావులు వారి సాహిత్యం ద్వారా వివరించారు. స్వాతంత్రోద్యమానికి సమాంతరంగా మహిళా సమస్యల మీద వామపక్ష పార్టీలు ఘోషాకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. మహిళల సమస్యల మీద గ్రామస్థాయి నుంచి చైతన్యాన్ని అభివృద్ధి చేయడానికి స్త్రీలను సమీకరించడానికి మహిళాసంఘాలు కృషి చేశాయి.1975 సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళ సంవత్సరంగా ప్రకటించడం ఒక చారిత్రక సందర్భంగా పరిణమించింది. మహిళా ఉద్యమం స్త్రీల దృక్పథంతో కొత్తశక్తితో పునరుజ్జీవనం పొందింది. భారతదేశంలో కుటుంబ వ్యవస్థను పటిష్టంగా రూపొందించడంలో

స్త్రీ పాత్ర ఎంతో నిర్మాణాత్మకమయినదిగా పేర్కోవాలి. స్త్రీల అభ్యుదయాన్ని, అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొన్న సంస్కరణ ఉద్యమాలు స్త్రీలను ఒక నిర్బంధం నుంచి మరొక నిర్బంధంలోకి నెడుతున్నాయనే విషయాన్ని వివరించే సాహిత్యం కొంత వచ్చింది. ఆధునిక యుగంలో వచ్చిన సాహిత్యోద్యమాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్త్రీవాద సాహిత్యానికి దోహదం చేసినవే. తర్వాత కాలంలో వచ్చిన 'స్త్రీవాదం' ఒక సిద్ధాంతంగా రూపొందడానికి మూలం విస్తృత మయిన జీవితానుభవాలు, ఆలోచనలు ప్రపంచం మొత్తం మీద స్త్రీలందరికి సమానంగానే వున్నాయని చెప్పవచ్చు. అయితే వీటిలోని పరిమితుల కారణంగా ఈ ఉద్యమం ప్రత్యేకంగా రావలసిన అవసరం ఏర్పడింది. సంస్కరణోద్యమంలో ఆచారాల పేరిట స్త్రీల పై జరిగే అణచివేత, స్త్రీల విద్య చర్చినీయాంశాలై, ఆ రచయితల మూఢాచారాలను ఖండిస్తూ రచనలు చేశారు. కాల్పనికోద్యమ సాహిత్యంలో వచ్చిన ముఖ్యమయిన మార్పు స్త్రీని భోగదృష్టితో చూసే సాంప్రదాయానికి స్వస్తి చెప్పడం. స్త్రీ శరీర సౌందర్యం కంటే ఆత్మసౌందర్యానికి విలువనివ్వడం అయితే ఈ ఉద్యమం స్త్రీని ఒక మనిషిగా కాక ఒక ఆదర్శంగా వర్ణించింది.

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్ర నుంచి స్త్రీల నిరసనల, ప్రతిఘటనల, చరిత్ర స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి వీలుగా ప్రతినిధి పాత్రలుగా ప్రాచీన సాహిత్యం నుంచి ఆరుగురు స్త్రీలను ఎంచుకోవడం జరిగిందని కాత్యాయనీ విద్మహే పేర్కొన్నారు. వారు 'ప్రద్వేషిణి, గాంధారి, మాంచాల, నింపుణిక, విశాల, కుటుంబాధికార వ్యవస్థలో తమను బాధపెట్టిన ఏ జీవితకోణం పట్లనో కలిగిన క్రోధంతో తమకు తెలిసన పద్ధతుల్లో నిరసన ప్రకటించారని ఆమె వివరించారు. స్త్రీ పురుష సంబంధాలను చలం సామాజిక, కుటుంబిక లైంగిక స్థాయీ బేధాలతో అర్థం చేసుకున్నాడు. సమాజం, కుటుంబం, రాజ్యం పరస్పర సంబంధంలో ఒకే రకమయిన నీతిని, సాంస్కృతిక విలువల్ని వైరుధ్యాలకు తావులేకుండా భిన్న రంగాల నుంచి పరిపోషించే బృహత్ నిర్మాణంలో, ప్రణాళికలో భాగంగా వుండటాన్ని చలం గ్రహించగలిగాడు. 1921 నుంచి 1947 మధ్యకాలంలో ఈ విధమయిన చైతన్యంతో చలం సాహిత్యం సాగింది. సామాజిక, కుటుంబపరమయిన మానవ సంబంధాల నిశిత పరిశీలన నుంచి వాటిని అభివృద్ధికరంగా మార్చుకోవాలన్న ఆకాంక్షతో రూపొందించే సాహిత్యానికి సామాజిక నిర్మాణంలో ప్రముఖ స్థానం వుంటుంది. 1921-1928 మధ్యకాలంలో చలం రాసిన 'శశిరేఖ', 'దైవమిచ్చిన భార్య', 'మైదానం', 'వివాహం' నవలలు రాశారు. ఈ నవల ద్వారా కుటుంబాధికార వ్యవస్థను ధిక్కరించి స్త్రీలు ఆత్మగౌరవానికి, ఆనందానికి, స్వీయ అనుభవానికి, అనుభూతికి ప్రాధాన్యత వున్న లైంగిక సంబంధాలను ఆకాంక్షించి ప్రవర్తించడం చూపించాడు. స్త్రీ పురుష సంబంధాల గురించి చలం సాహిత్యం వ్యాప్తిలోకి తెస్తున్న ఈ నూతన భావజాలాన్ని ఎదుర్కొనడానికి విశ్వనాథ సత్యనారాయణ 1932లో 'చెలియలికట్ట' నవల రాశారు.

కుటుంబాన్ని సనాతన ధర్మానికి ఆలంబనంగాను, స్త్రీ జీవితాన్ని అందుకు అనుబంధంగాను ఆయన చూశాడు. 1935లో రాసిన 'వేయిపడగలు' 'గంగూలీ ప్రేమకథ' మొదలయిన నవలల్లో కుటుంబంలో ఆడపిల్లల పెంపకపు సంస్కృతి, పితృస్వామ్య వ్యవస్థా ధర్మాలకు అవసరమయిన స్త్రీలను తయారు చేయడంగా వుండాలని బలంగా ప్రతిపాదించాడు. సామాజిక, సంప్రదాయక పరిధులు దాటిన లైంగిక సంబంధాలు ప్రళయాన్ని సృష్టిస్తాయని వివరించారు. సంస్కరణోద్యమ ప్రభావాలతోను, చదువుకొనడానికి లభించిన అవకాశాలతోను గురజాడ, చలం మొదలయిన వారి రచనలు చదవడం కారణంగా 1940 నాటికి ఆత్మగౌరవాన్ని ఏదో ఒక రూపంలో అభివ్యక్తీకరించే నూతన తరం స్త్రీలు రూపొందారు. ఈసామాజిక సందర్భానికి అడవిబాపిరాజు నవలలు ప్రాతినిధ్యం వహించాయి. 'తుఫాను' నవలలో హేమకుసుమ సుందరి పాత్ర ద్వారా స్వేచ్ఛ గురించి, హక్కులు, ఆలోచనలు స్త్రీల జీవితంలో తుఫాను రేపుతాయని, వాటి నుంచి బయటపడి తనను తాను రక్షించుకోవడం స్త్రీ చేతిలోని పని అని ఈ నవలలో బాపిరాజు సూచించారు. 1947లో 'ఆడబ్రతుకే మధురం', 1948లో 'ఆడజన్మ' నవల రాసి కొడవటిగంటి కుటుంబరావు మహిళాజీవన సంస్కృతి గురించిన తాత్త్విక దృక్పథాన్ని స్పష్టం చేశారు.

ప్రాచీన సాహిత్యంలో స్త్రీని ఉదాత్తంగాను, చంచల స్వభావురాలిగాను చిత్రీకరించారు. సహనశీలిగా లోపభూయిష్టంగా ఆవిష్కరించారు. వస్తువు, పాత్ర, సన్నివేశం రసనిర్దేశం తప్పనిసరి అయిన ఆ సాహిత్యంలో స్త్రీ స్వభావ చిత్రికరణకు కొన్ని పరిమితులు ఏర్పడ్డాయి. భారతంలో సత్యవతి, కుంతి, గాంధారి, ద్రౌపతి, శకుంతల, దమయంతి, శర్మిష్ఠ, దేవయాని, కద్రువ, వినత; రామాయణంలో కైకేయి, మంథర, సీత, శూర్పణఖ, తార, మండోదరి; భాగవతంలో రుక్మిణి, సత్యభామ, యశోద; ప్రబంధాల్లో వరూధిని, కలభాషిణి, నిగమశర్మ అక్క, గిరిక, సుగాత్రి మొదలయిన పాత్రలు గుర్తుండిపోయే విలక్షణ పాత్రలు. ఆధునిక యుగానికి వస్తే గురజాడ చిత్రించిన పూర్ణమ్మ, బుచ్చమ్మ, మధురవాణి విభిన్న స్వభావం గల పాత్రలు. భావకవిత్వంలో ఊర్వశి, వత్సల, కిన్నెరసాని, యెంకి ప్రణయభావానికి ప్రతీకలుగా నిలిచిపోయారు. స్వాతంత్రోద్యమ కాలంలో స్త్రీలు తమంత తాముగా అన్ని రంగాల్లో ముందుకు రావడానికి ప్రయత్నం చేశారు. ఆధునిక కాలంలో నవలల్లో, కథల్లో మాత్రం స్త్రీ స్వభావం సునిశితంగా చిత్రీకరణ జరిగింది. స్త్రీలు పురోభివృద్ధి దిశగా అడుగులు వేయడం కందుకూరి వీరేశలింగం కాలంలోనే మొదలయింది. కాని స్త్రీ స్వభావాన్ని అధ్యయనం చేయడం, వారి అంతరంగంలోకి తొంగి చూడటం చలంతో ప్రారంభమయింది. ఆ నేపథ్యం నుంచి అమీనా, రాజేశ్వరి వంటి స్త్రీ పాత్రలను సృష్టించి స్త్రీ స్వభావాన్ని లైంగిక స్వేచ్ఛ అనే కోణం నుంచి చిత్రించాడు. దీనిని ఖండిస్తూ విశ్వనాథ సత్యనారాయణ స్త్రీ స్వభావాన్ని సాంప్రదాయ దృష్టి కోణంతో చిత్రీకరించాడు. అటు చలం, ఇటు విశ్వనాథ సత్యనారాయణ ఇద్దరూ స్త్రీకి పురుషునితో సమానమయిన గౌరవప్రదమయిన స్థానాన్ని కల్పించలేకపోయారని డాక్టర్ పి. సుమతీ నరేంద్ర పేర్కొన్నారు. గోపిచంద్, బుచ్చిబాబులు కూడా పురుషుల మనస్తత్వాలను అధ్యయనం చేసినట్టుగా స్త్రీల మనస్తత్వాన్ని అర్థం చేసుకోలేదని ఆమె వ్యాఖ్యానించారు.

ఉద్యోగ రంగంలో స్త్రీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే ప్రదేశాల్లో వారు వివిధ రకాలుగా హింసకు గురవుతున్నారు. అనేక అనుభవాలను చవి చూడాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్ని నలిగిపోయే స్త్రీల స్వభావాన్ని చిత్రించిన ఘనతను మాలతీచందూర్, వాసిరెడ్డి సీతాదేవి, అరవింద ఆనందారామం మొదలయిన రచయిత్రులకు దక్కుతుంది. మహిళల అంతరంగాన్ని సునిశితంగా ఆవిష్కరించిన ప్రతిభ వీరి

సొంతమని చెప్పవచ్చు. ''తెలుగుసాహితీ క్షేత్రంలో సార్వకాలికమయిన సమ్మోహనశక్తితో నిలబడగలిగిన అక్షరాలు రెండే రెండు అవి 'అమ్మ'. నిత్య నైమిత్తకాలాల్లో మానవుడు అమ్మను ఎన్ని రూపాల్లో తలచుకుంటాడో, స్తుతిస్తాడో చెప్పలేం. 'మాతృదేవో భవ'తో ప్రారంభమయ్యే బాలకాండ మనిషి బావి జీవితాన్ని తీర్చిదిద్దే పెదబాలశిక్ష!. శిశువుకు పాలివ్వడంతోనే తన కర్తవ్యం పూర్తయిందని తల్లి అనుకోదు. అనుభవాల ఆస్తులు పంచు తుంది. అనురాగాలను వారసత్వంగా అందేజేస్తుంది. అందుకే పోతనామాత్యుడు 'అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూల పుటమ్మ' అమ్మలో కవులు దేవిని చూశారు. శారదాదేవిని చూశారు. భారత మాతను దర్శించారు, తెలుగుతల్లిని ఆవాహన చేశారని ప్రముఖ సంపాదకులు ఎబికె ప్రసాద్ 'అమ్మ' సవితాసంకలన సమీక్షలో పేర్కొన్నారు. స్త్రీలు రాస్తున్న కవిత్వాన్ని స్త్రీవాద కవిత్వంగా పరిగణించి విమర్శకు తీసుకెళ్లిన వారు చేకూరి రామారావు. తొలిసారిగా ఆడవారు రాసిన కవిత్వంలో కొన్నింటిని ఏరి వాటిని స్త్రీవాద కవిత్వంగా పరిచయం చేస్తూ తొలిసారి సంకలనంగా అచ్చు వేసిన ప్రచురణకర్త త్రిపురనేని శ్రీనివాస్. ఇక ఏ కవయిత్రి రాసిన కవిత్వానైనా ఫెమినిస్టు కవిత్వంగా మాట్లాడటం ఆనవాయితీ అయింది. స్త్రీవాద దృక్పథం కలిగిన కవిత్వానికీ, స్త్రీల అనుభవాల్నీ మాత్రమే చిత్రించిన కవిత్వానికీ మధ్య తేడా తెలియకుండా పోయింది. స్త్రీ వాద దృక్పథం అనగా స్త్రీల జీవితాల్లోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాలని పురోగామి దిశగా మలుపు తిప్పగల దృక్పథం అని అర్థం. ఈ దృక్పథం కలిగిన సాహిత్య ప్రక్రియ ఏదైనా, స్త్రీవాద సాహిత్యం అవుతుంది. స్త్రీల సాహిత్యంలో వారి జీవితాల్లోని సంక్లిష్టతా, వైరుధ్యాలు వ్యక్తమవుతాయి. బలమయిన కవితా ధోరణితో శక్తివంతమయిన శైలిలో ప్రపంచంలోనే తెలుగు సాహిత్యానికి ఒక ప్రత్యేకతనీ, విశిష్టతనీ కవయిత్రులు తీసుకొచ్చారు. దీనిని తెలుగు సాహిత్య విమర్శ గుర్తించి గౌరవించింది. స్త్రీవాద సాహిత్యం 90వ దశకం నుంచి మొదలయింది. స్త్రీ విముక్తికి సోషలిజమే మార్గమని నమ్మినా; స్త్రీ సమస్యలపై వామపక్ష ఉద్యమాలకు సరైన అవగాహన లేదంటూ, ఒకవేళ వున్నా ఆచరణలో విఫలమవుతున్నారంటూ వచ్చిన ఆరోపణల నుంచి స్త్రీవాద సాహిత్యం మొదలయింది. పెట్టుబడిదారీ విధానం గల పాశ్చాత్య దేశాల్లో అవసరం మేరకు స్త్రీలను ఉత్పత్తిరంగంలోకి తీసుకురావడం వల్ల మహిళల్లో కొంత వికాసం జరిగింది. మన దేశం విషయానికొస్తే 70 శాతం మంది చదువు కోనివారు; 80 శాతం గ్రామాల్లో నివసిస్తున్నవారు కావడం వల్ల మహిళ చైతన్యం నామమాత్రంగానే వుంది. స్త్రీల పరిస్థితులను, సమస్యలను వివరించడానికి, చర్చించడానికి ఫెమినిస్టులు ఇంగ్లీషు, హిందీలో 'మానుషి', సంఘర్ష్ పత్రికలను, బెంగాలీ భాషలో 'సచేల'; మరాఠీలో 'మిలాన్ సర్వాజని' తెలుగులో స్త్రీ స్వేచ్ఛ', 'భూమిక' పత్రికలను ప్రచురిస్తున్నారు. స్త్రీ ఉద్యమాన్ని, స్త్రీ వాద సాహిత్యాన్ని భారతీయ పత్రికలు, రేడియో, టివిలు మంచి ప్రచారాన్ని ఇస్తున్నాయి. స్త్రీ ఉద్యమాల ప్రభావం వల్లనో, ప్రచార సాధనాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్లనో ఇటీవల ఆడపిల్లల తల్లిదండ్రుల మనస్తత్వాల్లో కొంతమార్పు కనిపిస్తుంది.

తెలుగు మహిళా మణిపూసలు

- తొలినాటి పాత్రికేయ మహిళా మణిపూస వింజమూరి వెంకటరత్నమ్మ. 1914లో అనసూయ అనే పత్రికను స్వీయ సంపాదకత్వంలో ప్రారంభించారు. అది మహిళల మాసపత్రిక.
- తొలి తరం మహిళా సంపాదకురాలుగా వులుగుర్త లక్ష్మీనరసమాంబ 1904 జనవరిలో సావిత్రి అనే పేరుతో మహిళలకోసం ఒక పత్రికను ప్రారంభించిన తెలుగు మాతృమూర్తి. ఆ పత్రిక హైదరాబాదు స్టేట్ ఆర్కైవ్స్‌లో ఉంది. మరొకటి రాజమండ్రి గౌతమి గ్రంథాలయంలో ఉంది.
- తెలుగు సినిమా రంగానికి మణిపూస లభించింది ఆమెది స్వరపేటిక కాదు సర్వ పేటిక, ఆ గొంతులో ఇమడని రాగం లేదు. పలకని పాట లేదు. ఆమె శిష్టా (ఎస్) జానకి.
- నటిగా అత్యున్నత కీర్తి శిఖరాలనధిరోహించిన ఆమె కంట కన్నీరు కారిస్తే మన కంట నీరు వస్తుంది. ఆమె నవ్వుతే మన పెదవులు ఆనందంతో విచ్చుకుంటాయి. ఆమె రోదిస్తే మన హృదయం తరుక్కుపోతుంది. అంతగా తన నటనతో ప్రేక్షకుల్ని తన పాత్రలో విలీనం చేసుకున్న మేటినటి.. ఆమే మహా నటి సావిత్రి.

తరతరాలుగా ఇదే కుల ఆచారం





మెదక్ పాత బస్‌స్టాండ్ నుండి కిలోమీటరు దూరంలో గిద్దకట్ట సమీపంలో గుట్టల మధ్య ఉన్న చిక్కటి అడవిలాంటి స్మశాన వాటికలోకి మేం అడుగు పెట్టగానే నలుగురు మహిళలు బొంద తవ్వుతూ కనిపించారు. చనిపోయిన వారి అంత్యక్రియలు జరపడమే వీరి జీవనోపాధి. ఇది బ్యాగరి మహిళలకు తరతరాలుగా వచ్చిన కుల ఆచారం.

"ఆస్పత్రుల దగ్గర అనాథ శవాలను తీయాలన్నా మేమే పోవాలి. కుళ్లిన శవాల దగ్గరకు మమ్మల్నేపిలుస్తారు. మా బతుకంతా శవాల మధ్యనే. భరోసా లేని బతుకులు మావి" అని గోతిని తవ్వడం ఆపకుండానే చెప్పింది బ్యాగరి లచ్చిమి. గిద్దకట్టలోని స్మశాన వాటిక సమీపంలో ఆరు కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరిలో పన్నెండుమంది మహిళలకు అంత్యక్రియలు జరపడమే వృత్తి. వీరు తమను తాము బ్యాగరోళ్లుగా చెప్పుకుంటారు. ఇక్కడి ప్రజలు కూడా అలాగే పిలుస్తారు. అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్లన్నిటినీ వీరే పూర్తి చేస్తారు. ఒక ఫోన్ కాల్ చేస్తే చాలు.. అవసరమైన సామగ్రినంతటినీ సిద్ధం చేసుకుంటారు. బంధువులు శవానికి తలకొరివి పెట్టి వెళ్లిపో తారు. మిగతా పనంతా ఈ ఆడవాళ్లే దగ్గరుండి చూసుకుంటారు.

ఇంత చేస్తున్నా వీళ్లకు నెలకు దక్కే ఆదాయం 2,000 రూపాయలు కూడా ఉండదు. "మృతుల అంత్య సంస్కారాలకు వచ్చిన వారు ఏమైనా ఇస్తే ఇవ్వవచ్చు లేదా ఇవ్వకుండా వెళ్లిపోవచ్చు. గ్యారంటీ లేదు" అని వీరంటారు. అయితే అంత్యక్రియల్లో తామూ పాలు పంచుకున్నామనే తృప్తి మిగులుతోందంటారు. నిలువ నీడా లేదు...

కొండల మధ్య అడవిలా ఉన్న బొందల గడ్డ దిగువన రహదారి పక్కన పూరిళ్లలో ఈ బ్యాగరి కుటుంబాలు జీవించేవి. విద్యుత్, నీళ్లు, మరుగుదొడ్లు లాంటి కనీస సదుపాయాలు లేవు. స్మశానంలో నుండి నీళ్లు తెచ్చుకొని వాడుకునే వారు.

రెండేళ్ల కిందట వీరుంటున్న పూరిళ్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. అప్పటి నుంచి వీరికి నిలువ నీడ లేదు. ప్రభుత్వం పట్టించుకోలేదు. సమీపంలో చిన్న గదుల్లో ఇరుకిరుగ్గా జీవిస్తున్నామని యాదమ్మ, శైలజ చెప్పారు. ఇదే పనిలో 800 కుటుంబాలు

"మెదక్ పట్టణంలో దాదాపు 48,000 జనాభా ఉంది. అన్ని కులాలు, వర్గాల వారికీ ఇదే స్మశానం. ఎవరు పోయినా మేమే అంతిమ సంస్కారాలు చేయాలి. మా అమ్మ, చిన్నమ్మ, తోబుట్టువులు ఇదే పనిచేసి బతుకుతున్నారు. అంత్యక్రియల సమయంలో బండలు మోయడం లాంటి బరువు పనులు మగవాళ్లు చేస్తారు.

మెదక్ జిల్లాలో 800 బ్యాగరి కుటుంబాలు ఇదే వృత్తిలో ఉన్నాయి. కానీ, మా సమస్యలను ఎవరూ పట్టించుకోరు. ఆస్పత్రుల్లో కుళ్లిన శవాలను తీయడానికి మేమే పోవాలి. కానీ, మాకు రోగాలు వచ్చి, అదే ఆస్పత్రికి పోతే మమ్మల్ని చాలా హీనంగా చూస్తారు" అని ఆవేదన వ్యక్తం చేశాడు బ్యాగరి యాదగిరి.

అతడు ఐటీఐ వరకూ చదివాడు. కానీ ఏ ఉద్యోగం రాక స్మశానంలో మహిళలకు పనుల్లో సాయంగా ఉన్నాడు. అందివచ్చిన ఉద్యోగం దక్కలేదు "ఇంటర్మీడియట్ చదివాను. అప్పట్లో అటెండర్‌గా ఉద్యోగం వచ్చింది. కానీ రెండు వేలు లంచం అడిగారు. అదిచ్చే స్తోమత లేక ఈ వృత్తిలోనే కొనసాగుతున్నాను. రాములును ప్రేమించి పెళ్లాడాను. మాకు ముగ్గురు పిల్లలు. కష్టమైనా నష్టమైనా ఇదేపని చేసుకొని బతుకుతున్నాను. నా ఇల్లు కాలిపోయినపుడు నా సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు అందులో బూడిదయ్యాయి. ఇప్పటి వరకు మాకు నీడ లేదు. ఇదే స్మశానంలో వాచ్‌మన్ గదిలో తల దాచుకుంటున్నాం" అని బ్యాగరి సుజాత వివరించారు. అమెకిపుడు అరవై అయిదేండ్లు. ఒకసారి బొంద తవ్వుతుంటే ప్రమాదం జరిగి కాలు విరిగింది. ఇప్పటికీ కుంటుతూనే పనులు చేస్తున్నారామె.

"విజయశాంతి ఎంపీగా ఉన్నపుడు మాకు ఇంటిస్థలాలు ఇస్తామన్నది. కానీ ఇప్పటికీ నెరవేరలేదు" అని చెప్పారు సుజాత కూతురు బ్యాగరి నాగరాణి. ఆమె ఏడో తరగతి వరకూ చదువుకున్నారు. ఇదే వృత్తిలో ఉన్నారు. ఊరికి దూరంగా ఉండాలి...

"మాకు రాత్రింబవళ్లు లేవు. ఎవరు ఎపుడు చనిపోయినా ఆ శవం దగ్గర ఉండాల్సి వస్తుంది. అందరూ మాతో సేవలు చేయించుకుంటారు తప్ప మా బాధలు ఎవరూ పట్టించుకోరు."

"అందరిలా మాకు సమాజంలో సమాన గౌరవం ఉండదు. అంత్యక్రియలు చేసుకునే బ్యాగరోళ్లమని దూరంగా ఉంచుతారు. అశుభకార్యాలకు తప్ప శుభకార్యాలకు పిలవరు. కొందరు పిలిచినా అందరూ తిన్న తరువాత ఆఖరున మాకు భోజనం పెడతారు" అని చెప్పారు బ్యాగరి అన్నమ్మ. వీరిలో అందరూ పదో తరగతి నుండి ఇంటర్ వరకు చదువుకున్నవారే. మరో పనిచేయడానికి కుల కట్టుబాటు అడ్డురావడంతో ఇదే పనిలో కొనసాగుతున్నారు. మనం ఒక చెత్తకుప్ప దగ్గర నిమిషం కూడా ఉండలేం. వీరు కుళ్లిన శవాల దగ్గర కొన్ని గంటల పాటు ఉండాల్సి వస్తోంది. అలాంటి వీరికి వంద రూపాయల ఆదాయం కూడా రావడంలేదు. విషాదంలో ఉన్న వారిని వీరు డిమాండ్ చేయలేరు. కొన్నిసార్లు ఉచితంగానే అంత్యక్రియలు చేస్తారు.

వేటూరి వైభవం



- కొడుకుల వాసుశ్రీ

యధాలాపంగా టీవీ ఛానెళ్ళు మారుస్తుంటే ప్రేమించు పెళ్ళాడు సినిమాలో "ఈ చైత్రవీణా" పాట వస్తోంది. నిజంగా అది త్రివేణీ సంగమం కాదు ద్వి త్రి వేణి సంగమం.

వేటూరి రచన... ఇళయరాజ సంగీతం..బాలు స్వరమాధుర్యం.. జానకమ్మ కోకిల గానం.. వంశీ చిత్రీకరణ... భానుప్రియ రాజేంద్రప్రసాద్ ల అభినయం. వెరశి వెండితెరపై ఓ సుందరకావ్యం. పాట ఎత్తుకోవడమే ఈ చైత్రవీణ అన్నారు వేటూరి.

చైత్ర వసంత పంచమి నాడు పుట్టింది ఆ వీణాపాణి శారదాంబ.

ఆమె అక్షరం... ఆమె అక్షయం... ఆమె గీర్వాణి... ఆమె సకల శాస్త్రాలకూ రారాణి

ఆమె జ్ఞానం.. ఆమె సర్వవిద్యలకూ మూలం...

వాల్మీకి నోట ఆది కావ్యాన్ని పలికించిన తల్లి ఆమె.

వ్యాసభగవానుడి చేత ఆపార సాహిత్యాన్ని రాయించిందీ ఆ తల్లే.

యాజ్ఞవల్క్యుడు, ఆదిశంకరులు, ఆదిశేషువు, బృహస్పతి అందరూ ఆమె అనుగ్రహంతోనే అనంతమైన జ్ఞానాన్ని వరప్రసాదంగా అందుకున్నారు.

ఆ తల్లి సరస్వతి..

అమ్మ చేతిలో వీణ సంగీతానికి ప్రతిరూపం. ఈ వీణ పేరు 'కచ్ఛపి'. చదువంటే కేవలం పుస్తకాల్లో ఉండేది మాత్రమే కాదు. కళలన్నీ చదువులో భాగమే. కళాకారుడు అత్యుత్తమ సంస్కారం, ఆత్మీయత కలిగి ఉంటాడు. మనుషులందరూ ఇలాంటివారు కావాలని సరస్వతి చేతిలోని వీణ చెబుతుంది. అందులో ఏడుతంత్రులు ఉంటాయి. వీటిద్వారా నాదం ఉత్పత్తి అవుతుంది. మనం చూసే ప్రపంచమంతా నాదమయం. పరమేశ్వరుడు నాదస్వరూపుడు. కాబట్టి, పరమేశ్వరుడిని చేరుకోవాలంటే నాదోపాసన చెయ్యాలన్న సందేశం కూడా సరస్వతీదేవి చేతిలోని వీణ చెబుతుంది.

అలాంటి చైత్రవీణ ఝుంఝుం అందట.

అది కూడా ఎలా రొదలా నా ఎదలో తుమ్మెదలాట. తుమ్మెద ఎగురుతున్నప్పుడు ఓ రకమైన గంభీరమైన శబ్దం వస్తుంది. దాన్నే రొద అంటాం కూడా. అలా ఈ జంట గుండెల్లో ప్రేమ అనే ఆలాపన తుమ్మెద ఝుంకారంలా ధ్వనిస్తోందట. ఎంత చక్కని భావం.

ఇక చరణంలో

విడిపోలేని విరితీవలలో

కురులే మరులైపోతుంటే..

పువ్వుల తీగలు లో లతలు చిక్కుకొని విడదీయడం కష్టమే. ఆమె కురులు లతలైతే

వారి ప్రేమ మరులై విడదీయలేనంత గాఢంగా పెనవేసుకుందట.అని హీరో అంటే.. బదులుగా నాయకంటుంది..

ఎడబాటేది ఎదలోతులలో

అదిమే వలపే పుడుతుంటే అంటుంది.

ఈ విరహాలు ఎడబాటులు మనుషులకే కానీ ఎదలో ఉన్న ప్రేమకి కాదట. విడదీద్దామని ప్రేమజంటని ఎంతగా వేధిస్తే మరింత ప్రేమ బలపడుతుందట. సినిమాలో వీరి ప్రేమను పెద్దలు అంగీకరించరు.

అదీ సంగతి.. ఇక పాట అంతటికీ హైలెట్ బిట్

తనువు తనువూ తరువు తరూవై..

అంటాడు. తనువు అంటే దేహం..తరువు అంటే చెట్టు..దేహం దేహం పెనవేసుకుంటాయి..కాని చెట్టు చెట్టు ఎలా? అందుకే తనూవూ అన్నారు. చెట్లకీ లతలు పెనవేసుకుంటాయి. అడవుల్లో కనిపిస్తాయి. చెట్టంతా లతలే కమ్మేస్తాయి. మనకీ ఒక్కో దగ్గర కరెంట్ స్థంబాలకీ చూడండి పాదు మొక్కలు చుట్టేస్తాయి. పోలుకూడా కనపడదు. అలా

మన తనువులు తనూవులా ఏకమై పోవాలని హీరో ఆకాంక్ష. అలాంటి ప్రణయ వేళ "పుప్పొడి ముద్దే" పెడుతుంటే అంటాడు. ముద్దు తెలుసు కానీ ఈ పుప్పొడి ముద్దు ఏంటో? పుస్తకాలు తిరగేసి మరగేసి మధిస్తే నాకు బోధ పడిందేంటంటే..

పువ్వులలో మధ్యన పుప్పొడి ఉంటుంది. అండోత్పత్తికీ ఫలదీకరణకి ఉపయోగపడుతుంది. ఇది రేణువుల రూపంలో మెత్తని పొడిలా తావికి అంటుకొని ఉంటుంది. గాలిలో ఈ పుప్పొడి రేణువులు ప్రయాణించి

వేరే పువ్వు పుప్పొడిలో కలుస్తాయి. పరాగ సంపర్కం అంటారు. అలాగే తుమ్మెదలు తేనిటీగల ద్వారా కూడా పుప్పొడి పరాగ సంపర్కం జరుగుతుంది. తేనెటీగ పువ్వులో మకరందం తాగడానికి వాలినప్పుడు దాని బరువుకి ఝీకాంరానికి

సుతిమెత్తని ఈ పుప్పొడి తేనటీగకి అంటుకుంటుంది. ఒక్కో సారీ తేనటీగ మొత్తం ఈ పుప్పొడి రేణువులలో మునిగిపోతుంది అలా నాయక మొత్తం కరిగిపోయి హీరోని కమ్మేసాలా ముద్దుపెట్టాలట. అదీ పుప్పొడి ముద్దు అంటే. ఇప్పుడు తెలిసింది కదా వేటూరిని అపర శృంగార శ్రీనాధుడు అని ఎందుకంటారో!!!

ఇలా చెట్టుని లత పెనవేసీకున్నట్లు పుప్పొడి ముద్దు పెడుతున్న వేళ మిగిలిన సుమాలు గంధం పూస్తున్నాయట

వహ్ వా వేటూరి సాహెూ

తొలిగా నా చెలితో కౌగిలిలో సాగే ప్రేమారాధన...తొలి చుంబనం అన్నమాట.

ఇక రెండో చరణంలో

నదులై సాగే రుతుశోభలలో

అభిషేకించే మకరందం

అంటే వసంత రుతువులోనే కాదు శిశర వర్ష శరదృతువులలో కూడా తేనిటీగలు పువ్వులలో తేనే సంగ్రహిస్తాయి

అలాంటి తియ్యని తేన ఏకంగా ఏరులా పారీతోందట!

గగనం భువనం కలిసే సొగసే..సంధ్యారాగం అనిపిస్తే....

నింగి నేల కలవవు కలిసినట్లు సంధ్యాసమయాలలో కనిపిస్తాయి. కథ పరంగా నాయికానాయకుల పరిస్థితి అది.

వనమే...యవ్వనమై

జీవనమై రాధాలాపన అంటుంది. ఇక్కడ జానకమ్మ గొంతులో వైవిధ్యం అనితర సాధ్యం.

సరస్వతి అనే శబ్దానికి ప్రవాహం అనే అర్థం కూడా ఉంది. ప్రవాహం అంటే నిరంతరం సాగిపోయే చైతన్యం. సాధారణంగా జలం నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. జలం జీవశక్తికి సంకేతం. దాన్నుంచే అన్ని జీవులకూ శక్తి అందుతోంది. తద్వారా ప్రకృతిలో ఉత్పాదకత జరుగుతోంది. ఈ ఉత్పాదకతకు ప్రతిఫలమే సరస్వతి

అటువంటి సరస్వతీ పుత్రుడు వేటూరి.

జానకీ కన్నుల జలధి తరంగం

రాముని మదిలో విరహ సముద్రం,

చేతులు కలిసిన సేతు బంధనం-ఆ

సేతు హిమాచల ప్రణయ కీర్తనం,

సాగర సంగమమే ప్రణవ సాగర సంగమమే."

అని కన్యాకుమారి ఒడ్డున కూర్చొని రాసాడు

శయ్యలలో కొత్త వయ్యారమొలికె

శరదృతు కావేరిలా కొంత సాగి' వంటి ప్రకృతి వర్ణనలతో 'ఆనందభైరవి చిత్రంలోను

రాసిన మహనీయుడు

ముక్కుపచ్చలారని కుర్రబెంగల లేత గుండెల చప్పుడు వినిపించాలని ఇవాళ ఎవరనుకుంటున్నారు! అసూర్యంపశ్యల పరువాల పాల పొంగుల కెరటాల పవళించిన..వటపత్రశాయిగా పవళించిన.. బాలకృష్ణుడెవరిక్కావాలి? జయదేవుడి పదప్రయోగం ఏ శృంగారమహస్సు నుంచి కణకణలాడుతూ ఎగసివచ్చి కవితగా రగిలిందో హుతాశరనతల్పం వంటి ప్రయోగాలు,వాటిలో ఉన్న పద అర్థ వర్ణ శబ్ద విన్యాసాలు చెబితే వినేవారెవ్వరు...

అర్థంకానివాళ్ళకో ప్రశ్నార్థకం, అర్థమైన వాళ్ళకో అనుబంధం. ఈ లోకంలో ఎందరో పిచ్చాళ్ళున్నారు. డబ్బు, పదవి, కీర్తి, కాంత, కనకం, ప్రేమ, సినిమా, మంచితనం, తిండి ఇలా ఎవరికి తోచిన పిచ్చిలో వాళ్ళు మునిగి తేలుతుంటారు.

ఎవరేమనుకున్నా

నేను మాబావ గంటి మురళీ మా మిత్రబృందం వేణు దాసు రాధాకృష్ణ మరికొందరు వేటూరి పిచ్చోళ్ళం.అంతే.వేటూరి వైభవం

కొదుకుల వాసుశ్రీ

యధాలాపంగా టీవీ ఛానెళ్ళు మారుస్తుంటే ప్రేమించు పెళ్ళాడు సినిమాలో "ఈ చైత్రవీణా" పాట వస్తోంది. నిజంగా అది త్రివేణీ సంగమం కాదు ద్వి త్రి వేణి సంగమం.

వేటూరి రచన... ఇళయరాజ సంగీతం..బాలు స్వరమాధుర్యం.. జానకమ్మ కోకిల గానం..వంశీ చిత్రీకరణ... భానుప్రియ రాజేంద్రప్రసాద్ ల అభినయం. వెరశి వెండితెరపై ఓ సుందరకావ్యం. పాట ఎత్తుకోవడమే ఈ చైత్రవీణ అన్నారు వేటూరి.

చైత్ర వసంత పంచమి నాడు పుట్టింది ఆ వీణాపాణి శారదాంబ.

ఆమె అక్షరం... ఆమె అక్షయం... ఆమె గీర్వాణి... ఆమె సకల శాస్త్రాలకూ రారాణి

ఆమె జ్ఞానం.. ఆమె సర్వవిద్యలకూ మూలం...

వాల్మీకి నోట ఆది కావ్యాన్ని పలికించిన తల్లి ఆమె.

వ్యాసభగవానుడి చేత అపార సాహిత్యాన్ని రాయించిందీ ఆ తల్లే.

యాజ్ఞవల్క్యుడు, ఆదిశంకరులు, ఆదిశేషువు, బృహస్పతి అందరూ ఆమె అనుగ్రహంతోనే అనంతమైన జ్ఞానాన్ని వరప్రసాదంగా అందుకున్నారు.

ఆ తల్లి సరస్వతి..

అమ్మ చేతిలో వీణ సంగీతానికి ప్రతిరూపం. ఈ వీణ పేరు 'కచ్ఛపి'.



చదువంటే కేవలం పుస్తకాల్లో ఉండేది మాత్రమే కాదు. కళలన్నీ చదువులో భాగమే. కళాకారుడు అత్యుత్తమ సంస్కారం, ఆత్మీయత కలిగి ఉంటాడు. మనుషులందరూ ఇలాంటివారు కావాలని సరస్వతి చేతిలోని వీణ చెబుతుంది. అందులో ఏడుతంత్రులు ఉంటాయి. వీటిద్వారా నాదం ఉత్పత్తి అవుతుంది. మనం చూసే ప్రపంచమంతా నాదమయం. పరమేశ్వరుడు నాదస్వరూపుడు. కాబట్టి, పరమేశ్వరుడిని చేరుకోవాలంటే నాదోపాసన చెయ్యాలన్న సందేశం కూడా సరస్వతీదేవి చేతిలోని వీణ చెబుతుంది.

అలాంటి చైత్రవీణ ఝుంఝుం అందట.

అది కూడా ఎలా రొదలా నా ఎదలో తుమ్మెదలాట. తుమ్మెద ఎగురుతున్నప్పుడు ఓ రకమైన గంభీరమైన శబ్దం వస్తుంది. దాన్నే రొద అంటాం కూడా. అలా ఈ జంట గుండెల్లో ప్రేమ అనే ఆలా పన తుమ్మెద ఝుంకారంలా ధ్వనిస్తోందట. ఎంత చక్కని భావం.

ఇక చరణంలో విడిపోలేని విరితీవలలో

కురులే మరులైపోతుంటే..

పువ్వుల తీగలు లో లతలు చిక్కుకొని విడదీయడం కష్టమే. ఆమే కురులు లతలైతే

వారి ప్రేమ మరులై విడదీయలేనంత గాఢంగా పెనవేసుకుందట.అని హీరో అంటే..బదులుగా నాయకంటుంది..

ఎడబాటేది ఎదలోతులలో

అదిమే వలపే పుడుతుంటే అంటుంది.

ఈ విరహాలు ఎడబాటులు మనుషులకే కానీ ఎదలో ఉన్న ప్రేమకి కాదట. విడదీద్దామని ప్రేమజంటని ఎంతగా వేధిస్తే మరింత ప్రేమ బలపడుతుందట. సినిమాలో వీరి ప్రేమను పెద్దలు అంగీకరించరు.

అదీ సంగతి.. ఇక పాట అంతటికీ హైలెట్ బిట్

తనువు తనువూ తరువు తరూవై..

అంటాడు. తనువు అంటే దేహం..తరువు అంటే చెట్టు..దేహం దేహం పెనవేసుకుంటాయి..కాని చెట్టు చెట్టు ఎలా? అందుకే తనూవూ అన్నారు. చెట్లకీ లతలు పెనవేసుకుంటాయి. అడవుల్లో కనిపిస్తాయి.చెట్టంతా లతలే కమ్మేస్తాయి. మనకీ ఒక్కో దగ్గర కరెంట్ స్ధంబాలకీ చూడండి పాదు మొక్కలు చుట్టేస్తాయి. ఫోలుకూడా కనపడదు. అలా మన తనువులు తనూవులా ఏకమై పోవాలని హీరో ఆకాంక్ష. అలాంటి ప్రణయ వేళ "పుప్పోడి ముద్దే" పెడుతుంటే అంటాడు. ముద్దు తెలుసు కానీ ఈ పుప్పొడి ముద్దు ఏంటో? పుస్తకాలు తిరగేసి మరగేసి మధిస్తే నాకు బోధ పడిందేంటంటే..

పువ్వులలో మధ్యన పుప్పొడి ఉంటుంది. అండోత్పత్తికీ ఫలదీకరణకి ఉపయోగపడుతుంది. ఇది రేణువుల రూపంలో మెత్తని పొడిలా తావికి అంటుకొని ఉంటుంది. గాలిలో ఈ పుప్పొడి రేణువులు ప్రయాణించి వేరే పువ్వు పుప్పొడిలో కలుస్తాయి. పరాగ సంపర్కం అంటారు. అలాగే తుమ్మెదలు తేనిటీగల ద్వారా కూడా పుప్పొడి పరాగ సంపర్కం జరుగుతుంది. తేనెటీగ పువ్వులో మకరందం తాగడానికి వాలినప్పుడు

దాని బరువుకి ఝీకాంరానికి

సుతిమెత్తని ఈ పుప్పొడి తేనటీగకి అంటుకుంటుంది. ఒక్కో సారీ తేనటీగ మొత్తం ఈ పుప్పొడి రేణువులలో మునిగిపోతుంది.

అలా నాయక మొత్తం కరిగిపోయి హీరోని కమ్మేసాలా ముద్దుపెట్టాలట. అదీ పుప్పొడి ముద్దు అంటే. ఇప్పుడు తెలిసింది కదా వేటూ రిని అపర శృంగార శ్రీనాధుడు అని ఎందుకంటారో!!!

ఇలా చెట్టుని లత పెనవేసీకున్నట్లు పుప్పొడి ముద్దు పెడుతున్న వేళ మిగిలిన సుమాలు గంధం పూస్తున్నాయట

వహ్ వా వేటూరి సాహెూ

తొలిగా నా చెలితో కౌగిలిలో సాగే ప్రేమారాధన…తొలి చుంబనం అన్నమాట.

ఇక రెండో చరణంలో

నదులై సాగే రుతుశోభలలో

అభిషేకించే మకరందం

అంటే వసంత రుతువులోనే కాదు శిశర వర్ష శరదృతువులలో కూడా తేనిటీగలు పువ్వులలో తేనే సంగ్రహిస్తాయి

అలాంటి తియ్యని తేన ఏకంగా ఏరులా పారీతోందట!

గగనం భువనం కలిసే సొగసే..సంధ్యారాగం అనిపిస్తే....

నింగి నేల కలవవు కలిసినట్లు సంధ్యాసమయాలలో కనిపిస్తాయి. కథ పరంగా నాయికానాయకుల పరిస్థితి అది.

వనమే…యవ్వనమై

జీవనమై రాధాలాపన

అంటుంది . ఇక్కడ జానకమ్మ గొంతులో వైవిధ్యం అనితర సాధ్యం.

సరస్వతి అనే శబ్దానికి ప్రవాహం అనే అర్థం కూడా ఉంది. ప్రవాహం అంటే నిరంతరం సాగిపోయే చైతన్యం. సాధారణం గా జలం నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. జలం జీవశక్తికి సంకేతం. దాన్నుంచే అన్ని జీవులకూ శక్తి అందుతోంది. తద్వారా ప్రకృతిలో ఉత్పాదకత జరుగుతోంది. ఈ ఉత్పాదకతకు ప్రతిఫలమే సరస్వతి

అటువంటి సరస్వతీ పుత్రుడు వేటూరి.

జానకీ కన్నుల జలధి తరంగం

రాముని మదిలో విరహ సముద్రం,

చేతులు కలిసిన సేతు బంధనం – ఆ

ఎ

సేతు హిమాచల ప్రణయ కీర్తనం,

సాగర సంగమమే ప్రణవ సాగర సంగమమే.”

అని కన్యాకుమారి ఒడ్డున కూర్చొని రాసాడు

శయ్యలలో కొత్త వయ్యారమొలికె



శరదృతు కావేరిలా కొంత సాగి' వంటి ప్రకృతి వర్ణనలతో 'ఆనందభైరవి చిత్రంలోను

రాసిన మహనీయుడు

ముక్కుపచ్చలారని కుర్రబెంగల లేత గుండెల చప్పుడు వినిపించాలని ఇవాళ ఎవరనుకుంటున్నారు! అసూర్యంపశ్యల పరువాల పాల పొంగుల కెరటాల పవళించిన..వటపత్రశాయిగా పవళించిన.. బాలకృష్ణుడెవరిక్కావాలి? జయదేవుడి పదప్రయోగం ఏ శృంగార మహస్సు నుంచి కణకణలాడుతూ ఎగసివచ్చి కవితగా రగిలిందో హుతాశరనతల్పం వంటి ప్రయోగాలు,వాటిలో ఉన్న పద అర్ధ వర్ణ శబ్ద విన్యాసాలు చెబితే వినేవారెవ్వరు…

అర్ధంకానివాళ్ళకో ప్రశ్నార్థకం, అర్ధమైన వాళ్ళకో అనుబంధం. ఈ లోకంలో ఎందరో పిచ్చాళ్ళున్నారు. డబ్బు, పదవి, కీర్తి, కాంత, కనకం, ప్రేమ, సినిమా, మంచితనం, తిండి ఇలా ఎవరికి తోచిన పిచ్చిలో వాళ్ళు మునిగి తేలుతుంటారు.

ఎవరేమనుకున్నా నేనూ, మరికొందరు వేటూరి పిచ్చోళ్ళం.అంతే.



క్రికెటర్.. అత్యంత ఖరీదైన విడాకులు

ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ విడాకుల వ్యవహారం భారీ స్థాయిలో ఉన్నట్టుంది. ఐదు నెలల కిందట తన భార్య కైలీ నుంచి విడిపోయాడట క్లార్క్. తాజాగా వారి విడాకులు ధ్రువీకరణ అయినట్టుగా ఇంగ్లిష్ మీడియా చెబుతూ ఉంది. ప్రపంచంలో అత్యంత ప్రతిభావంతమైన క్రికెటర్లలో క్లార్క్ కూడా ఒకడిగా గుర్తింపు పొందాడు. క్రికెట్ లో ఆస్ట్రేలియా ఏకఛత్రాదిపత్యపు చివరి రోజుల కెప్టెన్ కూడా క్లార్కేనే.

క్లార్క్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా ఒక వన్డే ప్రపంచకప్ ను కూడా నెగ్గింది. అంత దూకుడైన ఆటగాడు కాకపోయినా... డేంజరస్ ప్లేయర్ గా క్లార్క్‌కి పేరుంది. ఇలాంటి నేపథ్యంలో క్లార్క్ విడాకులు వార్తల్లోని అంశాలు అవుతున్నాయి. ఆసక్తిదాయకమైన అంశం ఏమిటంటే.. విడాకుల కోసం క్లార్క్ తన భార్యకు అత్యంత భారీ పరిహారాన్ని అందించినట్టుగా వార్తలు వస్తూ ఉండటం. విడాకులతో పాటు కైలీకి క్లార్క్ దాదాపు 280 కోట్ల రూపాయల స్థాయి పరిహారాన్ని ఇస్తున్నట్టుగా ప్రచారం జరుగుతూ ఉంది!

టీవీ యాంకర్ అయిన కైలీని క్లార్క్ ఏడేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు కూడా ఉంది. విడాకుల అనంతరం కూతురు పెంపకాన్నీ వీరిద్దరూ చూసుకోనున్నారని, మాజీ అవుతున్న భార్యకు మాత్రం ఏకంగా 280 కోట్ల రూపాయల స్థాయి పరిహారాన్ని క్లార్క్ చెల్లించనున్నాడని ఆస్ట్రేలియన్-బ్రిటీష్ మీడియా ప్రముఖంగా పేర్కొంటున్నాయి.



పెద్దరికం



పెద్దవయసు - గౌరవం పొందండి

"పెద్దల మాట, చద్ది మూట అనే రోజులు పోయాయి. మమ్మల్ని ఎవరూ పెద్ద పీట వేసి గౌరవించరు. ఏ విషయంలోనూ మా పెద్దరికానికి విలువ ఇయ్యరు. ఏం చేస్తాం కాలం వచ్చి చిక్కాం కానీ కాళ్ళు లేక చిక్కామా! పెద్దతనంలో ఇలా అగచాట్లు పడుతున్నాం" అంటూ మీరు కూడా తరుచుగా అంటున్నారా??

ఒక్క క్షణం.....

పెద్దతనం అంటే వరం అండీ !!! మీరు పెద్దలుగా గుర్తించ బడుతున్నారంటే అది మీకు లభిస్తున్న సువర్ణావకాశం సుమండీ !! ఏమిటీ ! అలా చిరాకుగా నా వంక చూస్తున్నారు !!

"పెద్దతనమా ! నా పిండాకూడా !!" అంటున్నారు కదా మనసులో ??

అప్పుడే నిరాశానిస్పృహలకు లోనయ్యారా!! అందుకే అంటారు "ఈ పెద్దవాళ్ళు తమ మాటే తప్ప ఎదుటివారి మాట విన్పించుకోరని !!"

సరే నండి వింటారు కదా ! మరి నామాట ....

పెద్దతనం వచ్చింది అనగానే కొన్ని విషయాలు మనం వదిలి వేయాలి.

పట్టుకోవటం కష్టం కానీ వదిలివేయటంలో బాధ ఏమిటి చెప్పండి? అలా అనుమానంగా చూడకండి... ఏమి వదిలివేయాలో చూద్దామా

"అమ్మాయి!! గ్యాసు కట్టేసావా!! గీజర్ ఆఫ్ చేసావా?? ఏ.సి. ఆన్ లో ఉన్నట్లుంది.. పాలు ఫ్రిజ్ లో పెట్టావా ?? కరెంట్ బిల్లు కట్టారా !!!" లాంటి ఎంక్వయిరీలు వదిలి వేయండి!!!

"మా కొడుకు కోడలు పట్టించుకోరు" అని హైరానా పడకండి..

ఇలా పట్టించుకుంటూ.. 60..70 ఏళ్ళు గడిపారు, ఇంకా ఎంతకాలం ?? ఇది వాళ్ళ హయాంలో వాళ్ళిష్టం .. కష్టనష్టాలు కూడా వాళ్ళవే!! చూడండి అప్పుడు ఎంత ప్రశాంతంగా ఉండగలరో.. "నా అభిప్రాయం ఏమిటంటే" అని అనటం తగ్గించి..

"నీ ఇష్టం, నువ్వు చెప్పు" అని వాళ్ళ ఇష్టాయిష్టాలతో వాళ్ళని బ్రతకనిద్దామా!!

'నాకూ తెలుసు' తో పాటు 'నాకు మాత్రమే తెలుసు' అనే అహం తగ్గించుకుని, వాళ్ళకి చాలా విషయాలు, టెక్నాలజీ 'నాకంటే ఎక్కువ తెలుసు' కదా అనే నిజాన్ని ఠక్కున ఒప్పేసుకోండి.. మీ మంచికేనండీ చెబుతున్నాను ...

"మా కాలంలో",

"మా చిన్నప్పుడు" అంటూ వీలు చిక్కినప్పుడల్లా వారిని ఊదర కొట్టకండి. వారి ముఖాల్లో కనిపించే విసుగుని చూడనట్లు నటించకండి. మన పిల్లలు కోసం వచ్చేవారితో మితంగా మాట్లాడండి. వాళ్ళు మనకోసం రాలేదు అని గుర్తుంచుకోండి. కాసేపు మాట్లాడాక లేచి గదిలోకి వెళ్ళిపోగలిగే మనోనిగ్రహం అలవరుచుకోండి ..

పెద్దవారిని పలకరించే మర్యాదతో ఒక ప్రశ్న ఎవరైనా సహజంగా అడుగుతారు... "ఆరోగ్యం బాగుంది కదా" అని. దయచేసి వెంటనే స్పందించకండి...

మన బి.పి..... షుగర్.. కీళ్ళనొప్పులు .. నిద్ర పట్టకపోవటం,.. నీరసం అంత రసవత్తరమైన విషయం కాదని సదా సర్వదా గుర్తుంచుకోవాలండీ బాబూ !!! మనకి తోచక కాలక్షేపానికి ఎంత ఆలోచించినా ఎదుటివాళ్ళకి దాంట్లో అంతే ఇంట్రెస్ట్ ఏం ఉంటుంది చెప్పండి.. "బాబోయ్ !! ఎందుకు అడిగామా" అనే

పశ్చాత్తాపం వారికి కలిగించకండి..

ఇంకొక విషయం...

ఎవరో పెద్దాయన అన్నాడు...

"మన అనుభవం తో వారిని తీర్చి దిద్దాలి కదా!" అని.

కాలం మారింది... మారుతున్నది..

"రోట్లో కందిపచ్చడి రుబ్బటం.. తిరగలితో విసరటం.. కట్టెల పొయ్యి మీద వంట చేయటం, కవ్వంతో మజ్జిగ చిలకటంలో గల నా అనుభవం నేటి తరానికి ఎలా ఉపయోగపడుతుంది ??"

ఉద్యోగాలైనా అంతే! పద్ధతులు మారుతున్నాయి.. టెక్నాలజీ అన్నింటా చోటు చేసుకుంటున్నది.... విమానంలో ప్రయాణించే వారికి ఎర్రబస్సు లో సీటు ఎలా పట్టుకోవాలో చెప్పి ఏం ప్రయోజనం ??

చివరగా పెద్దతనంలో మన పరువు కాపాడుకోవటం పూర్తిగా ... పూర్తిగా మన చేతుల్లోనే ఉందండీ !! అనవసరం విషయాల్లో జోక్యం చేసుకోకుండా... మితభాషిగా వుంటూ... మన ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోకుండా... ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ... జిహ్వా చాపల్యం తగ్గించుకుని... అన్నింటికంటే ముఖ్యమైన విషయం "నన్ను ఎవరూ గౌరవించటం లేదు" అనే ఆత్మన్యూనతా భావం దరి చేరకుండా **జాగ్రత్తపడాలి...**

భావం, బంధాలు, అంత తేలికగా తగ్గించుకోలేము.. కనీసం కొన్ని విషయాలను వదిలివేద్దాం.. పాజిటివ్ గా చూడండి... ఉద్యోగానికి పరిగెత్తాలనే హడావిడి లేదు... మొత్తం సంసారాన్ని లాగే బాధ్యత లేదు... పిల్లలకి సహకరిస్తున్నామనే తృప్తి ఉండనే ఉంది..

హాయిగా పూజలు చేసుకోవచ్చు.. భగవద్గీత, భాగవతం చదువుకోచ్చు.. దైవదర్శనం చేసుకోవచ్చు.. చిన్న చిన్న హాబీలు మనసు కి ఆహ్లాదాన్నిస్తాయి.. వాటికి సమయం కేటాయించవచ్చు..

ఒక మాటని రోజూ అనుకుందాం.. "I love myself... I respect my self" ఇది మన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది..

చివరగా...... మన దిగవలసిన స్టేషన్ దగ్గరలోనే వుంది ... Platform అదిగో ..... సమయం దగ్గర పడింది. ఇక మనకి బోగీలో ఉన్నవారితో తగువులు... మనస్పర్థలు ఎత్తిపొడుపు మాటలు అవసరం అంటారా...

మనం దిగుతుంటే వారి ముఖాల్లో 'హమ్మయ్య' అనే భావం కనిపించాలో లేక 'అయ్యో అప్పుడే స్టేషన్ వచ్చేసిందా' అనే భావం కనిపించాలో నిర్ణయం మన చేతిలోనే ఉంది ...

పెద్దతనం మనకి వరంలాంటిది ... అది ముఖ్యంగా మన 'అహం' తగ్గించి, మనకి జీవితం అంటే ఏమిటో, మన నిజమైన విలువ ఏమిటో సరియైన అవగాహన కల్పిస్తుంది ... కాబట్టి అందరూ వృద్ధాప్యాన్ని ఆనందంగా స్వాగతించాలి సుమండీ !!!

లినస అనిపించుకునే కంటే nice అనిపించుకోవడం మంచిది .

ఏడాది క్రితం అదృశ్యమైన ఓడ.. సడెన్‌గా వేరే దేశ తీరంలో ప్రత్యక్షం

డబ్లిన్: ఎప్పుడో ఏడాది క్రితం కనిపించకుండా పోయిన ఓ ఓడ.. సడెన్‌గా వేరే దేశ తీరంలో ప్రత్యక్షం అయితే ఎలా ఉంటుంది? సరిగ్గా అలానే జరిగింది గ్రీస్‌కు చెందిన ఎమ్వీ ఆల్టా అనే ఓడ విషయంలో. 1976లో టాంజానియాలో నిర్మించిన ఈ ఓడను 2017లో గ్రీస్ దేశం కొనుక్కుంది. ఆ మరుసటి ఏడాదే అమెరికా దగ్గరలోని హైతీ నగరానికి పంపించింది. దాదాపు 1,380మైళ్లు అంటే సుమారు 2,220 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత బెర్ముడా సమీపంలో సడెన్‌గా ఆల్టా ఆగిపోయింది. ఏమైందా అని చూస్తే ఓడలో పవర్ కనెక్షన్ పోయినట్లు తేలింది. ఈ సమాచారం అందుకున్న యూఎస్ కోస్ట్‌గార్డ్.. ఆల్టాలో ఉన్న సిబ్బందిని కాపాడారు. ఆ తర్వాత ఓడను గుయానా వరకూ తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే అక్కడుండగా ఈ పడవను కనిపించకుండాపోయింది. ఆ తర్వాత గతేడాది ఆగస్టులో బ్రిటన్‌కు చెందిన రాయల్ నేవీ అధికారులు.. ఈ ఓడ అట్లాంటిక్ సముద్రంలో తమ కంటబడిందని, సాయం చేద్దామని వెళ్తే దానిలో ఎవరూ లేరని తెలిపింది. ఆ తర్వాత మళ్లీ ఆల్టా ఎవరి కంటా పడలేదు. ఇప్పుడు సడెన్‌గా ఐర్లాండ్‌లోని బాలీకాటన్ ప్రాంతంలో సముద్రతీరంలో ప్రత్యక్షమైంది. డెన్నిస్ తుఫాను వల్లే ఈ ఓడ ఇక్కడకు వచ్చిందని ఐర్లాండ్ అధికారులు భావిస్తున్నారు. నిపుణులు పరిశీలించిన తర్వాత దీన్ని ఏం చేయాలనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.



పనికి వచ్చే ముచ్చట!!

రచన : పరుశురాం నాగం

ఒక ఊర్లో పదో తరగతి మిత్రులు, ఓ 80 మంది కలిసి చదువుకున్నారు. కొందరు పై చదువులకని, కొందరు బతుకు బాటను వెతుక్కుంటూ బయటి దేశానికి వలసకనీ, కొందరు ఊళ్ళోనే తోచిన పని చేసు కుంటూ, కొందరు పక్క నున్న పట్టణంలో చిన్నదో, పెద్దదో వ్యాపారం చేసు కుంటూ గడపసాగారు. గడప దాటారు. ఓ పది సంవత్సరాలు గడిచి పోయాయి. ఇంతలో Whatsapp లేదా మరో యాప్ వచ్చింది. ఒక మిత్రుడు అందరం రోజూ పలకరించుకుందాం, సాధకా బాధకాలు చెబుకుందాం అనే ఉద్దేశ్యంతో.. ఓ గ్రూపు Creat చేసాడు. కొద్దిరోజు ల్లోనే... 80 మందిలో.. 60 మంది నెంబర్ లు దొరకబట్టి... గ్రూపులో add చేశారు.

చిన్ననాటి మిత్రులే గాని, ఇప్పుడే కొత్తగా పరిచ యం అయిన వ్యక్తుల వలె.. ఎంతో ఉత్సాహంతో పలుకరించుకునే వాళ్ళు. ఎవరెవరు.. ఏమేం పనులు చేస్తున్నారో.... ఎక్కడెక్కడ ఉన్నారో.. పెళ్లి.. పిల్లల విషయం... ఒకటేమిటి... సర్వం సంభాషించుకునే వాళ్ళు.

మళ్ళీ పాత రోజులు గురుతు చేసుకుంటూ... మంచి మంచి సూక్తులు.. శాత్రాలు, పంచులు, జోకులు వేసుకుంటూ ఎంతో సంబర పడిపోయేవారు. అందరూ అడ్మిన్ లే!??

ఇలా ఎంతో జోష్‌గా గ్రూప్ నడుస్తుంది. ఒక రోజు open చేయకపోతే.. వందల సంఖ్యలో Unread మెసేజ్ లు ఉండేవి. గ్రూపు పుణ్యానా... ఒకనాడు అందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనం (Get Together/ Reunion) కూడా ఏర్పాటు చేసుకున్నారు.

రోజులు గడవసాగాయి.

ఒకనాడు, గ్రూపులో ఓ మిత్రుడు... Good Morning మెస్సేజ్ పెట్టాడు.

ఇంకో మిత్రుడు కలుగజేసుకొని "ఎందుకురా ఈ పనికి రాని మెస్సేజ్? ఏదైనా పనికి వచ్చే మెసేజ్ పెట్టండి. Good Morning , Good Nightలతో ఒరిగేది ఏం లేదు" అని అన్నాడు. ఇక అయోమయంలో, ఏమెసేజ్ పెట్టాలో తెలియక... ఆ Good Morng చెప్పిన మిత్రుడు... మళ్ళీ ఏనాడూ మెస్సేజ్ చేయలేదు.??

ఒకనాడు... ఆ ఊళ్ళో జరిగిన ఓ దొంగతనం గురించి... తీవ్రంగా చర్చ నడుస్తున్న సమయంలో... ఒక మిత్రుడు... తాను చూసే సినిమా టాకీస్ తో పాటు, పోస్టర్ తో దిగిన ఫొటో ఒకటి, ఈ గ్రూపులో షేర్ చేసాడు.

"అరేయ్.. మేము ఇంత తీవ్రంగా చర్చ నడిపిస్తే... మధ్యలో నీ సోది ఏంది రా?? ఏదైనా పనికి వచ్చే పోస్ట్ పెట్టు" అని అనగానే.... ఏ పోస్ట్, ఎప్పుడు పెట్టాలో అర్థం కాకపోవడంతో.... మరొక్కమారు అతను... గ్రూపులో ఏ పోస్ట్ పెట్టలేదు. 'ఒకతనను... మంచి మసాలా వేసి వండిన.... 'సాంబారు' తో పోస్ట్ చేసాడు.'ఎప్పుడూ.. తిండి విషయలేనా?? ఏదైనా పనికి వచ్చే పోస్ట్ చేయమన్నారు' ఇంకొకరు. ఆ సాంబార్ పోస్ట్ వ్యక్తి వెంటనే గ్రూపు నుండి %ఎవట్% అయ్యాడు.??. ఓసారి దేశ, రాష్ట్ర రాజకీయాలు మీద వాదోపవాదాలు నడుస్తున్నాయి. "మా పార్టీ ఇది చేసింది, అది చేసింది" అని తీవ్రంగా వాదించుకుంటున్నారు. ఎదు రుగా ఉంటే.. కొట్టుకునే వాళ్లే!!??. ఇంతలో మధ్యలో.. ఒక మిత్రుడు... ఓ "అమ్మాయి ఫోటోలో.. 'ఫోన్ నెంబర్ కావాలా??" అని రాసి ఉన్న ఫొటో పెట్టాడు. ఆ ఇద్దరు "రాజకీయ మేధావులకు".. ఎక్కడో కాలింది. ఇద్దరు కలిసి.. ఈ మిత్రున్ని తిట్టారు. ఏదైనా.. పనికి వచ్చే.. పోస్ట్ పెట్టమన్నారు. అంతే.. మరోమారు.. ఈ మిత్రుడు ఏ పోస్ట్ పెట్టలేదు. (ఇంకా ఎన్నో ఉన్నాయి చెప్పడానికి. అవి చెబితే... ఇది కూడా పనికి రాని పోస్ట్ అవుద్దని చెప్పడం లేదు. మిత్రులు మన్నించాలి?) ఇలా... ఏ పోస్ట్ పనికి వచ్చేదో.. ఈ గ్రూపులో .. దెంతో లాభసాటిగా ఉంటుందో అర్థం కాక.. ఒక్కొక్కరు... పోస్టులు చేయడం మానేశారు. చివరికి... గ్రూపులో ఓ నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. ఒకప్పుడు ఫోన్‌లో TOPలో కనబడిన గ్రూపు కాస్త.. ఎక్కడో అడుగుకి పడిపోయింది. Searchలో వెతికితే గాని దొరకడం లేదు?? అప్పుడప్పుడు... ఊళ్ళో ఒకరినొకరు... ఎదురెదురుగా కనబడినా... మారు మాట్లాడుకునే వాళ్ళుకాదు. అందుకే... మిత్రుల మధ్యన అడ్డుగోడలు ఏం పెట్టుకోకండి. బడి గోడ మీద కూర్చున్నప్పుడు... ఏం మాట్లాడుకుంటాం?? కాలేజి కాంటీన్‌లో, టీ తాగుతూ.. ఏం డిస్కషన్ చేస్తాం?? వాడకట్టు మిత్రులు , ఊరి మిత్రులు ఓ బస్టాండ్ దగ్గరి చెట్టు కింద కూర్చొని ఏం మాట్లాడుకుంటాం?? వీటిలో.. ఏ ఒక్క ముచ్చటకు హద్దు ఉండదు. ! ఓ హద్దే ఉంటే.. ఆ ముచ్చట ఎంతో సేపు.. ఎంతోకాలం నడవదు. మనం ఏదైనా... జాబ్ కోసం ఇంటర్వ్యూలో పాల్గొంటున్నమా?? ఏదైనా ఓ సంఘటన మీద డిస్కస్ చేయడానికి?? లేదు కదా. మిత్రుల మధ్యన.... ఎప్పుడూ.. పనికి వచ్చే ముచ్చటనే ఉండక్కర్లేదు. Good Morning, Good Nightల వల్ల... ఆ మిత్రుడు మనతో కలిసి ఉన్నాడని, ఆనందంగా ఉన్నాడని అనుకోండి.?? ఏ పోస్ట్.. ఎప్పుడైనా.. ఏ సమయం లోనైనా పంపనివ్వండి. ఎందుకంటే.. అతని.. ప్రతి విషయాన్ని.. మీతో పంచుకుందాం అని అనుకుంటున్నాడు. తుమ్మినా.. దగ్గినా కూడా మెసేజ్ లు పెట్టే వాళ్ళను చూసి తిట్టకండి. ఎందుకంటే.. ఎందుకంటే.. ప్రతి క్షణాన్ని, మీతో కలిసి ఓ మధుర స్మృతిగా మలుచుకుందాం అని అనుకుంటున్నారు.

చివరగా ఓ సందేశం... : మిత్రుల మధ్యన ఎప్పుడైతే... హద్దుల అడ్డుగోడలు ఏర్పడతాయో...మెల్లమెల్లగా.. ఆ స్నేహబంధం బీటలువారి బద్దలైపోతుంది. ఇది మన గ్రూప్‌కి కూడా వర్తిస్తుంది అంకుంటే, ఒక లైక్? వేసుకోండి. ఈ లైక్ కూడా ఎందుకంటే, మీరు ఈ మెసేజ్ అయిన మొత్తం చదివారా లేదా అని తెలుసుకోవడానికి ??


తెలంగాణ కమలాధిపతి



అధికార పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదిగి 2024లో అధికారం లోకి రావడమే తమ లక్ష్యమని తెలంగాణ బీజేపీ ఏనాటి నుంచో చెబుతోంది. దీనికి లోక్ సభ ఫలితాలు ఆ దిశగా మార్గం చూపగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలు కూడా ఆ పార్టీకి ఆశలు రేపాయి. ఈ క్రమంలోనే పార్టీని పటిష్టం చేయడానికి బలం పెరగడానికి త్వరలోనే పార్టీకి కొత్త సారథిని నియమిం చబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. పార్టీ అధ్యక్షుడి మార్పుపై కసరత్తు సాగుతుంది. అయితే ఈసారి పక్కాగా కొత్త కార్యవర్గం ఏర్పాటుచేస్తారని తెలుస్తోంది. దీనికి మాజీ గవర్నర్ పార్టీ సీనియర్ నాయకుడు సీహెచ్ విద్యాసాగర్ రావు చెప్పిన మాటలు ప్రాధా న్యం సంతరించుకున్నాయి. అయితే అధ్యక్షుడిగా లక్ష్మణుడా.. సంజయుడా లేదా అరుణమ్మ అనే చర్చ సాగుతోంది

పార్టీలో సీనియర్ నాయకుడిగా డాక్టర్ కె.లక్ష్మణ్ ఉన్నారు. గతంలో ఎమ్మెల్యేగా పని చేశారు. ప్రస్తుతం ఆయన అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మళ్లొకసారి ఆయన పదవీకాలం పొడిగించే అవకాశం కనిపిస్తోంది. అయితే పార్టీకి యువ రక్తం కావాలని జోష్ మీదున్న యువ నాయకుడు అయితే పార్టీ బలోపేతం అవుతుందనే మాట వినిపిస్తోంది. గతేడాది జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కన్నా ఒక సీటు ఎక్కువ పొంది మొత్తం 4 ఎంపీ సీట్లు గెలవడంతో పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చింది. అధికార పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పడానికి బలం చేకూరింది. ఈ క్రమంలో కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ను కూడా అధ్యక్షుడిగా చేయాలని ప్రధానంగా యువ నాయకులు కోరుతున్నారు.

కరీం నగర్ లో ఒంటిచేత్తో గెలిచిన బండి సంజయ్ పక్కా హిందూత్వ వాది. దూకుడుతనం.. వాక్పటిమ తదితర లక్షణాలు ఉండడం తో బండి సంజయ్ ను రాష్ట్ర అధ్యక్షుడిగా చేయాలని ఉత్తర తెలంగాణ నాయకులు కోరుతున్నారు. అయితే ఢిల్లీలో రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ నాయకత్వ మార్పు విషయమై స్పందించారు. పార్టీ అధ్యక్షుడిగా ఎవరినీ ఎన్నుకుంటారనే విషయమై మీడియా ప్రశ్నించింది. పార్టీకి డైనమిక్ యంగ్ నాయకుడు బండి సంజయ్ ను కూడా పరిశీలిస్తున్నారు. అయితే ఆయన ఎంపీగా ఉండడంతో అధ్యక్షుడు అయితే పార్టీకి అంత సమయం కేటాయిస్తాడా? రాష్ట్రమంతా తిరుగుతాడ అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే లక్ష్మణ్ అయితే పార్టీని నడిపించగలడు.. పార్టీని విస్తృత చేసే కార్యక్రమాలు చేయగలడు అని చెప్పారు. కానీ వీరు అవుతారు అని మాత్రం ఒక్క పేరు చెప్పలేదు. యువరక్తం హిందూత్వం అంటే సంజయ్ వైపు.. పార్టీ బలోపేతం సీనియార్టీ అంటే లక్ష్మణ్ కు అధ్యక్ష పదవి వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ పదవికి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి డీకే అరుణ కూడా పోటీ పడుతున్నారు. అయితే ఈ పార్టీలో ఇతర పార్టీల మాదిరిగా సామాజిక సమీకరణాలు పెద్దగా పట్టించుకోరు. కేవలం హిందూత్వ పార్టీలో వారి స్థాయి వారి గుణగణాలు తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుంటారు. మరి వీటన్నిటి నేపథ్యం లో అధ్యక్ష పదవికి లక్ష్మణ్ సంజయ్ మధ్యనే పోటీ సాగుతుంది. ఏది ఏమున్నా పార్టీ అధిష్టానం ఆ నిర్ణయం వెల్లడిస్తుంది.



చినబాబు... ఎప్పటికయ్యేను పెదబాబు???....

చంద్రబాబుగారి అబ్బాయి చినబాబు. నారా లోకేష్ నాయుడు అన్నది పూర్తి పేరు. సినిమా, రాజకీయ రంగాల్లో బడాబాబుల పిల్లలకు అసలు పేర్లు కన్నా కొసరు పేర్లే ముద్దు. బాబు లేదా పెదబాబు, కాదంటే చినబాబు. ఇలాగే పిలుచుకోవాలి. అందువల్ల లోకేష్ బాబు ఎప్పటికీ చినబాబే. ఇప్పుడు ఈ చినబాబు వచ్చే ఎన్నికల నాటికి నలభయ్యవ పడిలోకి వస్తారు. ఆయన రాజకీయాల్లోకి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రవేశించి పదేళ్లు దాటింది. 2009లో తండ్రి వెనుక వుండి, ఎన్నికల ప్రచార సామగ్రి, కార్యక్రమాల ప్లానింగ్ ఇలాంటి పనులు అన్నీ పార్టీ ఆఫీసులో వుండి టేకప్ చేసారు. అది చినబాబు రాజకీయ ప్రస్థానానికి పునాది. అయిదేళ్లు తిరిగేసరికి ఆయన మంత్రి. ప్రభుత్వ..పార్టీ పగ్గాలు దాదాపు అన్నీ ఆయన చేతుల్లోనే.

నిజంగా ఇదంతా స్వయం కృషా? ఆయన సాధించిన విజయమా? ఇలా ప్రశ్నించుకుంటే, కేవలం అనూచానంగా, తండ్రి చాటు బిడ్డగా, వారసత్వంగా సంక్రమించినది తప్ప, ఆయనగా సాధించినది ఏమిటి? అని ప్రశ్నించుకోవాల్సిన సమయం ఇది. ఎందుకంటే, ఇప్పుడు ఆయన ప్రతిపక్షంలో వున్నారు. మరో నాలుగేళ్లలో రాబోయే ఎన్నిక ల్లో మరోసారి తలపడాల్సి వుంది. ఇలాంటి నేపథ్యంలో అసలు లోకేష్ అనే చినబాబు భవితవ్యం ఎలా వుంది? ఎలా వుండబోతోంది అన్నది ఓ సారి అవలోకించాల్సిన అవశ్యం వుంది. ఎందుకంటే మరోనాలుగేళ్ల తరువాత చంద్రబాబు ఇంకా వృద్ధులు అవుతారు. జగన్, పవన్ అనే ఇద్దరు యంగ్ పొలిటికల్ లీడర్లను ఢీకొనాల్సింది లోకేష్ బాబే.

గడచిన అయిదేళ్లు

గడచిన అయిదేళ్లలో చినబాబు కింగ్. అందులో సందేహం లేదు. పార్టీలో ఆయనదే హవా. అధికారంలో ఆయనకు మంత్రి పదవి అయాచితంగా అందివచ్చింది. కానీ అయిదేళ్ల తరువాత చూసుకుంటే ఆయన సాధించింది ఏముంది? అన్న ప్రశ్నమాత్రమే మిగుల్తుంది. పార్టీని బలోపేతం చేసిన ధాఖలా లేదు. అందుకు ప్రత్యేకంగా లోకేష్ చేసిన కృషి కనిపించదు. పార్టీ కార్యకర్తలకు భీమా, గుర్తింపు కార్డులు ఇలాంటి కార్పొరేట్ స్టయిల్ వ్యవహారాలు మినహా మరేమీ కానరావు. ఆయన ఇంగ్లీష్ మీడియం చదువు వల్ల కావచ్చు, నాలుక సరైన పలుకులు పలకడానికి సహకరించక కావచ్చు, అనేక సార్లు అభాసుపాలయ్యారు.

ఒక్కోసారి ఒక్కొక్కరు ఎందుకు ఎలా ముద్రపడతారు అన్నది అర్థం కాదు. రాహుల్ గాంధీ అలాగే మొద్దబ్బాయి మాదిరిగా తన రాజకీయ ఎర్లీ డేస్ లో ముద్ర పడిపోయారు. రాను రాను ఆయన

రాటు దేలినా, రాజకీయ ప్రసంగాలు అద్భుతంగా చేసినా ఆ ముద్ర మాత్రం పోలేదు. రాహుల్ ను ఓ ప్రధాని అభ్యర్థిగా ఈ దేశ ప్రజానీకం ఇప్పటికైతే అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీలోని కీలక తరం అంతరించిపోతోంది. తదనుగుణంగా రాహుల్ గాంధీ లో వచ్చిన మార్పు కూడా గుర్తింపు కు నోచుకోకుండా పోతోంది.

లోకేష్ వ్యవహారం కూడా ఇలాగే వుంది. ఎందుకో ఆయన కూడా కాస్త మొద్దబ్బాయిగానే ముద్రపడ్డారు. పప్పు అనే ప్రచారం ప్రతిపక్షాలది అయితే కావచ్చు. కానీ ఆయన ఒక డైనమిక్ లీడర్ అని మాత్రం గుర్తింపు తెచ్చుకోలేకపోయారు. ఆయన లాంగ్వేజ్ మాత్రమే కాదు, బాడీ లాంగ్వేజ్ కూడా అందుకు కొంత కారణమైంది. వయస్సు మీద పడినా చంద్రబాబు ఇప్పటికీ కాస్త డైనమిజం కనబర్చగలుగుతున్నారు కానీ, లోకేష్ దగ్గర నుంచి మాత్రం అది రావడం లేదు.

కేటిఆర్ భిన్నంగా..

అదే సమయంలో మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణలో కేటీఆర్ ఇందుకు పూర్తి భిన్నంగా దూసుకుపోతున్నారు. కేసిఆర్ ఛాయలోంచి కేటీఆర్ ఎప్పుడో బయటపడిపోయారు. ఆయన స్వంతంగా ఎన్నికలను డీల్ చేయడం నుంచి విదేశీ వేదికల మీద కూడా తన డైనమిజాన్ని నిరూపించేసుకున్నారు. ఇప్పుడు కేటీఆర్ కు అంటూ ఓ స్వంత మార్కు వచ్చేసింది. ఆ తరహా మార్కు లో ఒక్కశాతం కూడా ఇప్పటికీ చినబాబు లోకేష్ కు రాలేదు. నిజానికి గత అయిదేళ్లలోనే కేటీఆర్ ఇది సాధించారు. కానీ అదే సమయంలో ఆ స్థాయి లోకేష్ సాధించలేకపోయారు.

నడుస్తున్న చరిత్ర

ఇప్పుడు ఆంధ్రలో తెలుగుదేశం ప్రతిపక్షంలో వుంది. దాదాపు కీలక నాయకులంతా చేష్టలుడిగి కూర్చున్నారు. అమరావతి సమస్య వచ్చింది కాబట్టి కృష్ణ, గుంటూరు ప్రాంత నాయకులు కాస్త గొంతు విప్పుతున్నారు. కానీ చంద్రబాబు మాత్రం ఈ వయసులో కూడా పాపం, కిందా మీదా అవుతున్నారు. ఆఖరికి బస్ యాత్రకు రెడీ అయి పోయారు. మరి ఇంతకీ ఇలాంటి కీలకసమయంలో లోకేష్ ఏం చేస్తున్నట్లు? చినబాబు ఎందుకు కేవలం ట్విట్టర్ కే పరిమితం అవుతున్నారు. ట్విట్టర్ లో కూడా ఆయన కేవలం తన పార్టీ జనాల అటెన్షన్ ను తీసుకుంటున్నారు తప్ప, జనరల్ గా యువతరం ఆసక్తిని తన వైపు తిప్పుకోలేకపోతున్నారు. కానీ అదే కేటీఆర్ ట్విట్టర్ అక్కౌంట్ చూస్తే అలా వుండదు. దానిని రాజకీయాలకు అతీతంగా యువత ఫాలో అవుతూ వుంటుంది.

నిజానికి మూడు రాజధానుల సమస్య లాంటి కీలక విషయం వచ్చిన తరువాత కార్యాచరణ రంగంలోకి దిగాల్సింది చంద్రబాబు కాదు చినబాబే. కానీ చంద్రబాబు కానీ చినబాబు కానీ ఎందుకో అలా ఆలోచించడం లేదు. చినబాబు కేవలం ట్విట్టర్‌కు పరిమితమైపోయారు. నిజానికి కార్యక్షేత్రంలోకి లోకేష్ దిగి, రాష్ట్రం అంతా తిరిగినా, లేదా బస్ యాత్ర చేసినా, ఆయనకు మైలేజ్ వచ్చే అవకాశం వుంటుంది. కానీ లోకేష్ అలాంటి ఆలోచన చేస్తున్నట్లు కనిపించడం లేదు. తెలుగుదేశం పార్టీ ఆయన అనుకూల మీడియా కూడా చంద్రబాబునే ముందుకు తోస్తోంది. ఆయననే ముందుకు ప్రొజెక్ట్ చేస్తోంది. బాబు ను గెలిపించకపోవడం వల్లనే ఇదంతా అంటోంది. మళ్లీ బాబే రావాలి అనే దిశగా వార్తలు ప్రచారం చేస్తున్నారు.

కానీ ఇది ఇప్పుడు బాగానే వుంటుంది. జగన్ దురదృష్టమో, బాబు అదృష్టమో కలిసి వచ్చి మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి వస్తే అప్పుడు చంద్రబాబునే ముఖ్యమంత్రి చేయాల్సిందే. పార్టీ అదే చేస్తుంది కూడా. అప్పుడు కూడా లోకేష్ ది మళ్లీ బ్యాక్ సీట్ డ్రయివింగ్ నే. కానీ దీనివల్ల ఏం జరుగుతుంది?లోకేష్ అధికారం చెలాయించవచ్చు కానీ, ప్రజల్లో పరపతి పెంచుకోవడం కష్టం.

ఇవ్వాళ కాకపోవచ్చు, 2024 నాటికి కావచ్చు, ఆ తరువాత కావచ్చు. ఎప్పటికైనా లోకేష్ నేరుగా పవన్ తో, జగన్ తో పోటీ పడి తన డైనమిజం ను నిరూపించుకోవాల్సిందే. దానికి ఇప్పటి నుంచీ కష్టపడడం, బాటలు వేసుకోవడం అవసరం. అలా కాకుండా బాబు వున్నంత కాలం తండ్రి చాటు బిడ్డగానే వుంటాను అనుకుంటే లేదా ఆయనను అలా వుంచాలి అనుకుంటే అది తప్పిదమే అవుతుంది. చంద్రబాబు రాజకీయ తెరమీద లేని తరుణం వచ్చినపుడు లోకేష్ ఒక్కసారికి యుద్ధంలోకి దిగితే వ్యవహారం వేరుగా వుంటుంది. అదే బాబు వెనుక వుండి, తన సలహా, సహకారాలతో గెలిచినా, ఓడినా, మంచి అయినా, చెడు అయినా, రాటుకి పోటుకి తట్టుకుంటూ లోకేష్ ను ముందుకే నడిపిస్తే అది వేరుగా వుంటుంది. అలా అలా జనాల్లో లోకేష్ అన్న వాడు కూడా ఓ లీడర్, ఓ కాంపిటీటర్ అన్నది ముద్ర అవుతుంది.

పార్టీలో యంగ్ తరంగ్

లోకేష్ సంగతి అలా వుంచితే తెలుగుదేశం పార్టీలో గల్లా జయదేవ్, రామ్మోహన్ నాయుడు తదితర యువతరంగం వుంది. వాళ్లు ఇప్పటికే పార్టీకి అతీతంగా కాస్త రాణింపు తెచ్చుకున్నారు. సోషల్ మీడియాలో వారికంటూ ఫాలోయింగ్ వుంది. ఇప్పుడు కాకున్నా, మరో నాలుగేళ్లలో ఇలాంటి వాళ్లు మరికొంత మంది తెలుగుదేశంలో పుట్టుకురావడం ఖాయం. అది అనివార్యం. కానీ ఇలాంటి వాళ్ల కన్నా మెరుగు అనిపించుకుంటేనే చినబాబుకు భవితవ్యం. బాబు గారి పరోక్షంలో పార్టీని ఏకతాటిపై వుంచాలని లోకేష్ ఇలాంటి యంగ్ తరంగ్ కన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకోవాల్సి వుంది. అలా జరగాలంటే ఆయన ఇప్పటి నుంచీ రాజకీయ యవనిక మీద తరుచుగా ప్రత్యక్షం కావాల్సి వుంది.

చంద్రబాబు గారి బస్ యాత్ర కన్నా, చినబాబు పాదయాత్ర లాంటిది చేపడితే ఇలాంటిది సాధ్యం కావచ్చు. ఎన్నికలకు రెండేళ్లు ముందుగా అయినా ఇలాంటి ఆలోచన చేయాలి. అలా కాకుండా చంద్రబాబు కిందా మీదా ఆయాసపడి, కష్టపడి, ఎత్తులకు పై ఎత్తులు వేసి, తన మీడియా సహకారంతో 2024లో అధికారం సాధించినా, ఆయన అనంతరం దాన్ని నిలబెట్టుకోవడం మాత్రం లోకేష్ కు కష్టం అవుతుంది. ఎందుకంటే అయాచితంగా వచ్చింది వేరు కష్టపడింది వేరు. కష్టపడింది చేజారితే మళ్లీ కష్టపడి సాధించుకోవచ్చు. అయాచితంగా వచ్చింది చేజారితే కష్టం ఎలా చేసి సాధించాలో తెలియదు. మళ్లీ అయాచితంగా ఎలా వస్తుందో అని చూడడం తప్ప.

ప్రస్తుతం లోకేష్ ఇలా అయాచిత ఫలితం కోసం చూస్తున్నారు. చంద్రబాబు తన కష్టాన్ని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. చంద్రబాబుకి చినబాబుకి ఇదీ తేడా.

దేవులపల్లి కృష్ణశాస్త్రి



మనసున మల్లెల మాలలూగెనే అంటూ మధుర రాత్రులకు కొత్త అర్థాలు చెప్పినా... ఏడ తానున్నాడో బావ అంటూ విరహ వేదనలోని వివిధ కోణాలు మనకు రుచి చూపించినా... కుశలమా నీకూ కుశలమేనా అంటూ ఆలూ మగల మధ్యన ఉండాల్సిన అనురాగం గురించి కాబోయే దంపతులకు ప్రేమతో చెప్పినా... తొందరపడి ఒక కోయిల చేత కాస్తంత ముందే కూయించినా... అది ఒక్క దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికే చెల్లింది..

సడి సేయకో గాలి సడి సేయ బోకే బడలి వొడిలో రాజు పవళించేనే అంటూ ప్రకృతి కాంతకు ప్రణమిల్లినా.. పగలయితే దొరవేరా... రాతిరి నా రాజువిరా అంటూ రసరమ్యమైన పదాలతో రంజింప చేసినా... పాలిచ్చే గోవులకూ పసుపూ కుంకం, పనిచేసే బసవడికీ పత్రీ పుష్పం సమర్పించి తెలుగు వారి లోగిళ్ళలో అక్షరాలతో అందాల సంక్రాంతి ముగ్గులు దిద్దించినా..

అది ఒక్క దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికే చెల్లింది..

మందారంలా పూస్తే మంచిమొగుడొస్తాడని...గన్నేరంలా పూస్తే కలవాడొస్తాడని...సింధూరంలా పూస్తే చిట్టీ చేయంతా... అందాల చందమామ అతడే దిగి వొస్తాడంటూ పెళ్ళికాని తెలుగమ్మాయిల కలలకు గోరింటాకు సొగసులద్దినా... గోరింకా పెళ్లై పోతే ఏ వంకో వెళ్ళిపోతే గూడంతా గుబులై పోదా గుండెల్లో దిగులై పోదా అంటూ భగ్న ప్రేమికుల గుండెల్లో గుబులును నింపి వారి మనసుల్ని దిగులులో ముంచెత్తినా...

అసలు ఏం చేసినా ఏం రాసినా అది ఒక్క దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికే చెల్లింది... ఇంకా చెప్పాలంటే అసలు తెలుగు భాషని గానీ తెలుగు వారిని కాని ఏమన్నా చేసుకునే అధికారం ఆయనకా పరమేశ్వరుదే ఇచ్చాడేమో. .

"జయ జయ జయ ప్రియభారత జనయిత్రీ దివ్య ధాత్రి" అంటూ తన అపారమైన దేశభక్తితో ఏకంగా భరత మాతనే పరవశింప చేసిన ఈ ధన్యజీవి తదనంతరం మన తెలుగు వారందరి కేర్ అఫ్ అడ్రెస్స్ గా మారారు...

మరి అంతటి కృష్ణ శాస్త్రి గారు తెలీని తెలుగు వారు ఎవరన్నా వున్నారంటే అది శాస్త్రి గారికి కాదు వారి సాటి తెలుగు వార మైన మనకే ఎంతో అవమానం... ఎన్నిసార్లు విన్నాఎన్ని తరాల తర్వాత విన్నాఇప్పటికీ ఎంతో కొత్తగా అనిపించే ఎన్నోఆణిముత్యాలను మన తెలుగు వారికందించిన ధన్య చరితులు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు..

అటువంటి పరమ పుణ్యాత్ములైన శాస్త్రిగారు అదేమీ శాపమో గానీ వ్యక్తిగత జీవితంలో మాత్రం ఎనలేని విషాదాన్ని చవి చూసారు..

"నావలోతానుండి మము నట్టేట నడిపే రామచరణం... త్రోవలో కారడవిలో తోత్తోడ నడిపే రామచరణం... నావ అయితే రామచరణం... త్రోవ అయితే రామచరణం.. .మాకు చాలును వికుంట మందిర తోరణం శ్రీరామ చరణం.."

అంటూ మనకు తత్వ బోధన చేసిన కృష్ణ శాస్త్రి గారు కాన్సర్ తో తన మాట్లాడే శక్తిని పూర్తిగా కోల్పోయినా పెద్దగా బాధ పడలేదు గానీ తన కంటి వెలుగైన తన ముద్దుల గారాల పట్టి సీత అకాల మరణాన్నిమాత్రం జీర్ణించుకోలేక పోయారు...

కూతురిని కోల్పోయిన బాధ కృష్ణ శాస్త్రి గారిని మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా బాగా కుంగ తీసిందనే చెప్పాలి... అదే సమయంలో ఆర్థిక సమస్యలు కూడా వారిని చుట్టు ముట్టి మరింత ఉక్కిరి బిక్కిరి చేసాయి...

"..ఈ గంగాకెంత గుబులు... ఈ గాలికెంత దిగులు.. " అంటూ ప్రకృతిలోని ఎన్నిటి గురించో దిగులు పడ్డ శాస్త్రి గారు తన వ్యక్తిగత జీవితంలో మాత్రం చెప్పు కోలేని బాధలనుభవించారు...

సరిగ్గా ఆ సమయంలోనే మరపురాని ఓ చిన్న సంఘటన ఆ రోజుల్లో జరిగింది..

చిన్నదే అయినా ఆ తరవాతి కాలంలో ఈ మహత్తర సంఘటన వలన మనం కొన్ని మధురమైన పాటల్ని వినగాలిగాం... తెలుగు చిత్ర పరిశ్రమలో బహుశా కొద్ది మందికి మాత్రమె తెలిసిన ఈ సంఘటన 1974 – 75 ప్రాంతంలో మదరాసు మహాపట్టణం లోని ప్రముఖ సంభాషణల రచయిత గొల్లపూడి మారుతీ రావు గారింట్లో జరిగింది..

మద్రాసు కేంద్రంగా తెలుగు చిత్ర పరిశ్రమ మూడు పువ్వులూ ఆరు కాయలుగా కళ కళ లాడుతుండే రొజులవి... చిత్ర పరిస్రమకు సంబందించిన చిన్నాపెద్దా అందరూ అప్పట్లో మద్రాసులోనే వుండేవారు.. గొల్లపూడి మారుతీ రావు గారు కూడా మద్రాసులోనే వుండేవారు..

ఈ మహత్తరమైన సంఘటన జరిగిన రోజున పొద్దున్న పూట

ఎప్పట్లాగే తన పనులు ముగించుకొని ఉదయం 8.30 గంటల సమయంలోమారుతీరావు గారు బయటి కెళ్ళటానికి సిద్దమవుతుండగా ఒక ఫియట్ కారొచ్చి ఆయన ఇంటి ముందాగింది ..

".. పొద్దున్నేఎవరో మహానుభావులు.." అనుకుంటూ మారుతి రావు గారు కొద్దిగా ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి పోయారు..

ఆయన్ని మరింత ఆశ్చర్యానికి గురి చేస్తూ కారు లోంచి మహా కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు కిందకి దిగారు.. అంతటి మహనీయులు తన ఇంటికొచ్చారనే ఆనందంతో కాసేపు ఉబ్బితబ్బిబ్బయినా వెంటనే తేరుకొని మారుతీ రావు గారు శాస్త్రి గారికి ఎదురెల్లి సాదరంగా వారిని ఇంట్లోకి ఆహ్వానించారు..

కాఫీ ఫలహారాలు అవీ పూర్తయిం తరువాత శాస్త్రిగారు తన కేదో విషయం చెప్పాలనుకొని కూడా చెప్పటానికి సంశయిస్తున్నారని అర్థం అయ్యింది మారుతీ రావు గారికి..

మెల్లిగా తను కూర్చున్న కుర్చీ లోంచి లేచి.. శాస్త్రి గారికి దగ్గరగా వచ్చి.. ముందు కొంగి..ఆయన మోకాళ్ళ మీద చేతులేసి.. ఆయన మొహంలోకి చూస్తూ... లోగొంతుకలో ఎంతో ఆప్యాయంగా అడిగారు మారుతీ రావు గారు..

"మాస్టారూ మీరు నాతో ఏదో చెప్పాలనుకొని కూడా చెప్పలేక పోతున్నారు.. నా దగ్గర కూడా సంశయిస్తె ఎట్లా చెప్పండి.. అంత మరీ పరాయి వాడినయి పోయానంటారా ..."

తానెంతో ఆరాధించే తన గురువు గారు తన ముందు గూడా మొహమాట పడుతున్నారన్నఅక్కసుతో కావాలనే కాస్త నిష్టూరాలాడుతూ మాట్లాడారు మారుతీరావు గారు..

అప్పుడు జరిగిందండీ ఆ సంఘటన..

ఎంతటి వాడి చేత నైనా కంట తడి పెట్టించే ఒక విషాదకరమైన ఘటన... మీరే చదవండి .తెలుస్తుంది .

శాస్త్రిగారికి ఆ రోజుల్లో స్వర పేటికకి కాన్సర్ సోకటం వలన గొంతు పూర్తిగా మూగ బోయింది.. .అందుకని ఆయన ఎక్కడికెళ్ళినా ఒక పలకా బలపం చేతిలో పట్టుకొని వెళ్ళేవారు... ఎవరికేం చెప్పదలుచుకున్నా ఆ పలక మీదనే రాసి చూపించేవారు...

మారుతీ రావు గారు తన దగ్గరికొచ్చిఅలా అడగంగానే శాస్త్రి గారు ముందుగా ఒక పేలవ మయిన జీవం లేని నవ్వు నవ్వారు...

ఆ తరువాత తల వొంచుకొని పలక మీద చిన్నచిన్న అక్షరాలతో దాదాపు ఓ రెండు నిమిషాలపాటు చాలా పొందికగా ఏదో రాస్తూ ఉండిపోయారు... ఆ తరువాత అదేంటో చదవమని పలక మారుతీ రావు గారి చేతి కిచ్చారు ...

అందులో ఏముందో చదవటానికి మారుతీ రావు గారికి ముందొక పావు నిమిషం పట్టింది... ఆ తరువాత అందులోని విషయాన్నిసంగ్రహించి జీర్ణించు కోవటానికింకో అర నిమిషం పట్టింది... ఆ పైన లోపలి నుండి తన్నుకుంటూ వొస్తున్న దుంఖాన్ని ఆపుకోవటానికి మరో నిమిషం పట్టింది...

".. నాకుషస్సులు లేవు.. ఉగాదులు లేవు.. " అంటూ తెలుగు సాహితీ లోకాన్నిఉగ్రూతలూగించిన ఈ మహా మనీషి జీవితంలోంచి నిజంగానే ఉషస్సులూ ఉగాదులూ వెళ్లిపోయాయా అనుకుంటూ కాసేపలా మౌనంగా ఉండిపోయారు మారుతీ రావు గారు... ఏం సమాధానం చెప్పాలో వెంటనే అర్థం కాలేదు... అసలు అట్లాంటి విపత్కర పరిస్థితి ఒకటి తన జీవితంలో వొస్తుందని కూడా ఆయన ఏనాడు ఊహించలేదు... అయినా వెంటనే తనను తాను తమాయించుకొని తల ఎత్తి శాస్త్రిగారే వేపు కాసేపలా చూస్తూ ఉండి పోయారు..

"..పెరిగి విరిగితి విరిగి పెరిగితి... కష్ట సుఖముల సార మెరిగితి... పండుచున్నవి ఆశ లెన్నో... ఎండి రాలగ పోగిలితిన్..." అన్నంత దీనంగా వుంది అప్పటి కృష్ణ శాస్త్రి గారి ముఖస్థితి..

ఎప్పుడూ తళతళ లాడే జరీ అంచు వున్నపట్టు పంచెలో కనపడే శాస్త్రి గారు ఆ సమయంలో కేవలం ఒక మామూలు ముతక పంచెలో కనపడ్డారు... చాలా బేలగా మారుతీరావు గారి వేపు చూస్తున్నారు... దుంఖాన్ని దిగమింగుకొని మారుతీరావు గారు మళ్ళీ పలక వేపు చూసారు ...

"మారుతీ రావూ... నా పరిస్థితులేమి బాగా లేవయ్యా... చాలా ఇబ్బందుల్లో వున్నాను... ఓ ఇరవై వేలు అర్జెంటుగా కావాలి... అందుకని నా కారు అమ్మేద్దామనుకుంటున్నాను... నీ ఎరకలో ఎవరన్నా స్తితిమంతులుంటే చెప్పు... అమ్మేద్దాం... నాకు తెలుసు నువ్వు చాలా బిజీగా ఉంటావని... కానీ తప్పలేదు.. అందుకే పొద్దున్నే వచ్చినిన్ను ఇబ్బంది పెట్టాల్సోచ్చింది... నా కోసం ఈ పని చేసి పెట్టవయ్యా మారుతీ రావు.. .గొప్పసాయం చేసిన వాడివవుతావ్..."

తన కనురెప్పలు వాలిస్తే ఎక్కడ తన కంట్లో నీళ్ళు జారిపది మాస్టారిని మరింత బాధ పెడతాయో అని తనను తాను సంభాళించుకుంటూ మారుతీ రావు గారు శాస్త్రి గారి మొహంలోకి కాసేపలా తదేకంగా చూస్తూ ఉండిపోయారు..

ఆ తరువాత మెల్లిగా లేచి వెళ్ళి శాస్త్రిగారి కాళ్ళ దగ్గర కూర్చొని "..మాస్టారు... మీ పరిస్థితి నాకర్థమయ్యిందండీ.. కాని కారు గూడా లేకుండా ఈ మహా పట్టణం లో ఏమవస్థలు పడతారు చెప్పండి... మీరు అన్యధా భావించనంటే ఒక్క మాట... చెప్పమంటారా.."

అంటూ ఆయన మొహంలోకి చూస్తూ ఆయన అనుమతి కోసమన్నట్టుగా ఆగారు మారుతీరావు గారు...

అదే పేలవమయిన నవ్వుతో చెప్పు అన్నట్టుగా తలాడించారు శాస్త్రిగారు...

"..ఆ ఇరవై వేలు నేను సర్దుబాటు చేస్తాను... ఆహా... అప్పుగానే లెండి.. .మీకు వీలు చిక్కినపుడు ఇద్దురు గాని... నాకేమంత తొందరా లేదు అవసరమూ లేదు... దయచేసి నా మాట కాదనకండి ..."

వెంటనే తల వొంచుకొని శాస్త్రిగారు మళ్ళీ పలక మీద ఏదో రాసి మారుతీరావు గారికి చూపించారు ...

"..నా వల్ల నువ్వు ఇబ్బంది పడటం నాకిష్టం లేదయ్యా..".. ఇదీ శాస్త్రిగారు రాసింది..

"....అయ్యా నాకేమి ఇబ్బంది లేదండి... తండ్రి లాంటి వారు మీరు ఇబ్బందుల్లో వుంటే చూస్తూ వూరుకోమంటారా చెప్పండి.. .అయినా దేవుడి దయ వలన నా పరిస్థితి బానే వుంది లెండి... ఇంక మీరు

దయ చేసి నా మాట కాదనకండి..."

దానికి శాస్త్రిగారు ముందు కాస్త పేలవంగా నవ్వినా ఆ తరువాత కష్టాల నెన్నిటినో కడుపులో దాచుకొని తన పిల్లల కోసం ఒక నాన్న నవ్వే ప్రేమ పూరితమైన చిరు నవ్వు నవ్వారు.. దాన్నే అంగీకార సూచకంగా భావించి మారుతీరావు గారన్నారు..

"..మాస్టారూ..ప్రస్తుతానికి అంత డబ్బు ఇంట్లో లేదు... బ్యాంకు నుండి తీసుకురావాలి.. సాయంత్రం కల్లా తెప్పించి పెడతాను... పర్వాలేదు కదా..."

".. ఏమీ పర్వాలేదు " అన్నట్టుగా తలూపారు శాస్త్రిగారు...

ఆ తర్వాత ఇంక బయలుదేరుతాను అన్నట్టుగా లేచి నిలబడ్డారు.. వారిని సాగనంపటం కోసం గేటు దాకా వచ్చి కార్ డోర్ తీసి నిలబడ్డారు మారుతీరావు గారు...

కారెక్కుతుండగా ఆగి మళ్ళీ తన చేతిలో పలక మీద ఏదో రాసి మారుతీరావు గారికి చూపించారు శాస్త్రిగారు...

"..డబ్బులు తీసుకోవటానికి సాయంత్రం నన్ను ఎన్నింటికి రమ్మంటావ్..".. ఇదీ దాని సారాంశం...

గుండె పగిలినట్టుగా అనిపించింది మారుతీ రావు గారికి.... కొద్దిగా నొచ్చుకున్నట్టుగా అన్నారు..

"..అయ్యా డబ్బులు తీసుకోవటం కోసం మిమ్మల్నిమళ్ళీ మా ఇంటికి రప్పించి పాపం మూట గట్టు కోమంటారా చెప్పండి ... మీకా శ్రమ అక్కర్లేదు లెండి.... సాయంత్రం నేనే డబ్బు తీసుకొని మీ ఇంటికి వస్తాను... సరేనా "

"..సరే...అట్లాగే రావయ్యా ... వచ్చి భోంచేసి వెళ్ళదు గాని...'"

అని మళ్ళీ పలక మీద రాసి మారుతీరావు గారికి చూపించి కారెక్కారు శాస్త్రిగారు..

వారి సంస్కారానికి ఓ నమస్కారం చేసి వారిని సాగ నంపారు మారుతీ రావు గారు...

అన్నట్టుగానే ఆ సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో డబ్బు తీసుకుని శాస్త్రి గారింటికి వెళ్ళారు మారుతీ రావు గారు...

వారికి డబ్బులందించి భోజనాలు చేసి బయలు దేరే ముందు శాస్త్రి గారితో అన్నారు మారుతీ రావు గారు...

"..మాస్టారు... మరీ చనువు తీసుకుంటున్నాననుకోకపోతే ఓ మాట అడగచ్చంటారా.."

అడుగు అన్నట్టుగా తలూపారు శాస్త్రిగారు..

"..వీలయితే మళ్ళీ పాటలు రాస్తారా.... నవతా వాళ్ళేదో కొత్త సినిమా తీస్తున్నారుట... దాంట్లో ఏదో తెలుగు భాషకు సంబంధించి ఒక పాట పెడదా మనుకుంటున్నారట.. మిమ్మల్ని అడిగే ధైర్యం లేక నన్నడిగారు.. కనుక్కొని చెబుతానన్నాను... మళ్ళీ పాటలు రాయకూడదూ.. మీకూ కాస్త వ్యాపకంగా వుంటుందీ.. ఏదో వేన్నీళ్ళకు చన్నీళ్ళ మాదిరి నాలుగు రాళ్ళూ వస్తాయి... ఏం చెప్పమంటారు..."

"..సరే కానీవయ్యా.. నీ మాటెందుకు కాదనాలి..".. పలక మీద రాసి చూపించారు శాస్త్రిగారు...

ఆ తర్వాత కొన్నాళ్ళకు నవతా వారి సినిమా సాంగ్ రికార్డింగ్ AVM స్టూడియో లో ప్రారంభ మయ్యింది...

ఆ రోజక్కడ రికార్డింగ్ లో సంగీత దర్శకులు జి కే వెంకటేష్ గారు, కృష్ణశాస్త్రి గారూ, ప్రముఖ గాయని సుశీల వంటి మరి కొంతమంది ప్రముఖులు కూడా వున్నారు... అందరూ కూడా శాస్త్రిగారు రావటంతో చాల సంతోషంగా వున్నారు..

ముందుగా శాస్త్రిగారి పాటతో రికార్డింగ్ మొదలయ్యింది..

మధ్యలో శాస్త్రి గారు రాసిన చరణంలో ఎక్కడో ఒక చిన్న డౌట్ వచ్చి జి కే వెంకటేష్ గారు శాస్త్రి గారి దగ్గర కొచ్చి ఏదో చెవిటి వాళ్ళతో మాట్లాడుతున్నట్టుగా చాలా పెద్ద గొంతుతో అడిగారు

"...అయ్యా మీరిక్కడేదో రాసారు గాని మీటర్ ప్రాబ్లం వచ్చేలా ఉంది... ఈ పద మేమన్నా కొంచెం మార్చ గల రేమో చూస్తారా " అని...

దానికి సమాధానంగా శాస్త్రిగారు తన పలక మీద ఇలా రాసారు..

".. దానికేం భాగ్యం..తప్పకుండా మారుస్తాను.. కానీ ఒక చిన్న విషయం... నేను మాట్లాడలేను గాని నా చెవులు బాగానే పని చేస్తున్నాయి... గమనించ గలరని మనవి "..

అది చదివి జి కే వెంకటేష్ గారితో సహా అక్కడున్న పెద్దలందరూ శాస్త్రి గారి సెన్స్ అఫ్ హ్యూమర్ కి హాయిగా నవ్వేశారు...

ఆ తర్వాత శాస్త్రిగారి పాటతో సహా ఆ సినిమాలోని అన్ని పాటల రికార్డింగ్ పూర్తయిపోయాయి.. సినిమా కూడా షూటింగ్ ముగించుకొని విడుదలై పెద్ద హిట్ అయ్యింది..

ఆ సినిమా కోసం శాస్త్రిగారు రాసిన పాట ఇప్పటికీ మన తెలుగు రాష్ట్రంలో ఏదో మూల వినపడుతూనే ఉంది ..

ఆ పాటే...

అమెరికా అమ్మాయి లోని "...పాడనా తెలుగు పాట...పరవశమై మీ ఎదుట మీ పాట.."

ఉపసంహారం

ఆ తర్వాత కృష్ణశాస్త్రి గారు మరికొన్ని మంచి పాటలు మనకందించారు... వాటిల్లో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి... "..ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం..",(కార్తీక దీపం) "..గోరింటా పూసింది కొమ్మా లేకుండా...",(గోరింటాకు) "..ఈ గంగకెంత దిగులు...ఈ గాలి కెంత గుబులు..",(శ్రీరామ పట్టాభిషేకం) "..ఆకులో ఆకునై పూవు లో పూవునై.." (మేఘసందేశం) మొదలైనవి... ఆ తరువాత వయోభారం వలన శాస్త్రిగారు పాటలు రాయటం పూర్తిగా తగ్గించేసారు..

"..నారాయణ నారాయణ అల్లా అల్లా... నారాయణ మూర్తి నీ పిల్లల మేమెల్లా.." అంటూ పరబ్రహ్మ ఒక్కడే అని ఎంతో సున్నితంగా లోకానికి చాటి చెప్పిన విశ్వకవి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు తన కవితామృతం తో తెలుగు శ్రోతల్నిఅమరుల్నిచేసినా తాను మాత్రం నింపాదిగా మనదరినీ వదిలేసి "..నీ పదములే చాలూ... రామా... నీ పద ధూళియే పదివేలూ .." అంటూ ఫిబ్రవరి 24,1980 నాడు తన శ్రీరాముడి పాద ధూళిని వెతుక్కుంటూ వేరే లోకాల వేపు సాగిపోయారు..

ముక్తాయింపు

"...అంత లజ్జా విషాద దురంత భార... సహనమున కోర్వలేని ఈ పాడు బ్రతుకు... మూగవోయిన నా గళమ్మునను గూడ... నిదుర వోయిన సెలయేటి రొదలు గలవు...ఇక నేమాయె..." - కృష్ణపక్షం


ప్రజా సంక్షేమం సరే... రాష్ట్ర క్షేమం అక్కర్లేదా??

అసలే ఖాళీ ఖజానా వెక్కిరిస్తోంది. పాత ముఖ్యమంత్రి చేసిన అప్పులపై వడ్డీలు కట్టడానికే గుడ్లు తేలేయాల్సి వస్తోంది. రాష్ట్ర జిడిపి ఎంత అని ఎవరైనా అడిగితే మొహం చాటేయాల్సి వస్తోంది. ఇటు ముఖ్యమంత్రిని చూస్తే రోజుకో స్కీము ప్రకటించేస్తున్నాడు. ఎన్నికల ప్రచారంలో చెప్పినవీ, చెప్పనవీ అన్నీ టపటపా ప్రకటించేస్తున్నాడు. రేపనే రోజు ఉంటుందో లేదో తెలియనంత ఆతృతగా, ఆబగా అమలు చేసేస్తూ దానకర్ణుడికే కంగారు పుట్టిస్తూ చరిత్రలోకి ఎక్కాలన్న తాపత్రయం కనబరుస్తున్నాడు. ఇవేళ రాత్రి ముఖ్యమంత్రి గారి కలలో ఏ ఐడియా దూరకుండా చూడు వెంకటరమణా అని ఆర్థికమంత్రి పడుక్కోబోయే ముందు ప్రార్థించే పరిస్థితి వచ్చింది.

అన్నీ ఒకేసారి చేయాలా? – నాయకులు వాగ్దానాలు చేస్తారు. వాటిల్లో సగం నెరవేర్చినా జనాలు మహదానంద పడతారు. అవి కూడా అధికారంలోకి వచ్చిన ఏ మూడో ఏడో మొదలుపెట్టి, నాలుగో ఏడులో కాస్త గట్టిగా చేసినా తృప్తి పడతారు. మొన్న ఢిల్లీలో అరవింద్ పదవీకాలం పూర్తయ్యేందుకు ఆర్నెల్ల ముందే కొన్ని పథకాలు పెట్టినా, జనాలు ఫిర్యాదు చేయకుండా 90% సీట్లు కట్టబెట్టారు. మరి అలాటిది జగన్ అన్నీ మొదటి ఏడాదిలోనే ఎందుకు చేయాలి? మాట తప్పని– మడమ తిప్పని... సింగ్రోమా? ఏడాదికి కొన్ని చొప్పున చేస్తూ పోతే ఆ బిరుదు ఎవరైనా ఎత్తుకుపో తారా? 'అధికారంలోకి రాగానే నా మొదటి సంతకం ఫలానా ఫైలు మీదే' అని చాలామంది నాయకులు ప్రకటిస్తారు. కొందరు చేస్తారు కూడా. అయితే తర్వాత కొన్నాళ్లకు దాని విధివిధానాలు బయటకు వస్తాయి – ఫలానాది వుంటే యిది వర్తించదు, ఇంతే యిస్తాం, యింతమందికే యిస్తాం అంటూ భారం తగ్గించుకుంటూ వస్తారు. జనాలు తిరగబడరు. సరేలే అనుకుంటారు.

ఏ పథకమైనా పేపరు మీద బాగానే ఉంటుంది. ఆర్థిక వేత్తలు, ప్రణాళికా శూరులు ఏవేవో లెక్కలు వేసి చేసేయచ్చు అంటారు. అమలు చేసేటప్పుడే కష్టం తెలుస్తుంది. వ్యవస్థలో అడుగడుగునా లోపాలుంటాయి. దొంగ లబ్ధిదారులు దూరేస్తారు. తడిసి మోపెడవు తుంది. అప్పుడు దానిలో మార్పు చేయాల్సి వస్తుంది. కొన్ని రైడర్స్ పెట్టాల్సి వుంటుంది. అందుకే పైలట్ ప్రాజెక్టుగా కొన్ని జిల్లాలలో ప్రవేశపెట్టి, లోపాలు సవరించుకుని, తక్కిన జిల్లాలకు విస్తరించాలి. ఫలితాలు బాగా వస్తున్నాయంటే తక్కిన వర్గాలకు విస్తరించాలి. అలాగే ఓ నాలుగు పథకాలు ముందుగా పెట్టి అవి విజయవం తమైతే, నిలదొక్కుకుంటే, వచ్చే ఏడాది రాష్ట్రఆదాయం పెరిగితే మరో నాలుగు పథకాలు పెట్టవచ్చు. అదేమీ కాకుండా 'ఇక్కడ ప్రజాధనం దోచిపెట్టబడును' అని బోర్డు పెట్టుకుని అన్నీ ఒకేసారి, పప్పుబెల్లా ల్లాగా పంచేస్తూ ఉంటే ఎలా? ఈ పథకాలను యిదే రీతిలో ఐదేళ్ల పాటు నిర్వహించగలరా? ఏడాదేడాదికి లబ్ధిదారులు పెరిగితే తట్టుకోగలరా?

ఖర్చు చూస్తే బోల్డు – మధ్యతరగతి జీవులం మనకు తెలుసు. ఈ నెలలో బట్టలు కొంటే, వచ్చే



నెలలో కుట్టించుకుంటాం. రెండూ ఒకే నెలలో భరించడం కష్టం. మధ్యలో ఏ అనారోగ్యమో వచ్చి ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తే కుట్టించుకోవడం వాయిదా పడుతుంది. మనకు బోల్డు పండుగలు సంకురాత్రికి కాకపోతే శివరాత్రికి కొత్త బట్టలు వేసుకుంటాం. మనం మధ్యతరగతి అయితే ఆంధ్రప్రభు త్వంది దిగువ మధ్యతరగతి. రాబోయే ఖర్చు చూస్తే మనకే దిగులు వేస్తుంది. ఖర్మం చాలక మధ్యలో హుదూద్ లాటి విపత్తు వస్తే వీళ్ల లెక్కలన్నీ ఏమవుతాయో అని భయమేస్తుంది. ప్రకృతి విపత్తు మాట సరే, సొంతంగా తెచ్చిపెట్టుకున్న విపత్తు ఒకటి వుంది. రాజధాని మార్పు! ఎంత సంసారపక్షంద్కెనా కొత్త రాజధాని కట్టాలిగా. దానికి కనీసం 5 వేల కోట్లయినా కావలసి వస్తాయి కదా! అది భవనాలకు, రోడ్లకు అనుకుంటే ఆ పైన ఉద్యోగుల హిరణ్యాక్షవరాలు తీర్చాలి.

అమరావతిలో ఏద్కెనా ఉంచినా, ఉంచకపోయినా రైతులిచ్చిన భూములను డెవలప్ చేసి యివ్వక తప్పదు కదా! లేకపోతే కోర్టు ఊరుకోదు. దానికే లక్ష కోట్లవుతుంది. అదీ పాత ప్రభుత్వం రెండేళ్ల క్రితం వేసిన లెక్క. ఆలస్యమైన కొద్దీ ఖర్చు పెరుగుతుంది. పైగా కోర్టు నష్టపరిహారం కూడా యిమ్మనవచ్చు. ఇంతేనా? పోలవరం ఒకటి 2021 కల్లా పూర్తి చేసేస్తామంటున్నారు. దానికి డబ్బు కావాలి. ఇప్పటిదాకా పాత ప్రభుత్వం హయాంలో జరిగిన పనులకు బిల్లులు చెల్లించకుండా తొక్కిపట్టారు. మాకు నమ్మకం లేదు, వెరిఫై చేయాలంటూ కాలక్షేపం చేశారు. ఎంతకాలం చేయగలుగుతారు? ఎప్పటికో అప్పటికి చెల్లించాలి కదా. లేకపోతే కోర్టు జరిమానా విధించవచ్చు. అన్నట్టు యింకో విషయం మర్చిపోయాను. దేశంలో ఎక్కడా లేని విధంగా యీ రాష్ట్ర ప్రభుత్వానికి రెండు డజన్లకు మించి సలహాదారులున్నారు. వారి జీతభత్యాలకే బోల్డు అవుతుంది.

మరోటండోయ్, స్మశానాలతో సహా ప్రభుత్వ ఆస్తులన్నిటిపై వైసిపి పార్టీ రంగులేయడానికే వేలాది కోట్లు ఖర్చవుతున్నాయి. వాటికీ డబ్బు కావాలి. కోర్టు వాళ్లు అభ్యంతర పెడితే ఎన్నికల వేళ వాటిని గోకేయడానికో, ముసుగేయడానికో యింకా ఖర్చు పెట్టాలి. ముఖ్యమంత్రిగారు దావోస్, లావోస్ అంటూ విదేశాలు తిరగటం లేదు, రైతులను సింగపూరుకు తిప్పటం లేదు కాబట్టి కానీ ఆ ఖర్చూ చేరేది. కేంద్రం చూస్తే ఎంగిలి చేయి కూడా విదల్చడం లేదు. ఎన్‌డిఏలో చేరతాం అని ఊరించినా, చేరితే చేరండి కానీ డబ్బు మాత్రం అడక్కండి అంటారు వాళ్లు. టిడిపికి మంత్రిపదవులు యిచ్చాం కానీ, రాష్ట్రానికి నిధులిచ్చామా? ఇప్పుడు మీకిస్తే వాళ్లు నొచ్చుకోరా? అంటారు.

తొమ్మిది అంకె దాటిపోయింది స్వామీ! – ఇలాటి పరిస్థితుల్లో కూడా జగన్ పొద్దున్న లేస్తే నవరత్నాలంటారు. ఎన్నికల మానిఫెస్టోలో చెప్పిన రత్నాలేమిటి? వైయస్సార్ రైతు భరోసా, ఫీజు రీఎంబర్స్‌మెంటు, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, దశలవారీ మద్యనిషేధం, జగనన్న అమ్మ ఒడి, మహిళలకు వైయస్ ఆసరా, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ మహిళలకు వైయస్సార్ చేయూత, పేదలకు ఇళ్లు, వైయస్సార్ పెన్షన్ కానుక. వీటికి చేర్చిన కొత్త పథకాలు – ప్రభుత్వ స్కూళ్ల స్థితిగతులను మెరుగుపరిచే నాడు–నేడు, జాలర్ల కోసం వైయస్సార్ మత్స్యకార నేస్తం, ఆరోగ్యశ్రీకి కొనసాగింపుగా వైయస్సార్ ఆరోగ్య ఆసరా, వైయస్సార్ నేతన్న నేస్తం, వైయస్సార్ వాహనమిత్ర, వైయస్సార్ కంటి వెలుగు, వైయస్సార్ లా నేస్తం. ఇవి కాక యింకా ఏవో ఉన్నాయేమో, గుర్తు రావటం లేదు. నాకే కాదు, మంత్రులకు కూడా గుర్తు రావేమో, అన్ని పెట్టేశారు.

వీటి ద్వారా కోటిన్నర కుటుంబాలకు 23,767 కోట్ల రూ.లు పంపిణీ అవుతుందని ప్రభుత్వం చెప్పుకుంటోంది. కోటిన్నర కుటుంబాలంటే, కుటుంబానికి నలుగురు సభ్యులున్నారనుకుంటే ఆరు కోట్ల మంది లబ్ధిదారులున్నారన్నమాట. రాష్ట్ర జనాభా చూడబోతే 5.40 కోట్లు! అంటే కొంతమందికి రెండేసి పథకాలు దక్కుతున్నాయన్నమాట. ఇవి కాక ఎప్పణ్నుంచో వస్తున్న పథకాలు కొన్ని వుంటాయి కదా! 'మన బియ్యం' పేర రూపాయికి కిలో బియ్యం చొప్పున కుటుంబానికి 20 కిలోల బియ్యం, 'ముఖ్యమంత్రి యువనేస్తం' పేర నెలకు రూ.2 వేల చొప్పున 4.30 లక్షల మందికి నిరుద్యోగ భృతి వంటివి! అవి మానేయడం కష్టం. పేర్లు మార్చగలుగుతారు కానీ మొత్తం ఎత్తేయలేరు కదా! 13 జిల్లాల, 25 ఎంపీల, రాజధాని సైతం కట్టుకోలేని, పరిశ్రమలు లేని చిన్న రాష్ట్రానికి ఇంత భారం అవసరమా? ఎవరడిగారని?

తాయిలాలతో పైకి వచ్చిన ప్రాంతీయపార్టీలు – స్వాతంత్ర్యం వచ్చినపుడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెసు పార్టీ దీర్ఘకాలిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు అనేకం చేపట్టింది. ఆనకట్టలు, డ్యామ్‌లు, కాలువలు, భారీ పరిశ్రమలు, కొత్త నౌకాశ్రయాలు, కొత్త విమానాశ్రయాలు, గనులు, రోడ్లు, ఆసుపత్రులు, బడులు, కాలేజీలు, మంచినీటి ఏర్పాట్లు, డ్రైనేజి సౌకర్యం, విద్యుత్ ప్రాజెక్టు, మిలటరీకి ఆయుధాలు, హరిత విప్లవం పేర కొత్త వరివంగడాలు, శ్వేత విప్లవం పేర పాల ఉత్పత్తి పెంచడం, కొత్త రైల్వే ల్కెనులు, కొత్త టెలిఫోను వైర్లు, .. యిలా సవాలక్ష పనులు మొదలుపెట్టారు. ప్రతి రాష్ట్రమూ మాకు ముందంటే మాకు ముందన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లా మాకే కావాలంటే మాకన్నారు. అందుకని అనేక చోట్ల శంకుస్థాపనలు చేసేసి, పనులు మొదలుపెట్టారు. అయితే ఉన్న నిధులు తక్కువ. ప్రజలకే ఆదాయం తక్కువ, వారి నుంచి పన్నుల ద్వారా ఇంకేం వస్తుంది? పైగా మద్యనిషేధం, కుటుంబనియంత్రణ, టీకాలు వంటి సామూహిక సంక్షేమపథకాలకు కూడా వెచ్చించాలి. వీటివలన వచ్చే డబ్బును తలా కాస్తా పంచడం మొదలుపెట్టారు.

దీనివలన నిర్మాణవ్యయం పెరుగుతూ పోయింది. రెండోది వీటి ఫలితాలు రావడంలో ఆలస్యం కావడంతో జనాల్లో అసహనం కలగసాగింది. మా గ్రామానికి విద్యుత్ యిచ్చారంటే, మా వూళ్లో బడి పెట్టారంటే నాకు వ్యక్తిగతంగా ఏం లాభం? నా జేబులోకి ఏమైనా వస్తోందా? అని ఆలోచించే జనాలు పెరిగారు. దీన్ని పసిగట్టింది, తమిళనాట వెలసిన ప్రాంతీయ పార్టీ డిఎంకె. 1967 ఎన్నికలలో తాము అధికారంలోకి వస్తే రూపాయికి మూడు పడులు (పడి అంటే రమారమి సోల) బియ్యం యిస్తాం అనే నినాదం అందుకుంది. ఉన్న కాస్త డబ్బు యిలాటివాటికి యిచ్చేస్తే చేపట్టిన ప్రాజెక్టుల గతేమిటి? అలా యివ్వకూడదు అని కాంగ్రెసు వాదించింది. జనాలకు కాంగ్రెసు

వాదన నచ్చలేదు. డిఎంకె హామీయే నచ్చింది. వాళ్లని గెలిపించారు. గెలిచాక డిఎంకె రూపాయికి పడి బియ్యమే యిచ్చింది. జనాలు సరేలే అనుకున్నారు. అది చూసి కాంగ్రెసు మేమూ యిస్తాం అనలేక పోయింది. ఎందుకంటే యిక్కడ యిస్తే పక్క రాష్ట్రంలో ఉన్న కాంగ్రెసు యూనిట్‌పై ఒత్తిడి పడుతుంది.

భారం మీకు, పేరు మాకు – ఇదే జాతీయ పార్టీ కున్న కష్టం. దేశమంతటికీ ఒకే విధానం అమలు చేయాలి. ప్రాంతీయ పార్టీకి ఆ బాధ్యత లేదు. ఆ రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల బట్టి, ఓటు బ్యాంకు బట్టి, తమకు అనువైన తాయిలాలను చూపి ఓటర్లను ఊరించవచ్చు. ఇక ప్రాంతీయపార్టీలన్నీ తాయిలాల పార్టీలుగా మారి, జాతీయ పార్టీలకు పోటీ యివ్వసాగాయి. జాతీయ పార్టీలు ఓడిపోయి, కేంద్రంలో కూడా ప్రాంతీయ పార్టీ కూటమి అధికారంలోకి వచ్చింది. దీర్ఘకాలిక ప్రాజెక్టులకు సెలవిచ్చేసి, ఋణమాఫీలనీ, పంటకు మద్దతు ధరలనీ యిలా తాత్కాలికాల మీద పడ్డారు. చివరకు ఎలా తేలిందంటే రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు 'సంక్షేమ పథకాలతో మేం జనాల్ని ఆకట్టుకుని ఓట్లేయించుకుంటాం, దీర్ఘకాలిక ప్రాజెక్టులు కూడా అవసరమే కానీ ఆ భారం మీదే' అని కేంద్రాన్ని పాలిస్తున్న జాతీయ పార్టీలకు చెప్పసాగాయి.

ఇలా అయితే తమకు ఎన్నటికీ పేరు రాదని భయపడిన జాతీయ పార్టీలు తాము కూడా కొన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, రాష్ట్రాలను అమలు చేయమన్నాయి. అయితే యీ ప్రాంతీయ పార్టీలు ఆ పేర్లకు బదులు తమ పేర్లు పెట్టేసి, అవి తాము పెట్టిన పథకాలే అనే యింప్రెషన్ కలిగిస్తున్నాయి. జాతీయ పార్టీ రాష్ట్ర యూనిట్లు 'ఇది అన్యాయం, అది మా డబ్బు, మీదని ఎలా చెప్పుకుంటారు?' అని గగ్గోలు పెట్టసాగాయి. 'మీకేమైనా డబ్బు చెట్లకు కాస్తున్నాయా? మేం పంపించిన డబ్బేగా మాకు తిరిగి యిస్తున్నది?' అని ప్రాంతీయ పార్టీ ప్రభుత్వాలు అనసాగాయి. మరి ఆ డబ్బులో జాతీయ అవసరాల్కెన పథకాలకు ఖర్చు పెడుతున్నాంగా, విడిగా మీకు యిన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు డబ్బు కావాలంటున్నారుగా, విపత్తులొస్తే మా దగ్గరే డిమాండ్ చేస్తున్నారుగా, అవన్నీ పోగా మేం కొంత సంక్షేమానికి యిస్తే వాటికి మీ పేర్లు పెట్టడమే కాక, యింకా పైన మీ పథకాలు పెట్టి, 'బజెట్ లోటు ఏర్పడింది, భర్తీ చేయండం'టే మేమెందుకు యిస్తాం?' అంటున్నాయి కేంద్రంలో ఉన్న జాతీయ పార్టీలు.

తాయిలాలకు ఓట్లు రాల్తాయా? – చివరకు తేలిందేమిటంటే ఓట్లు రాలాలంటే సంక్షేమ పథకాలను గుప్పించడమే, రేపటి సంగతి, ఎల్లుండి సంగతి దేవుడు చూసుకుంటాడు అనే ధోరణిలో ప్రాంతీయ పార్టీలు పడ్డాయి. కానీ తమాషా ఏమిటంటే తాయిలాలు యిచ్చిన పార్టీలన్నీ ఎన్నికలలో గెలవటం లేదు. రెండు ప్రాంతీయ పార్టీలున్న చోట, పోటీపడి ఒకర్ని మించి మరొకరు హామీలు గుప్పించినా, తక్కువ పథకాలు యిస్తానన్న వారిని గెలిపించిన సందర్భాలున్నాయి. తెలంగాణ అసెంబ్లీకి కెసిఆర్ మళ్లీ గెలిస్తే పథకాలు గెలిపించాయన్నారు, ఇప్పుడు దిల్లీలో అరవింద్ గెలిచినా అదే మాట అన్నారు. కానీ ఆంధ్రలో బాబు విషయంలో అది జరగలేదు. రేపు జగన్ విషయంలో జరుగుతుందో లేదో స్థానిక ఎన్నిక ఫలితాలు సూచిస్తాయి.

తెలుగునాట సంక్షేమ పథకాలనగానే ఎన్టీయారే గుర్తుకు వస్తారు. 'దీర్ఘకాలిక పథకాలు ఫలితాలను యిచ్చేదాకా యీ సామాన్యుడు బతికి ఉండాలిగా' అంటూ 2 రూ.లకు కిలో బియ్యం, ఉచిత వస్త్రాలు వగైరా మొదలుపెట్టారు. అవి విజయవంతం కావడంతో తెలుగునాట వీటి జోరు పెరుగుతూ పోయింది. మార్కెట్లో రూ.3.50 ధర ఉన్నపుడు బియ్యం రూ.2కు యిచ్చారు. ఇప్పుడు రూ.60 ఉన్నపుడు రూపాయికి యిస్తాననడమేమిటి? ధైర్యం చేసి ఏ పాతిక రూపాయలో చేయవచ్చు కదా అంటే యిది పులి స్వారీ లాటిది. ఎక్కడమే తప్ప దిగగలిగే ప్రశ్న లేదు. పథకం తీసేస్తే జనాలకు కోపాలు వస్తాయని భయం. ఇప్పుడు బోగస్ తెల్లకార్డు, రేషన్ కార్డు ఏరేస్తూంటే ప్రతిపక్షం వాళ్లే కాదు, స్వపక్షం వాళ్లూ గోల, ఓట్లు పోతాయని! నిజానికి అవి పేదలకు ఉద్దేశించిన పథకాలు. డబ్బున్నవాళ్లూ తీసేసుకుంటే అందాల్సిన వాళ్లకు అందవు కదా!

కలుపు ఏరడానికి ధైర్యం ఉండాలి – ఆంధ్రజ్యోతి ఓ కథనంలో 'తెల్ల కార్డున్న వాళ్లు స్థలాలు కొనకూడదంటే ఎలా? ఆ మాట కొస్తే రాష్ట్రంలో 95% మందికి ఆ కార్డులున్నాయి.' అని రాసింది. ఆ అంకె నిజమే అయితే అంతకంటె సిగ్గుచేట్కెనది మరోటి ఉండదు. రాష్ట్రంలో 5% మంది మాత్రమే ధనికులుంటే యిన్ని నగల షాపు, బట్టల షాపులు ఎలా ఉంటాయి? బోగస్ పేదలను ఏరివేస్తే మిగిలే డబ్బుతో సంక్షేమ పథకాలు కొన్నిటికి నిధులు సమకూరుతాయి. ఓట్ల భయం లేకుండా అది చేసినవాడే మొనగాడు. రాజీపడితే సగటు నాయకుడే! కొన్ని దండగమారి పథకాలుంటాయి. వాటిని ఎత్తివేయడానికీ ధైర్యం ఉండాలి. అన్న క్యాంటీన్ పేదల కొరకు ఉద్దేశించినది. కానీ చాలా మంది గృహస్తులు అవి వచ్చాక యిళ్లల్లో వంటలు మానేసి, అక్కడకు వెళ్లి తినేసి, అలా మిగిలిన డబ్బు సినిమాకు, షికార్లకు ఖర్చు పెట్టారని విన్నాను. అవి ఎత్తేస్తే ఆందోళన రాకపోవడానికి అదో కారణమేమో!

ముఖ్యంగా మనం తెలుసుకోవసినది – సంక్షేమ పథకాలకు, దీర్ఘకాలిక పథకాలకు తూకం ఉండాలి. ఏది ఎక్కువైనా ప్రజలను సంతుష్టి పరచడం కష్టమే. పెళ్లిళ్లకు, పేరంటాలకు, పండగలకు, తీర్థయాత్రలకు ప్రభుత్వం యివ్వనక్కరలేదు. ఇవ్వకపోయినా జరిగేవి జరుగుతాయి, యివ్వడం వలన వాళ్ల అట్టహాసం పెరుగుతుందంతే! కూడూ, గూడూ, గుడ్డ, విద్య, వైద్యం వీటిపై దృష్టి పెడితే చాలు. ఇవి కూడా వ్యక్తిగతంగా యివ్వవలసిన పని లేదు. వాటి ధరలు ప్రజలకు అందుబాటులో పెడితే చాలు. ఉచితంగా ఆశించకుండా సబ్సిడీలో కొనుక్కోవడం అలవాటు చేయాలి వారికి. విద్య, వైద్యం చాలా ఖరీద్కెన వ్యవహారాలు అయ్యాయి. ఆరోగ్యశ్రీతో కార్పోరేట్ ఆసుపత్రులను పరిపుష్టం చేసేబదులు ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలి. మందులు చౌకధరలో దొరికే ఏర్పాటు చేయాలి. కార్పోరేట్ కాలేజీలు ఫీజుల పేరుతో చేసే దోపిడీ ఆపి, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో మేల్కెన విద్య అందేట్లు చూసి, సామాన్యులను అక్కడకు ఆకర్షించాలి. అరవింద్ కేజ్రీవాల్ స్కోర్ చేసినది అక్కడే – అందుబాటులో విద్య, వైద్యం! తాగునీరు, విద్యుత్ ధరలు తగ్గించడం బోనస్ అయింది.

వివక్షత చూపకపోవడం మెప్పించింది – పథకాల్లో మరో

కోణమేమిటంటే కాస్ట్ ఆఫ్ డెలివరీ మెకానిజం, డబ్బు పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసిన వ్యవస్థ నిర్వహణ ఖర్చు! అదృష్టవశాత్తూ పాత పాలకుల ముందుచూపు వలన కంప్యూటరైజేషన్, ఆధార్ వంటి వ్యవస్థలు ఏర్పడి డబ్బు వారికి నేరుగా చేరే సౌకర్యం ఏర్పడింది. ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంట్లు సబ్మిట్ చేయడం, వాటిని వెరిఫై చేయగలగడం జరుగుతోంది. డబ్బు నేరుగా పేదలకు చేరినప్పుడు వాటిని ఖర్చు పెట్టడం ద్వారా, వస్తూత్పత్తి పెరిగి ఆర్థిక వ్యవస్థ బాగుపడుతుంది. డిజిటలైజేషన్‌లో మరో సౌకర్యం ఏమిటంటే లబ్ధిదారుడు ఏ పార్టీ వాడు, మనవాడా? పరాయివాడా? వంటివి తెలుసుకునే వీలుండదు. వాణ్ని ఎలిమనేట్ చేయలేరు.

బాబుకి అప్రతిష్ఠ తెచ్చిపెట్టినవి జన్మభూమి కమిటీలు. జగన్ హయాంలో ఆ భయం లేకుండా అన్ని పార్టీల వారికీ అందడంతో ఆ దిశగా ఫిర్యాదు వినబడటం లేదు. ఉన్న ఫిర్యాదులన్నీ కార్డులు రద్దు చేస్తున్నారనే! అదీ మా పార్టీ వాళ్లవి అనటం లేదు. అంటే మీ పార్టీ వాళ్లు యిన్నాళ్లూ అన్యాయంగా లబ్ధి పొందారన్నమాట అంటారు. ఆధార్‌తో అనుసంధానించినప్పుడు వాడి ప్యాన్ నెంబరెంతో, వాడికి ఏ వాహనముందో, ఎంత ఆస్తి ఉందో, తెల్ల కార్డుకి, యీ సంక్షేమ పథకానికి అర్హుడో కాదో చటుక్కున తెలిసిపోతుంది. తెలిసినా అనర్హులను తొలగించలేదంటే పొలిటికల్ విల్, ధైర్యం, నిజాయితీ లేవని అర్థం.

మందుబాబుపై చంద్రబాబు సహానుభూతి – సంక్షేమ పథకాలు క్యారట్లయితే, ప్రజలకు స్టిక్ కూడా చూపించాలి. బియ్యం మీద, చదువు మీద ఆదా చేసిన డబ్బును సారా మీద తగలేస్తానంటే ఆ వీలు లేకుండా చేయాలి. తరచి చూడండి, జరిగే నేరాల్లో 80–90% కేసుల్లో మద్యం పాత్ర ప్రత్యక్షంగానో, పరోక్షంగానే ఉంటోంది. ఆడపిల్ల మీద అత్యాచారాల విషయంలోనే కాదు, అక్రమ సంబంధాల విషయంలో కూడా ప్రియుడు, మొగుణ్ని తాగుదాం రా అని తుప్పల్లోకి తీసుకెళ్లి తాగించి, నెత్తిమీద బాటిల్‌తో మోదుతున్నాడు. గతంలో ఏదైనా విశేషం ఉంటేనే – ప్రమోషన్ వచ్చిందనో, స్కూటర్ కొన్నామనో, పిల్లాడు పుట్టాడనో– మిత్రులు మందు పార్టీ అడిగేవారు. ఇప్పుడదేమీ లేదు, రొటీన్‌గా వారంలో సగటున ఐదు రోజులు తాగేస్తున్నారు. ఇంట్లో ఆడవాళ్లు కూడా దుకాణం పెట్టేస్తున్నారు. మొగుడూ పెళ్లాలు యిద్దరూ తాగి కొట్టుకుంటూంటే పిల్లల గతి ఏమవుతుందో ఊహించుకోండి.

మద్యప్రవాహం ఎంత తగ్గిస్తే సమాజానికి అంత మంచిది. ఆంధ్ర ప్రభుత్వం మద్యం రేట్లను విపరీతంగా పెంచేసి, మందుబాబులను యిబ్బంది పెట్టేస్తోందని చంద్రబాబు ఊహూ విలవిల్లాడి పోతున్నారు. ప్రజల క్షేమం కోరే నాయకుడు అలా పబ్లిగ్గా మాట్లాడవచ్చా? ఆయనకు సంబంధించిన డిస్టిలరీ కంపెనీలను నియంత్రించి, జగన్ తన కంపెనీలను ప్రోత్సహిస్తున్నాడని అంటున్నారు. బాబు ఆవేదనకు అదే కారణమా? ప్రజారోగ్యానికి ఏది మంచిదో ప్రభుత్వం డబ్బు ఖర్చుపెట్టి మరీ చెప్పాల్సి వస్తోంది. హెల్మెట్ పెట్టుకో, కారు సీటు బ్టో పెట్టుకో, పొగాకు నమలకు, సిగరెట్టు పీల్చకు, మద్యం తాగకు... అంటూ. ప్రతి బజెట్‌లో సిగరెట్ల రేటు పెంచేసి, వాడకం తగ్గించుకుంటూ వచ్చారు. ఇప్పుడు జగన్ మద్యం షాపుల వేళలు తగ్గించి, ధరలు ఆకాశానికి పెంచేయడం వలన డబ్బు చాలక జనాలు తక్కువ తాగినా కుటుంబానికి లాభమే తప్ప నష్టం లేదు. దానివలన ప్రభుత్వాదాయం తగ్గినా జగన్ ఖాతరు చేయడం లేదు. మంచిదే.

ప్రభుత్వ భూములకు గిరాకీ వుందా? – ఇది బాగానే ఉంది కానీ అసలు సమస్య జగన్ తన పథకాలకు డబ్బు ఎలా తెస్తాడన్న ప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఆదాయం ఎక్కణ్నుంచి? గత ఐదేళ్లగా బాబు ఏం ఊదరగొట్టినా రాష్ట్రానికి పరిశ్రమలు యిప్పటిదాకా పెద్దగా రాలేదు, వద్దామనుకున్నవి జగన్ స్థానికులకు 75% ఉద్యోగాల రూలు విని జంకుతున్నాయి. ఉన్నవైనా పాత ఒప్పందాలు సమీక్షిస్తామంటే విస్తరించడానికి జంకుతున్నాయి. పోనీ, ఎప్పటికో అప్పటికి పరిశ్రమలు నెమ్మదిగా వస్తాయని అనుకున్నా వాటిపై ఆదాయం కళ్లచూసేసరికి కనీసం యింకో నాలుగైదేళ్లు పడుతుంది. రాష్ట్రానికి హైదరాబాదు వంటి కల్పవృక్ష సదృశ మహానగరం ఏమీ లేదు. చాలా కంపెనీల హెడాఫీసులు – సాక్షితో సహా– హైదరాబాదు నుంచి కదలలేదు, అందువలన పన్ను అక్కడికే పోతుంది.

దేశమే డబ్బు లేక అల్లాడుతోంది. కేంద్రం రాష్ట్రాలకు జిఎస్‌టి బాకీలు చెల్లించటం లేదు. ఇక యీ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏమిస్తుంది? అప్పు చేద్దామన్నా బాబు ఉన్న పరపతి అంతా కరారావుడు చేసేశారు, క్రెడిట్ లిమిటు దాటేశారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసుల వంటి వాటితో రాజకీయ లబ్ధి పొందవచ్చు తప్ప ఖజానాకు ఆదాయం రాదు. వైయస్ గతంలో హైదరాబాదులో ప్రభుత్వ భూములమ్మి ఖజానాకు డబ్బు చేర్చారు. జగన్ అలాటి ప్రయత్నం చేసినా ప్రయోజనం లేదు. అప్పట్లో హైదరాబాదుకి ఉన్న బ్రాండ్ యిమేజి వేరు. ఆ మార్కెట్ వేరు. ఆంధ్రలో ఏ ఊరికి ఆ రేటు పలుకుతుంది? అభివృద్ధి చేస్తాం అని చెప్పుకోవడమే తప్ప యిదిగో చేశాం, చూడండి అని చూపించడానికి ఏమీ లేదు. బాబు గ్రాఫిక్స్ అమరావతి ప్రయోగం తర్వాత ఏదైనా చేస్తామని ఏ ప్రభుత్వం అన్నా, నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరు.

పైగా ఆంధ్రలో నిర్మాణాత్మకంగా చెప్పుకోదగ్గ పని యిప్పటిదాకా జరగలేదు. జగన్ ఎంతసేపూ సంక్షేమ పథకాలూ, రాజధాని మార్పు, అధికార వికేంద్రీకరణ లాటివి మాట్లాడుతున్నారు తప్ప ఫలానా సెజ్ ఏర్పాటు చేశాం, ఫలానా ప్రణాళిక రూపొందించాం అని చూపటం లేదు. అన్ని ప్రాంతాల అభివృద్ధి లాటివి చెప్పినా ఫలితాలు ఫలదీకరించలేదు. అందువలన ప్రస్తుతానికి ఆంధ్రలో భూముల విలువ పెద్దగా వుంటుందని, వాటిని అమ్మి ప్రభుత్వం డబ్బు చేసుకోగలుగుతుందని అనుకోవడానికి లేదు. డబ్బు లేకుండా యీ పథకాలు ఎంతకాలం సాగుతాయో ఎవరూ ఊహించుకోలేరు. ఆపి వేస్తే మాత్రం ప్రజలు ఆగ్రహించడం ఖాయం. 'ముందే చూసుకోవద్దా?' అని మండిపడతారు. పరిస్థితి చూస్తూ ఉంటే చివరకు జనాలే మాకు కొత్త స్కీములొద్దు మొర్రో, నెలవారీ జీతాలిస్తూ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై కాస్త ఖర్చు పెట్టండి మహాప్రభో అని బతిమాలే రోజు వస్తుందనిపిస్తోంది.

డా॥ అంబేడ్కర్ ధర్మపత్నిగా రమాబాయి

డాక్టర్ జి.వి.రత్నాకర్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ, హైదరాబాద్



మహా పురుషులని మహోన్నతులుగా తీర్చిదిద్దడంలో వాళ్ళ ధర్మపత్నుల పాత్ర ఎంతైనా ఉంటుందని చెప్పవచ్చు. వాళ్ళు కేవలం జీవన సహచరులుగా జీవితంలోని ఆటుపోట్లలో తోడుగా ఉండటమే కాకుండా భర్తల్లో మానసికమైన బలాన్ని, ఉత్సాహాన్ని పెంపొందించే శక్తులుగా కూడా ఉంటారు. ఇంతేకాకుండా కఠినమైన, కష్టసాధ్యమైన సమయాల్లో బలాన్ని కలిగించి ప్రేరణని

అనారోగ్యంతో ఉన్నా ఆకలితో ఉన్నా లేక కడుపునిండా భోజనం చేసి ఉన్నా నిరంతరం ఆయన అధ్యయనంలోనే నిమగ్నమై ఉండేవాడు. అలాంటి ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత అణగారిన దళితులు స్త్రీల హక్కుల పరిరక్షకుడు అయిన బాబాసాహెబ్ డా॥ బి.ఆర్.అంబేడర్ జీవన సహచరిగా జీవితాన్ని గడిపిన రమాబాయి అంబేడ్కర్ జీవితం అందరికీ సదా స్మరణీయం. వివాహస్థలంగా భాయ్‌ఖల్లా (ముంబయి నగర సభ్ స్టేషన్) లోని చేపల బజారుని నిర్ణయించారు. అక్కడ ఖాళీ స్థలంలో కప్పుకింద మూలన అమ్మాయి తరపువారు మరోవైపు అబ్బాయి తరపువారు జమకూడారు. ఆ కప్పుకింద మురికినీరు చెడువాసనతో ప్రవహిస్తూ ఉంది. అక్కడి అరుగును బెంచ్‌గా ఉపయోగించారు. వివాహం ఆనందంగా, ఉత్సాహంగా, జరిగింది. వివాహానికి వచ్చిన వ్యక్తులందరూ చాలా ఆనందించారు. ఉదయం చేపల వాళ్ళు వచ్చే లోపే వీళ్ళు ఆ స్థలాన్ని ఖాళీ చేయాల్సిఉంది. రమాబాయి, భీమారావ్‌ల వివాహము భాయ్‌ఖల్లా దగ్గరి చేపల బజారులో ఒక కప్పు కింద జరిగింది. చేపలవాళ్ళు వచ్చేలోపే వివాహ కార్యక్రమాలు చదివింపులు, అప్పగింతలు పూర్తికావాల్సి ఉంది. తెల్లవారగానే బంధువులందరూ తమ తమ ఇళ్ళకి బయలుదేరారు. రమాబాయి చాలా సరళమైన, శాంతమైన మంచి గుణం కలిగినట్టిది. ఆమెకు కపటాలు మోసాలు ఏమీ తెలియవు. నిజాయితీ ఆమె జీవితానికి ఆభరణంగా ఉంది. ఆమె చాలా అందమైనదే కానీ చదువుకున్నది కాదు. కానీ వాస్తవమేమంటే తెలివిలో, మేధోపరంగా చూస్తే బాబాసాహెబ్, రమాబాయిల జంట చాలాసరైనది. ఇదే బాబాసాహెబ్ జీవితపు గొప్పదనంగా చెప్పవచ్చు. ఒక చదువులేని స్త్రీకి మంచి భర్తగా జీవితాన్ని కొనసాగించగలిగాడు. వివాహసమయంలో బాబాసాహెబ్‌కి రమాబాయి నిరక్షరాస్యులని బాగా తెలుసు. వివాహసంబంధాలని తల్లిదండ్రులు సమాజంలోని చిన్న – పెద్దలు నిర్ణయించేవారు. ఆ సమయంలో పెండ్లి కుమారుడు, పెండ్లి కూతుళ్ళ ఇష్టాయిష్టాలు ఏమీ ఉండేవికావు. వివాహ సమయంలో బాబాసాహెబ్ ఇలా నిశ్చయించుకున్నారు. అదేమంటే రమాబాయి చదువుకోకపోయినా ఫర్వాలేదు. నేను స్వయంగా కష్టపడి ఆమెకి చదువు నేర్పుతాను. కనుకనే బాబాసాహెబ్ ఆ విషయంలో ఎప్పుడూ బాధపడలేదు. భీమారావు రమాబాయికి చదువునేర్పేందుకు తన వైపు నుండి తీవ్రమైన ప్రయత్నాలు చేశాడు. కానీ రమాబాయి చదువుకునేందుకు ఆసక్తి చూపలేదు. ఆమె ఆలోచనలో పెద్దల పట్ల ఆదరభావం కలిగి సేవలు చేయడం, భర్త మనసెరిగి మెసలడం, భర్తకోసం కర్పూరంలా తన జీవితాన్ని తాను సమర్పించుకోవడం స్త్రీ

సహజమైన కర్తవ్యాలుగా భావిస్తుండేది. ఈ విధమైన సంప్రదాయ బద్ధపు ఆలోచనలతో స్త్రీవిద్యవైపు ఆమె మనసు లగ్నం కాలేదు. ఫలితంగా బాబా సాహెబ్ ఎంత ప్రయత్నించినా సామాన్యమైన అక్షర జ్ఞానం లప్ప ఆమె ముందుకి వెళ్ళలేక పోయింది. ఆమె చాలాసార్లు ప్రాథమికమైన పుస్తకాలు, సంచి, పలక తీసుకొని వెళ్ళేది కానీ అవన్నీ వ్యర్థమయ్యేవి. రమాబాయి తాను అంతగా చదువుకోకపో యినా తన బర్త అపారమైన మేధాసంపత్తితో విద్యావేత్తగా ఉండడాన్ని చూసి మాత్రం చాలా సంతోషించేది. గర్వపడేది కూడా. బాగా చదువుకున్న ఆడవాళ్ళకి కూడా తన భర్త పాండిత్యాన్ని గురించి తెలియజేసి వాళ్ళని హతాశులను చేసేది. బాబాసాహెబ్ అనేకసార్లు ప్రాథమిక తరగతుల పుస్తకాలు తీసుకొని రామాబాయితో చదివించాలని ప్రయత్నించేవాడు. కానీ అవన్నీ వ్యర్థమయ్యేవి.

బాగా కష్టపడిన తర్వాత బాబాసాహెబ్ ఆమెకు సంతకం చేయడం నేర్పించారు. బాబాసాహెబ్ అమెరికాలో ఉన్న సమయంలో రమాబాయి పత్రికల్లోని పెద్ద పెద్ద అక్షరాలని చదవడం నేర్చుకుంది. అయితే అక్షర జ్ఞానంతో పోలిస్తే రమాబాయి మానసికంగా చాలా తెలివైనది.


బాబా సాహెబ్‌ని ఆమె ఎల్లప్పుడు "సాహెబ్" అనే సంబోధనతో పిలుస్తూ ఆయనపట్ల తన గౌరవాన్ని వ్యక్తపరిచేది. బాబాసామెబ్ కూడా ఆమెని ప్రేమగా "రామూ" అని పిలుస్తుండేబారు. దూర ప్రాంతాల్లో ఉన్నప్పుడు రామూ అని సంబోధించి వ్రాసేఆరు. దీనిని బట్టి బాబాసాహెబ్‌కి భార్యపట్ల ఉన్న అంతుని ప్రేమ, స్నేహం, సాహార్ధతల గురించి తెలియవస్తుంది.



బాబాసాహెబ్ వివాహం రమాబాయితో జరిగిందనేది మనకి కనిపిస్తుంది కాని నిజానికి ఆయన వివాహము విద్యాసుందరిత జరిగింది. అత్యధిక సమయం ఆయన విద్యాధ్యయనంలోనే గడిపేవారు.

బాబాసాహెబ్ తన తుదిశ్వాస వరకు విద్యతో తన బంధాన్ని చాలా దృఢంగా పెనవేసి ఉంచారు. పగలైనా, రాత్రైనా, ఎండైనా చలైనా, ఆరోగ్యంగా ఉన్నా లేక కూడా కల్పిస్తారు. ధైర్యం, సామసం కోల్పోయిన, వేళ, నైతికమైన, మానసికమైన బలాన్ని కల్గించే అర్ధాంగిగా ఉండి జీవన గమనంలో చలించని స్థిరమైన సందే శాన్ని స్తారు. బాబాసాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ జీవితాన్ని ప్రకాశవంతం చేసి, కష్టకాలంలో ఆయనకి అండగా నిలబడి, అడుగడుగునా ఆయనకి ప్రోత్సా హాన్నం దించి, ఆయన దినచర్య లోని సుఖదుఃఖాల్లో పాలుపంచుకొని నిరంతరం సహచర్యాన్నందించేది ఆయన ధర్మపత్ని రమాబాయి.

రమాబాయి అంబేడ్కర్ తన జీవితంలోని చివరి నిమిషాన్ని కూడా మన విముక్తి ప్రదాత బాబా సాహెబ్ డా॥ అంబేడ్కర్ జీవన ప్రస్థానంలోని ఆటంకాలను, ముళ్ళను, రాళ్ళను, తొలగించేం దుకు వినియోగించింది. బాబాసాహెబ్‌ని కేవలం తనకే కాకుండా దేశానికే అత్యంత గౌరవమైన వ్యక్తిగా భావించేది. ఈ మహోన్నతమైన మహిళ అబల ఎంత మాత్రం కాదు. ఆమె ఒక మహాశక్తి. ఆమె బలాన్ని, సంకల్పాన్ని కలిగించే స్త్రీ మాత్రమే. అంతటి





మహోన్నతమైన స్త్రీ పట్ల మనం నేడు అత్యంత గౌరవాన్ని ప్రకటిస్తూ ఆమెను "రమామాత" అనే పేరుతో పిలుస్తున్నాం. అలాంటి మహోన్నతమైన స్త్రీ ఏ వీరనారికి కూడా ఏ మాత్రం తీసిపోదు. గతంలో బాల్యవివాహాల ఆచారాలు ప్రబలంగా ఉండేవి. తొమ్మిది, పది సం॥రాల అతి పిన్న వయస్సులోనే రమాబాయి బాబాసాహెబ్ జీవితంలోకి ప్రవేశించింది. ఆ సమయంలో భీమారావ్ (బాబాసాహెబ్) ఐదవతరగతి చదువుతూ ఉన్నాడు. వివాహం జరిగే సమయంలో భీమారావ్ వయసు కేవలం 14 సం॥రాలు మాత్రమే ఉంది. వివాహ సమయంలో అంబేద్కర్ ఆంగ్ల భాషా విద్యార్థిగా ఉన్నాడు. రమాబాయి పేరు వివాహానికి ముందు రమీబాయి ఆమె తండ్రి "భికూ ధూత్రే" దాభోల్ దగ్గరలోని వణంద్ గ్రామంలో నివసిస్తూ ఉండేవాడు. మహారాష్ట్ర సాంప్రదాయాను సారంగా వాళ్ళని "వణంద్‌కర్" అని పిలుస్తూ ఉండేవారు. ఆయన దాపోలిలో కూలిపనిచేసి కష్టించి కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు. ఆయన నలుగురు సంతానంలో కేవలం ఒకడే కొడుకు, అతను అందరికంటే చిన్నవాడు.

అందరికంటే పెద్ద కూతురు "గౌరాబాయి"కి చిన్నప్పుడు పెళ్లయి పోయింది. మిగిలిన వాళ్ళు ముగ్గురు అనగా రమాబాయి, మీరాబాయి శంకర్. వీళ్ళని భికూధూత్రే

అతి కష్టంతో పెంచుతూ ఉన్నారు. దనం లేక పోవడంతో ఆయనకి రోజులు అతి కష్టంతో గడుస్తూ ఉండేవి. ఎందుకంటే ఆయన భార్య అప్పటికే చనిపోయంది. పిల్లలు అప్పుడు చాలా చిన్నవాళ్ళుగా ఉన్నారు. ఇప్పుడు కుటుంబాన్ని నడిపే భారం అంతా అతని భుజాలపై పడంది. ఆయన కూలిపనిగా, సముద్రం నుండి బజారుకి చేపలు వెదురుబుట్టతో మోసే పనిని చేసేవాడు. ఆ కూలి పని చాలా కష్టంతో కూడుకున్నది బరువు తరచుగా ఎత్తుకునే అ కఠిన పని కారణంగా ఆయనకి గుండెల్లో నొప్పి వచ్చేది. తర్వాత ఆ నొప్పే ఆయన ప్రాణాల్ని బలితీసుకుంది. భికూ ధూత్రే మరణించిన తర్వాత ఆయన కుటుంబం దిక్కులేనిదై పోయింది.

అనాథలైన పిల్లలకి చెడుకాలం దాపురించింది. వారి పోషణ భారాన్ని వాళ్ళ చిన్నాన్న స్వీకరించాడు. వాళ్ళు భూయాఖలాలోని చేపలు బజారు దగ్గర నివసిస్తూ ఉండేవారు. ఆయన పేరు శంకర్‌ధూత్రే ఆయన ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ ఉండేవాడు. ధూత్రేని వన్‌కర్ అనే పేరుతో కూడా పిలిచేవారు.

ఇక్కడ భీమారావ్ అన్న ఆనందరావుకి వివాహం అయి పోయింది. ఇక కుటుంబంలో భీవా (భీమారావ్) పెండ్లి గురించి ఆలోచిస్తున్నారు. సుబేదార్ రామ్‌జీ మనసులో భీవాకి కూడా పెండ్లి చేయాలని అనుకోవడం మొదలుపెట్టాడు.

భీవా సోదరులందరిలోకి ఎర్రగా శక్తి కలిగి, ధీర్ఘకాయునిగా అందంగా ఉండేవాడు. అందరికంటే చిన్నవాడు కావడంతో సుబేదారు భవాని ప్రేమగా గారాబంగా చూసుకునే వాడు. భీవాకి సరిపోయే అందమైన గుణవంతురాలైన అమ్మాయిని చూసి చేయాలని ఆయన కోరిక. అలాంటి అమ్మాయి కోసం ఆయన వెతుకుతూ ఉన్నాడు. ఆయన రమాబాయి కంటే ముందు ఇద్దరు అమ్మాయిలను చూసాడు. వాళ్ళ తల్లిదండ్రులతో కూడా సంబంధాన్ని నిశ్చయం చేసుకుంటానని కూడా చెప్పి ఉన్నాడు. రామ్‌జీ సక్పాల్ దృష్టి రమాబాయి మీదపడింది. ఆయనకి రమాబాయి బాగానచ్చింది. ఆయన మొదటి సంబంధాన్ని వదులుకోవడానికి సిద్ధపడ్డాడు. తన తప్పు కింద కులపంచాయితీ నిర్ణయానుసారం ఐదు రూపాయలు వాళ్ళకి చెల్లించడం కూడా జరిగింది. రామ్ జీ సుబేదారు జరిమానా కట్టి కూడా రమాబాయిని కోడలిగా తన యింటికి తెచ్చుకోవాలనే నిర్ణయాన్ని మాత్రం వదలలేదు. సుబేదారు రామ్ జీ ద ృఢసంకల్పం గలిగినవాడు. ఈ విధంగా రమాబాయి బాబాసాహెబ్ జీవితంలోకి ప్రవేశించింది.

వనరులు ఉన్నా.. అభివృద్ధి సున్నా...!



ఉత్తరాంధ్ర జిల్లాల్లో అన్ని వనరులు ఉన్న అభివృద్ధికి దూరంగానే ఉంటుంది. విశాఖ నగరం మినహాయిస్తే ఉత్తరాంధ్ర జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాలన్నీ మౌలిక వసతులు లేక సరేనా ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళ్ళిపోతున్నారు. ఇక్కడ కోట్ల మంది ప్రజలు దాదాపు 20 లక్షల మంది ఆదివాసీలు ఉన్న వీరి బాగోగుల గురించి మాట్లాడే నాధుడే లేడు.

గత కొన్ని దశాబ్దాలుగా ఇదే జరిగుతోంది. నీటి వనరులతో పాటు అన్ని రకాల మానవ వనరుల వున్నాయి. కష్టపడే తత్వం ఉన్నవారు ఉత్తరాంధ్ర వాసులు.

కష్టం ఉత్తరాంధ్ర కు నీటి కష్టాలు ఎక్కువే 16 నదులు ఉన్నప్పటికీ తాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు వేసవిలో ఇక్కట్లు తప్పట్లేదు. మన నదులు మనకు సంపద సృష్టించాలి. వలసలు వెళ్ళిన లక్షలాది ప్రజలు తిరిగి వచ్చి మన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలంటే మన నీరు ,నిధులు, భూములు మనకే చెందాలి. గోదావరిలో కలుస్తున్న మన నీటి వాటా ఎంతో అడుగి సాధించుకుందాం.

ఇప్పటికైనా మన వాటా ఎంతో తేల్చుకోకపోతే మన కష్టాలు తీరవు. ఉత్తరాంధ్ర కళింగాంధ్ర గా పిలవబడే శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం జిల్లాలో చరిత్రలో చాలా ప్రాముఖ్యత గల ప్రాంతం బౌద్ధ జైన వైష్ణవ మతాలకు ఆలవాలంగా ఉన్న వాళ్ళని ఏ కీ బౌద్ధ , జైన శిధిలాలలో వైష్ణవ దేవాలయాల్లో కనిపిస్తుంది. దేశంలో ఎక్కడా లేని పవిత్రత వాస్తవాలు ఇక్కడే ఉండటానికి కారణం ఇక్కడ ఉండే నీటి వనరులు .సారవంతమైన భూమి కష్టపడి పనిచేసే ప్రజలు . ఈ పరిస్థితి 1953 వరకు కొనసాగింది.


మద్రాసు రాష్ట్రంలో వున్నప్పుడు విశాఖపట్నం గంజాం జిల్లాలకు పరిమితమైన ఈ ప్రాంతం తెల్లదొరలకు వణుకు పుట్టించిది. ఎప్పుడు వారితో రాజీ పడలేదు. ఒకరిద్దరు లాలూచీపడిన వారు కూడా కోస్తా నుండి వచ్చి స్థిరపడిన వారే . ఇక్కడి 16 నదులు ప్రధానంగా శబరి, సీలేరు, ఏలేరు వంటి నదులకు మూలమైనవి తూర్పు కనుమలు. ముఖ్యంగా అరకు సాలూరు ప్రాంతాల్లో ప్రారంభమైనది గోదావరి లో కొన్ని మరికొన్ని వంశధార నాగావళి శారద ,బహుదా వంటి నదుల ద్వారా బంగాళాఖాతంలో కలుస్తాయి. ఇక్కడి జమీందార్లు, రైతులు చెరువులను నదుల ద్వారా నింపి నూతుల ద్వారా వ్యవసాయం చేసుకుని ఆర్థికంగా బలంగా ఉండేవారు. కరువులు వస్తే బర్మా, బెంగాల్ వెళ్లిపోయేవారు. బ్రిటిష్ వారికి కప్పం కట్టే జమిందారులు మన ప్రాంతంలో లో నీటిపారుదల సౌకర్యం కలిగించమని కోరలేదు. ఎందుకంటే నీటి సౌకర్యం కల్పించి వారు పన్నులు పెంచేవారు .చిన్న సన్నకారు రైతులు దాన్ని తట్టుకోలేరు కనుక భూములను కూడా తీసుకోండి పన్నులు కట్టలేమని అని చెప్పిన ఇలాంటి సంఘటనలు అనేక ఉన్నాయి . బ్రిటిష్ వారు దౌర్జన్యం చేస్తే కొర్ర మల్లయ్య, సాసుమాను గుండమ్మ తెలుగు బిడ్డలు తిరగబడ్డారు. వీరి త్యాగాలతో పెరిగిన నాయకత్వం తరువాతి కాలంలో కోస్తా రాయలసీమ సామాజిక వర్గాల వారు ఆ తగాదాల్లో తలదూర్చ లేకపోయింది. అందుకే శ్రీభాగ్ ఒప్పందానికి దూరంగా ఉంది. స్వాతంత్రం వచ్చాక భారతదేశానికి తూర్పు తీరాన సహజసిద్ధంగా ఉన్న విశాఖపట్నం నౌకాశ్రయం అన్ని విధాల ఉపయోగపడింది. విశాఖ నగరంలో కేంద్ర పరిశ్రమల సంస్థలు ఏర్పాటు చేశారు.

విశాఖ మహానగరంలో అభివృద్ధి చెందుతున్న సమయంలో కోస్తా జిల్లాల వారు వచ్చి స్థిరపడి పోయాక ఇక్కడ ఉన్న నాయకత్వాన్ని నాశనం చేశారు. కొంతమందిని లోబరు చుకున్నారు. ఉత్తరాంధ్ర రాజకీయాలు సాధించారు. స్థానికేతర నాయకత్వం వల్ల స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల పట్ల వారికి అవగాహన లేక నీటి ఇబ్బందులు తో పాటు అనేక సమస్యలు అలాగే కొనసాగుతున్నాయి.

ఇక్కడ విశాఖ నగరం లో భూములు, ఆస్తులు వ్యాపారాలకు పరిమితమై ఆదివాసీ ప్రాంతాల అవసరాలు, గ్రామీణ ప్రాంత వ్యవసాయం నిర్లక్ష్యం చేశారు. రాష్ట్రం కి కావలసిన నిధులను ఈ ప్రాంతం నుండి వెళ్లిన ప్రాజెక్ట్ లన్నీ రెండు మూడు జిల్లాలకు పరిమితం చేశారు. విచిత్రంగా వారికి సంబంధించిన నదులు ఏవి లేకపోయినా కృష్ణా, గోదావరి నదులు దిగువ ప్రాంతంలో వారు ఉన్నా రాష్ట్రానికి కంతటికీ చెందిన నీటి వనరులను వాళ్లే వాడేసుకున్నారు. దీంతో ఉత్తరాంధ్ర వెనుకబడిపోయి, లక్షలాది మంది జీవనోపాధి లేక వలసలు వెళ్లడం జరిగింది. మరి మన నదుల నీరు ,మానవ వనరులు మనం వినియోగించుకోవాలా లేదా... దక్షిణాది నదుల్లో గోదావరికి ఉన్న పవిత్రత, ప్రాముఖ్యత ఇతర నదులకు లేకపోవడానికి చారిత్రక కారణాలు ఉన్నాయి. గోదావరికి ఉన్న ఉపనదు ల్లో శబరి, పొట్టేరు, సీలేరు లేకపోతే డెల్టా కు రెండో పంటకు నీరు ఉండదు.ఈ మూడు(శబరి) ఉపనదులు ఉత్తరాంధ్రలోని తూర్పు కనుమల్లో విశాఖ విజయనగరం జిల్లాలో ప్రారంభమవుతుంది .ఆ నీరు ఈ ప్రాంతం ప్రజల హక్కు .గత రెండు వందల సంవత్సరాల లో,ముఖ్యంగా 150 ఏళ్లుగా ఈ ప్రాంతం నీటిని వాడుకుంటూ వ్యవసాయం చేసుకుని పెరిగి పెద్దవారై విశాఖ నగరం కబ్జా చేసిన వారు ఇప్పుడు విశాఖ ఉత్తరాంధ్రను ఆడిపోసుకుంటున్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నదుల అనుసంధానం గోదావరిని పెన్నాతో కలపాలని చూస్తున్నారు .అయితే గోదావరి ఎగువ ప్రాంతంలో మన్యంలో ఆదివాసులు ఎడమవైపు ఉన్న వెనుకబడిన ఉత్తరాంధ్ర లో కోటి మంది ప్రజలు ఉన్నారనే సంగతి మర్చిపోతున్నారు. ఇదే నీటి సమస్యలను కారణం .విశాఖ వస్తున్న పరిపాలన రాజధానికి మేలు చేయవచ్చు. మరి అంతర్వేది గా ఉన్న మిగతా ప్రాంతాలకు నీరు ఇవ్వాలిగా. కష్టపడే తత్వం, వ్యవసాయ నైపుణ్యం వున్నా లక్షలాది మంది ఉత్తరాంధ్ర ప్రజలు కోస్తా జిల్లాలో వ్యవసాయ కూలీలుగా మారడానికి కారణం తెలుసుకోవాలి. తూర్పు కనుమల్లో ఉన్న ఉత్తరాంధ్ర అన్ని వున్న ఒక జమిందారు ప్రాంతం. కష్టపడే మత్స్యకారులు, కొండల్లో కాయకష్టం చేసి ఆదివాసులు,



మధ్యలో దళిత వెనుకబడిన కులాలను అభివృద్ధి కోసం అందరూ వాడుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన 1953 నుండి ఈ ప్రాంతానికి అభివృద్ధి అందలేదు. విశాఖపట్నం లో వచ్చిన పారిశ్రామికీకరణ మూలంగా వలసలు పెరిగి కోస్తా నయా జమీందార్లు ఇక్కడ తయారయ్యారు. వారికి ఈ ప్రాంత నైసర్గిక పరిస్థితులు, నీటి వనరులు గురించి తెలీదు. ఇక్కడ బతుకుతూ కోస్తా కు ఉత్తరాంధ్ర నీటి ని తరలించారు.



ఉత్తరాంధ్ర 16 నదులపై ఉదాసీనత. సుజల స్రవంతి విశాఖ పరిశ్రమ లకు పరిమితం అయిపోతే భవిష్యత్తు అంధకారం.కలిసి వున్న ఆంధ్రప్రదేశ్ లో1833టిఎంసిలు కేటాయిస్తే అందులో 1300 టిఎంసిలు వాడుకున్నారు. తెలంగాణ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు తీసివేయగా 814 టిఎంసి నీరు మొత్తం కోస్తా, రాయలసీమ కు చెందుతుంది. అందులో రెండు జిల్లాల్లోని రిజర్వాయర్లు కట్టి తమ సామాజిక, రాజకీయ, ఆర్థిక పెత్తందారీ తనాన్ని చాటుకున్నారు. తెలంగాణలో కాళేశ్వరం వచ్చిన తర్వాత వీరికి ఉత్తరాంధ్ర గోదావరే దిక్కు. దాన్ని కూడా దొడ్డిదారిన మళ్ళించి మన ఎందుకు మన శక్తి భూమి మనపై అక్కసు ఎందుకు ?. మన వనరులు,మన శక్తి, భూమి,భుక్తి మనం హక్కు.ఇది తెలుసుకోక పోవడమే మన వెనుకబాటుతనం. అందుకే ఆధారంగా గోదావరిలో మన వాటా ఎంతో తేల్చాలని అడుగుదాం. అర్థిద్దాం,పోరాడదాం.2014 చట్టం లో act 69,94 ప్రకారం నీటి వినియోగ పంపిణీపై నివేదించే హక్కు మాకుంది.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2020



అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క ఉద్దేశ్యం – మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మరియు సాంస్కృతిక సమస్యలపై ద ృష్టి పెట్టడం, మరియు ఆ రంగాలన్నింటిలో మహిళల పురోగతి కోసం వాదించడం.వారి యొక్క పురోగతికి గణనీయమైన కృషి చేసిన మహిళలను గుర్తించడానికి కూడా ఈ రోజు తరచుగా ఉపయోగించబడుతుంది. దీనిని అంతర్జాతీయంగా చేయాలనే ఆలోచన క్లారా జెట్కిన్ అనే మహిళ నుండి వచ్చింది. 1910 లో కోపెన్‌హాగన్‌లో (డెన్మార్క్) జరిగిన అంతర్జాతీయ మహిళల వర్కింగ్ ఉమెన్‌లో ఆమె ఈ ఆలోచనను సూచించింది. అక్కడ 17 దేశాల నుండి 100 మంది మహిళలు ఉన్నారు మరియు వారు ఆమె సూచనను ఏకగ్రీవంగా అంగీకరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మొట్టమొదట మార్చి 19 , 1911 న జరుపుకున్నారు. 1908 లో న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు తక్కువ పని గంటలు, మెరుగైన వేతనం మరియు ఓటు హక్కును కోరుతూ కవాతు చేసారు. ఆ మొదటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లక్షలాది మంది మహిళలు, పురుషులు మహిళల హక్కులకు మద్దతుగా ర్యాలీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క ఆలోచన అమెరికా యొక్క జాతీయ మహిళా దినోత్సవం, ఫిబ్రవరి 28, 1909 నుండి సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా ద్వారా ప్రకటించబడింది. మరుసటి సంవత్సరం, సోషలిస్ట్ ఇంటర్నే షనల్ డెన్మార్క్‌లో సమావేశమైంది మరియు అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఆలోచనను ప్రతినిధులు ఆమోదించారు. మరుసటి సంవత్స రం, మొదటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం–లేదా మొదట దీనిని అంతర్జాతీయ వర్కింగ్ ఉమెన్స్ డే అని పిలిచారు – డెన్మార్క్, జర్మనీ, స్విట్జర్లాండ్ మరియు ఆస్ట్రియాలో ర్యాలీలతో జరుపుకున్నారు. వేడుకలలో తరచుగా కవాతులు మరియు ఇతర ప్రదర్శనలు ఉన్నాయి.

మొదటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగిన వారం తరువాత కూడా, ట్రయాంగిల్ షర్ట్‌వైస్ట్ ఫ్యాక్టరీ ఫైర్, న్యూయార్క్ నగరంలో 146 మందిని, ఎక్కువగా యువ వలస మహిళలను చంపింది. ఆ సంఘటన పారిశ్రామిక పని పరిస్థితులలో చాలా మార్పులకు ప్రేరణనిచ్చింది, మరియు అప్పటి నుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా మరణించిన వారి జ్ఞాపకశక్తి తరచుగా పిలువబడుతుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క మొదటి రష్యన్ ఆచారం ఫిబ్రవరి 1913 లో జరిగింది. 1914 లో, మొదటి ప్రపంచ యుద్ధం విస్ఫోటనం చెందడంతో, మార్చి 8 అనేది యుద్ధానికి వ్యతిరేకంగా మహిళల ర్యాలీల రోజు, లేదా యుద్ధ సమయంలో మహిళలు అంతర్జాతీయ సంఘీభావం వ్యక్తం చేశారు. 1917 లో, ఫిబ్రవరి 23 న – పాశ్చాత్య క్యాలెండర్‌లో మార్చి 8 న – రష్యన్ మహిళలు సమ్మెను నిర్వహించారు, ఈ సంఘటనల యొక్క ముఖ్య ప్రారంభం జార్ (1917 కి ముందు రష్యా చక్రవర్తి) ఫలితంగా కూలిపోయింది. ఈ సెలవుదినం తూర్పు ఐరోపా మరియు సోవియట్ యూనియన్లలో చాలా సంవత్సరాలు ప్రాచుర్యం పొందింది. క్రమంగా, ఇది నిజంగా అంతర్జాతీయ వేడుకగా మారింది. ఐక్యరాజ్యసమితి 1975 లో, మరియు 1977 లో అంతర్జాతీయ మహిళా సంవత్సరాన్ని జరుపుకుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని పిలువబడే మహిళల హక్కులను గౌరవించడాన్ని ఐక్యరాజ్యసమితి అధికారికంగా ప్రకటించింది. 2011 లో, అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క 100 వ వార్షికోత్సవం ప్రపంచ వ్యాప్తంగా అనేక వేడుకలకు దారితీసింది మరియు అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై సాధారణం కంటే ఎక్కువ శ్రద్ధ చూపింది. యునైటెడ్ స్టేట్స్లో 2017 లో, చాలా మంది మహిళలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని “మహిళలు లేని రోజు” గా సెలవు తీసుకున్నారు. కొన్ని నగరాల్లో మొత్తం పాఠశాల వ్యవస్థలు మూసివేయబడ్డాయి (మహిళలు ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులలో 75% ఉన్నారు). సమ్మె యొక్క స్ఫూర్తిని గౌరవించటానికి ఆ రోజు సెలవు తీసుకోలేని వారు ఎరుపు రంగు ధరించారు. చైనాలో, స్టేట్ కౌన్సిల్ సలహా ప్రకారం, మార్చి 8 న చాలా మంది మహిళలకు సగం రోజుల సెలవు ఇవ్వబడుతుంది, అయినప్పటికీ చాలా మంది యజమానులు తమ మహిళా ఉద్యోగులకు సగం రోజును ఎప్పుడూ పంపరు. ఇటలీలో, అంతర్జాతీయ మహిళా దినోత్సవం లేదా “లా ఫెస్టా డెల్లా డోన్నా”, మిమోసా అనే పువ్వులు ఇచ్చి జరుపుకుంటారు. ఈ సంప్రదాయం యొక్క మూలం అస్పష్టంగా ఉంది, అయితే ఇది రెండవ ప్రపంచ యుద్ధం తరువాత రోమ్‌లో ప్రారంభమైందని నమ్ముతారు.

ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రచారం సామూహిక వ్యక్తివాదం ఆలోచన నుండి తీసుకోబడిన EachForEqual అనే థీమ్‌ను ఎంచుకుంది. “మనమంతా మొత్తం భాగాలు” అని ప్రచారం పేర్కొంది. “మన వ్యక్తిగత చర్యలు, సంభాషణలు, ప్రవర్తనలు మరియు మనస్తత్వాలు మన పెద్ద సమాజంపై ప్రభావం చూపుతాయి. “సమిష్టిగా, మేము మార్పును చేయగలము. సమిష్టిగా, లింగ సమాన ప్రపంచాన్ని సృష్టించడానికి మేము ప్రతి ఒక్కరూ సహాయపడతాము.” అనేదే ఈ సారి నినాదం.

– నేదునూరి హేమంత్ కుమార్
Ph: 8618022686
Email: hemanth.nedunuri@gmail.com

చేపలు తినడం ఎంతో మేలు..!




చేపా చేపా నీ రేటెంత... నువ్వు కొన్నంత అంటుంది చేప. చేపల వంటకాలను మనం లొట్ట లేసుకొని తింటారు. చేపలను అనేక విదాలుగా వండుకోవచ్చు. ప్రస్తుతం కరోనా వైరస్ ప్రభావంతో చాలామంది మిగతా నాన్‌వెజ్ వంటకాల కంటే చేపలమీదే ఎక్కువ ఆశక్తి చూపిస్తున్నారు. అయితే ఈ చేపల్లో అనేక పోషక పదార్ధాలు వున్నాయి. ఇప్పుడు వాటి గురించి తెలుసుకుందాం...

చేపలను సాధారణంగా జల పుష్పాలని అంటారు. ఇందులో అధిక మోతాదులో ప్రోటీన్లు కలిగి ఉండడం వల్ల ప్రపంచంలో అధిక శాతంలో ప్రజలు చేపలను ఆహారంగా తీసుకుంటారు. చేపలలో అత్యధికంగా పోషక పదార్ధాలు, మాంసకృత్తులు కల్గి ఉండడం వలన వీటిని ప్రాచీన కాలం నుండి ముఖ్యమైన ఆహార వనరులుగా వీటిని వినయోగిస్తున్నారు. జంతు సంబంధ మాంసకృతులలో సుమారు 16% చేపల నుంచే వచ్చే మాంసకృతులే. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 100 కోట్ల జనాభా చేపలను ప్రాథమిక వనరులుగా గుర్తించారు (FAO United Nations,1997). చేపలనుంచి వివిధ రకాల చేప నూనె లభిస్తుంది వీటిలో (HUFA) Highly unsaturated fatty acids మరియు (PUFA) Poly unsaturated fatty acids, విటమిన్స్, మినరల్స్ సంతృప్తికరంగా ఉంటాయి. భారతదేశంలో పౌష్టికాహారం లోపాన్ని ఎదుర్కోవడానికి చేపలన్నింటిని ఒక శక్తివంతమైన ఆయుధంగా వినియోగిస్తారు. వీటిని పొడి రూపంలో మధ్యాహ్న భోజన పథకంలో చిన్న పిల్లలకు అందిచండం ద్వారా పౌష్టికాహార లోపాన్ని అధికగమించవచ్చు. దాదాపు అన్ని రకాల చేపలలో ప్రోటీన్లు, ఒమేగా 3 ఆమ్లాలు కల్గి ఉంటాయి. కానీ ఉప్పునీటి చేపలో మాత్రం రుచికి ఉప్పదనంగా ఉంటుంది, మంచినీటి చేపలతో పోల్చినపుడు ఉప్పునీటి చేపల రుచి చాలా వేరుగా ఉంటుంది. ఉప్పునీటి చేపలలో ముల్లులు చాలా పెద్దవిగా ఉండటం వల్ల వీటిని చాలా తేలికగా వేరుచేసి ఆహారంగా తినవచ్చు, కానీ మంచినీటి చేపలలో ముల్లులు చాలా చిన్నవిగా ఉండం వల్ల వీటిని ఆహారంగా తీసుకోవడం చాలా కష్టం. ఈ రెండు రకాల చేపల మధ్య కొన్ని పోషకాహార వ్యాత్యాసాలుంటాయి. ఉప్పునీటి చేపలలో అధికంగా అయోడిన్‌ను కల్గిఉంటాయి. వాటి శరీరంలో 3.5% సోడియం ఉంటుంది. చేపలలో అత్యధికంగా కాల్షియం మరియు విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. మంచినీటి చేపలు సముద్రపు చేపలకంటే అధిక పౌష్టికాలను కలిగి ఉంటాయి. కానీ అందులో మెర్క్యూరీ నిల్వలు ఎక్కువగా ఉండడం వల్ల వాటి పెంపకం కొంచెం సమస్యాత్మకము. మంచినీటి చేపల్లో పరన్న జీవులు వల్ల కలిగే వ్యాధులుకూడా ఎక్కువే. (Tape worm infections, Nematodes). ఈ రోజుల్లో ఇంటిగ్రేటెడ్ లైవ్ స్టాక్ ఉత్పత్తి సాధ్యమైనది. కానీ ఈ విధమైన ఉత్పత్తి చేయడం ద్వారా క్రొత్త రకమైన వైరస్ రావడానికి కారణము అవుతున్నాయి (ఉదా : ఇన్ఫ్లూయాన్జా వైరస్). అందుకే ప్రస్తుత కాలంలో సహజంగా లభించే చేపలకే ఎక్కువగా ప్రాధాన్యత యివ్వడం జరుగుతుంది. సాగు చేసిన మంచినీటి చేపలకంటే సమజంగా లభించే ఉప్పునీటి చేపలలోనే ఎక్కువ శాతం పోషక విలువలు లబిస్తున్నాయి.



Dr. V.Anu Prasanna, M.Sc., Ph.D
Assistant Professor, Head of the Department,
Department of Zoology, Yogi Vemana University,
YSR Kadapa, A.P





నిరుద్యోగ భూతం

దేశంలో నిరుద్యోగం నానాటికి పెరగటమేగానీ, తగ్గుముఖం పడుతున్న దాఖలా కనపడటం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిరుద్యోగ రేటు 7.78శాతంగా నమోదైందని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' (సీఎంఐఈ) తాజాగా గణాంకాల్ని విడుదల చేసింది. గత నాలుగునెలలతో పోల్చితే ఇది అత్యధికం. గ్రామీణ నిరుద్యోగం జనవరిలో 5.97శాతం ఉండగా, ఫిబ్రవరినాటికి 7.37శాతానికి పెరిగింది. పట్టణాల్లో నిరుద్యోగం 8.65శాతంగా నమోదైంది. ఆర్థిక సంక్షోభం తీవ్రరూపం దాల్చిందని, ఆర్థిక కార్యకలాపాలు గత ఆరేండ్లలో ఎన్నడూలేనంతగా నెమ్మదించాయని సీఎంఐఈ తాజా గణాంకాల ఆధారంగా ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. కరోనా వైరస్ ప్రభావం ఆసియా మార్కెట్లపై పెద్ద ఎత్తున ఉందని, ఈనేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ ముందు ముందు కోలుకునే అవకాశాలు కనపడటం లేదని వారు వ్యాఖ్యానించారు. గత కొన్నేండ్లుగా మోడీ సర్కార్ ఎంచుకున్న ఆర్థిక విధానాలు ప్రతికూల ఫలితాలు ఇవ్వటం మొదలుపెట్టాయని, నిరుద్యోగం పెరగటం, తయారీరంగం దెబ్బతినటంలో అది కనపడిందని ఆర్థిక నిపుణులు చెప్పారు. సుదీర్ఘంగా కొనసాగుతున్న ఈ పరిస్థితి మెరుగుపడకపోతుందా? అని అందరూ ఎదురుచూస్తున్నారనీ, కానీ నిరుద్యోగం నానాటికీ పెరగటం ఆందోళన కలిగించే అంశమనీ వారు చెప్పారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెద్ద ఎత్తున కల్పిస్తామని, ఏటా 2కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని మోడీ నేతృత్వంలోని బీజేపీ 2014 సార్వత్రిక ఎన్నికల్లో వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చి ఐదేండ్లు దాటినా..దాని ఊసే ఎత్తటం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మోడీ సర్కార్ అమలుజేసిన నోట్లరద్దు, జీఎస్టీ నిర్ణయాలు ఉన్న ఉద్యోగాల్ని పోయేలా చేశాయని ఐఎంఎఫ్, ఆర్‌బీఐ మొదలైన సంస్థలే మొత్తుకుంటున్నాయి. దాంతో దేశంలో నిరుద్యోగం మరింతగా పెరగడానికి దారితీసిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.



ఇంకేన్నాలు ఈ అఘాయిత్యాలు

దేశ చరిత్రలోనే తొలిసారిగా మహిళలు, పిల్లలపై నేరాల విచారణకు వేగంగా విచారణ ముగించడానికి వీలుగా ప్రతిజిల్లాకు ఒక ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. అత్యాచారం, సామూహిక అత్యాచారం, యాసిడ్ దాడులు, సోషల్ మీడియా ద్వారా అసభ్యంగా చూపించడం, వేధించడం వంటి నేరాలు పోక్సో పరిధిలోకి వచ్చే అన్ని నేరాలు ఈ కోర్టు పరిధిలోకి తీసుకువచ్చారు.

ఈ నేరాలపై దోషులు పై కోర్టుకు వెళ్లి అప్పీలు చేసుకునే గడువును కూడా కేంద్ర ప్రభుత్వం చట్టంలో ఉన్న ఆరు నెలల కాలాన్ని ఎపిలో మూడు నెలలకు తగ్గించారు. ఈ చట్టాల గురించి నేటి తరం విద్యార్థిని విద్యార్థులకు, యువతకు, మహిళా ఉద్యోగులకు అవగాహన పరచాలి. టివి, సినిమా, పత్రికలు, సోషల్ మీడియా మొదలగు వాటి ద్వారా ప్రచారం చేస్తూ మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, మహిళలను ఏవిధంగా వేధించినా వారిపట్ల తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి. మహిళా బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి.

దిశ ఘటన విషయంలో దేశ మంతా దిగ్భ్రాంతికిలోనై ఆడపిల్లల భద్రత పట్ల విచారాన్ని వ్యక్తం చేస్తుంటే, మరికొందరు సోషల్ మీడియాలో వికృతంగా పోస్టులు, కామెంట్లు చేసి, పైశాచికా నందాన్ని పొందారు. చాలా మంది అమ్మాయిల వల్ల అబ్బాయిలు నష్ట పోతున్నారని, రేప్ చేయడం తప్పుకాదని అంటూ, రేప్‌లను సమర్థిస్తూ ఫేస్‌బుక్ యూజర్, మరికొందరు సోషల్ మీడియాలో కామెంట్లు పెట్టారు.

దీని ద్వారా నేటి యువత ఎంతగా నైతిక విలువలను వదిలివేసి కనీసజ్ఞానం, అవగాహన లేకుండా ప్రవర్తించడం, స్పందించడం గమనించవచ్చు. నేటి కాలంలో స్త్రీలు పురుషులతో సమానంగా చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ భారతీయ పురుషాధిక్యత సమాజంలో పనిచేసే, ఉద్యోగాలు చేసే స్త్రీల పట్ల చిన్నచూపు కలిగి ఉన్నారు. అందుచేత ఉద్యోగాలు చేసే చోట్ల, పనిచేసే చోట్ల వెళ్లే దారిలో వివక్ష తకు లోనవుతూ, లైంగిక దాడులకు గురవుతున్నారు.

అంతే గాక పురుషాధిపత్యానికి అనుగుణంగా ప్రవర్తించాల్సిన గత్యంతరం ఏర్పడుతోంది. తమ హక్కుల కోసం నిలబడ్డ స్త్రీల పట్ల ఎదురు తిరిగిన స్త్రీల పట్ల అణిచివేత, ఇబ్బందులకు, సమస్యలకు గురి చేసి తమ ఆధిక్యతను ప్రదర్శించడానికి పురుష ఉద్యోగులు, అనగా వారితో పనిచేసే తోటి ఉద్యోగులు, పై అధికారులు ప్రవర్తిస్తున్నారు. ఈ తరుణంలో నేటి స్త్రీలను కాపాడేందుకు ఎన్ని చట్టాలు చేసినా, వాటిని ఎంతవరకు స్త్రీలు ఉపయోగించుకుంటున్నారు? ఎంతమేరకు వాటిపై అవగాహన కలిగి ఉన్నారో చర్చించాల్సిన అవసరం ఉంది.

స్త్రీల అసభ్య చిత్రీకరణ నిషేధిత చట్టం–1986 ఏమి చెబుతుందంటే వ్యాపార ప్రకటనలు, ప్రచురణ, చిత్రాలు, బొమ్మలు మొదలైన మార్గాల ద్వారా స్త్రీలను అసభ్యకరంగా చిత్రీకరించడం నిషేధించే నిమిత్తం 1986 సంవత్సరంలో కేంద్రప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించిన తర్వాత 1987 సెప్టెంబరు 27 నుండి అమలులోకి వచ్చింది. స్త్రీ శరీరఆకారాన్ని అసభ్యంగా లేక స్త్రీలను అవమానపరిచే రీతిలో చిత్రీకరించడం, తమ వ్యక్తిగత అవసరాల కోసం కరపత్రాలు లేదా వివిధ ప్రసారమాధ్యమాల్లో అగౌరవపరుస్తూ ప్రకటనలు చేయడం వలన ప్రజలలో నైతిక విలువలు దిగజారే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉండడం వల్ల స్త్రీలను అసభ్యకరంగా చిత్రీకరించడం నేరంగా పరిగణించబడుతుంది. స్త్రీలను అసభ్యకరంగా చిత్రీకరించే భంగి మలను లేక చిత్రాలను నోటీసు ద్వారా కానీ, సర్క్యులర్, లేబుల్, రేపర్ వంటి వాటి ద్వారా అడ్వర్టైజింగ్ చేయడం, అట్టపెట్టెలు మొదలైన ప్యాకింగ్‌పై అంటించడం వంటివన్నీ ఈ చట్టం పరిధిలోకి వస్తాయి.

స్త్రీలను అసభ్యంగా చిత్రీకరించే ప్రకటనలు, ఎగ్జిబిట్‌చేయడం, ప్రచురించడం మొదలైనవన్నీ ఈ చట్టపరిధిలో నిషేధించడమైనది. (సెక్షన్ 3) స్త్రీలను అసభ్యకరంగా చిత్రించే పుస్తకాలను, కరపత్రాలను అమ్మటం,అద్దెకి ఇవ్వడం, పంచిపెట్టడం వంటి పెయింటింగ్స్‌ను, రచనలను పోస్టు ద్వారా పంపడం కూడా ఈ చట్టపరిధిలో నిషేధం. శాస్త్రీయ, సాంకేతిక కళారంగాల అవసరానికి గాని ప్రజాసంక్షేమం కోసం కానీ ప్రచురించిన పుస్తకాలు, చిత్రాలు, ఫొటోగ్రాఫ్‌లు మొదలైన వాటికి ప్రాచీన కళాఖండాలను, శిల్పాలకు, సినిమాటోగ్రాఫర్‌లోని పార్ట్ 2 పరిధిలోకి వచ్చే చిత్రాలకు ఈ నియమం వర్తించదు(సెక్షన్ 4). సెక్షన్ 3,4 పరిధిలోని నిబంధనలు ఉల్లంఘించినట్లయితే రెండు సంవత్సరాల జైలుశిక్ష లేదా ఐదువేల రూపాయల వరకు జరిమా నా లేదా రెండూ విధించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలచే ఈ చట్టం కింద అధికారం ఇవ్వబడిన గెజిటెడ్ ఆఫీసర్ ఎవరైనా ఈ చట్టపరిధిలో నేరం జరిగిందని భావించబడే ప్రదేశంలోకి వారంటు లేకుండా ప్రవేశించి సోదా చేసి అసభ్యంగా చిత్రించే ప్రకటనలు, పుస్తకాలు, దినపత్రికలు, ప్రసార మాధ్యమాలు మొదలైనవాటిని స్వాధీనం చేసుకోవచ్చు. అయితే నివాసగృహంలో ప్రవేశించి అటువంటి సోదాలు చేయాలంటే వారెంట్ తప్పనిసరిగా అవసరం. ఈ చట్టం పరిధిలో నేరాలకు పాల్ప డినది కంపెనీ అయితే కంపెనీ లేదా పరిశ్రమ బాధ్యతాయుతమైన ఉద్యోగి కూడా నేరం చేసినట్లు గానే పరిగణనలోకి తీసుకోబడుతుంది. కంపెనీ డైరెక్టర్ మేనేజర్ మొదలైన వారి సహకారంతో ప్రోద్బలంతో నేరం జరిగినట్లుగా భావించబడితే వారిని కూడా శిక్షకు అర్హులుగా ప్రకటించబడు తుంది. భారతీయ శిక్షాస్మృతి 1869 ప్రకారం ఈ సెక్షన్‌ల ప్రకారం మహిళల గురించి ఏవైనా అసభ్యకర చిత్రాలు, వీడియో ప్రదర్శనలు మీడియాలో, ప్రసారం చేయడం చేస్తే న్యాయపరంగా శిక్షించడానికి ఈ సెక్షన్ల ద్వారా జైలుశిక్ష లేదా జరిమానాలు లేదా రెండూ విధించబడతాయి. ఐపిసి 500 సెక్షన్ ప్రకారం మహిళలతో అసభ్యకరంగా మాట్లాడడం వారి పరువు ప్రతిష్ట వ్యవహార శైలి గురించి ప్రసారం చేసినందుకు శిక్ష.

ఆలోచించండి?



రాష్ట్రం ప్రవేశపెట్టిన చట్టం ద్వారా రేప్ చేసిన వారికి తప్పని సరిగా మరణశిక్ష విధిస్తారు. నిర్భయ చట్టం ప్రకారం రెండునెలల్లో దర్యాప్తు పూర్తయితే మరో రెండు నెలల్లో శిక్షలు పడాలి. అంటే మొత్తం నాలుగు నెలల్లో దర్యాప్తు, న్యాయప్రక్రియ పూర్తి కావాలి. ఎపి దిశ చట్టంలో దీన్ని 21 రోజులకు కుదించారు. అత్యాచార నేరాల్లో విస్పష్టమైన తిరుగులేని ఆధారాలు లభించినట్లయితే 21రోజుల్లోనే నిందితుడికి శిక్షపడుతుంది. వారం రోజుల్లో పోలీసు దర్యాప్తు పూర్తి అవుతుంది.

14 రోజుల్లోపే న్యాయప్రక్రియ పూర్తయ్యిశిక్షపడాలి. అత్యాచార సంఘటనల్లో మాత్రమేకాకుండా పిల్లలపై లైంగిక నేరాలన్నింటికీ కూడా శిక్షల్ని పెంచారు. కేంద్రం చేసిన పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక నేరాలు, లైంగిక వేధింపులకు కనీసం మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు శిక్ష విధించ వచ్చు. ఎపిలో దాన్ని జీవితఖైదుగా మార్చారు. అంటే పిల్లలపై ఇక ఎలాంటి లైంగిక నేరాలు చేసినా జీవితాంతం జైల్లో ఉండాలి. లేదంటే ఉరికంబం ఎక్కాల్సి రావొచ్చు.

అత్యాచార నేరాలకు మాత్రమే కాకుండా పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారి విషయంలో కేంద్రం విధించిన ఒక ఏడాది గడువనీకు బదులు వారంలో దర్యాప్తు చేసి, న్యాయప్రక్రియ 14 పనిదినాల్లో పూర్తిచేసేలా చట్టానికి సవరణచేశారు. సోషల్ మీడియా ద్వారా మహిళలను వేధించడం, వారిపై అసభ్య పోస్టింగులు పెట్టడం లాంటివి చేస్తే ఐపిసి ప్రకారం ఇప్పటివరకు శిక్షలు నిర్దిష్టంగా లేవనీ. ఈ చట్టం ప్రకారం మెయిల్స్ ద్వారా లేదా సోషల్ మీడియా ద్వారా లేదా ఇతర డిజిటల్ మాధ్యమాల ద్వారా మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే మొదటి తప్పునకు రెండేళ్ళు, ఆ తర్వాత తప్పునకు నాలుగేళు శిక్ష విధించేలా ఐపిసిలో 354(ఇ) అనే కొత్త సెక్షన్‌ను తీసుకొచ్చారు.

దేశ చరిత్రలోనే తొలిసారిగా మహిళలు, పిల్లలపై నేరాల విచారణకు వేగంగా విచారణ ముగించడానికి వీలుగా ప్రతిజిల్లాకు ఒక ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. అత్యాచారం, సామూహిక అత్యాచారం, యాసిడ్ దాడులు, సోషల్ మీడియా ద్వారా అసభ్యంగా చూపించడం, వేధించడం వంటి నేరాలు పోక్సో పరిధిలోకి వచ్చే అన్ని నేరాలు ఈ కోర్టు పరిధిలోకి తీసుకువచ్చారు.

ఈ నేరాలపై దోషులు పై కోర్టుకు వెళ్లి అప్పీలు చేసుకునే గడువనీను కూడా కేంద్ర ప్రభుత్వం చట్టంలో ఉన్న ఆరు నెలల కాలాన్ని ఎపిలో మూడు నెలలకు తగ్గించారు. ఈ చట్టాల గురించి నేటి తరం విద్యార్థిని విద్యార్థులకు, యువతకు, మహిళా ఉద్యోగులకు అవగాహన పరచాలి. టివి, సినిమా, పత్రికలు, సోషల్ మీడియా మొదలగు వాటి ద్వారా ప్రచారం చేస్తూ మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, మహిళలను ఏవిధంగా వేధించినా వారిపట్ల తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి. మహిళా బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి.

కన్నాంబ కళాంకిత



కన్నాంబ పేరు చెప్పగానే మొదటిగా గుర్తుకొచ్చేది, లవకుశలోని ఆమె పోషించిన కౌసల్య పాత్ర. తరువాత గుర్తుకొచ్చేది మనోహరలోని పాత్ర. ఆ రోజుల్లో ఆమెకు ధీటైన నటీనటులు, శ్రీ యస్వీ రంగారావు గారు,శివాజీ గారు మరియు సావిత్రి గారు. గంభీరమైన స్వరం, చక్కటి రూపం వీటికి తోడు మాటలు పలకడంలో ఆమె చాతుర్యం, హావభావాలు.. ఇవన్నీ చూస్తుంటే ఎవరికైనా అనిపించేది కళ దైవదత్తమైనదని! ప్రసిద్ధ రంగస్థల నటి, గాయని, చలన చిత్ర కళాకారిణిగా తెలుగునాట కీర్తి తెచ్చుకున్న కన్నాంబ పూర్తి పేరు పసుపులేటి కన్నాంబ. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో 1912లో జన్మించిన కన్నాంబ ఆనాటి నావెల్ నాటక సమాజంలో పదమూడు సంవత్సరముల వయస్సులో బాల పాత్రలు వేస్తూ తొలిసారిగా నాటక రంగ ప్రవేశం చేసింది తన నాటకరంగానుభవంతో 1935లో హరిశ్చంద్ర తెలుగు చలనచిత్రంలో చంద్రమతిగా అడుగు పెట్టింది. ఆ తరువాత ద్రౌపదీ వస్త్రాపహరణంలో ద్రౌపదిగా అద్భుతంగా నటించి తెలుగు ప్రేక్షకుల మన్ననలను, ప్రశంసలను అందుకుంది. సుమారు 150 పౌరాణిక, జానపద మరియు చారిత్రక చిత్రాలలో తనదైన శైలిలో అద్వితీయంగా నటించి గొప్ప నటీమణిగా కీర్తి గడించింది. నవరసాలను సమర్థవంతంగా అవలీలగా పోషించగల అద్భుత నటీమణి కన్నాంబ. కన్నాంబ భర్త కడారు నాగభూషణం. ఇద్దరు కలసి 'రాజరాజేశ్వరి' చిత్ర నిర్మాణ సంస్థని స్థాపించి అనేక చిత్రాలు తెలుగు, తమిళ, కన్నడ భాషలలోనూ నిర్మించారు. ద్రౌపదీ వస్త్రాపహరణం, హరిశ్చంద్ర, చంద్రిక, కనకతార, పల్నాటియుద్ధం, గృహలక్ష్మి, అనార్కలి, దక్షయజ్ఞం, తోడికోడళ్ళు, కృష్ణ కుచేల, లవకుశ తదితర చిత్రాలు ఆమె నటించిన ముఖ్యమైనవి. ఎం.జి.రామచంద్రన్, ఎన్.ఎస్. రాజేంద్రన్ శివాజీ గణేషన్, నాగయ్య, పి.యు. చిన్నప్ప, నందమూరి తారక రామారావు తదితర అగ్రశ్రేణి నాయకుల సరసన ఎన్నో చిత్రాల్లో ఆమె నటించింది. కన్నాంబ గారి పేరు వింటేనే గౌరవభావం కలుగుతుంది. అంత ప్రజ్ఞావంతురాలైన నటి మరొకరు కనబడరు. కేవలం ఒక కనుబొమ్మతో ఆవిడ ప్రేమ, కరుణ, రౌద్రం... ఒకటేమిటి, నవరసాలు పలికించగలరు. నాకు ఆవిడ నటించిన తోడికోడళ్ళు అంటే చాల ఇష్టం. ఆవిడ తప్పితే ఆ భూమికను ఎవ్వరు చేయలరేమో అనిపిస్తుంది. ఆవిడ మంచి మనసు గురించి ఎంత చెప్పిన తక్కువే అవుతుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఆవిడ ఔదార్యంలో నాగయ్య గారి లాంటి వారు. శ్రీ రాజరాజేశ్వరి ప్రొడక్షన్స్ (కన్నాంబ గారి సంస్థ) ఒక దాన ధర్మ నిలయంగా విలసిల్లింది అని ఇప్పటికీ చెప్పుకుంటారట! ఇటువంటి గొప్ప నటులు, నటీమణులు కటిక పేదరికంలో చనిపోయారు అని తలచుకొంటేనే బాధగా వుంటుంది. చనిపోయిన యాభై ఏళ్ల తరువాత కూడా ఆ మహా నటులను, నటీమణులను మనం నేటికి తలచుకోవడమే వారి ప్రతిభకు గొప్ప నిదర్శనం. ఒక కళాకారిణికి అంతకన్నా కావలసిన యశస్సు ఏముంటుంది? ఆవిడ విశాల హృదయాన్ని గురించి ఒక మాట తప్పక చెప్పి తీరాలి. కన్నాంబ గారి పెంపుడు కూతురు రాజరాజేశ్వరినే దర్శకుడు సి.యస్. రావు గారికిచ్చి పెళ్లి చేసినా, వాళ్ళు విడిపోయారు. తరువాత రాజసులోచన గారు, సి.యస్. రావు గారు ఒకరినొకరు ఇష్టపడుతున్నారని తెలిసి కన్నాంబ గారే దగ్గరుండి వివాహం చేయించారు. ఈ విషయం రాజసులోచన గారే స్వయంగా అన్నారని ఒక పత్రికలో చదివాను. ఇక డీ.వీ. నరసరాజు గారు ఆయన పుస్తకంలో కన్నాంబ గారి గురించి, ఆవిడకు దక్కిన గౌరవం గురించి చెబుతూ ఒక సినిమాలో నటించే సమయంలో ఆవిడ మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వెళ్లి చాలా ఆలస్యంగా వస్తున్నా



రని, ఆవిడని తొందరగా రమ్మనే సాహసం చేయలేక, ఆ చిత్ర దర్శకులు ఒక కారు ఇచ్చి, "నరసరాజు గారూ, కన్నాంబ గారిని డ్రాప్ చేసి ఈ కారు పట్టుకెళ్ళి మీరు భోంచేసి, మరల తిరిగి వచ్చేటప్పుడు ఆవిడని తీసుకురండి టైంకి. "అని పంపారట. మొదట కన్నాంబ గారిని డ్రాప్ చేసిన కారు నరసరాజు గారిని డ్రాప్ చేయగానే, ఆయన గబగబా భోజనం ముగించి, బయటకు వచ్చి చూస్తే కారు కనబడలేదట. ఏమయింది చెప్మా అనుకుంటుంటే మామూలుగానే కారు ఆలస్యంగా వచిందట. అందులో కన్నాంబ గారు ఉన్నారట (ముసుముసి నవ్వులు నవ్వుకుంటూ..) "నరసరాజు గారు, మిమ్మల్ని డ్రాప్ చేసాక మా ఇంటికి రమ్మని చెప్పాలెండి డ్రైవర్‌ని" అన్నారట ఆవిడ. అంతటి పసిపిల్లలాంటి నిష్కల్మషమైన ఆవిడ మన హృదయాలలో ఎప్పటికీ వుంటారు. కన్నాంబ పాడిన "కృష్ణం - భజరాధా" గ్రాంఫోన్ గీతాలు, ఆ రోజుల్లో ప్రతి ఇంట మారు మ్రోగుతూ ఉండేవి. ఆమె గొప్ప నటీమణి మాత్రమే కాదు. చక్కని గాయని కూడా. సుమారు ఐదు దశాబ్దాలు తెలుగు చలన చిత్ర సీమలో తనదైన ప్రత్యేక బాణీని ప్రదర్శించిన శ్రీమతి కన్నాంబ 1964లో మే 7న తుదిశ్వాస విడిసారు. రావికొండలరావు రచన నుండి 1) 'నేనే రాణినైతే ఏలనే ఈ ధర ఏకధాటిగా ...' అని ఒక పాట. చేతిలో కత్తి పట్టుకొని, వీరావేశంతో గుర్రం మీద కూచుని ఠీవీగా, ధాటిగా కళ్లెర్రజేస్తూ పాడిన ఆ మహానటి పసుపులేటి కన్నాంబ. ఆ సినిమా పేరు 'చండిక' (1941), ఠీవి గురించి ఆ రోజుల్లో ఆ సినిమా చూసినవాళ్లు చెప్పుకొనే వారు. అందులో కన్నాంబ గారు ఇంకా కొన్ని పాటలు పాడారు. మరొక పాట - "ఏమే ఓ కోకిలా- ఏమో పాడెదవు. ఎవరే నేర్పినది ఈ ఆట ఈ పాట..." ఈ పాటలో ఆమె నవ్వులు రువ్వుతూ పాడతారు. మధ్యమధ్యలో వచ్చే ఆ నవ్వు - ఆమె తప్ప ఇంకెవరు అలా నవ్వులు కలుపుతూ పాడలేరని కూడా ఆనాటి జనం చెప్పుకునేవారు 2) కడారు నాగభూషణం గారిని వివాహం చేసుకొని శ్రీ రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ స్థాపించి తెలుగు తమిళ భాషల్లో 22 చిత్రాలు నిర్మింపజేశారమే. 'సుమతి(1942)', పాదుకా పట్టాభిషేకం (1954), సౌదామిని (1951), పేదరైతు (1952), లక్ష్మి (1953) సతీ సక్కుబాయి (1954), శ్రీకృష్ణతులా భారం (1955), నాగపంచమి (1956) మొదలైన చిత్రాలు ఆ కంపనీ నిర్మించింది. జీతాలు ఇవ్వడంలో ఆ కంపనీకి గొప్ప పేరు వుండేది. ప్రతినెలా ఒకటో తేది రాకముందే ముందు నెల చివరి రోజునే స్టాఫ్‌కి జీతాలు ఇచ్చేసేది ఆ కంపనీ. వారి ఆఫీసు కూడా చాల విశాలమైన కాంపౌండ్‌లో, కార్లు, వ్యాన్లతో కళకలలాడుతూ వుండేది. ఇప్పుడు 'టైటానిక్ చీరలు' అంటూ సినిమా పేర్లతో చీరలు వస్తునట్టు- అప్పుడు "కాంచనమాల గాజులు - కన్నాంబ లోలాకులు" అంటూ ఆభరణాలు వచ్చేవి. కన్నాంబ గొప్ప ఐశ్వర్యవంతురాలు అనీ, బంగారు కాసులు డబ్బాల్లో పోసి, పప్పులు, ఉప్పులు పెట్టుకొనే డబ్బాల మధ్య ఎవరికీ తెలియకుండా ఉంచేవారని చెప్పుకునేవారు. 3) ఐశ్వర్యం ఎలా వస్తుందో ఎలా పోతుందో ఎవరూ చెప్పలేరని పెద్దలు చెబుతారు. ఎలా పోయాయో, ఏమైపోయాయో గాని, కన్నాంబ మరణంతో కంపనితో సహా అన్నీ పోయాయి. ఆమె భర్త నాగభూషణం గారు ఒక చిన్న గదిలో ఉంటూ కాలక్షేపం చేసేవారు. ఒకసారి ఒక మిత్రుడు ఆయన్ని కలవాలని ఆ గదికి వెళ్లి 'గుండె కలుక్కుమంది. ఆ వాతావరణం చూడలేక తిరిగి వచ్చేసాను' అని చెప్పారు. ఆ చిన్న గదిలో ఒక ట్రంకు పెట్టె, ఓ కుర్చీ మాత్రం వున్నాయి. ఎదురుగా కన్నాంబ ఫోటో, దండెం మీద తువ్వాలు తప్ప ఇంకా ఏమి కనిపించలేదు. ఆయన కిందనే చాప మీద కూర్చొని, దిన పత్రిక చదువుకుంటున్నారు అన్నాడు ఆ మిత్రుడు. 4) కన్నాంబ మృతదేహాన్ని వారి కులాచారం ప్రకారం నగలతోనే పూడ్చిపెడితే దొంగలు ఆ నగలను కాజేసి ఆమె శవాన్ని కూడా మాయం చేసారట.

పెళ్లి చీరె పెట్టిన చిచ్చు...!



పెళ్లికొడుకు పరారీలో!!

పెళ్లంటే పందిళ్లు.. ఇల్లంతా సందళ్లు.. తాళాలు తలంబ్రాలు.. మూడే ముళ్లు.. ఏడే అడుగులు.. మొత్తం కలిపి నూరేళ్లు... అని పాడుకుందామని పాట స్టార్ట్ చేశారో లేదో, పెళ్లి పెటాకులై, వాదోపవాదాలు, గొడవలు, పోలీసు కేసుల దాకా వెళ్ళింది. కర్ణాటకలో హాసన్ అందమయిన ప్రాంతం. పుడమితల్లి పచ్చని పట్టుచీర కట్టుకుని సతత హరిత సంభరితంగా, ప్రశాంతంగా ఉండే ప్రాంతం. ఆ హాసన్‌లో రఘుకుమార్- సంగీత అని యువతీ యువకులు. చూపులు కలిసిన శుభవేళ ప్రేమ పుట్టింది. ప్రేమ మొగ్గ తొడిగి, పూలు పూచి ఇళ్లల్లో తెలిసే సరికి సంవత్సరం పట్టింది. మొదట రాట్ ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రేమగా అటు ఇటు తల్లిదండ్రులను ఒప్పించారు ఈ ప్రేమికులు. ముహుర్తాలు కుదిరాయి. పెళ్లిపందిరి బుక్ చేశారు. పై పాటలోలా పందిళ్లు, తాళాలు, తలంబ్రాలు అన్నీ సిద్ధమయ్యాయి. పందిట్లో అమ్మాయి సిగ్గుల మొగ్గయి బుగ్గల్లో ఎరుపుల నిగ్గులు వెలుగుతుండగా ఫొటోగ్రాఫర్లు ఫోటోలు తీస్తున్నారు. వీడియోగ్రాఫర్లు వీడియోలు తీస్తున్నారు. ఈలోపు పెళ్ళికొడుకు తల్లి రంగప్రవేశం చేసింది. దాంతో పెళ్లి పెటాకులయ్యింది. ఎలాగంటే-అమ్మాయ్! నువ్ కట్టుకున్న పెళ్లి చీర చాలా దరిద్రంగా ఉంది. వెళ్లి మంచి చీర కట్టుకుని రా! అని పెళ్లి కూతురిని ఆదేశించింది. అయ్యో అత్తా! మైసూరు ఊరు ఊరంతా తిరిగి రెండువేల చీరల్లో నుండి దీన్ని ఎంపిక చేశారు మా అమ్మా నాన్నా. చాలా కాస్ట్లీ చీర. దీనికేమి తక్కువ? బాగానే ఉంది కదా? అని అమ్మాయి సర్ది చెప్పబోయింది. ముందు మీ అమ్మా నాన్నను పిలువు అని వారొచ్చాక- పెళ్లి చీర మారిస్తేనే పెళ్లి- లేకపోతే లొల్లి లొల్లి అని అల్టిమేటం ఇచ్చింది కాబోయే అత్త. చీర లాగితే డొంకంతా కదలాలి కాబట్టి- పోవమ్మా చాలా చూశాము గానీ, అమ్మాయి కట్టుకున్న చీరతోనే తాళి కట్టించుకుంటుంది- ఏం ఎగతాళిగా ఉందా? అని పెళ్లికూతురి తల్లిదండ్రులు ఆ చీరకే స్టికాన్ అయ్యారు. అత్త అహం దెబ్బతింది. ఒరేయ్ రఘు! అమ్మాయిని పెళ్లి చీర మార్చమంటే మార్చట్లేదు. నువ్వసలు పందిట్లోకే రావద్దు- అని పెళ్లికొడుక్కు తల్లి ఆదేశాలిచ్చింది. అంతే అమ్మ మాట జవదాటని రఘు అడ్రెస్ లేడు. పెళ్లి ఆగిపోయింది. లోకల్ మహిళా పోలీసు స్టేషన్‌కు వెళ్లి పెళ్లి కొడుకు, అతడి అమ్మా నాన్నలమీద పెళ్లికూతురు అమ్మా నాన్నలు కేసు పెట్టారు. ఇది జరిగి నాలుగు రోజులయ్యింది. ఇప్పటిదాకా పెళ్ళికొడుకు ఆచూకీ దొరకలేదు. ఇందులో కొంత మంచీ ఉంది. కొంత చెడూ ఉంది. చీరకే ఇంత చించుకునిపోతే రేపు సంసారం నిలువుగా అడ్డంగా ఎంతగా చిరిగిపోయేదో? కాబట్టి తాళి కట్టాక ఎగతాళి కావడం కంటే ముందే దరిద్రం వదిలినందుకు అమ్మాయి సంగీత సురక్షితం. వీలయితే మరొకరిని ప్రేమించవచ్చు. లేదా పెద్దలు కుదిర్చిన పెళ్ళిచేసుకుని కర్ణాటక సంగీతం పాడుకుంటూ శేష జీవితాన్ని గడిపేయవచ్చు. అబ్బాయి రఘు మరీ దుర్బలుడిలా ఉన్నాడు. ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాను అని ధైర్యంగా చెప్పగలిగినవాడు చీరదేముంది లేమ్మా! అని అమ్మకు చెప్పలేకపోయాడు. పందిట్లోకి వచ్చి సమస్యను సామరస్యంగా పరిష్కరించ లేకపోయాడు. పీటల మీద అమ్మాయిని ఖర్మానికి వదిలేసి పరారై పోయాడు. కొడుకును పెంచిన తన పెంపకానికి ఆ తల్లి ఇంతటి సంక్షోభంలోనూ మురిసిపోతోందట. హాసన్ నుండి మైసూరు హీనపక్షం మూడు గంటల ప్రయాణం. అంతదూరం వెళ్లి పెళ్లిబట్టలు ఒక పనిగా పెట్టుకుని సెలెక్ట్ చేస్తే చీర బాగలేదనడం మనసు చివుక్కుమనే విషయమే. సంగీత ఈరోజు చీర మారిస్తే రేపు సంసారంలో అత్త గడియకొకటి మార్చమని చెబుతూనే ఉంటుంది. ఈ పిరికి రఘు పోతే పోయాడు. ఇంకో రఘుకుల తిలకుడు సంగీతకు దొరకాలని కోరుకుందాం.





మళ్ళీ వెళ్దాం ప్రకృతి వైపు

క్యాన్సర్‌తో సోనాలీ బింద్రే, అజయ్ దేవ్‌గన్ - లిటరల్ ఎపికొండైలిటిస్ (తీవ్రమైన భుజం వ్యాధి), ఇర్ఫాన్ ఖాన్ - క్యాన్సర్, మనీషా కొయిరాలా - క్యాన్సర్, యువరాజ్ సింగ్ - క్యాన్సర్, సైఫ్ అలీ ఖాన్ - గుండెపోటు, హృతిక్ రోషన్ - బ్రెయిన్ క్లాట్, అనురాగ్ బసు - రక్త క్యాన్సర్, ముంతాజ్ - రొమ్ము క్యాన్సర్, షారుఖ్ ఖాన్ - 8 శస్త్రచికిత్సలు (మోకాలి, మోచేయి, భుజం మొదలైనవి), తాహిరా కశ్యప్ (ఆయుష్మాన్ ఖురానా భార్య) - క్యాన్సర్, రాకేశ్ రోషన్ - గొంతు క్యాన్సర్, లిసా రాయ్ - క్యాన్సర్, రాజేష్ ఖన్నా - క్యాన్సర్, వినోద్ ఖన్నా - క్యాన్సర్, నర్గిస్ - క్యాన్సర్, ఫిరోజ్ ఖాన్ - క్యాన్సర్, టోమ్ బలిపీఠం - క్యాన్సర్ ... ఈ వ్యక్తులు లేని వారు కాదు, డబ్బు కొరత లేని వారు! డైటీషియన్ సలహా మేరకు ఎల్లప్పుడూ ఆహారం తీసుకుంటారు. ఏసిలో నివసించేవారు మరియు బిస్లెరి నీరు త్రాగేవారు. జిమ్‌కు కూడా వెళ్తారు. రోజూ అన్ని రకాల శరీర పరీక్షలు చేయించుకుంటారు. ప్రతి ఒక్కరికి అర్హత కలిగిన స్వంత వైద్యులు ఉన్నారు. ఇప్పుడు ఒక ప్రశ్న తలెత్తుతుంది? వాళ్ళకు శరీరంపై చాలా శ్రద్ధ ఉన్నప్పటికీ, వాళ్ళు అకస్మాత్తుగా ఇంత తీవ్రమైన అనారోగ్యం ఎలా పొందారు? ఎందుకంటే వారు సహజమైన వస్తువులను ఉపయోగించడం మానేశారు. ప్రకృతి మనకు ఎప్పటికీ హాని కలిగించదు కాబట్టి ఏదైనా ప్రకృతి సహజ ఫలం తినండి లేదా త్రాగండి! శరీరానికి ఎటువంటి హాని జరుగదు మనం ఈ భూమిని కలుషితం చేయకపోతే, భూమి నుండి బయటకు వచ్చిన నీటి నాణ్యత చాలా బాగుంటుంది. మీరు పుట్టినప్పటి నుండి మీ పిల్లవాడిని ఒక్క సూక్ష్మక్రిమి కూడా లేని చోట ఉంచి చూడండి. పెరిగిన తరువాత, సాధారణ ప్రదేశంలో నివసించడానికి వదిలివేసి చూడండి. ఉదాహరణకు మైఖేల్ జాక్సన్ ఆక్సిజన్ టెంట్లలో, అత్యంత పరిశుభ్రమైన పరిసరాల్లో నివసించినా, అనారోగ్యం పాలై, చిన్న వయసులోనే అతి దారుణమైన పరిస్థితుల్లో మరణించాడు. ఆ పిల్లవాడు సాధారణ జ్వరాన్ని కూడా భరించలేడు! ఎందుకంటే అతని శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థ సూక్ష్మక్రిములతో పోరాడటానికి సరిపడినంతగా అభివృద్ధి చెందలేదు. మీరు ఒక రోజు సబ్బుతో స్నానం చేయకపోతే మీరు సూక్ష్మక్రిములతో చుట్టుముట్టబడతారు మరియు సాయంత్రం కల్లా మీరు చనిపోతారని కార్పొరేట్ సంస్థలు మనల్ని భయభ్రాంతులకు గురిచేసాయి. మనం పట్టణాలలో ఎలా ఎందుకు నివసిస్తున్నామో అర్థం కావడం లేదు. నిత్యం విభిన్న రోగాల బారిన పడి స్వచ్ఛమైన గాలినికూడా పీల్చలేక పోతున్నాము. ఒకరితో ఒకరు కరచాలనం చేసిన తరువాత ప్రజలు శానిటైజర్ను వాడడం మనం చూస్తున్నాము. మీరు ఎప్పుడైనా గమనించారా! పిజ్జా బర్గర్ తినే సిటీ పీపుల్ సులభంగా వ్యాధుల బారిన పడుతున్నారు. కార్పొరేట్ హాస్పిటళ్ళు వారిని పీల్చి పిప్పి చేస్తాయి. నాటు ఆవుపాలు పెరుగు మజ్జిగ తినే గ్రామంలో వృద్ధులకి అదే జ్వరం కానీ ఏ వ్యాధైనా మందులు లేకుండా ఇట్లే నయమవుతుంది. వారికి చిన్న చిన్న సమస్యలను తట్టుకునే సహజసిద్ధ ఆరోగ్యం ఉంటుంది. ప్రకృతిలో మమేకమై, శారీరక శ్రమతో దినచర్య ఉండే వారు, దృఢంగా ఉంటారు. అంతేకానీ, ప్రతీ చిన్న సమస్యకు మందులపై ఆధారపడరు. పల్లెలలోని పిల్లలు ఎవరైతే బయట మన్ను దుమ్ములో నిత్యం ఆడు కొంటుంటారో మరియు నిత్యం ప్రకృతిలో దొరికే పల్లె చెట్లలో కాసే జామ కాయలు నాటు పులుపు మామిడికాయలు నాటు దానిమ్మ కాయలు నిమ్మ కాయలు బుడంకాయలు తాతాబుడం కాయలు కాశిపండ్లు బలసపండ్లు ఉలింది పండ్లు మల్లీతకాయలు నాటు చెరుకుగడలు చీమిడిపండ్లు పచ్చి వేరుశనగ కాయలు పచ్చి జొన్న కంకులు పచ్చి రాగికంకులు పచ్చి సజ్జకంకులు తామర గింజలు నేరేడుపండ్లు రెండు రకాల రేగు పండ్లు ఇసకరేణి పండ్లు మేడి పండ్లు నాగదారి పండ్లు సీతాఫలం పండ్లు పచ్చి వెలగపండ్లు నాటు బొప్పాయి పండ్లు గుమ్మడికాయలు ఉసిరికాయలు పచ్చి/పండు చింతకాయలు పచ్చి గెనుసుగడ్డలు తింటూ పొలాలను పండించే పనిలో గడిపినచో వారానికోరోజు పండించిన వడ్లను స్వయంగా దంచుకొని నిత్యం రోకటితో నూరిన పచ్చళ్ళను తింటూ ఉన్నవారికి ఎంతో చక్కని ఆరోగ్యం వారి సొంతం గాక ఎవరి సొంత మౌతుంది? కనీసం పైన తెలిపిన పండ్ల పేర్లయినా తెలిసినవారెదరుంటారు? డబ్బు ఎల్లవేళలా ఆరోగ్యాన్ని మరియు ఆనందాన్ని కలిగించదు. ఒక్కో దంపతులకు ఒక ఎకరం మెట్ట, మాగాణీ చాలు చక్కని సంసారంతో కలకలలాడుతూ సుఖంతో తృప్తిగా జీవితాన్ని గడపడానికి. వివేకం విజ్ఞతకై డిగ్రీ వరకు చదువు చాలు అదే చక్కని జీవితం ! మళ్ళీ వెళ్దాం.. ప్రకృతి వైపు అలోచించండి మిత్రమా...!

ఇందిరా గాంధీ



జననం : 19, నవంబర్ 1917, మరణం : 31 అక్టోబర్ 1984

దేశాన్ని నడిపించిన చరిష్మా గల, వివాదస్పద రాజకీయ నాయకులలో ఇందిరా గాంధీ అగ్రగణ్యులు. 1966-1977 వరకు మళ్ళీ 1980 లో నుంచి 1984 లో ఆమె కన్నుమూసేంత వరకు దేశ ప్రధాన మంత్రిగా పని చేశారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కుమార్తెగా ఆమె బాల్యం ఒ ం ట రి త న ం తో విషాదభరితంగా సాగింది. చిన్న వయసులోనే ఆమె తల్లిని కోల్పోయారు. స్వతంత్ర ఉద్యమ సమయంలో నెహ్రూ ఆమెను తరచుగా గదిలో ఉంచేవారు. ఆమె విద్యాభ్యాసం వివిధ బోర్డింగ్ స్కూళ్లలో సాగింది. 1942 లో ఫిరోజ్ గాంధీని పెళ్లాడారు. తన తండ్రి మరణానంతరం రాజకీయాల్లోకి వచ్చారు. నెహ్రూ అనంతరం పార్టీలో ఎదిగి, లాల్ బహదూర్ శాస్త్రి హయాంలో సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అయ్యారు.

పార్టీలో ఆమె సర్దుకుపోయే ధోరణిలో ఉంటారని పార్టీ సభ్యులు భావించినప్పటికీ, వాళ్ళ అంచనాలకు విరుద్ధంగా, వారు వ్యతిరేకించినప్పటికీ బ్యాంకులను జాతీయం చేశారు. పార్టీలోని పలువురు ఆమెను పార్టీ నాయకురాలిగా తోసిపుచ్చినప్పటికీ, వాళ్లపై ప్రతీసారి పైచేయి సాధించి అధికారంలోకి వచ్చారు. ప్రధానిగా ఆమె హయాంలో అవినీతి ఆరోపణలు మరియు నిరంకుశ పాలనతో అత్యవసర పరిస్థితి విధించడంతో ఆమె సంకీర్ణ కూటమికి అధికారం అప్పగించాల్సి వచ్చింది. అయితే ప్రతికూల భావనలను బద్ధలు కొడుతూ 1980 లో ఆమె మరోసారి అధికారంలోకి వచ్చారు. అయితే ప్రధానిగా ఆమె తీసుకున్న కొన్ని కఠిన నిర్ణయాలు ఆమె మరణానికి కారణమయ్యాయి.

ఎం.ఎస్.సుబ్బులక్ష్మి

జననం : సెప్టెంబర్ 16, 1916 మధురై షణ్ముఖవడివు సుబ్బు లక్ష్మి
మదురై,తమిళనాడు రాష్ట్రం
మరణం: 2004 డిసెంబరు 11 (వయసు 88)
చెన్నై, తమిళనాడు రాష్ట్రం
మరణానికి కారణం ఊపిరితిత్తుల న్యుమోనియా,
హృదయ సంబంధ సమస్యలతో



వృత్తి : కర్నాటక సంగీత గాయకురాలు ఎం.ఎస్.సుబ్బు లక్ష్మి లేదా ఎం.ఎస్.గా పేరుగాంచిన మదురై షణ్ముఖవడివు సుబ్బు లక్ష్మి (1916 సెప్టెంబర్ 16 - 2004 డిసెంబర్ 11) సుప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసు రాలు, గాయని మరియు నటి. ఈమె భారతదేశ అ త్యున్నత పౌరపురస్కారమైన భారత రత్న పురస్కారాన్ని పొందిన మొట్టమొదటి సం గీత కళాకారిణి, ఆసియా నోబెల్ ప్రైజ్‌గా పరిగణించే రామన్ మెగసెసే పురస్కారం పొందిన తొలి భారతీయ సంగీత కళాకారిణి. 1974 లో రామన్ మెగసెసె పురస్కారం పొందినప్పుడు అవార్డు ప్రదాతలు ప్రకటిస్తూ కర్ణాటక సంగీత శ్రోతల్లో తీవ్రమైన స్వచ్ఛతావాదులు శ్రీమతి. ఎం. ఎస్. సుబ్బులక్ష్మిని కర్ణాటక సంగీతపు శాస్త్రీయ, అర్ధ-శాస్త్రీయ గీతాలాపనలో ప్రస్తుతపు ప్రధాన విశేషంగా పరిగణిస్తారు అని వ్యాఖ్యానించారు.

నిర్మలా సీతారామన్



భారతదేశ ఆర్థిక శాఖ మంత్రి
వ్యక్తిగత వివరాలు జననం 1959 ఆగస్టు 18
(వయస్సు: 60 సంవత్సరాలు)
తిరుచురాపల్లి, తమిళనాడు
రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ
జీవిత భాగస్వామి
పరకాల ప్రభాకర్(ఆంధ్ర రాష్ట్రము) సంతానము
ఒక ఆడపిల్ల నివాసము
కొత్త ఢిల్లీ, భారత్ పూర్వ విద్యార్థి

నిర్మలా సీతారామన్ భారతదేశ తొలి మహిళ రక్షణ శాఖ మంత్రి. 1980 నుంచి 1982 వరకు ప్రధాని హోదాలో ఇందిరాగాంధీ ఈ పదవిని నిర్వహించారు. సాధారణ సేల్స్ మేనేజర్ నుంచి అంచెలంచెలుగా ఎదిగి తాజాగా అత్యంత కీలకమైన దేశ రక్షణ మంత్రిస్థాయికి చేరిన ఏకైక వ్యక్తి నిర్మలా సీతారామన్!! అందునా.. పూర్తిస్థాయిలో దేశ రక్షణ మంత్రిత్వశాఖను చేపట్టిన తొలి మహిళ నిర్మలనే కావడం విశేషం.

రిసెప్షనిస్టు నుంచి ప్రపంచ శక్తిమంతురాలిగా..



శీతల పానీయాల దిగ్గజం కోకాకోలా..! కొన్ని దశాబ్దాలపాటు ఈ మార్కెట్‌ను ఏకఛత్రాధిపత్యంతో ఏలింది. ఎప్పటి నుంచో శీతల పానీయాల మార్కెట్‌లో ఉన్న పెప్సీ మాత్రం అనుకున్న స్థాయిలో ఎదగలేదు. ఈ క్రమంలో ఒక భారతీయురాలు ఆ సంస్థ దశ..దిశను మార్చేశారు. ఆమే ఇంద్రా నూయి..! ఒకప్పుడు పార్చ్యూన్, ఫోర్బ్స్ వంటి జాబితాల్లో నిలకడగా చోటు దక్కించుకొన్నారు. అకుంఠిత దీక్షతో అత్యున్నత శిఖరాలను అందుకున్న ఆమె ప్రపంచ నారీ లోకానికే ఓ విజయం సంకేతం. కేవలం ఓ విద్యార్థిగా అమెరికాలో అడుగుపెట్టి కార్పొరేట్ రంగంలో అపార కీర్తిని సొంతం చేసుకున్నారు.

క్రికెట్ అంటే ఇష్టం...

ఉక్కు మహిళగా కార్పొరేట్ రంగం కొనియాడే నూయి పూర్తి పేరు ఇంద్రా కృష్ణమూర్తి నూయి. చెన్నైలోని హోలి ఏంజెల్స్ స్కూల్లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీ నుంచి బీఎస్సీలో పట్టా పొందారు. స్కూల్, కాలేజీల్లో నూయి కేవలం చదువులకే పరిమితం కాలేదు. ఆటపాటల్లో ముందుండేవారు. క్రికెట్ అంటే ఆమెకు చాలా ఇష్టం. బీఎస్సీ అనంతరం 1976లో కోల్‌కతా ఐఐఎం నుంచి ఎంబీఏ పట్టా అందుకున్నారు. 'నెటూర్ బెడ్‌సెల్' అనే వస్త్ర తయారీ సంస్థలో ప్రొడక్ట్ మేనేజర్‌గా ఉద్యోగం లభించింది.

బ్రిటన్ నూతన ఆర్థిక మంత్రిగా భారత సంతతి



బ్రిటీష్ బడ్జెట్ లండన్: బ్రిటన్ నూతన ఆర్థిక మంత్రిగా భారత సంతతి వ్యక్తి, ఇన్ఫోసిస్ నారాయ''ణ మూర్తి అల్లుడు రిషి సునక్ నియమితులైన విషయం తెలిసిందే. కాగా.. వచ్చే నెల 11న పార్లమెంట్‌లో ఆయన బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ఆయనే స్వయంగా వెల్లడించారు. 'ఈ నెల 11న పార్లమెంట్‌లో నేను మొదటిసారిగా బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నాను. బడ్జెట్‌ను రూపొందించేందుకు కసరత్తు జరుగుతోంది' అంటూ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఆక్స్‌ఫోర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీల్లో చదివిన రిషి.. యార్క్‌షైర్‌లోని రిచ్‌మండ్ నుంచి వరుసగా మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఈ మధ్య జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన రిషి సునక్‌ను ప్రధాని బోరిస్ జాన్సన్ ఆర్థిక మంత్రిగా నియమించారు. ఇదిలా ఉంటే.. గతంలో థెరిసా మే ప్రభుత్వంలోనూ మంత్రిగా ఆయన పని చేశారు.

సంస్కృతి సాంప్రదాయాలు

సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా పదేపదే గొప్పలు చెప్పుకుంటున్న భారతావనిలో మహిళలపై జరుగుతున్న దాడులు ఆందోళనే కాదు ఆవేదనను కలిగిస్తున్నాయి. సమాజంలో పూజనీయులైన మహిళల ధనమాన ప్రాణా లకు రక్షణ కల్పించే విషయంలో విఫలం అవుతున్నారు. పాలకులు మహిళా రక్షణ విషయంలో పటిష్ట మైన చట్టాలు చేసి అధికారుల మీద అధికారులను నియమి స్తున్నా దోషులను పట్టుకుని న్యాయస్థానాలముందు తిరుగులేని సాక్ష్యాలతో రుజువులు చేసి శిక్షలు వేయిస్తున్నా మహిళలపై జరుగుతున్న అఘాయి త్యాలు ఏమాత్రం ఆగడంలేదు. అవి అంతకంతకూ పెరుగుతు న్నాయి. జరిగిన, జరుగుతున్న సంఘటనలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. చట్టం తన పని తాను చేసుకు పోతుందని పాలకులు ఎంతగా చెపుతు న్నారో అంతకు రెట్టింపు స్థాయిలో మహిళలపై నేరాలు పెరిగిపోతు న్నాయి.

వాస్తవంగా చదువు సంధ్యలు పెరిగే కొద్దీవిజ్ఞానం ఆర్జించే కొద్దీ మనుషుల ప్రవర్తనల్లో మార్పులు రావాలి. సంస్కారం సభ్యత మరింత ఎరగాలి. మంచేదో చెడేదో గ్రహించే విచక్షణ జ్ఞానం పెరగాలి. దుర దృష్ట వశాత్తూ అందుకు విరుద్ధంగా తిరోగమిస్తున్నామేమోనని పిస్తుం ది. చట్టాలు కానీ ఆ అధికారులు కానీ ఈ అరాచకాలను నియంత్రిం చలేకపోతున్నారు. పాలకుల్లోనే త్రికరణశుద్ధి లేదేమోననే అనుమా నాలు వ్యక్తం అవుతు న్నాయి.చట్టసభలో మహిళా బిల్లు ఏనాడో అటకె క్కిం చారు. అత్యాచార సంఘటనలు వేధింపులతో ఎన్ని లక్షల మంది మహిళలు తమలో తాము కుమిలిపోతున్నారో బైటికి చెప్పుకోలేక అటు పోలీస్ స్టేషన్ గడప ఎక్కలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘట నలు అన్నీ ఇన్నీ కావు. ఇక కుల, మత వర్గాలకు అతీతంగా సమా జాన్ని తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతుంటే మరొకపక్క మూర్తీ భవించిన మూఢనమ్మకాలు ,కులవ్యవస్థపై ఉన్న భ్రమల తో నేటికీ తల్లితండ్రులే హత్యలకు పాల్పడుతున్నారు. మొన్న చిత్తూరుజిల్లా మదనపల్లిలో సంవత్సరం క్రితం ప్రేమించి పెళ్లిచేసుకున్న యువతిని ఎంత దారుణం గా హత్యచేసారో తలచుకుంటేనే గుండె చెరువవుతుంది.

అదేగ్రామానికి చెందిన మరొక కులానికి చెందిన యువకుణ్ణి ఆ యువతి ప్రేమించి పెళ్లిచేసుకుంది. ఏడాది తర్వాత మగ బిడ్డకు జన్మని చ్చింది. ఏడురోజుల బిడ్డతో గ్రామానికి వస్తున్న ఆయువతిని మార్గమ ధ్యంలో కాపలా కాసి తండ్రి, తల్లి, సోదరుడు, సోదరీమణి నలుగురూ కలిసి ద్విచక్రవాహనంపై బలవంతంగా ఎక్కించి తీసుకువెళ్లి దారుణం గా హత్యచేసి నీటిలో పడేసిన వైనం సభ్యసమాజాన్ని విస్తుపరిచేలా చేసింది. కేవలం తమ కుటుంబపరువు పోతుందనే కక్షతో సొంత కూతురినే హత్యచేసిన ఆ తల్లిదండ్రులను పోలీసులు అరెస్టు చేసారు. కేసు పెట్టారు. దర్యాప్తు చేస్తున్నారు. అయినా వారిలో ఎలాంటి పరివం ర్తనలేదు. తాముచేసింది సరైన దేనని సమర్ధించుకుంటున్నారు. గత ఏడాది హైదరాబాద్ శివార్లలో కులాంతర వివాహం చేసుకున్నందుకు ఆ తండ్రి విచక్షణ మరిచి గొంతుకోసి కుమార్తెను హత్య చేసారు. దాదాపు నాలుగేళ్లక్రితం వివాహం జరిగినా రెండేళ్ల వయసున్న కుమా రుడు వారికున్నా మరొకపక్క కుమార్తె ఏడునెలల గర్భవతి అని తెలిసినా ఇవన్నీ విస్మరించి ఆనాటి పగతో విచక్షణ, మంచి చెడూ మరిచి రాక్షసుడిగా మారి గొంతు తెగకోసి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.

అలాగే వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న మహిళ కుమార్తెతో సహా ఆత్మహత్య చేసుకుంది. ఇలా రోజూ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఆత్మహత్యలు, హత్యల పరంపర కొనసాగుతూ ఉంది. ఇక ప్రేమ పేరుతో చేస్తున్న మోసాలు అన్నీఇన్నీ కావు. ఈ విష సంస్కృతి పెరిగిపో తున్న దనడానికి పోలీసు రికార్డులే అద్దంపడుతున్నాయి. విద్యార్ధులపై వేధింపులకు అంతేలేకుండాపోతుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రారంభిం చిన షీ టీమ్స్ కొంతవరకు ఫలి తాలు సాధిస్తున్నాయి. ఏదిఏమైనా మహిళలపై అఘా యిత్యాలు హత్యాయత్నాలు, వెంటపడి వేధించే కీచకులు పెచ్చురిల్లిపోతున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యా ప్తంగా కూడా పెరుగుతున్నాయి. దేశంలో అత్యా చారాల పరిస్థితి పరిశీలిస్తే నేరస్తులను కట్టడి చేయలేని నిస్సహాయ స్థితిచూస్తే ఎప్పటికీ పాలకులు కట్టడిచేయలే రేమోననిపిస్తున్నది. అలా అని పాలకులు ఏమీ చేయడం లేదని చెప్పడంలేదు. చట్టాలమీద చట్టాలు చేస్తున్నారు. ఉన్న చట్టాలకు మరింత పదును పెడుతున్నారు.

అధికా రుల మీద అధికారులను నియమిస్తున్నారు. అయినా ఆశిం చిన ఫలితాలు చేకూరడం లేదు. నిర్భయ చట్టంతో వీటిని కొంత వరకైనా నియంత్రించాలని ఆశించారు. కానీ అదీ నిరాశే అయింది. ఆ తర్వాత కూడా ఈ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయి. భారత్ లోనే కాదు ప్రపంచదేశాల్లో మహిళలపై హింసకు చరమగీతం పాడా లన్న ప్రధాన ఉద్దేశ్యంతో ఎంతో కృషి జరుగుతు న్నది. ప్రపంచ వ్యా ప్తంగా ఎన్నో దేశాలు చట్టాలు తెచ్చాయి. ఎన్నో పథకాలు ప్రవేశపె ట్టాయి. ఏమాత్రం ఫలితాలు ఉండటంలేదు. కులం మతం జాతి ప్రాంతీయ బేధాలు అన్నింటికీ అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా మహిళల పట్ల వైఖరి మారితే ఈ వేధింపులు ఉండేవి కావు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్రపాలకులు చట్టాలుచేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. ఆచరణ దిశగా ప్రయత్నించాలి. అప్పుడే ఈ పశుప్రవృత్తికి కొంతవరకైనా పగ్గా లు వేయగలుగుతాం. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భారతా వనిలో మహిళా భద్రత ప్రశ్నార్ధకం అవుతుంది. ఇది దేశానికి ఏమాత్రం క్షేమం కాదు.

***